సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 14+4 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 16

సోమవారం 8-4-2024




'ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి శాశ్వత వనరులతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలన్నదే నా స్వప్నం'

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

సోమవారం 8-4-2024

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14+4 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 16



'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు. పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు ఉన్నత చదువులు చదవాలి.'



ముంబై అదిరే బోణీ..
29 పరుగుల తేడాతో ఢిల్లీపై గెలుపు.. చెలరేగిన రోహిత్, షెఫర్డ్ - స్పోర్ట్స్‌లో



పన్ను భారం తగ్గేదెలా?
పన్ను విధానాలు.. వాటిలోని అనుకూల అంశాలపై కథనం - ప్రాఫిట్ ప్లస్‌లో

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



కశ్మీర్ భారత్‌లో లేదా?
'దేశంలో కశ్మీర్ అంతర్భాగం కాదా? గతంలో రాజ్యాంగాన్ని ఎందుకు అమలుచేయలేదని ప్రతిపక్షాలను ప్రధాని మోదీ ప్రశ్నించారు.
వివరాలు 6లో ▸



బీజేపీ తెచ్చిపెట్టిన నిరుద్యోగం
దేశంలో బీజేపీ తెచ్చిపెట్టిన నిరుద్యోగ సమస్యే లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాన అంశమని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే అన్నారు.
వివరాలు 6లో ▸



'ఆప్' నిరాహార దీక్షలు
ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అరెస్టును నిరసిస్తూ ఆప్ నేతలు ఆదివారం జంతర్‌మంతర్ వద్ద సామూహిక నిరాహార దీక్ష చేశారు.
వివరాలు 6లో ▸



ఈసీ 'సోషల్' బాట
తొలిసారిగా ఓటు హక్కు వినియోగించుకుంటున్న వారి కోసం 'టర్నింగ్ 18' పేరిట ప్రచార కార్యక్రమానికి ఈసీ శ్రీకారం చుట్టింది.
వివరాలు 6లో ▸

ఊసరవెల్లి



- వైఎస్ జగన్‌ను ఒంటరిగా ఎదుర్కోలేక కూటమిపేరుతో చంద్రబాబు ఎత్తుగడ
- షర్మిలను సీఎం జగన్‌పై ప్రయోగించిన కుటిలనేత
- దానివల్ల ఆశించిన ఫలితం లేక ఇప్పుడు సరికొత్త ప్రచారం
- వైఎస్సార్‌సీపీ వ్యతిరేక ఓట్లు చీల్చడానికే షర్మిల నాటకాలు ఆడుతున్నట్టు ఆరోపణ

2 లో

బీజేపీకి పురందేశ్వరి
వెన్నుపోటు!

- అనపర్తి సీటు విషయంలో చంద్రబాబు డ్రామా.. మొదట టీడీపీ అభ్యర్థిని ప్రకటించి ఆ తర్వాత బీజేపీకి కేటాయింపు
- అయినా.. టీడీపీ అభ్యర్థి నల్లమిల్లి ప్రచారం
- ఈ పరిణామాలను పట్టించుకోని బీజేపీ రాష్ట్ర అధినేత్రి పురందేశ్వరి

5 లో



ప్రకాశం జిల్లా కొనకనమిట్ల సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం



టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల 2014 మేనిఫెస్టో చూపిస్తూ.. వారి మోసపూరిత హామీలను వివరిస్తున్న సీఎం జగన్

బాబును నమ్మితే పులికి బలే

కొనకనమిట్ల 'మేమంతా సిద్ధం' సభలో సీఎం జగన్

- ప్రజలకు మంచి జరుగుతుంటే చూడలేని శాడిస్టు..
- అవ్వా తాతల పింఛన్లకు అడ్డుపడ్డ వ్యక్తి చంద్రబాబు
- స్వార్థ రాజకీయాలతో వారి మరణానికి కారణమయ్యాడు
- ఆయనకు పొరపాటున ఓటు వేస్తే ఈ పథకాలకు ముగింపే
- మన భవిష్యత్తు ముందుకా.. వెనక్కా అని తేల్చే ఎన్నికలు ఇవి
- వలంటీర్ వ్యవస్థతో బాబు గుండెల్లో రైళ్లు పరిగెత్తుతున్నాయి
- 58 నెలల్లో మీ బిడ్డ చేసినట్లు.. బాబు ఎందుకు చేయలేకపోయాడు?

7 లో

జన సునామీ..

మండుటెండలోనూ బస్సు యాత్రకు ప్రజలు బ్రహ్మరథం
ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగిన సీఎం జగన్.. జనజాతరను తలపించిన కొనకనమిట్ల బహిరంగ సభ

8 లో

కూటమిలో
కత్తులు

చంద్రబాబు డీఎన్ఏ వెన్నుపోటును వంటబట్టించుకున్న నేతలు
మిత్రపార్టీలకు వెనుక దెబ్బ
పోలవరంలో జనసేన అభ్యర్థికి చుక్కలు చూపిస్తున్న టీడీపీ శ్రేణులు
ఉమ్మడి అనంతపురంలో సీనియర్లకు రాజకీయ సన్యాసం!
పిఠాపురంలో జనసేనానికి అసమ్మతి సెగ
తంబళ్లపల్లె టీడీపీ అభ్యర్థిని మార్చాలన్న మాజీ ఎమ్మెల్యే శంకర్ వర్గీయులు
పాలకొల్లు బాబు సభలో బన్నీవాసుకు అవమానం.. జనసైనికుల మండిపాటు

9 లో

ఆ డబ్బులు మావే
ఇచ్చేయండి

- రూ.51,99,800 నగదుతోపాటు చెక్కులు కూడా ఇవ్వండి
- రామోజీరావుకు చెందిన మార్గదర్శి చిట్‌ఫండ్స్ లొల్లి
- డబ్బులిప్పించాలంటూ విశాఖ ఎన్నికల యంత్రాంగం చుట్టూ ప్రదక్షిణలు.. ఆధారాలు అడిగితే చూపకుండా పరారీ
- ఓట్ల కొనుగోలుకు టీడీపీ నేతలకు అందించడానికి మార్గదర్శి పక్కా ప్లాన్

9 లో







ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

బిచ్చగాళ్లను కాస్తా లక్షాధికారులను చేశారు

మా తల్లిదండ్రులు, తాతలు సంచార జీవనం గడుపుతూ... ఆకివీడులోని దుంపగడప రైల్వే గేటు వద్ద రైల్వే స్థలంలో 50 ఏళ్లుగా గుడారాల్లో జీవనం గడిపారు. నా తల్లి దండ్రులు రైల్వే స్థలంలో గుడిసె వేసుకుని జీవించారు. మాకు, మా తల్లిదండ్రులకు, తాత ముత్తాతలకు చదువులు లేవు. గుంతలు, కాల్వల్లో చేపలు పట్టుకుని భిక్షాటన చేసి జీవనం సాగించాం. రైల్వే స్థలం నుంచి మమ్మ ల్ని ఖాళీ చేయించినప్పుడు అప్పటి ఎమ్మెల్యే పాతపాటి సర్రాజు పెద్ద మనస్సుతో మా తల్లిదండ్రులకు సమతానగర్ రోడ్డులోని చినకా పవరం డ్రెయిన్ వద్ద స్థలాలు ఇచ్చారు. పాకలు, రేకుల షెడ్లు వేసుకుని మా తల్లిదండ్రులతో కలిసి ఉన్నాం. నాకు పెళ్లయిన తరువాత ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకోగా ముఖ్యమం త్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో 11 మంది చెంచులకు కుప్పనపూడి శివారు తాళ్ల కోడు వద్ద ఒక్కొక్కరికి సెంటు భూమి చొప్పున కేటాయించారు. ఇంటి నిర్మాణానికి రూ. 1.80లక్షలు ఆర్థిక సాయం చేశారు. డ్వాక్రా రుణం తీసుకుని, కొద్దిగా అప్పు చేసి ఆ మొత్తా నికి జమచేసి మేము పక్కా భవనం నిర్మించు



కుంటున్నాం. జగనన్న దయతో మా పిల్లల్ని చదివించుకుంటున్నాం. అమ్మ ఒడి పథకం ద్వారా ఏడాదికి రూ. 15వేలు వంతున సాయం అందుతోంది. ప్రభుత్వ పాఠశాలలో మంచిగా చదువు చెబుతున్నారు. మధ్యాహ్న భోజనం పెడుతున్నారు. స్కూలుకు వెళ్లే పిల్లలకు దుస్తులు, బ్యాగ్‌లు, పుస్తకాలు, టై, బూట్లు ఇవ్వడం బాగుంది. ప్రస్తుతం మేము చేపలు పట్టుకోవడంతోపాటు చిన్నచిన్న పనులు చేసుకుని జీవిస్తున్నాం. బిక్షగాళ్లుగా ఉన్న మమ్మల్ని లక్షాధికారులను చేసిన ఘనత జగ న్‌దే. ఆయనకు రుణపడి ఉంటాం.

– నల్లబోతుల అప్పన్న తాళ్లకోడు
(బీఆర్ కోటేశ్వరరావు, విలేకరి, ఆకివీడు)

ఇంతటి సాయం ఎన్నడూ ఎరుగం

మాది నిరుపేద కుటుంబం. ఈ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు మా కుటుంబానికి ఎంతో ఆసరాగా నిలిచాయి. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు గ్రామం లో చిన్న చికెన్ దుకాణాన్ని పెట్టుకొని నా కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. నాకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. గత ప్రభు త్వంలో ఏ మేలూ జరగలేదు. ఈ ప్రభుత్వం లో సొంతింటి కల నెరవేరింది. స్థలం మం జూరు చేయడమే గాకుండా ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజే సింది. నా భార్య వరలక్ష్మి ఇంటి దగ్గర టైలరిం గ్ చేస్తూ నాకు అండగా నిలుస్తోంది. ఆమెకు చేదోడు కింద గత మూడేళ్లగా ఏటా రూ.10 వేలు, అమ్మ ఒడి కింద ఏటా రూ.15 వేలు



చొప్పున ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందింది. మాకు ఆర్థికంగా అండగా నిలిచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి జీవి తాంతం రుణ పడి ఉంటాం.

– దొమ్మా వీరబాబు, ప్రత్తిపాడు
(ప్రగడ రామకృష్ణ, విలేకరి, ప్రత్తిపాడు రూరల్)

సమస్యలు తీరి సంతోషంగా జీవనం

నేను వ్యవసాయ కూలి పని చేస్తూ కుటుం బాన్ని పోషిస్తున్నా. డా.బీఆర్ అంబే డ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురంలో కాపురం ఉంటూ వచ్చిన అరకొర ఆదాయం తో పిల్లల చదువులు ఎలా అని నిత్యం తల్లడి ల్లిపోయే వాళ్లం. గత ప్రభుత్వ హయాంలో మాకు ఎలాంటి సాయం అందలేదు. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత మాకు చాలా మేలు జరిగింది. బడికెళ్తున్న మా అమ్మాయికి ఐదేళ్లుగా జగనన్న అమ్మఒడి పథకం ద్వారా ఏడాదికి రూ. 15 వేలు వంతున వచ్చింది. వైఎస్సార్ రైతు భరోసా ద్వారా ఏటా రూ.13,500 వంతున, వైఎస్సార్ ఉచిత పంట బీమా ద్వారా రూ.6,460, ఇన్‌పుట్ సబ్సిడీ పథకం ద్వారా రూ.31,950 వచ్చాయి. ముఖ్యంగా నిరుపేదలైన మాకు విలువైన ఇం టి స్థలంతోపాటు ఇల్లు కట్టుకునేందుకు ఆర్థిక



సహాయంగా రూ.1.80 లక్షలు మంజూర య్యాయి. దాంతో ఇంటి నిర్మాణం చేపట్టాం. ఇప్పుడు మా కుటుంబం హాయిగా జీవిస్తోం దంటే దానికి కారణమైన ముఖ్యమంత్రి జగన న్నకు ఎప్పటికీ రుణపడి ఉంటాం.

– అంసూరి జయపాలకృష్ణ, కపిలేశ్వరపురం
(పెద్దింశెట్టి లెనిన్ బాబు, విలేకరి, కపిలేశ్వరపురం)

ఐదేళ్లలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పరిపుష్టం

ఇందుకు బ్యాంకింగ్ రంగం కీలక సూచీలే నిదర్శనం

- ఐదేళ్లలో డిపాజిట్లతో పాటు రుణాల మంజూరులో భారీగా వృద్ధి
- డిపాజిట్లలో 58.23 శాతం వృద్ధి
- రుణాల మంజూరులో ఏకంగా 96.64 శాతం వృద్ధి
- డిపాజిట్ల పెరుగుదల ప్రజల ఆదాయం ఉన్నతికి నిదర్శనం
- రుణాల పెరుగుదల ఆర్థిక కార్యకలాపాల పెరుగుదలకు నిదర్శనం
- అర్హతగల వర్గాలందరికీ బ్యాంకుల ద్వారా రుణాలందించడంలో ప్రభుత్వం సఫలం
- ఆర్‌బీఐ నిబంధన మేరకు క్రెడిట్ డిపాజిట్ రేషియో 60 శాతం ఉండాలి
- కానీ రాష్ట్రంలో ఆ రేషియో 157.94 శాతం ఉంది
- 226వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ నివేదిక స్పష్టీకరణ



సాక్షి, అమరావతి: వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి పలు సంక్షేమ పథకాల ద్వారా ప్రజల ఆర్థికాభివృద్ధికి, జీవన ప్రమాణాల పెంపునకు, రాష్ట్రాభివృద్ధికి బాటలు వేశారు. ఈ ఐదేళ్లలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పరిపుష్టంగా తయారైంది. బ్యాంకింగ్ రంగం కీలక సూచికలే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. గత ఐదేళ్లలో రాష్ట్రంలో డిపాజిట్లతో పాటు రుణాల మంజూరులో భారీగా వృద్ధి నమోదైనట్లు 226వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ నివేదిక వెల్లడించింది. ఐదేళ్లలో రెండేళ్ల కోవిడ్ సంక్షోభం నెలకొన్నప్పటికీ రాష్ట్ర ప్రజల జీవనోపాధికి సమస్యల్లేకుండా వైఎస్ జగన్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలు సత్ఫలితాలు ఇస్తున్నాయనడానికి డిపాజిట్లలో భారీ వృద్ధి నిదర్శనం. గత ఐదేళ్లలో డిపాజిట్లలో ఏకంగా 58.23 శాతం వృద్ధి నమోదైంది. 2019 మార్చి నాటికి డిపాజిట్లు రూ.3,12,642 కోట్లు ఉండగా 2023 డిసెంబర్ నాటికి రూ.4,94,690 కోట్లు.. అంటే రూ.1,82,048 కోట్లు పెరిగాయి. అన్ని రంగాలకు బ్యాంకు రుణాల మంజూరులో ఏకంగా 96.64 శాతం భారీ వృద్ధి నమోదైంది. 2019 మార్చి నాటికి రుణాల మంజూరు రూ.3,97,350 కోట్లు ఉండగా 2023 డిసెంబర్ నాటికి రూ.7,81,313 కోట్లకు పెరిగాయి. అంటే రుణాలు రూ.3,83,963 కోట్లు పెరిగాయి. డిపాజిట్ల పెరుగుదల ప్రజల ఆదాయం పెరుగుదలకు నిదర్శనం కాగా రుణాలు ఆర్థిక కార్యకలాపాల పెరుగుదలకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

వివిధ రంగాల్లో ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం ఇవ్వాల్సిన రుణాలు, రాష్ట్రంలో రుణాల మంజూరు ఇలా ..

రంగం	ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం	మంజూరైన రుణాలు
ప్రాధాన్యత రంగం	40 శాతం	64.91 శాతం
వ్యవసాయ రంగం	18 శాతం	43.21 శాతం
చిన్న, సన్నకారు రైతుల రుణాలు	10 శాతం	28.69 శాతం
బలహీన వర్గాల రుణాలు	12 శాతం	32.47 శాతం
మహిళలకు రుణాలు	5 శాతం	25.32 శాతం
సూక్ష్మ పరిశ్రమలకు	7.50 శాతం	8.66 శాతం

గత ఐదేళ్లలో బ్యాంకుల్లో డిపాజిట్లు, రుణాల్లో పెరుగుదల ఇలా..

సంవత్సరం	డిపాజిట్లు (రూ.కోట్లలో)	రుణాలు (రూ.కోట్లలో)
31-03-2019 నాటికి	3,12,642	3,97,350
31-03-2020 నాటికి	3,40,208	4,34,261
31-03-2021 నాటికి	3,85,929	5,03,075
31-03-2022 నాటికి	4,14,594	5,81,968
31-03-2023 నాటికి	4,56,961	6,84,466
31-12-2023 నాటికి	4,94,690	7,81,313

నవరత్నాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన పేదలందరి జీవన ప్రమాణాలు పెంచడమే లక్ష్యంగా నేరుగా నగదు బదిలీని అమలు చేసింది. అలాగే బ్యాంకుల ద్వారా పేదలు, రైతులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, ఎంఎస్ఎంఈలు, ఇతర వర్గాలకు వివిధ పథకాల కింద బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించడం ద్వారా వారి ఆదాయం మెరుగుపడేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది., ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలతో పాటు మహిళలకు బ్యాంకుల నుంచి రుణాలు విరివిగా లభించేలా చర్యలు చేపట్టింది. అందువల్లే గతంలో ఎన్నడూ లేని విధంగా అన్ని రంగాల్లో రుణాల మంజూరులో భారీ వృద్ధి నమోదైంది. ఆర్‌బీఐ నిబంధనలకన్నా అన్ని రంగాల్లో అత్యధికంగా బ్యాంకులు రుణాలు మంజూరు చేశాయి.

బ్యాంకులు ఇచ్చిన రుణాలను సకాలంలో చెల్లించేలా ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం రైతులకు, స్వయం సహాయక సంఘాలకు సున్నా వడ్డీ పథకాన్ని అమలు చేస్తోంది. అలాగే నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు లబ్ధిదారులకు పావలా వడ్డీకి రుణాలు ఇప్పిస్తోంది. వీధుల్లో, వాడల్లో చిరు వ్యాపారాలు చేసుకునే వారికి బ్యాంకులు ద్వారా సున్నా వడ్డీకే బ్యాంకుల ద్వారా రుణాలను ఇప్పిస్తోంది. వైఎస్సార్ చేయూత ద్వారా పేద మహిళలకు ప్రభుత్వం ఆర్థిక సాయంతో పాటు బ్యాంకు రుణాలను మంజూరు చేయించి, వ్యాపారాలు చేసుకునేలా ప్రోత్సహిస్తోంది. ప్రజలు కూడా ప్రభుత్వం అందించిన చేయూతతో సకాలంలో రుణాలు చెల్లిస్తూ వారి వ్యాపారాలను అభివృద్ధి చేసుకుంటూ ఆర్థికంగా ఎదుగుతున్నారు. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం గత ఏడాది డిసెంబర్ నాటికి క్రెడిట్ రేషియో 60 శాతం ఉండాల్సి ఉండగా దానికి మించి 157.94 శాతం నమోదైనట్లు బ్యాంకర్ల కమిటీ నివేదిక పేర్కొంది. సీడీ రేషియో అధికంగా ఉందంటే ఆ రాష్ట్రంలో వ్యాపార వాణిజ్య కార్యకలాపాలు అధికంగా జరుగుతున్నాయనే అర్థమని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు.

ఆక్వా, పాడి రైతులకు భరోసా

- అర్హత గల వారందరికీ కిసాన్ క్రెడిట్ కార్డులు
- ఆక్వా రైతుకు ప్రతి సీజన్‌లో రూ.10 లక్షల వరకు రుణం
- పాడి రైతుకు హామీ లేకుండా రూ.1.60 లక్షల వరకు రుణ సదుపాయం
- ఐదేళ్లలో 1.30 లక్షల మంది పాడి, ఆక్వా రైతులకు రూ.4,420 కోట్ల రుణాలు
- 3 శాతం వరకు వడ్డీ రాయితీ





సాక్షి, అమరావతి: కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా పాడి, ఆక్వా రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తోంది. ఒక్కో ఆక్వా రైతుకు గరిష్టంగా రూ.10 లక్షల వరకు ఆర్థిక చేయూతనిస్తుండగా.. పాడి రైతులకు ఎలాంటి హామీ లేకుండా రూ.1.60 లక్షల వరకు రుణాలిస్తోంది. కార్డుల జారీ, రుణ పరపతి కోసం ప్రత్యేకంగా ఆండ్రాయిడ్ ఆధారిత అప్లికేషన్ కూడా అభివృద్ధి చేసింది. జిల్లాల వారీగా లక్ష్యాలను నిర్దేశించి మరీ రుణాలు మంజూరు చేస్తోంది. ముందెన్నడూ లేనివిధంగా ఐదేళ్లలో రూ.4,420.38 కోట్ల రుణాలను ప్రభుత్వం అందించింది. కార్డు పొందే పాడి రైతులకు బీమా సదుపాయం కూడా కల్పించింది. తీసుకున్న రుణంపై చెల్లించే వడ్డీలో 1.5 శాతం చొప్పున ఏటా వడ్డీ రాయితీ పొందొచ్చు. సకాలంలో చెల్లించిన వారికైతే 3 శాతం వరకు వడ్డీ రాయితీ పొందే అవకాశం ఉంటుంది. మొత్తంగా ఐదేళ్లలో 1.30 లక్షల మంది పాడి, ఆక్వా రైతులకు రూ.4,420 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం రుణాలుగా అందించింది.


పాడి రైతులకు రూ.1,747.18 కోట్లు

వైఎస్సార్ చేయూత, ఆసరా వంటి పథకాల ద్వారా పొందిన లబ్ధితో పాడి పశువులు, సన్న జీవాలు కొనుగోలు చేసిన పాడి రైతులకు ప్రభుత్వం పశు కిసాన్ క్రెడిట్ కార్డులు జారీ చేసింది. జగనన్న పాలవెల్లువ, జగనన్న జీవక్రాంతి పథకాల కింద ఐదేళ్లలో 5.15 లక్షల మందికి మూగ, సన్నజీవాలను అందించింది. వీరందరికీ కిసాన్ క్రెడిట్ కార్డులు జారీ చేసింది. కార్డులు పొందిన వారిలో ఇప్పటివరకు 1,38,392 మంది రుణాల కోసం దరఖాస్తు చేయగా, వారిలో 1,13,399 మందిని అర్హులుగా గుర్తించింది. వీరిలో ఇప్పటికే 1,09,199 మందికి రూ.1.60 లక్షల వరకు రుణాలు ఇచ్చింది. ఇలా రూ.1,747.18 కోట్ల రుణం అందించింది. వ్యక్తిగతంగానే కాకుండా గ్రూపులుగా ఏర్పడినా కేసీసీ కార్డులు జారీ చేసేందుకు అవకాశం కల్పించింది. ఆర్బీకేల ద్వారా దరఖాస్తు చేసే పాడి రైతులు ఎంతకాలం నుంచి పశుపోషణ చేస్తున్నారు, ఎంత పాడి ఉంది, ఎన్ని పాలను ఉత్పత్తి చేస్తున్నారనే వివరాలను స్థానిక పశువైద్యాధికారి ధ్రువీకరిస్తే చాలు. ఎలాంటి హామీ లేకుండా రుణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంది. ఈ రుణాలతో పాడి రైతులు పశువులు, సన్నజీవాలకు షెడ్లు, మంచినీటి తొట్టెల నిర్మాణం, తాళ్లు, ఇతర సామగ్రితో పాటు పశుగ్రాసం కొనుగోలు చేశారు.

ఆక్వా రైతులకు రూ.2,673 కోట్లు

ఐదేళ్లలో 19,059 మంది ఆక్వా రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులను ప్రభుత్వం జారీ చేసింది. కార్డులు పొందిన ఆక్వా రైతులకు ప్రతి సీజన్‌లో రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు రుణం ఇస్తోంది. ఇందులో మొదటి రూ.2 లక్షలను కేసీసీ రుణంగా పరిగణిస్తోంది. రూ.2 లక్షలపై 2 శాతం, మిగిలిన రుణం సకాలంలో చెల్లిస్తే ఇంట్రెస్ట్ సబ్‌వెన్షన్ స్కీమ్ కింద మరో 3 శాతం వడ్డీ రాయితీ పొందే వెసులుబాటు కల్పించింది. ఇలా ఐదేళ్లలో రూ.2,673 కోట్లను రుణాలుగా ఇచ్చింది.

ఊసరవెల్లి..



అధికారంకోసం అడ్డదారులు తొక్కడం... అవసరమైతే అడ్డు తొలగించుకునేందుకు కూడా వెనుకాడకపోవడం... రోజుకో ఎత్తు గడతో నాలుక మడతేసేయడం... బద్ధ శత్రువులతోనైనా ఇట్టే జతకట్టేయడం... మరో అడుగు ముందుకేసి ఏకంగా కుటుంబాల్ని చీల్చేయడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. ఎంతటి వ్యక్తులనైనా బోల్తాకొట్టించగల సమర్థుడాయన. ఇప్పుడు రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని ఒంటరిగా ఎదుర్కోలేక అన్ని పార్టీలను ఏకం చేసేందుకు నానా పాట్లు పడ్డారు. అంతేనా... మరో అడుగు ముందుకేసి ఆయన సోదరినే పావుగా వాడుకున్నాడు. అదీ ఆశించిన ఫలితం ఇవ్వకపోవడంతో ఏకంగా అన్నా... చెల్లెళ్లిద్దరూ కలసి నాటక మాడుతున్నారంటూ కొత్త ప్రచారానికి శ్రీకారం చుట్టారు. అధికారంకోసం ఎంతకైనా తెగించగలిగిన టీడీపీ అధినేత చంద్రబాబు అనుసరిస్తున్న తీరును జనం సైతం ఛీకొడుతున్నారు.

సాక్షి, అమరావతి: రాజకీయంలో ఎలాంటి కుట్రలకైనా వెరవకూడదనీ.. అబద్ధాలు అలవోకగా ఆడేయొచ్చని.. ఎలాంటి విషయాన్నైనా తనకు అనుకూలంగా మలచుకోవచ్చని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు మరోసారి నిరూపించుకున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌ను ఎదుర్కొనేందుకు అన్ని అస్త్రాలను ఎక్కుపెట్టారు. ఘోర పరాజయం నుంచి తప్పించుకుని, రాజకీయంగా ఉనికి చాటుకోవడానికి చివరి ప్రయత్నంగా మహానేత వైఎస్ కుటుంబాన్ని చీల్చి.. సీఎం జగన్‌పై సోదరి షర్మిలను ప్రయోగించారు. సోదరికే న్యాయం చేయలేని వాడు రాష్ట్రానికి ఏం చేయగలరని ఇన్నాళ్లు ఆరోపిస్తూ వచ్చిన చంద్రబాబే.. ఆమెకు జనస్పందన లభించకపోవడం, తాను అనుకున్న ప్రయోజనాలు లభించే అవకాశాలు కన్పించకపోవడంతో మరోసారి మాట మార్చారు. శనివారం పెదకూరపాడులో నిర్వహించిన ప్రజాగళం సభలో తల్లి కాంగ్రెస్, పిల్ల కాంగ్రెస్ కలిసి కొత్త నాటకం ఆడుతున్నాయని ఆరోపించారు. కుమారుడికి ఏపీ, కుమార్తెకు తెలంగాణ రాసిచ్చానని ఒక తల్లి చెప్పిందని.. ఆ తల్లి తన ఇద్దరు పిల్లలకే న్యాయం చేయలేదు, రాష్ట్రానికి ఏం చేస్తారని ఇప్పుడు కొత్తగా ప్రశ్నించారు. అంతేగాదు... పిల్ల కాంగ్రెస్ వ్యతిరేక ఓటు చీల్చాలని తల్లి కాంగ్రెస్ నాటకం ఆడుతోందంటూ ఆరోపించారు. ఎన్డీయేకు పడే ఓట్లు చీల్చాలని నాటకం ఆడుతున్నారని మరో ప్రచారానికి దిగారు. దీనిని బట్టి ఆయన రంగులు మార్చడంలో ఊసరవెల్లికి కూడా మించిపోతారని రాజకీయ విశ్లేషకులు వ్యంగోక్తులు విసురుతున్నారు.

పావులా మారిన షర్మిల

తెలంగాణలో 2021 జూలై 8న వైఎస్సార్టీపీని షర్మిల స్థాపించారు. తన బతుకైనా చావైనా తెలంగాణలోనేని ఆమె అప్పట్లో ప్రతిజ్ఞ చేశారు. కానీ.. గతేడాది చివర్లో తెలంగాణ ఎన్నికల్లో పోటీ చేయకుండా అస్త్రసన్యాసం చేసి కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించారు. దీని వెనుక చంద్రబాబు హస్తం ఉందన్నది జగమెరిగిన సత్యం. ఇందుకోసం కర్ణాటక డిప్యూటీ సీఎం డి.కె.శివకుమార్‌తో బెంగళూరు విమానాశ్రయం సాక్షిగా మంతనాలు జరిపి ఏపీలో కాంగ్రెస్ పగ్గాలు షర్మిలకు కట్టబెట్టేందుకు ప్రణాళిక రచించారు. బీజేపీలోని తన ఏజెంట్, ప్రస్తుతం అనకాపల్లి లోక్‌సభ స్థానం బీజేపీ అభ్యర్థి అయిన సీఎం రమేష్ ద్వారా కాంగ్రెస్‌కు ఇం'ధనం' చేకూర్చి.. తన శిష్యుడు, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ద్వారా కథ మొత్తం నడిపించారు. షర్మిల కాంగ్రెస్‌లో చేరేందుకు ఢిల్లీ వెళ్లినప్పుడు.. పీసీసీ చీఫ్ పదవి దక్కించుకున్నాక ఢిల్లీ, కడప తదితర ప్రాంతాల్లో పర్యటించినప్పుడు సీఎం రమేష్ స్పెషల్ ఫ్లైట్‌లలోనే ప్రయాణించారు. ఇప్పటికీ సీఎం రమేష్ స్పెషల్ ఫ్లైట్‌లో షర్మిల ప్రయాణాలు చేస్తుంటే.. ఆమె భర్త అనిల్ టీడీపీ నేతలు బీటెక్ రవి, దేవగుడి నారాయణరెడ్డి తదితరులతో సమావేశమవుతున్నారు. షర్మిలను సీఎం జగన్‌పై ఉసిగొలిపి.. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ఓట్లను చీల్చడం ద్వారా రాజకీయ ఉనికి చాటుకోవాలన్నది చంద్రబాబు ఎత్తుగడ.

ఆ ప్రయోగం విఫలమై ఇప్పుడు కొత్త పాచిక

చంద్రబాబు, ఎల్లో పత్రికలు సీఎం జగన్‌పై చిమ్ముతున్న విషాన్నే పీసీసీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి షర్మిల చేత వల్లెవేయించారు. మరో అడుగు ముందుకేసి కడప లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా షర్మిల బరిలో నిలిచేలా చక్రం తిప్పారు. షర్మిలకు తోడుగా వివేకా కూతరు సునీతను రంగంలోకి దించారు. వారిద్దరి ద్వారా వివేకా హత్యపై దుష్ప్రచారం చేయించి.. దాన్ని అస్త్రంగా మార్చుకుని లబ్ధి పొందాలన్నది చంద్రబాబు పాచిక. కానీ.. వివేకానందరెడ్డి రెండో వివాహం చేసుకోవడంతో కుటుంబంలో తలెత్తిన ఆస్తి వివాదాలే ఆయన హత్యకు దారితీశాయని ఉమ్మడి కడప జిల్లా ప్రజలు బలంగా నమ్ముతున్నందున కడప లోక్‌సభ స్థానం పరిధిలో షర్మిల చేస్తున్న బస్సు యాత్రకు ప్రజాస్పందన కన్పించలేదు. తాను అనుకున్న ప్రయోజనం లభించకపోవడంతో చంద్రబాబు తన నిజస్వరూపాన్ని మరో సారి బయటపెట్టుకున్నారు. ఇప్పుడు షర్మిలపైనా నిందలు మొదలుపెట్టేశారు. వారిద్దరూ కలసి ఎన్డీయే ఓట్లు చీల్చేందుకు కుట్ర పన్నుతున్నారంటూ కొత్త పల్లవి ఎత్తుకుని తన సహజ నైజాన్ని చాటుకుంటున్నారు.

అధికారంకోసం జిత్తులమారి ఎత్తులు

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు 99% అమలు చేసి.. ఓ వైపు సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే.. మరోవైపు అభివృద్ధిలో రాష్ట్రాన్ని పరుగులు పెట్టిస్తున్న సీఎం జగన్ రాబోయే ఎన్నికల్లోనూ ప్రభంజనం సృష్టించడం ఖాయమని దాదాపు అన్ని సర్వేల్లోనూ స్పష్టమైంది. అలాంటి వ్యక్తిని ఒంటరిగా ఎదుర్కొనే దమ్ములేని చంద్రబాబు జనసేన, బీజేపీతో జతకలిశారు. మరో వైపు వివేకానందరెడ్డి కూతురు సునీతను చేరదీశారు. వివేకా హత్యపై సునీతతో దుష్ప్రచారం చేయిస్తూ.. రాజకీయంగా లబ్ధి పొందాలని భావించారు. అంతేగాకుండా జగన్ సోదరి షర్మిలను వాడుకునేందుకు కొత్త ప్రణాళికను అమలు పర్చారు.

పారదర్శక అనుమతుల జారీలో సువిధ పోర్టల్ రికార్డు

- ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి ఇప్పటివరకు 73 వేల దరఖాస్తులు
- ర్యాలీ నుంచి ఇంటింటి ప్రచారం వరకు అన్నీ ఈ పోర్టల్ ద్వారానే
- ముందు దరఖాస్తు చేసుకున్నవారికి ముందు అవకాశం

సాక్షి, అమరావతి: ఎన్నికల ప్రవర్తన నియమావళికి అనుగుణంగా రాజకీయ పార్టీలు తీసుకోవాల్సిన ముందస్తు అనుమతులు సులభతరంగా, పారదర్శకంగా అందించడానికి తీసుకొచ్చిన సువిధ పోర్టల్ రికార్డులు సృష్టిస్తోంది. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన తరువాత 20 రోజుల్లోనే దేశవ్యాప్తంగా రాజకీయపార్టీలు, అభ్యర్థుల నుంచి 73,379 అభ్యర్థనలు వచ్చినట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. ఇందులో 60 శాతం (44,626) అభ్యర్థనలకు అనుమతులు ఇవ్వగా 15 శాతం (11,200) అభ్యర్థనలను తిరస్కరించినట్లు తెలిపింది. మిగిలిన అభ్యర్థనలు పరిశీలనలో ఉన్నట్లు పేర్కొంది. సువిధ పోర్టల్ వినియోగంలో 23,239 అభ్యర్థనలతో తమిళనాడు మొదటిస్థానంలో నిలిచింది. తర్వాత స్థానాల్లో పశ్చిమబెంగాల్ (11,976 అభ్యర్థనలు), మధ్యప్రదేశ్ (10,636 అభ్యర్థనలు) ఉన్నాయి. కనిష్టంగా చండీగఢ్‌లో 17 అభ్యర్థనలు, లక్షద్వీప్‌లో 18, మణిపూర్లో 20 అభ్యర్థనలు అందాయి. ఇంకా నోటిఫికేషన్ వెలువడాల్సిన ఆంధ్రప్రదేశ్ నుంచి 1,153 అభ్యర్థనలు వచ్చాయి. ఉచిత, న్యాయమైన, పారదర్శకమైన ప్రజాస్వామ్యం అనే సూత్రాలకు అనుగుణంగా ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు, అభ్యర్థుల నుంచి అనుమతి అభ్యర్థనలు స్వీకరించేందుకు, వెంటనే వాటిపై చర్యలు తీసుకునేందుకు భారత ఎన్నికల సంఘం సువిధ పోర్టల్‌ను అభివృద్ధి చేసింది. పార్టీలు, అభ్యర్థులు ఓటర్లకు చేరువయ్యే కార్యక్రమాలకు ఫస్ట్ ఇన్ ఫస్ట్ అవుట్ సూత్రంపై పారదర్శకంగా అనుమతులు ఇచ్చేందుకు ఈ పోర్టల్ వీలు కల్పిస్తోంది. ర్యాలీలు నిర్వహించడం, తాత్కాలిక పార్టీ కార్యాలయాలు తెరవడం, ఇంటింటికి ప్రచారం చేయడం, వీడియో వ్యాన్లు, హెలికాప్టర్లు, వాహనాలు, కరపత్రాలు పంపిణీ వంటి వాటికి అనుమతులు ఇస్తుంది.

ఆన్‌లైన్ ద్వారా అనుమతులు

సువిధ పోర్టల్ (https://suvidha.eci.gov.in) ద్వారా రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎక్కడ నుంచైనా, ఎప్పుడైనా అనుమతి అభ్యర్థనలను ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చు. ఆఫ్‌లైన్‌లో కూడా అభ్యర్థనలు ఇవ్వవచ్చు. వివిధ రాష్ట్ర విభాగాల నోడల్ అధికారులతో నిర్వహించే పటిష్టమైన ఐటీ ప్లాట్‌ఫాం సహకారంతో దరఖాస్తులను సమర్థంగా ప్రాసెస్ చేయడానికి ఈ పోర్టల్ సహాయకారిగా ఉంటోంది. యాప్ ద్వారా కూడా సువిధ సేవలను పొందవచ్చు. దరఖాస్తుదారులు తమ అభ్యర్థనల స్థితిని ట్రాక్ చేయవచ్చు. ఈ యాప్ ఐవోఎస్, ఆండ్రాయిడ్ ప్లాట్‌ఫారాల్లో అందుబాటులో ఉంది. సువిధ ప్లాట్‌ఫాం ఎన్నికల ప్రక్రియ సామర్థ్యాన్ని పెంపొందించడమే కాకుండా, అప్లికేషన్ల రియల్ టైమ్ ట్రాకింగ్, స్టేటస్ అప్‌డేట్, టైమ్‌స్టాంప్ చేసిన సమర్పణలను ఎంఎస్ఎం ద్వారా తెలియజేయడం ద్వారా పారదర్శకతను నిర్ధారిస్తుంది. ఇంకా పోర్టల్‌లో లభించే అనుమతి డేటా ఎన్నికల వ్యయాలను పరిశీలించడానికి విలువైన వనరుగా ఉపయోగపడుతుంది. ఎన్నికల ప్రక్రియలో మరింత జవాబుదారీతనం, సమగ్రతకు దోహదపడటమేగాక ఎన్నికల సంఘం నిబద్ధతను పునరుద్ఘాటించడానికి సువిధ ప్లాట్‌ఫాం ఎంతో దోహదపడుతుంది. న్యాయమైన, సమర్థమైన, పారదర్శక ఎన్నికల వాతావరణాన్ని సులభతరం చేయడానికి, అన్ని రాజకీయపార్టీలు, అభ్యర్థులు అవసరమైన అనుమతులు పొందేందుకు సమాన అవకాశాలు కల్పించేందుకు ఇది ఎంతో ఉపయోగపడుతుంది.

సాగర్ కుడికాలువకు నేడు నీటి విడుదల



విజయపురి సౌత్: తాగునీటి అవసరాల నిమిత్తం నాగార్జున సాగర్ ప్రాజెక్టు కుడి కాలువకు సోమవారం ఉదయం 9.30 గంటలకు నీటిని విడుదల చేయనున్నట్లు మాచర్ల ఓ అండ్ ఎం ఈఈ శ్రీహరి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కుడి కాలువ పరిధిలోని గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాలకు నీటి విడుదల కొనసాగుతుందని పేర్కొన్నారు. మొత్తం ఐదు టీఎంసీల నీటిని రోజుకు 5,500 క్యూసెక్కుల చొప్పున ఈ నెల 18వ తేదీ వరకు విడుదల చేయనున్నట్టు వెల్లడించారు.

ఇదండీ జగత్



పగటిపూట ఎండలు మండుతున్నాయని ఇలా మధ్యరాత్రి వచ్చి ప్రచారం చేస్తే ఎలాగయ్యా!!

క్లుప్తంగా...

మహాదుర్గగా శ్రీశైలం భ్రామరి దర్శనం

- కైలాస వాహన సేవలో ఆది దంపతులు
- వైభవంగా ఉగాది మహోత్సవాలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైలం మహాక్షేత్రంలో ఉగాది మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండోరోజు ఆదివారం శ్రీభ్రమరాంబ దేవి మహాదుర్గ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయ దేవాలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో విశేషంగా అలంకరించిన కైలాస వాహనాన్ని అధిష్ఠించిన స్వామి, అమ్మవార్లకు అర్చకులు, వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహాదుర్గ అలంకారంలోని అమ్మవారిని, కైలాస వాహనాధీశులైన ఆది దంపతులకు ఆలయ ఉత్సవం జరిపారు. రాజగోపురం గుండా క్షేత్ర ప్రధాన వీధుల్లోకి తోడ్కొనివచ్చి వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు.

రేపు తిరుమలలో ఉగాది ఆస్థానం

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో ఈ నెల 9వ తేదీన శ్రీక్రోధినామ సంవత్సర ఉగాది ఆస్థానం శాస్త్రోక్తంగా జరగనుంది. ఉదయం ఆరు గంటలకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారికి, విష్వక్సేనుల వారికి విశేష సమర్పణ చేస్తారు. ఉదయం ఏడు నుంచి తొమ్మిది గంటల నడుమ విమాన ప్రాకారం, ధ్వజస్తంభం చుట్టూ ఊరేగింపుగా ఆలయంలోనికి ప్రవేశిస్తారు. ఆ తర్వాత శ్రీవారి మూలవిరాట్టుకు, ఉత్సవమూర్తులకు నూతన వస్త్రాలను ధరింపచేస్తారు. అనంతరం పంచాగ శ్రవణం నిర్వహిస్తారు. ఉగాది ఆస్థానాన్ని బంగారు వాకిలి వద్ద ఆగమ పండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. ఉగాదిని పురస్కరించుకుని 9వ తేదీన శ్రీవారి ఆలయంలో నిర్వహించే ఆర్జిత సేవలైన అష్టదళ పాద పద్మారాధన, కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవాలను టీటీడీ రద్దు చేసింది.

పేదలకు, ప్రధానికి ఒకే వైద్యం అందించాలి

ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు జయచంద్ర నాయుడు



హెల్త్ మేనిఫెస్టో విడుదల చేస్తున్న ఐఎంఏ నేతలు

కర్నూలు (హాస్పిటల్): దేశవ్యాప్తంగా వచ్చే 50 ఏళ్లలో దేశ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని హెల్త్ మేనిఫెస్టో రూపొందించామని, పేదలకు, దేశ ప్రధానికి ఒకే రకమైన వైద్యం అందించాలన్నది దీని ఉద్దేశమని ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జయచంద్ర నాయుడు చెప్పారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కర్నూలులోని ఐఎంఏ భవన్‌లో హెల్త్ మేనిఫెస్టో విడుదల చేశారు. జయచంద్ర నాయుడు మాట్లాడుతూ.. దేశ జీడీపీలో ఆరోగ్య రంగానికి, తాగునీరు, పారిశుధ్యంతో కలిపి కేవలం 1.2 నుంచి 1.6 శాతం మాత్రమే నిధులు కేటాయిస్తున్నారని, దీనిని 2.5 శాతానికి పెంచాలని కోరారు. తాగునీరు, పారిశుధ్యానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించాలన్నారు. చట్టాలను బలోపేతం చేసి వైద్యులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

వైఎస్సార్‌సీపీలో భారీగా కొనసాగుతున్న చేరికలు

తణుకు అర్బన్/నరసాపురం రూరల్/భీమవరం/పాలకొల్లు అర్బన్: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన టీడీపీ, జనసేన కార్యకర్తలు భారీగా వైఎస్సార్‌సీపీలో ఆదివారం చేరారు. అత్తిలి గోగులమ్మ పేటలో టీడీపీ, జనసేన పార్టీల మద్దతుదారులైన 30 కుటుంబాలు మంత్రి కారుమూరి సమక్షంలో పార్టీలో చేరాయి. నరసాపురం మండలం లక్ష్మణేశ్వరంలో జనసేన, టీడీపీల నుంచి భారీగా నేతలు, కార్యకర్తలు ప్రభుత్వ చీఫ్ విప్, స్థానిక ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. భీమవరం 39వ వార్డుకు చెందిన జనసేన, టీడీపీ నేతలు, కార్యకర్తలు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పాలకొల్లు మండలం చింతపర్రులో వైఎస్సార్‌సీపీ నేత పెన్మెత్స రామరాజు ఆధ్వర్యంలో నవ్యాంధ్ర దివ్యాంగుల సంక్షేమ సంఘం మండల శాఖ అధ్యక్షుడు దిద్దే సత్యనారాయణ, అతని అనుచరులు 100 మందికి పైగా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల గోపి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. రాజమహేంద్రవరంలోని బర్మా కాలనీకి చెందిన టీడీపీ, జనసేన కార్యకర్తలు ఎంపీ మార్గాని భరత్ సమక్షంలో, రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం హుకుంపేట వరలక్ష్మీ కాలనీకి చెందిన 500 మంది టీడీపీ కార్యకర్తలు మంత్రి చెల్లుబోయిన సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు.



మంత్రి చెల్లుబోయిన సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు



ఎంపీ మార్గాని సమక్షంలో టీడీపీ, జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన బర్మా కాలనీ వాసులు



ఎమ్మెల్యే ముదునూరి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన లక్ష్మణేశ్వరం గ్రామస్తులు



భీమవరంలో వైఎస్సార్‌సీపీలోకి చేరుతున్న వారిని ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



పాలకొల్లు మండలంలో వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గోపి



అత్తిలి గోగులమ్మ పేటలో వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో మంత్రి కారుమూరి

అంతర్వేదిలో జస్టిస్ రవినాథ్ తిల్హరీ



న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరీకి స్వామివారి చిత్రపటం అందజేస్తున్న సూపరింటెండెంట్

సఖినేటిపల్లి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరీ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన న్యాయమూర్తికి అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన జస్టిస్ రవినాథ్ తిల్హరీకి వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, ఆలయ సూపరింటెండెంట్ పి.విజయసారథి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

శ్రీవారి సేవలో సీఎస్, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి

తిరుమల: శ్రీవారిని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాధవిదేవి వేర్వేరుగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు పలుకగా.. టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి, అధికారులు లడ్డూ ప్రసాదాలతో ఘనంగా సత్కరించారు.



ఆలయం వెలుపల తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాధవిదేవి



జవహర్‌రెడ్డికి చిత్రపటం అందిస్తున్న టీటీడీ ఈవో ధర్మారెడ్డి


ఈద్గా స్థలాన్ని అపవిత్రం చేసిన టీడీపీ మూకలు

- సామూహిక నమాజులు చేసేచోట మద్యం సేవించి మూత్రవిసర్జన
- ఈద్గాకు తాళం వేసి ఉండటంతో ప్రహరీ పగులగొట్టి లోనికి ప్రవేశించిన దుండగులు



ఈద్గాలో పడగొట్టిన ప్రహరీ నుంచి వస్తున్న టీడీపీ కార్యకర్త

సత్తెనపల్లి: ముస్లింలు పవిత్రంగా భావించే ఈద్గా స్థలాన్ని టీడీపీ మూకలు అపవిత్రం చేసిన ఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో శనివారం రాత్రి జరిగింది. ప్రజాగళం పేరుతో ఎన్నికల ప్రచారానికి టీడీపీ అధినేత చంద్రబాబు శనివారం రాత్రి సత్తెనపల్లి వచ్చారు. దీంతో ఆ పార్టీకి చెందిన కొందరు రౌడీ మూకలు ఈద్గా స్థలంలోకి చొరబడి మద్యం సేవించి, పొగతాగుతూ మూత్ర విసర్జన చేశారు. ఈద్గా స్థలానికి తాళం వేసి ఉండటంతో ప్రహరీ పగులగొట్టి టీడీపీ మూకలు లోపలికి ప్రవేశించాయి. అక్కడే ఆహారం వండుకుని, మద్యం సేవించి ఖాళీ సీసాలు, సిగరెట్ పెట్టెలు పడేశారు. ఆ ప్రాంతంలోనే మూత్ర విసర్జన కూడా చేశారు. ఈద్గా ప్రాంతాన్ని ఆదివారం ముస్లింలు, మత పెద్దలు పరిశీలించి తమ మనోభావాలను దెబ్బ తీశారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. మునిసిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగుర్‌మీరా మాట్లాడుతూ.. రంజాన్ రోజున 10 వేల మంది ముస్లింలు సామూహిక నమాజులకు హాజరయ్యే ఈద్గా స్థలంలో మద్యం సేవించి, మూత్ర విసర్జన చేయడం బాధాకరమన్నారు. టీడీపీ ఇలాంటి అనైతిక చర్యలకు పాల్పడటం దారుణమన్నారు. ఈద్గా ప్రాంతమంతా పరిశీలించి అక్కడ పడేసిన ఖాళీ మద్యం సీసాలను, సిగరెట్ పెట్టెలను తొలగించారు. ఈద్గాలోని నమాజ్ చేసే ప్రాంతాన్ని వాటర్ ట్యాంకర్‌తో నీటిని రప్పించి కడిగి శుభ్రం చేశారు. ఈద్గా స్థలాన్ని అపవిత్రం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు షేక్ నాగుల్‌బాషా, నాయకులు సయ్యద్ సలీం, షేక్ మహమ్మద్ గని, షేక్ జానీ, షేక్ ముక్తార్, హుస్సేన్, మత పెద్దలు సుభానీఖాన్, ఖలీల్, సయ్యద్ హుస్సేన్, మహీబుల్లా, చిన్నమాబు, యూసఫ్, రెహమాన్, షేక్ కరీం, ఖాజా పాల్గొన్నారు.



మీ లోతైన తత్వశాస్త్రం కంటే
మీ శరీరంలో ఎక్కువ జ్ఞానం ఉంది.
- ఫ్రెడరిక్ నీషే

సాక్షి
సోమవారం, 8 ఏప్రిల్ 2024

ప్ర'పంచాంగం'

విశ్వంలో ఏదైనా చక్రగతిలోనే తప్ప సరళరేఖలో సాగదు; మానవజీవితమూ దీనికి మినహాయింపు కాదు. పగటిని రాత్రి అనుసరిస్తుంది; సూర్యుని చంద్రుడూ, నక్షత్రాలూ అనుసరిస్తాయి. మనిషి జీవితంలోనూ సుఖాల వెలుగును వెన్నంటే కష్టాల చీకట్లూ ఉంటాయి. జీవపరిణామక్రమంలో మనిషిలో మెదడు అభివృద్ధి చెంది ఆలోచన పదునెక్కినకొద్దీ అతణ్ణి అమితంగా తికమక పెట్టిన వాటిలో ఈ చక్రగమనం ఒకటి. మనుగడ పూర్తిగానూ, నేరుగానూ ప్రకృతివనరులపై ఆధారపడిన ఆదిమకాలంలో వేడి, వర్షం, చలి చక్రగతిని ఎందుకు అనుసరిస్తాయన్నది, కడుపు నిండిన తర్వాత కలిగే జిజ్ఞాస కాదు; కడుపు నింపుకోవడంతో ముడిపడిన చిక్కుప్రశ్న.

ఈ ఋతుపరివర్తనలో అతని చుట్టూ ఉన్న పరిసరాలు మారిపోయి; తను ఆహారం కోసం ఆధారపడిన కొన్ని రకాల జంతువులు అదృశ్యమై, కొత్తవి అడుగుపెడుతున్నాయి! దీనిని అర్థం చేసుకోడానికీ, దీనికి ఎవరు కారణమో తెలుసుకోడానికీ సమయం పట్టింది. పెరిగి తరిగే చంద్రకళలే కారణమనుకుని వాటిని కాలానికి అన్వయించుకుని ఋతుచక్రానికి కాలచక్రాన్ని జోడించుకున్నాడు. అలా కాలగణనంలో చాంద్రమానం అడుగుపెట్టి ఇప్పటికీ ఒక సంప్రదాయంగా కొనసాగుతోంది. ఆ క్రమంలోనే రేపు, అంటే చైత్ర శుక్ల పాడ్యమి నాడు మనం జరుపుకొంటున్నది స్వస్తిశ్రీ చాంద్రమాన క్రోధి నామ సంవత్సర ఉగాది.

ఉగాదిని ఇప్పుడు మనం ఒక పండుగగానే భావిస్తాం; గడిచిన ఏడాది ఎదురైన కష్టనష్టాలూ, ఆశాభంగాల పాత దుస్తులు విడిచేసి కొత్త ఆశలూ, ఉత్సాహాల ఉడుపులు ధరించే సందర్భమనుకుంటాం; ఆరు రుచుల సమ్మేళనంగా జీవితాన్ని సంకేతించేదిగా గుర్తుపెట్టుకుంటాం; పంచాంగ శ్రవణానికీ, కవితా శ్రవణానికీ కూడా చెవులు అప్పగిస్తాం. నూతనశోభకు, శుభానికి తలుపు తెరిచేలా తోచే ఏ సందర్భమైనా పండుగే. అయితే, ఉగాది పేరిట కొత్త సంవత్సర ప్రారంభాన్ని పండుగగా మలచడం వెనుక ఎంతో కథ ఉంది; అంతుబట్టని కాలచక్రపు తిప్పుళ్ళకు బిత్తరపోయి, తిరిగి నిలదొక్కుకోడానికి బతుకు చేసే పెనుగులాట ఉంది; కాలగమనాన్ని అర్థం చేసుకోవడానికి పడిన అంతులేని వైజ్ఞానిక ప్రయాస ఉంది; మనం అనాగరికునిగా పొరబడే ఆదిమానవుణ్ణే తొలి ఖగోళవేత్తగా రూపించి నిరూపించే అద్భుత నేపథ్యం ఉంది. తప్పులు, సవరణల రూపంలో సాగిన ఆ కాలగణనం కసరత్తులోకి తొంగిచూసినప్పుడు నాటి మానవుల ఆరాటపోరాటాలతో పాటు మరెన్నో ఆసక్తికర విషయాలు మన కళ్లను మెరుపులా తాకి ఆశ్చర్యం గొలుపుతాయి.

చంద్రుని వృద్ధిక్షయాల ఆధారంగా కాలాన్ని గణించడం, యాభైవేల సంవత్సరాల క్రితమే పాతరాతియుగంలో మొదలైనట్టు శాస్త్రవేత్తలు నిరూపించారు. అప్పటి గుహాచిత్రాలలో కనిపించిన పొడవాటి దండాన్ని చంద్రకళల ఆధారంగా కాలాన్ని కొలిచే సాధనంగా గుర్తించారు. ఇప్పటికీ పన్నెండు రాశులలో ఒకటిగా ఉన్న మేషరాశిని సూచించే పొట్టేలు బొమ్మతో సహా వివిధ జంతువుల బొమ్మలు ఆ దండంపై ఉన్నాయి. అనంతరకాలంలో పురోహితులు, మాంత్రికులు, పాలకులు ధరించే దండాలకు అదే మాతృక అయినట్టు తేల్చారు. చంద్రునితో ఋతువుల మార్పును ముడిపెట్టి చాంద్రమానానికి అలా తెరదీయడం గొప్ప ముందడుగే కానీ; ఋతుచక్రానికి, చాంద్రమానంలోని మాసచక్రానికి పొంతన కుదరకపోవడంతో, ఋతుపరివర్తనకు సూర్యుడు కారణమన్న ఎరుక పుట్టి సౌరమానం అడుగుపెట్టింది. భూమి తనచుట్టూ తాను తిరుగుతూ; ఇరవైమూడున్నర డిగ్రీల ఒంపుతో సూర్యుని చుట్టూ కూడా తిరుగుతోందన్న గ్రహింపు లేని ఆ కాలంలో కూడా సంవత్సరానికి 300 నుంచి 400 రోజులను లెక్కగట్టడాన్ని నేటి శాస్త్రవేత్తలు అబ్బురంగానే పరిగణిస్తారు. చాంద్రమానం సంవత్సరానికి 354 రోజులను లెక్కిస్తే, మరింత నిర్దుష్టమైన సౌరమానం 365 పైచిలుకు రోజులను లెక్కించింది. రెంటిమధ్యా ఉన్న 11 రోజుల పైచిలుకు తేడాను సరిపెట్టి రెండు మానాలనూ సమన్వయించడం ఖగోళ పండితులకు పెద్ద సవాలే అయింది. రోమన్, జూలియన్, గ్రెగేరియన్ లాంటి ఎన్ని కాలగణన పద్ధతులు వచ్చినా ఇలాంటి సమస్యలు నేటికీ అపరిష్కృతంగానే ఉన్నాయని 'కేలండర్ కథ' అనే పుస్తకంలో డా. మహీధర నళినీమోహన్ అంటారు.

మనదేశానికి చెందిన భాస్కరాచార్యులు సహా ప్రపంచవ్యాప్తంగా ఎందరో ఖగోళపండితులు సంవత్సరానికి 365 రోజుల పైచిలుకును సక్రమంగానే గుర్తించారు. కానీ అందులో ప్రకృతి సిద్ధంగా ఉన్న భిన్నాంకం వారి మేధకు లొంగేది కాదు. చాంద్రమానంలో భాగమైన నెలకు 29 రోజుల పైచిలుకు లెక్కా అలాంటిదే. భూభ్రమణంలో ఒంపు వల్ల కాలగణనంలో ఏర్పడే ఆ వైవిధ్యమే లేనప్పుడు ఋతుపరివర్తనే అంతరించి మరింత విషమసమస్య తలెత్తే మాటా నిజమే. మొత్తంమీద అప్పటినుంచీ ఇప్పటివరకూ కేవల చాంద్రమానం, కేవల సౌరమానం; చాంద్ర-సౌరమానాల సమన్వయం అనే మూడు పద్ధతులూ అమలులో ఉన్నాయి. విశేషమేమిటంటే, కాలగణానికి అనుసరించిన పద్ధతుల్లోనూ, ఆ క్రమంలో ఎదురైన సమస్యల పరిష్కారంలో సాఫల్య, వైఫల్యాలలోనూ ప్రపంచానుభవం ఒక్కలాంటిదే. కనుక 'పంచాంగం' అనే మాటను 'ప్రపంచాంగం'గానూ చెప్పుకోవడంలో తప్పులేదు.

పైన చెప్పిన సౌర, చాంద్రమానాల సమన్వయాన్నే 'యుగం' అంటారని 'జనకథ' అనే పుస్తకంలో రాంభట్ల కృష్ణమూర్తిగారి వివరణ. అధికమాసాలను పాటించడం ఇందులో భాగమే. అప్పుడు కూడా రెండు మానాల సమన్వయం అయిదేళ్ళకోసారే సాధ్యమవుతుంది. అదే అసలైన 'యుగాది'. ఇప్పుడు 'ఉగాది' పేరుతో ఏటా జరుపుకొంటున్నాం.

రైతుకు 'వినియోగ' ఆసరా!

విశ్లేషణ



దేవీందర్ శర్మ

'రైతు లేనిదే తిండి లేదు' అనేది పసలేని నినాదం కాదు. అందుకే వ్యవసాయాన్ని సజీవంగా ఉంచడానికి, ముందుకు తీసుకెళ్లడానికి వినియోగదారుల నిబద్ధత చాలా అవసరం. ఎల్లప్పుడూ ఆహారం చౌకగా ఉండాలని కోరుకునే బదులు, వినియోగదారులు తాము చెల్లించే న్యాయమైన, లాభదాయకమైన ధర రైతులకు మంచి జీవనాన్ని పొందడంలో మద్దతునిస్తుందని గ్రహించినట్లయితే, ఎక్కువ చెల్లించడానికి సిద్ధంగా ఉంటారు. అందుకు ప్రతిఫలంగా సురక్షితమైన, ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించడంలో అది వారికి సహాయపడుతుంది. వినియోగదారులు ఆహార గొలుసుపై నియంత్రణను క్రమేణా పెంచుకోవడంతో రైతుకూ, వినియోగదారుకూ మధ్య సంబంధం ఇద్దరికీ లాభదాయకం అవుతుంది. తద్వారా అది ఉత్పత్తుల అమ్మకాలలో ప్రతిబింబిస్తుంది.

2016లో ఫ్రాన్స్‌లో పాల ధరలు పడిపోయినప్పుడు 'ఎవరు బాస్?' అనే ఆలోచన వచ్చింది. ఫ్రెంచ్ డెయిరీ రైతులు కష్టాలను అధిగమించడంలో సహాయపడటానికి ప్రారంభించిన ఒక చిన్న ప్రయత్నమే 'ఎవరు బాస్?'. తర్వాత ఇది తనకుతానుగా ఒక ప్రత్యేకమైన వినియోగదారుల ఉద్యమంగా మారింది, ప్రపంచవ్యాప్తంగా దాని రెక్కలను విస్తరించింది. స్థిరమైన, పునరుత్పత్తి వ్యవసాయ వ్యవస్థలకు దారితీసే ఆరోగ్యకరమైన పరివర్తన దిశగా వ్యవసాయ ఆహార పరిశ్రమ పని చేస్తుందని నిర్ధారిస్తూ, ఫ్రెంచ్ ఆహార సహకార బ్రాండ్‌గా 'ఎవరు బాస్' అనే అవగాహనోద్యమం రైతులకు జీవనాధారంగా ఉద్భవించింది.



రైతులకు అధిక ధర ఇవ్వడం మార్కెట్లను కుప్పకూలుస్తుంది అని నమ్మే వారందరికీ, ఇక్కడ నేర్చుకోవడానికి గొప్ప అభ్యాసం ఉంది. ఎల్లప్పుడూ ఆహారం చౌకగా ఉండాలని కోరుకునే బదులు, వినియోగదారులు తాము చెల్లించే న్యాయమైన, లాభదాయకమైన ధర రైతులకు మంచి జీవనాన్ని పొందడంలో మద్దతునిస్తుందని గ్రహించినట్లయితే, ఎక్కువ చెల్లించడానికి సిద్ధంగా ఉంటారు. మరింతగా క్రమాంకనం చేస్తే, ప్రతిఫలంగా సురక్షితమైన, ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించడంలో అది వారికి సహాయపడుతుంది. వినియోగదారులు ఆహార గొలుసుపై నియంత్రణను క్రమేణా పెంచుకోవడంతో, ఈ క్విడ్ ప్రోకో (నీకిది, నాకది) సంబంధం మరింత పెరిగింది. ఇది ఆ ఉత్పత్తుల అమ్మకాలలో ప్రతిబింబిస్తుంది. సగటున 31 శాతం పైగా పెరిగింది.

కనీస మద్దతు ధరను చట్టబద్ధం చేయాలంటూ భారతీయ రైతులు నిరసన వ్యక్తం చేయడం ద్వారా ఆహార ద్రవ్యోల్బణం పెరుగుతుందని భయపడే ప్రధాన ఆర్థికవేత్తలు, మీడియా, మధ్యతరగతి వారు ఆగ్రహించిన తరుణంలో ఈ క్విడ్ ప్రో కో భావన ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఫ్రాన్స్, ఇతర ప్రాంతాలలో వినియోగదారులు స్వచ్ఛందంగా ఎక్కువ చెల్లిస్తున్నప్పుడు భయాందోళనలను సృష్టించే బదులు, భారత ఆర్థికవేత్తలు పంటలకు సరసమైన ధరను నిరాకరించడం వ్యవసాయ జీవనోపాధిని ఎలా చంపుతుందో గ్రహించి, రైతులకు గిట్టుబాటు ధర కల్పించే ఈ ప్రయత్నం ఎంత కీలకమో వినియోగదారులకు అవగాహన కల్పించాలి. మొత్తానికి, వినియోగదారులు రైతుల కష్టాల పట్ల సున్నితంగా ఉంటారు. సరైన అవగాహనతో, వారు వినియోగ ప్రవర్తనను సులభంగా మార్చగలరు. అది మార్కెట్ శక్తులను సైతం మార్చేలా చేస్తుంది.

మిగులు ఉత్పత్తి కారణంగా ఫ్రాన్స్‌లో పాల ధరలు పడిపోయినప్పుడు ఆ పరిణామం ఫ్రెంచ్ పాడి పరిశ్రమ పతనానికి దాదాపుగా దారి తీసింది. పాడి రైతులు షట్టర్‌లు మూసివేయడం ప్రారంభించడంతో గ్రామీణ ప్రాంతాల్లో రైతుల ఆత్మహత్యలు పెరిగాయి. ఆ కష్ట సమయాల్లో నికోలస్ చబన్నే. ఒక పాడి రైతు అయిన మార్షల్ దార్బన్‌ను కలుసుకున్నాడు. చబన్నే స్థానిక పాడి పరిశ్రమ సహకార సంస్థకు అధ్యక్షుడిగా ఉన్నారు. వారు రైతు సంఘం దుఃస్థితిని, చుట్టుపక్కల ఉన్న రైతుల బాధలను చర్చించినప్పుడు, రైతులను ఆదుకోవడానికి వినియోగదారులను ఒకచోట చేర్చే ఆలోచన రూపుదిద్దుకుంది. ''ఇది కష్టమని నాకు తెలుసు, కానీ ప్రయత్నించడం విలువైనదే'' అని నికోలస్ నాతో అన్నారు.

ఇలా 'ఎవరు బాస్?' అనేది రూపొందింది. రైతులకు గిట్టుబాటు ధర చెల్లించి ఆదుకోవడమే దీని లక్ష్యం. ''మనకు ఆహారం అందించే ప్రతి ఒక్కరూ గౌరవంగా జీవించడానికి ఇది అవసరం'' అని చబన్నే అన్నారు. 2016 అక్టోబర్‌లో, ఆపదలో ఉన్న 80 కుటుంబాలకు సహాయం చేస్తూ 7 మిలియన్ లీటర్ల పాలను విక్రయించే లక్ష్యంతో పాల కోసం బ్లూ కార్టన్ డిజైన్ ప్యాక్ ప్రారంభమైంది. సందేశాన్ని వ్యాప్తి చేయడంలో సహాయపడటానికి సోషల్ మీడియాను ఉపయోగించారు. రైతు చేయాల్సిందల్లా ఒక యూరో నమోదు రుసుము చెల్లించి, మంచి పద్ధతుల పట్ల తన నిబద్ధతను ప్రదర్శించడమే!

ఇది ప్రారంభమైన ఏడేళ్లలో, 'హూ ఈజ్ ది బాస్' సంఘీభావ బ్రాండ్ 424 మిలియన్ లీటర్ల పాలను లీటరుకు 0.54 యూరోల హామీతో కూడిన సరసమైన ధరకు విక్రయించింది. అయితే అది మార్కెట్ ధర కంటే 25 శాతం ఎక్కువ. అయినప్పటికీ ఇది నేడు ఫ్రాన్స్‌లో అత్యధికంగా అమ్ముడవుతున్న పాల బ్రాండ్‌గా ఉద్భవించింది. పైగా దాదాపు 300 వ్యవసాయ కుటుంబాలకు (వివిధ ఉత్పత్తుల కోసం సుమారు 3,000 మందికి) ఇది అండనిస్తోంది. మార్కెట్‌లో పనిచేసే ధరల వ్యత్యాసాల లాగా కాకుండా, మార్కెట్ ధోరణులతో హెచ్చుతగ్గులు లేని స్థిరమైన ధరను రైతులు పొందుతారు. ఫ్రాన్స్‌లో 38 శాతం రైతులు కనీస వేతనం కంటే తక్కువ సంపాదిస్తారనీ, పైగా 26 శాతం మంది దారిద్ర్య రేఖకు దిగువన జీవించి ఉన్నారని లెక్క. ఈ పరిస్థితుల్లో ఒక సర్వే ప్రకారం 75 శాతం మంది ప్రజలు తమ కొనుగోలుకు మరికొన్ని సెంట్లు జోడించడానికి సిద్ధంగా ఉన్నారని గుర్తించడం హర్షించదగినది. ఇది ఉత్పత్తిదారులకు సరసమైన ధరకు హామీ ఇస్తుంది.

ఇది పాలతో ప్రారంభమైంది. కాలక్రమేణా ఈ సంఘీభావ బ్రాండ్ సేంద్రియ వెన్న, సేంద్రియ కాటేజ్ చీజ్, ఫ్రీ-రేంజ్ గుడ్లు, పెరుగు, ఆపిల్ రసం, ఆపిల్ పురీ, బంగాళాదుంపలు, పిండిచేసిన టమోటాలు, గోధుమ పిండి, చాక్లెట్, తేనె, ఘనీభవించిన గొడ్డు మాంసం(గ్రౌండ్ స్టీక్)తో సహా దాదాపు 18 ఉత్పత్తులకు విస్తరించింది. సహకార సంఘం సాగుదారులకు సరసమైన ధరను అందజేస్తున్నప్పటికీ, వారు ఆరోగ్యకరమైన పద్ధతులను అనుసరించాల్సి ఉంటుంది. అవేమిటంటే వంటకాల్లో లేదా పశువుల దాణాలో పామాయిల్ ఉపయోగించకపోవడం, జన్యుపరంగా మార్పు చెందిన పదార్థాలను వాడకపోవటం. సంవత్సరంలో కనీసం 4 నెలల పాటు జంతువులను మేపడం వంటివి.

ఈ భావన ఇప్పుడు జర్మనీ, బెల్జియం, గ్రీస్, ఇటలీ, మొరాకో, నెదర్లాండ్స్, స్పెయిన్, బ్రిటన్, అమెరికాలోని 9 దేశాల వినియోగదారులకు చేరువవుతోంది. ఇక్కడ ఫ్రెంచ్ మాతృ సంస్థతో లైసెన్సింగ్ ఒప్పందంతో వినియోగదారుల వ్యవస్థలు ఏర్పాటు చేయటం జరిగింది. ఫ్రాన్స్ తన పండ్లు, కూరగాయల అవసరాలలో 71 శాతం దిగుమతి చేసుకుంటుందని, ఇది స్థానిక ఉత్పత్తిదారుల జీవనోపాధిని దెబ్బతీస్తోందని గ్రహించిన నికోలస్ దేశీయ రైతులకు సహాయం చేయడానికి ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించాడు. ''మేము సుదూర ప్రపంచం నుండి రవాణా చేయకూడదనుకుంటున్నాము. మన స్థానిక ఉత్పత్తిదారులను, వారు ప్రతిరోజూ మన ఇంటి ముంగిట ఉత్పత్తి చేసే ఆహారాన్ని మనం రక్షించుకోవాలి'' అని ఆయన అన్నారు. స్థానిక ఉత్పత్తిదారులకు సహాయం చేయడానికి, సహకార బ్రాండ్ ఇటీవల తన ఆహార బాస్కెట్‌లో స్ట్రాబెర్రీ, తోటకూర, కివీ పళ్లను పరిచయం చేసింది.

మార్కెట్లు పోటీని తట్టుకునేందుకు అట్టడుగు స్థాయికి దూసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో 'ఎవరు బాస్' అనే ఆలోచన వారికి కలిసి వచ్చింది. ఏది ఏమైనప్పటికీ, వ్యవసాయ ఆదాయాలను పెంపొందించే విషయంలో ప్రపంచవ్యాప్తంగా విఫలమైన సాగుదారులను మార్కెట్‌లు కలిగి ఉన్నందున, రైతులకు వినియోగదారుల మద్దతుపై చాలావరకు ఈ 'ఎవరు బాస్' ఆధారపడి ఉంటుంది. ఫ్రాన్స్‌లోని 16 మిలియన్ల మంది ప్రజలు సాపేక్షంగా ఎక్కువ ధరలకు కొనుగోళ్లు చేయడం ద్వారా రైతులను ఆదుకోవడానికి ముందుకు వస్తే, నికోలస్ ప్రారంభించిన సంస్థ కచ్చితంగా చాలా ముందుకు వచ్చినట్లే అవుతుంది.

వ్యాసకర్త ఆహార, వ్యవసాయ రంగ నిపుణులు
ఈ-మెయిల్: hunger55@gmail.com

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఇప్పుడెందుకు?



ఎన్నికల మ్యానిఫెస్టోలో భాగంగా కాంగ్రెస్ నేత పి. చిదంబరం 70 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ ఇస్తున్న 'గరీబీ హఠావో' హామీనే తిరిగి హామీగా ఇస్తున్నారు. విషయం ఏంటంటే - భారతదేశంలో 2013-2014లో 29.17 శాతంగా ఉన్న పేదరికం 2022-23 నాటికి 11.28 శాతానికి గణనీయమైన తగ్గుదలను నమోదు చేసింది.

- సునందా రాయ్, వ్యంగ్య వ్యాఖ్యాత

'లా' ఇంగ్లీషే కాదా!



బీజేపీలోని రెండో మేధావి కంగనా రనౌత్ (తొలి మేధావి ఇప్పటికీ సుధాన్షు త్రివేది) చెబుతున్న దానిని బట్టి "సర్దార్ పటేల్‌కు ఇంగ్లీష్ రాదు. అందుకే ఆయన ప్రధాని కాలేకపోయారు". కానీ వాస్తవమేంటంటే లా డిగ్రీ చేయటానికి 1910లో పటేల్ ఇంగ్లండ్ వెళ్లారు. 1913లో లా పట్టభద్రులయ్యారు.

- స్వాతీ దీక్షిత్, సెంట్రిస్ట్

ఊపిరిపోసిన తీర్పు



'యు.పి.బోర్డ్ ఆఫ్ మదర్సా చట్టం - 2004' రాజ్యాంగ విరుద్ధమని అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీమ్ కోర్టు స్టే విధించటంతో యూపీలోని 20 లక్షల మంది మదర్సా విద్యార్థులకు, 16 వేల మదర్సాలకు, 10 వేల మంది మదర్సా ఉపాధ్యాయులకు పెద్ద ఉపశమనం లభించినట్లయింది.

- ఆసిఫ్ ముజ్తఫా, రిసెర్చ్ స్కాలర్

ప్రకృతి న్యాయం



ఆలయ ఆచారాల పేరిట జంతు హింసకు పాల్పడుతున్న వారు ఆ జంతువుల ఆగ్రహానికి గురైతే కనుక అందుకు వారు అర్హులే అని ఇటువంటి ఘటనలు చూసినప్పుడు మనసుకు అనిపిస్తుంది. (కేరళలో ఇటీవల ఆలయ ఆచార కార్యక్రమ నిర్వహణ సమయంలో ఆస్థాన ఏనుగు తొక్కడం వల్ల మావటి మరణించడంపై స్పందిస్తూ...)

- ఆనంద్ శంకరన్, సామాజిక వ్యవస్థాపకులు

అదేం జాడ్యం?!



మార్క్సిజం చరిత్రను ప్రచారాస్త్రంగా ఉపయోగించుకుంటుంది. ప్రాచీన నాగరికతలు, నాటి రుషులపై వారికి అవగాహన లేదు. ఎంత గొప్పదాన్నయినా తేలిక చేసి పడేయటం కనిపిస్తుంది!

- డాక్టర్ డేవిడ్ ఫ్రాలే (పండిత వామదేవ శాస్త్రి)

ఇన్ బాక్స్

నిండుగ వెలుగు తెలుగు పండుగ

'ఉగాది' పేరు చెప్పగానే ముందుగా గుర్తుకు వచ్చేది అది మన తెలుగు పండుగ అని! ఉగాది నుండే తెలుగు సంవత్సరం మొదలవుతుంది కాబట్టి ఇది తెలుగువారి మొదటి పండుగ. చైత్ర శుద్ధ పాడ్యమి రోజున బ్రహ్మ సృష్టిని ప్రారంభించారని నమ్ముతారు. మత్స్యావతారం ధరించిన విష్ణువు సోమకుని సంహరించి వేదాలను బ్రహ్మకప్పగించిన సందర్భంగా 'ఉగాది' ఆచరణలోకి వచ్చిందని పురాణ ప్రతీతి. బ్రహ్మదేవుడు చైత్ర మాస శుక్లపక్ష ప్రథమ దినాన సూర్యోదయ వేళ సమగ్రంగా ఈ జగత్తును సృష్టించాడంటారు. 'ఉగాది', 'యుగాది' అనే రెండు పదాలు వాడుకలో ఉన్నాయి. 'ఉగ' అనగా నక్షత్ర గమనం. నక్షత్రగమనానికి 'ఆది'... 'ఉగాది'. అంటే సృష్టి ఆరంభమైన దినమే 'ఉగాది'.

ఉగాది పండుగ రోజున త్వరగా నిద్రలేచి ఇంటి ముందర ముగ్గులు వేసి వసంత లక్ష్మిని స్వాగతిస్తారు. తలంటు స్నానాలు చేస్తారు. కొత్త బట్టలు ధరిస్తారు. గుమ్మాలకు మామిడాకుల తోరణాలు కడతారు. షడ్రుచులతో కూడిన ఉగాది ప్రసాదాన్ని పంచాంగానికి, దేవతలకు నైవేద్యం చేసి తమ భవిష్యత్ జీవితాలు ఆనందంగా సాగాలని కోరుతూ ఉగాది పచ్చడి తింటారు. ఉగాది పచ్చడికి మనశాస్త్రాలలో 'నింబ కుసుమ భక్షణం'; 'అశోక కళికా ప్రాశనం' అని వ్యవహరించేవారు.



త్వామష్ట శోక నరాభీష్ట మధుమాస సముద్భవ
నిబామి శోక సంతప్తాం మమ శోకం సదా కురు

ఈ మంత్రం చదువుతూ ఉగాది పచ్చడి తినాలని శాస్త్రాలు చెప్తున్నాయి. ఉగాది పచ్చడి ఆహారంలో ఉండే ఔషధ గుణాన్ని, వృక్షసంరక్షణ అవసరాన్ని, ఆయుర్వేదానికీ - ఆహారానికీ గల సంబంధాన్ని చెప్పడమే కాక పండుగలకు, ఆచారాలకు, సముచిత ఆహారానికి గల సంబంధాన్ని చాటి చెప్తుంది. ఉగాది రోజున తినే పచ్చడిలో కొత్త చింతపండు, లేత మామిడి చిగుళ్ళు, అశోక వృక్షం చిగుళ్ళు, కొత్త బెల్లం, వేపపూత, మామిడి కాయముక్కలు, చెరకు ముక్కలు, జీలకర్ర లాంటివి ఉపయోగించాలి. ఈ పచ్చడి శారీరక ఆరోగ్యానికి కూడా ఎంతో శ్రేష్ఠమని ఆయుర్వేదం పేర్కొంటోంది. ఈ పచ్చడిని ఖాళీపొట్టతో తీసుకున్నప్పుడు ఆరోగ్యానికి మంచిదంటారు. బెల్లం - తీపి(ఆనందం), ఉప్పు (జీవితంలో ఉత్సాహం), వేప పువ్వు - చేదు (బాధ కలిగించే అనుభవాలు), చింతపండు - పులుపు (నేర్పుగా వ్యవహరించవలసిన పరిస్థితులు), మామిడి - వగరు (కొత్త సవాళ్లు), కారం (సహనం కోల్పోయే స్థితి) గుణాలకు సంకేతాలు అంటారు.

ఉదయంవేళ, లేదా సాయంత్రం సమయాలలో పంచాంగ శ్రవణం చేస్తారు. పంచాంగం అంటే అయిదు అంగాలని అర్థం చెపుతారు. ఉగాదికి సాహితీవేత్తలు ప్రత్యేకంగా 'కవి సమ్మేళనం' నిర్వహిస్తారు. ఒక్క తెలుగు సంప్రదాయంలోనే కాక దేశంలోని పలు ప్రాంతాల్లో వివిధ పేర్లతో ఉగాది జరుపుతారు. తెలుగు వారిలానే చాంద్రమానాన్ని అనుసరించే మరాఠీలకు కూడా ఉగాది చైత్రశుద్ధ పాడ్యమి నాడే వస్తుంది. వారి సంవత్సరాదిని 'గుడి పడ్వా'గా (పడ్వా అంటే పాడ్యమి) వ్యవహరిస్తారు. తమిళుల ఉగాదిని (తమిళ) 'పుత్తాండు' అంటారు. వారిది సౌరమానం. ఏప్రిల్ 14న సంవత్సరాదిని చేసుకుంటారు. బెంగాలీల నూతన సంవత్సరం వైశాఖ మాసంతో మొదలవుతుంది. వారి కాలమానం ప్రకారం వైశాఖశుద్ధ పాడ్యమినాడు ఉగాది వేడుకలు చేసుకుంటారు. వ్యాపారులు ఆ రోజున పాత ఖాతా పుస్తకాలన్నింటినీ మూసి, సరికొత్త పుస్తకాలు తెరుస్తారు.

- నందిరాజు రాధాకృష్ణ, వెటరన్ జర్నలిస్ట్ 98481 28215
(రేపు ఉగాది పర్వదినం సందర్భంగా)

అనుకరణకు అందని చిత్తరువు

కామెంట్



కరణ్ థాపర్

ఎవరైనా మీకు సన్నిహితులు మరణించినప్పుడు వారి జ్ఞాపకాలు మిమ్మల్ని వరదలా ముంచెత్తడం అసాధారణ మేమీ కాదని నేను ఊహించగలను. ఏనాడో మరిచిపోయిన సంఘటనలు - ఎక్కువగా ఆశ్చర్యం గొల్పేవి - తక్షణమే ఆ ముందురోజునే జరిగినంత స్పష్టంగా స్ఫురణకు వస్తాయి. అయితే అవి బహుశా మూడు, లేదంటే నాలుగు దశాబ్దాల క్రితానివి కూడా కావచ్చు. చిన్న చిన్న విషయాలు... భూమి బద్దలయ్యేలా ఒక నవ్వు, ప్రత్యేకమైన ఒక దేహభాష, విచలితపరచే ఒక స్వరశ్రుతి... హఠాత్తుగా మది పుటల్లోంచి పైకి లేస్తాయి. ఆరోజు ముందువరకు అవన్నీ ఎప్పటికీ జ్ఞాపకాల్లో లేనివన్నట్లే ఉంటుంది. ఇప్పుడు, ఒక విషాద మరణం తర్వాత, అవేవీ కూడా మీరు మర్చిపోలేనివి.

గత వారం నా కజిన్ అశోక్ థాపర్ అకస్మాత్తుగా మరణించారు. వయసులో ఆయన నాకన్నా పదిహేనేళ్లే పెద్దవారు కానీ... నా టీనేజీలో, ఇరవైల ఆరంభంలో ఆయన... నేను అనుకరించాలని అనుకున్న ఒక దివ్యమంగళ చిత్తరువు. మాట తూలని వ్యంగ్య ధోరణి, ఆచితూచే ఆ మాట తీరు, ఉద్వేగాలకు తావివ్వని పైపై పొడి హాస్యం, కొన్ని సమయాల్లో చటుక్కున పడే ఆయన చురకలు నాకు నచ్చేవి. ఆ వయసులో ప్రతి విషయంలోనూ నేను ఎలా ఉండాలని అనుకున్నానో ఆయన అలా ఉండేవారు. ఆయనలా ఉండేందుకు ఎంత అనుకరించినా నా ప్రయత్నాలు నెరవేరలేదు.

1977 వేసవిలో, ఎమర్జెన్సీ ముగిసిన వెచ్చని మలి సంధ్యలో అశోక్, నేను కలిసి.. అతడి ఛత్తర్‌పుర్ వ్యవసాయ క్షేత్రపు చాళ్లలో నడుస్తూ సాయంత్రాలను గడిపేవాళ్లం. అమాయకత్వపు చిలిపిదనంతో అల్లరి పన్నాగంతో, బంధువులైన తోటి పిల్లల్ని ఆటపట్టించేవాళ్లం. అవి పిల్లచేష్టలను మించి పరిణతి చెందింది మాత్రం అశోక్‌లోని అల్లిబిల్లి నైపుణ్యాలతోనే! నూలు వడికినట్లుగా అతడు కథల్ని అల్లి మోసుకొచ్చేవాడు. ఎప్పటికప్పుడు అవి తాజాగా, నమ్మదగినవిగా ఉండేవి. ఆ కథల కల్పనలకు గంటలు గడిచిపోయేవి. తోటి పిల్లలను ఒకళ్లకొకళ్లకు ముడివేసే సందర్భాలలో అతడిదైన ఒక గుర్తుండిపోయే మాటల మెలిక ఉండేది. అదొక హాస్యవల్లరి.



"గుర్తుకొస్తున్నాయి... గుర్తుకొస్తున్నాయి.." (ప్రతీకాత్మక చిత్రం)

తేలిగ్గా బురిడీ కొట్టించేవాడు. వాదనలతో దంగైపోయేలా చేసేవాడు.

1981 డిసెంబరులో నాకు నిశ్చితార్థం జరిగిన సాయంత్రం ఇద్దరం కలిసి పార్టీ చేసుకోవాలని అశోక్ నిర్ణయించాడు. మద్యం సేవించాం. ఆ ముందు రోజు అశోక్ మా కజిన్ మాలా సింగ్ నుంచి అరువుగా తెచ్చిన జీపులో ఊరంతా తిరిగి, చివరికి అర్ధరాత్రి వేళ మరికొంత మద్యం కోసం మాలా ఇంటికి వెళ్లాం. నిజానికి ఆ సమయంలో మేము బాగా మత్తులో ఉన్నాం. దారి మధ్యలో ఒక తోపుడుబండిని తప్పించడానికి డివైడర్‌కు వెళ్లి గుద్దుకున్నాం. పెద్ద కుదుపుతో జీపు ఆగిపోయింది.

పోలీసులు వచ్చి మమ్మల్ని లేవనెత్తారు. అన్నిసార్లు వాళ్లు అలా ఉంటారా! ఆ శీతాకాలపు చీకటి రాత్రిని సూర్యుడు చూస్తూ ఉండగా, మాలాను అడిగి డబ్బు తెమ్మని అశోక్ నన్ను మాలా వాళ్ల ఇంటికి పంపాడు. ''ఇందులోకి నన్నూ లాగారా! మొదట తాగారు. తాగింది చాలక జీపును గుద్దేశారు. ఇప్పుడు పోలీసుల నుంచి మిమ్మల్ని విడిపించుకోటానికి డబ్బులు అడుగుతున్నారు'' అని మాలా గుర్రు మన్నారు.

అదంతా ముగిశాక అశోక్, నేను జింఖానా క్లబ్‌లో హృదయాన్ని సంతుష్టి పరిచిన ఒక అల్పాహారంతో వేడుక జరుపుకున్నాం. ఆ క్లబ్‌కి మాత్రమే ప్రత్యేకమైన బ్లాక్ కాఫీని గొంతులోకి చప్పరిస్తూ, ''ఓహ్ వాట్ ఎ టాంగిల్డ్ వెబ్ వియ్ వీవ్'' అంటూ స్కాట్లాండ్ రచయిత వాల్టర్ స్కాట్‌ను ఉటంకించాడు అశోక్. ఆ మాట వాల్టర్ స్కాట్‌ది అని అప్పటికి నాకు తెలీదు. భవిష్యత్తులో ఎక్కడైనా సమయోచితంగా వదలడానికి అశోక్ నా కోసం ఉదారంగా పక్కకు తీసి ఉంచిన పుంఖానుపుంఖాల జీవిత సత్యాలలో ఒకటిగా నేను ఆ మాటను స్వీకరించాను.

అశోక్ ప్రభావంతోనే నేను ఎదిగాను. అందులో సందేహం లేదు. కొన్నిసార్లు బహుశా అక్షరాలా అతడు నన్ను పైకి లాగిన సందర్భాలు కూడా ఉన్నాయి. అయితే అతడు చాలానే నాకు నేర్పించాడు. ఒక మంచి కార్పెట్ పనితనాన్ని మెచ్చుకోవటంతో పాటుగా... హిందూ-ముస్లిం కట్టడాల నిర్మాణ కళల మధ్య వ్యత్యాసం ఎలాంటిది, ముదురు వర్ణాలు మనతో సంభాషించే విధానం; ఎవరికీ కనిపించని, తరచూ ఏ ఎవరూ పట్టించుకోని భారతదేశ రైతుల దుఃస్థితి వరకు... అన్నిటి గురించీ చెప్పేవాడు.

వ్యవసాయం అంటే అనాగరికం అనే భావన ఉన్న కాలంలోనే అశోక్ వ్యవసాయ నిపుణుడు. 'టైమ్స్ ఆఫ్ ఇండియా'లో అతడి వ్యాసాలు హరిత విప్లవాన్ని వివరించడటమే కాకుండా, ఆ విప్లవం సృష్టించిన సమస్యలను గురించి స్పష్టంగా చర్చించేవి. వాటిని నేను పూర్తిగా అర్థం చేసుకోగలిగానో లేదో చెప్పలేను కానీ, చదవడమైతే చాలా నిశితంగా చదివే వాడిని. నిజం ఏమిటంటే యాభై ఏళ్ల తర్వాత కూడా ఆ విషయాల పట్ల నాలో విస్మయాసక్తి ఉన్నదంటే కారణం అతడే.

అతడిని నిజంగా అంత ప్రత్యేకం చేసింది ఏంటీ అంటే.. అతడేమిటో నిర్వచించటం అన్నది కష్టం కావటమే! అతడు సామ్యవాది కాదు కానీ, అతడిలో లోతైన సామాజిక స్పృహ ఉండేది. అతడు నిశితంగా ఉండేవాడు తప్ప ఎప్పుడూ సమాచారాన్ని కుమ్మరించేవాడు కాదు. అతడొక మాటల మాంత్రికుడు. అయితే ఎప్పుడు మౌనం వహించాలో తెలిసినవాడు. సందర్భాలకతడు చక్కదనాన్ని జోడిస్తాడు. చురుకుదనపు మెరుపుల్ని చేకూరుస్తాడు. అంతేకాదు, సమపాళ్లలో నియంత్రణనూ, నిగ్రహాన్నీ పాటిస్తాడు.

అశోక్‌ని ఎందుకు ఇంతగా నేను ఆరాధించానో మీకిప్పుడు తెలిసిందా? అతడి గురించి రాయటం తేలిక ఎందుకైందంటే ఒకప్పుడు నేను ఎలాగైతే ఉండాలని అనుకున్నానో అలా ఉన్న వ్యక్తి గురించి రాస్తున్నాను కాబట్టి! అతడికి వీడ్కోలు చెప్పడం కష్టం. ఎందుకంటే నాలోని ఒక భాగానికి సెలవిక అంటున్నాను కాబట్టి!!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** అమావాస్య రా.12.23 వరకు, తదుపరి చైత్ర శుద్ధ పాడ్యమి, **నక్షత్రం:** ఉత్తరాభాద్ర ఉ.10.10 వరకు, తదుపరి రేవతి, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ప.12.25 నుండి 1.15 వరకు, తదుపరి ప.2.56 నుండి 3.44 వరకు, **అమృతఘడియలు:** లేవు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.54, **సూర్యాస్తమయం:** 6.10.

క్లుప్తంగా...

బాబు, పచ్చ పత్రికల తీరు సిగ్గు లేని రాజకీయాలకు నిదర్శనం: మంత్రి బొత్స



శృంగవరపుకోట : రాష్ట్రంలో అధికారం కోసం అవస్థలు పడుతున్న కొందరు రాజకీయ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు, వాళ్ల తీరు చూస్తే రాజకీయాలంటేనే సిగ్గేస్తోందని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. విజయనగరం జిల్లా ఎస్.కోటలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ మండల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వలంటీర్లు పింఛన్లు పంచకూడదని చంద్రబాబు పిటిషన్లు పెట్టి, ఈసీకి ఫిర్యాదులు చేసి.. ఇప్పుడు తమకేం సంబంధం లేదని చెప్పడం.. వాటినే పచ్చ పత్రికలు కథనాలు ఎత్తుకుని పేజీలుగా వండివార్చడం సిగ్గులేని రాజకీయాలకు నిదర్శనమన్నారు. మరో అమ్మ ఎస్పీలను, కలెక్టర్లను మార్చేయాలని, తొలగించాలని ఫిర్యాదు చేస్తుందని, వాళ్లంతా గతంలో వాళ్ల ప్రభుత్వాల హయాంలో పని చేసిన వారు కాదా.. అని ప్రశ్నించారు. బొత్స మీడియానుద్దేశించి మాట్లాడుతూ 'రామోజీకి చెప్పండయ్యా.. జోనల్ మేనేజర్లను జిల్లా కలెక్టర్లుగా నియమించేసుకుంటే ఆయనకు నచ్చినట్టు రాష్ట్రాన్ని ఏలుకోవచ్చని..' అన్నారు. కూటమిలో కొత్త కుట్రలు పురుడు పోసుకుంటున్నాయని, వాటిని చూసి భయపడాల్సిన అవసరం లేదని బొత్స స్పష్టం చేశారు.

యార్లగడ్డ ప్రచారంలో డబ్బులు, మద్యం పంపిణీ



రామవరప్పాడు: కృష్ణా జిల్లా గన్నవరం తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకటరావు ఎన్నికల నిబంధనలను అతిక్రమించి విచ్చలవిడిగా డబ్బులు పంపిణీ చేస్తున్నారు. ఆదివారం రాత్రి విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు, ప్రసాదంపాడు కాలువ కట్టలపై ఈయన ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా హారతులిచ్చిన మహిళలకు రూ.1000 చొప్పున డబ్బులు పంపిణీ చేశారు. ప్రచారంలో పాల్గొన్న ఒక్కొక్కరికి రూ.500 చొప్పున ఇచ్చారు. వీటితోపాటు చికెన్, మటన్‌తో భోజనాలు కూడా. అక్కడితో ఆగకుండా తమకు అనుకూలంగా నినాదాలు చేసిన వారికి, జెండాలు మోసిన వారికి మద్యం బాటిళ్లు విచ్చలవిడిగా పంచారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

చంద్రబాబుకు ఇక్బాల్ వత్తాసు దుర్మార్గం: ఆసిఫ్

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): ముస్లిం సమాజాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రచేస్తున్న టీడీపీ కూటమికి మద్దతుగా చంద్రబాబుకు వత్తాసు పలికిన ఎమ్మెల్సీ షేక్ మహ్మద్ ఇక్బాల్ తీరు దుర్మార్గమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పార్టీ అభ్యర్థి షేక్ ఆసిఫ్ ఒక ప్రకటనలో విమర్శించారు. ఇక్బాల్ వైఎస్సార్‌సీపీ జెండా పట్టుకోకపోయినా ముస్లిం సమాజానికి మేలు జరుగుతుందనే ఉద్దేశంతో ఆయనకు 2019లో హిందూపురం సీటు కేటాయించి జగన్‌మోహన్‌రెడ్డి గౌరవించారని, అక్కడ ఓడిపోతే వెంటనే ఎమ్మెల్సీగా నియమించారని గుర్తుచేశారు. అంతటి గౌరవమర్యాదలు ఇచ్చిన వైఎస్సార్‌సీపీపైన, జగన్‌మోహన్‌రెడ్డిపైన ఆరోపణలు చేయటం అత్యంత దారుణమని ఆయన పేర్కొన్నారు.

విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకోవడం కష్టమే

అనకాపల్లి వారాహి యాత్రలో పవన్



సాక్షి, అనకాపల్లి: ''విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవడం కష్టమే.. గతంలో నేను స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకునేందుకు ప్రధాన మంత్రిని కలిసేందుకు నాతో ఎవరొస్తారో చేతులెత్తండి అని అడిగితే ఎవరూ స్పందించలేదు''.. అని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యానించారు. అప్పట్లో విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాల నుంచి తనకు మద్దతు రాలేదని, లేదంటే ప్రధాని దగ్గరకు వెళ్లి ప్రైవేటీకరణను నిలిపివేసే వాడినని చెప్పుకొచ్చారు. ఇప్పుడు ప్రధాని మోదిని ఊరికే నిందిస్తే సరికాదని స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాల నాయకులను పవన్ తప్పుబట్టారు. అనకాపల్లిలో ఆదివారం నిర్వహించిన వారాహి యాత్రలో పవన్ మాట్లాడారు. 2014లో జనసేన పార్టీని స్థాపించినప్పటి నుంచి ఓడిపోయానని, ఇప్పుడు పిఠాపురంలో గెలవాలని బలంగా కోరుకుంటున్నానన్నారు. అనకాపల్లిలో ఉన్న శారదానది విదేశాల్లో ఉండి ఉంటే పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందేదని, మా కూటమి గెలిస్తే దాని ఒడ్డును పర్యాటకంగా అభివృద్ధి చేస్తానని తెలిపారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతిని తీసుకొచ్చింది వైఎస్సార్ అయితే.. ఆ తరువాత చంద్రబాబు ప్రభుత్వం రూ.3 వేల కోట్లు కేటాయిస్తే.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.2 వేల కోట్లు ఖర్చుచేసిందన్నారు. మరోవైపు.. దారి పొడవునా సీఎం జిందాబాద్ అంటుంటే 'మనకు అంత శక్తి లేదు.. 2029లో సీఎం అవడానికి ప్రయత్నిస్తా'నని పవన్ అన్నారు.

బీజేపీకి పురందేశ్వరి వెన్నుపోటు!

పొత్తులో కమలానికి కేటాయించిన అనపర్తి సీటు విషయంలో చంద్రబాబు డ్రామా

- అక్కడ మొదట టీడీపీ అభ్యర్థిని ప్రకటించి ఆ తర్వాత బీజేపీకి కేటాయింపు
- అయినా.. బీజేపీ అభ్యర్థితో పోటాపోటీగా టీడీపీ అభ్యర్థి నల్లమిల్లి ప్రచారం
- రాజమండ్రి టీడీపీ పార్లమెంట్ సమావేశానికి సైతం ఆయనకు బాబు ఆహ్వానం
- ఆయనే అక్కడ టీడీపీ అభ్యర్థిగా పోటీచేస్తారంటూ టీడీపీ దొంగాట
- ఈ పరిణామాలను ఏమాత్రం పట్టించుకోని బీజేపీ రాష్ట్ర అధినేత్రి పురందేశ్వరి
- అక్కడ టీడీపీ అభ్యర్థి పోటీలో ఉంటేనే తనకు ప్రయోజనమనే ఆమె మౌనం?
- మొదట నుంచి పార్టీని నమ్ముకున్న వారికి అన్యాయం జరుగుతున్నా ఆమె పట్టించుకోకపోవడంపై శ్రేణుల్లో ఆగ్రహం



సాక్షి, అమరావతి : రాష్ట్రంలో మిత్రపక్షమైన బీజేపీ పట్ల తెలుగుదేశం పార్టీ అవలంబిస్తున్న తీరు.. ఇందుకు తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి వ్యవహారశైలితో కమలనాథులు తీవ్రంగా రగిలిపోతున్నారు. చంద్రబాబు తమ పార్టీని ఇష్టానుసారం ఆడిస్తున్నా ఆమె ఏమాత్రం పట్టించుకోకుండా లోలోపల టీడీపీకి వత్తాసు పలికేలా ప్రేక్షకపాత్ర వహిస్తూ బీజేపీకి వెన్నుపోటు పొడిచేలా వ్యవహరిస్తున్నారని వారు మండిపడుతున్నారు. 2014లోనూ టీడీపీ అధినేత పొత్తు ధర్మాన్ని విస్మరించి తమ పార్టీ పోటీచేసిన పలు స్థానాల్లో టీడీపీ అభ్యర్థులను నిలబెట్టి దొంగదెబ్బ తీశారని వారు గుర్తుచేస్తున్నారు. ఇప్పుడు కూడా చంద్రబాబు తన వదినతో కలిసి ఇలాంటి డ్రామానే ఆడుతున్నారని బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఇందుకు బలం చేకూర్చేలా వారు అనపర్తి నియోజకవర్గాన్ని ఉదహరిస్తున్నారు. ఎందుకంటే ఈ ఎన్నికల్లో ఆ నియోజకవర్గాన్ని బీజేపీకి కేటాయించినప్పటికీ అక్కడ బీజేపీ, టీడీపీ అభ్యర్థులు పోటాపోటీగా ఎన్నికల ప్రచారం నిర్వహించుకుంటున్నారు. పొత్తులో బీజేపీకి కేటాయించిన ఆ స్థానంలో చంద్రబాబు రాజకీయ డ్రామాలు ఆడుతుంటే, ఆ నియోజకవర్గం ఉన్న రాజమండ్రి లోకసభ స్థానం నుంచి బీజేపీ తరఫున పురందేశ్వరి పోటీచేస్తూ కూడా అక్కడి పరిణామాలపై కిమ్మనకుండా ఉండడంతో రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ శ్రేణులు తీవ్రంగా తప్పుపడుతున్నాయి. ఇది బీజేపీని వెన్నుపోటు పొడవడమేనని వారు స్పష్టంచేస్తున్నారు.

పురందేశ్వరి ప్రేక్షకపాత్ర..

ఇక ఈ సీట్ల విషయంలో చంద్రబాబు ఆడుతున్న డ్రామాలను బీజేపీ రాష్ట్ర పార్టీ అధ్యక్షురాలిగా ఉన్న పురందేశ్వరి ఏమాత్రం పట్టించుకోవడంలేదని కమలనాథుల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. నిజానికి.. పురందేశ్వరి రాజమండ్రి లోక్‌సభ నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీచేస్తున్నారు. ఈ నేపథ్యంలో.. అనపర్తిలో బీజేపీ అభ్యర్థి కన్నా చంద్రబాబు తొలుత ప్రకటించిన టీడీపీ అభ్యర్థి పోటీలో ఉంటే పురందేశ్వరికి అక్కడ ఎక్కువ ఓట్లు పడతాయని చెప్పి టీడీపీ నాయకత్వం ఆమెను ఒప్పించిందని బీజేపీ నేతలు చెబుతున్నారు. తన సొంత రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్రంలో బీజేపీకి, పార్టీనే నమ్ముకున్న నాయకులకు టీడీపీవల్ల అన్యాయం జరుగుతున్నా ఆమె మౌనంగా ఉంటున్నారని వారంటున్నారు. అవసరమైతే, బీజేపీ ఆ స్థానాన్ని వదులుకునేందుకు కూడా పురందేశ్వరి సిద్ధంగా ఉన్నట్లు ఆ పార్టీలో ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది.

అప్పట్లో మోదీపై బాబు విమర్శలను ఖండించడంవల్లే..

వాస్తవానికి.. 2019 ఎన్నికలకు ముందు బీజేపీని, ప్రధాని మోదీని చంద్రబాబు టార్గెట్ చేసి వ్యక్తిగత విమర్శలు చేశారు. వీటిని అప్పట్లో ప్రస్తుత అనపర్తి బీజేపీ అభ్యర్థి ఎం. శివరామకృష్ణంరాజు ఖండించారు. ఈ నేపథ్యంలో ఇప్పుడీయన అభ్యర్థిగా కొనసాగితే టీడీపీ ఓట్లు బదలాయించడం కష్టమని కొత్త ప్రచారం మొదలుపెట్టినట్లు బీజేపీ వర్గాలు పేర్కొంటున్నాయి. అప్పట్లో మోదీపై చంద్రబాబు చేసిన విమర్శలను వదిలేసి వాటిని ఖండించినందుకు శివరామకృష్ణంరాజును బలిపశువును చేయాలని టీడీపీ ప్రయత్నిస్తోందని.. కానీ, పురందేశ్వరి టీడీపీ కుట్రను ఏమాత్రం అడ్డుకోకపోవడం ద్వారా బీజేపీకి వెన్నుపోటు పొడవడాన్ని కమలం శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నారు.

2014లో మాదిరిగానే ఇప్పుడూ వెన్నుపోటు

మరోవైపు.. చంద్రబాబు–పురందేశ్వరి తమ రాజకీయ డ్రామాను రక్తికట్టించేందుకు శివరామకృష్ణంరాజు బలమైన అభ్యర్థి కాదని ఇంకో కొత్త ప్రచారం చేస్తున్నారని బీజేపీ నేతలు చెబుతున్నారు. 2014 ఎన్నికల్లో ఇలాంటి ప్రచారాలే చేసి చంద్రబాబు బీజేపీకి వెన్నుపోటు పొడిచారని.. ఇప్పుడు పురందేశ్వరి ఆయనకు తోడైందని వారంటున్నారు. అప్పట్లో బీజేపీకి ఐదు లోక్‌సభ, 15 అసెంబ్లీ స్థానాలు కేటాయిస్తున్నట్లు చంద్రబాబు ముందు చెప్పి ఆ తర్వాత నాలుగు లోక్‌సభ 14 అసెంబ్లీ స్థానాలకు పరిమితం చేశారు. ఆ అసెంబ్లీ స్థానాలకు పార్టీ అభ్యర్థులను ప్రకటించిన తర్వాత వారు బలమైన వారు కాదంటూ సంతనూతలపాడు, గుంతకల్లు, కడప అసెంబ్లీ స్థానాల్లో చంద్రబాబు పోటీగా టీడీపీ వారికి సైతం బి–ఫారాలిచ్చారు. ఆ తరహాలోనే చంద్రబాబు ఇప్పుడు కూడా బీజేపీకి వెన్నుపోటు పొడిచే ప్రయత్నంలో పురందేశ్వరి భాగస్వామ్యం కావడంపట్ల కమల దళంలో ఆమెపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

బాబు–పురందేశ్వరి కలిసి నాటకం

బీజేపీతో పొత్తు కుదరక ముందే గత ఫిబ్రవరి 24న చంద్రబాబు 94 అసెంబ్లీ స్థానాలకు ప్రకటించిన టీడీపీ అభ్యర్థుల జాబితాలో అనపర్తి నుంచి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేరును ప్రకటించారు. ఆ తర్వాత మార్చిలో పొత్తులు ఖరారయ్యాక టీడీపీ ఆ స్థానాన్ని బీజేపీకి కేటాయించింది. దీంతో బీజేపీ జాతీయ నాయకత్వం అక్కడ బీజేపీ అభ్యర్థిగా ఎం. శివరామకృష్ణంరాజు పేరును ప్రకటించింది. ఈ ప్రకటన తర్వాత కూడా నల్లమిల్లి రామకృష్ణారెడ్డి టీడీపీ అభ్యర్థిగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ పొత్తు ధర్మానికి తూట్లు పొడుస్తున్నారు. రెండ్రోజుల క్రితం చంద్రబాబు నిర్వహించిన రాజమండ్రి పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ ప్రధాన నాయకుల సమావేశానికి నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని కూడా పిలిచారని బీజేపీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ సమావేశం తర్వాత కూడా అనపర్తి టీడీపీ అభ్యర్థిగా రామకృష్ణారెడ్డి పోటీచేస్తున్నట్లు టీడీపీ శ్రేణులు ప్రచారం చేస్తుండంపై బీజేపీ వర్గాలు మండిపడుతున్నాయి. పురందేశ్వరి ఈ పరిణామాలను అడ్డుకునేందుకు ఎలాంటి ప్రయత్నాలు చేయకపోవడంతో చంద్రబాబు–పురందేశ్వరి ఇద్దరూ కలిసే ఈ డ్రామాను ఆడుతున్నారని బీజేపీ నాయకులు ఆరోపిస్తున్నారు.

బాబు సంపద సృష్టి బూటకం: కేశినేని



గజమాలతో ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, ఎమ్మెల్యే అభ్యర్థి ఆసిఫ్‌ను సత్కరిస్తున్న నేతలు

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): సంపద సృష్టిస్తా.. పేదలకు పంచుతా.. అని చంద్రబాబు చెప్పడం పెద్ద బూటకమని విజయవాడ ఎంపీ, వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ (నాని) చెప్పారు. చంద్రబాబు పాలనతో పోలిస్తే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో అన్ని విధాల అభివృద్ధి జరిగిందన్నారు. ప్రజల ఆదాయం పెరిగిందని, పేదరికం గణనీయంగా తగ్గిందని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమం, విద్య, వైద్యంపై దృష్టిపెట్టి జగన్ ప్రజలందరి మన్ననలు పొందారన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని 43వ డివిజన్‌లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్‌తో కలిసి కేశినేని నాని ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కేశినేని నాని మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో రెండేళ్లు కరోనాతో పోగా మిగిలిన మూడేళ్లలో జరిగిన అభివృద్ధిని గణాంకాలతో వివరించారు.

సుజనాచౌదరి బాగోతం బయటపెడతా

పచ్చ మీడియాను అడ్డుపెట్టుకుని తనపై తప్పుడు ప్రచారం చేస్తే తగిన బుద్ధి చెబుతానని హెచ్చరించారు. పదేళ్లుగా తనపై ఏ ఆరోపణలేదని, వైఎస్సార్‌సీపీలో చేరగానే తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. సుజనాచౌదరి బాగోతం బయటపెడతానని హెచ్చరించారు. ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ మాట్లాడుతూ ఎన్నికల్లో తనను భారీ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు.

బొండా ఉమా గో బ్యాక్

- నినదించిన ఆర్యవైశ్యులు
- పిలవకపోయినా ఆర్యవైశ్య మహోత్సవానికి వెళ్లి హడావుడి
- ఉద్రిక్తంగా మారడంతో కార్యక్రమం నిలిపివేత



సభను నిలిపేయాలని చెబుతున్న పోలీసులు

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): విజయవాడ అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి పిలవకపోయినా టీడీపీ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బొండా ఉమా రావడంతో ఉద్రిక్తంగా మారింది. 'బొండా ఉమా గో బ్యాక్' అంటూ ఆర్యవైశ్యులు నినాదాలు చేశారు. చివరకు కార్యక్రమాన్ని అర్ధంతరంగా నిలిపివేయాల్సి వచ్చింది. విజయవాడలోని మొగల్రాజపురం సున్నపుబట్టీల సెంటర్‌లో గల ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ హాల్‌లో విజయవాడ అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి నిర్వాహకుల ఆహ్వానం మేరకు విజయవాడ సెంట్రల్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాస్ హాజరయ్యారు. నూతన కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం అనంతరం వెలంపల్లి శ్రీనివాస్ మాట్లాడి వెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బొండా ఉమా అక్కడికి వెళ్లారు. వేదికపై వెళ్లి కూర్చోవడంతో ఆర్యవైశ్య కులానికి సంబంధం లేని బొండా ఉమా కార్యక్రమానికి ఎందుకు వచ్చారంటూ విజయవాడ అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు కొండపల్లి బుజ్జి ప్రశ్నించారు. పిలవకపోయినా అభినందించడానికి వచ్చారని, పిలవకపోయినా వస్తామంటూ బొండా ఉమా అనుచరుడు, టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు దూండి రాకేశ్ వాగ్వాదానికి దిగారు. ఈ నేపథ్యంలో 'బొండా ఉమా గో బ్యాక్' అంటూ కార్యక్రమానికి హాజరైన వారిలో కొందరు ఆర్యవైశ్యులు నినాదాలు చేశారు. దీంతో బొండా ఉమా వేదిక దిగి వెళ్లిపోయారు. ఈ వివాదం విషయం తెలుసుకున్న మాచవరం పోలీసులు ఆ హాల్‌కు వెళ్లి.. రాజకీయ నాయకులతో సంబంధం లేకుండా కార్యక్రమం నిర్వహిస్తామంటేనే అనుమతులు ఇచ్చామని నిర్వాహకులతో చెబుతుండగా.. దూండి రాకేశ్ వచ్చి ఇది తమ అంతర్గత సమావేశమని, పోలీసులు ఎందుకు వచ్చారంటూ వాదనకు దిగారు. కార్యక్రమం నిర్వహణకు ఇచ్చిన అనుమతిని రద్దు చేస్తున్నామని పోలీసులు నిర్వాహకులతో చెప్పి హాలులో ఉన్న సభ్యులందరినీ బయటకు పంపించేశారు. దూండి రాకేశ్‌ను అరెస్ట్ చేసి.. కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. కాగా.. దూండి రాకేశ్ అత్యుత్సాహమే వివాదానికి కారణమని విజయవాడ అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం సభ్యులు చెప్పారు. బొండా ఉమాకు తాము ఆహ్వానం పంపలేదని స్పష్టం చేశారు. ఆర్యవైశ్య ప్రముఖులకు మాత్రమే ఆహ్వానాలు పంపామని చెప్పారు. బొండా ఉమా కావాలనే తమ కార్యాక్రమానికి వచ్చి వివాదం రాజేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఓటర్లపై కూటమి ప్రలోభాల వల

- చర్యలు తీసుకోవాలని ఈసీకి ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఫిర్యాదు
- ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా షర్మిల వ్యాఖ్యలు
- డబ్బులు పంపిణీ చేస్తున్న కూటమి అభ్యర్థులు కేశినేని చిన్ని, సుజనాచౌదరి



ఈసీ కార్యాలయంలో ఫిర్యాదు అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణు, నాయకులు

సాక్షి, అమరావతి: ఎన్నికల నియమావళిని పదేపదే ఉల్లంఘిస్తూ.. ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్న టీడీపీ, బీజేపీ, కాంగ్రెస్ నేతలపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు కోరారు. ఈ మేరకు ఆదివారం వెలగపూడి సచివాలయంలో ఈసీని కలిసి ఆధారాలతో ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాకు వెల్లడించిన వివరాలు..

- రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ, బీజేపీ, జనసేన, కాంగ్రెస్ నేతలు ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్న ఘటనలను ఎప్పటికప్పుడు ఈసీ దృష్టికి తీసుకెళ్తున్నాం. కడప బహిరంగ సభలో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మాట్లాడుతూ.. అన్ని పార్టీల నుంచి డబ్బులు తీసుకుని, ఓట్లు మాత్రం కాంగ్రెస్కు వేయమని ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా మాట్లాడారు. దీనిపై ఆధారాలతో ఈసీకి ఫిర్యాదు చేశాం.
- విజయవాడ పశ్చిమ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి, టీడీపీ నేత కేశినేని చిన్ని, ఓటర్లను ప్రలోభ పరుస్తూ డబ్బులు పంచడాన్ని కూడా ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లాం. ఆనాడు కేంద్ర కేబినెట్లో ఉండి కూడా, రాష్ట్ర ప్రయోజనాలను సుజనా పూర్తిగా పక్కన పెట్టారు. ప్రత్యేక హోదాను సమాధి చేసి ప్యాకేజీగా మార్చడంలో సుజనా చౌదరి, సీఎం రమేష్‌ల పాత్రే కీలకం.
- సీఎస్, డీజీపీలపై నర్సీపట్నం సభలో టీడీపీ నేత అయ్యన్నపాత్రుడు వాడిన భాష సభ్యసమాజం సిగ్గుతో తలదించుకునేలా ఉంది. అధికారులను తూలనాడటం, వ్యవస్థలను తేలిక చేసి మాట్లాడటం, చంద్రబాబు నుంచి అభ్యర్థుల వరకు షరా మామూలైపోయింది. – పింఛన్‌దారుల విషయంలోనూ ఏవిధంగా కూటమి నేతలు చులకన చేసి మాట్లాడారో ఈసీ దృష్టికి తీసుకువెళ్లాం.

మైనార్టీలపై బాబు కపట ప్రేమ

''మైనార్టీల గురించి మాట్లాడే నైతిక అర్హత చంద్రబాబుకు, టీడీపీకి ఏమాత్రం లేదు. ఆనాడు దివంగత మహానేత మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్ తీసుకువస్తుంటే, కోర్టుకు వెళ్లి మరీ అడ్డుకుంది టీడీపీ కాదా? అధికారంలో ఉండి కూడా ఎన్నికలకు ముందు 4 నెలల వరకు మైనార్టీలకు కేబినెట్లో స్థానం కల్పించని వ్యక్తి చంద్రబాబు. కానీ సీఎం వైఎస్ జగన్ తన తొలి కేబినెట్లోనే మైనార్టీలకు ఉపముఖ్యమంత్రి హోదా కల్పించి, మైనార్టీల పక్షపాతిగా నిలిచారు'' అని విష్ణు పేర్కొన్నారు. అమరావతి పేరుతో ఆనాడు తెలుగుదేశం ప్రభుత్వం ఆడిన డ్రామాలను ప్రజలు గ్రహించినందునే స్థానిక ఎన్నికల్లో అక్కడి ప్రజలు టీడీపీని చిత్తుగా ఓడించారని గుర్తుచేశారు. రైతు రుణమాఫీని ఎగ్గొట్టి అన్నదాతలకు ద్రోహం చేసిన చంద్రబాబు రైతు సంక్షేమంపై మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎవరెన్ని విమర్శలు గుప్పించినా ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమని స్పష్టంచేశారు. ఎమ్మెల్యే వెంట నవరత్నాల కార్యక్రమం ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ ఎ. నారాయణమూర్తి, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ సభ్యులు శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

సుజనా చౌదరి, కేశినేని చిన్నిపై ఎన్నికల అధికారులకు ఫిర్యాదు

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): ఎన్నికల ప్రచారంలో భాగంగా హారతి పళ్లెంలో డబ్బులు వేసిన ఘటనపై ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి, టీడీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని)పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రిటర్నింగ్ ఆఫీసులో ఆయన ఫిర్యాదు చేశారు. డబ్బుల పంపిణీపై వార్తా చానల్స్, వార్తా పత్రికల్లో వచ్చిన కథనాల క్లిప్పింగ్స్, హారతి పళ్లంలో డబ్బులు వేస్తున్న వీడియోలు ఎన్నికల అధికారులకు అందజేశారు. పూర్తి ఆధారాలు ఉన్నందున ఎన్నికల నియమావళిలో సూచించిన విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సుజనా చౌదరి డబ్బుల సంచులతో పశ్చిమ నియోజకవర్గానికి వచ్చారన్నారు. తొలిరోజే ఆయన కోడ్ ఉల్లంఘనకు పాల్పడ్డారని తెలిపారు.

నా తడాఖా చూపిస్తా..

- పామర్రు, ఉయ్యూరు ప్రజాగళంలో చంద్రబాబు
- ఆయన ప్రసంగిస్తుండగానే వెనుదిరిగిన జనం



బాబు ప్రసంగిస్తుండగా వెనుదిరిగిన జనం

సాక్షి, మచిలీపట్నం/ఉయ్యూరు/కంకిపాడు(పెనమలూరు): రాబోయే ఎన్నికల్లో తనను గెలిపిస్తే ఏడాదికి నాలుగు లక్షల చొప్పున ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తానని ఒకవైపు చెబుతూనే... మరోవైపు నెలకు మూడువేల వంతున నిరుద్యోగ భృతి కల్పిస్తానని టీడీపీ అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారు. కృష్ణాజిల్లా పామర్రు, పెనమలూరు నియోజకవర్గం ఉయ్యూరులో ఆదివారం నిర్వహించిన ప్రజాగళం సభల్లో ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల అధికారంలో ఉన్న వైఎస్ జగన్ ఎలాంటి ఉద్యోగాలు ఇవ్వకపోయినా ఎన్నో ఇచ్చేశానని చెబుతున్నాడని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్ ప్రజల సొమ్మును దోచుకుని పెద్ద బంగ్లా కట్టించారని, గ్రామాల్లో గ్రావెల్ మట్టి తరలిస్తున్న వారికి మద్దతుగా నిలిచారన్నారు. పోలీసు అధికారుల తీరుపైనా విమర్శలు గుప్పించారు. వైఎస్సార్ సీపీకి చెందిన జిల్లా నేతలపైనా ఆక్రోశం వెళ్లగక్కారు. పేర్ని నాని, గుడివాడ నాని, వంశీ, మంత్రి జోగి రమేష్ సంగతి తేలుస్తానని హెచ్చరించారు.

రోడ్ షో ఫ్లాప్

పామర్రు, ఉయ్యూరులో ఆదివారం నిర్వహించిన ప్రజాగళం ఎన్నికల షో అట్టర్ ఫ్లాప్ అయ్యింది. జనసమీకరణకోసం జనసేన, బీజేపీతో కలిసి టీడీపీ పెద్దఎత్తున ప్రయత్నించినా ఫలించలేదు. అరకొర జనమే హాజరయ్యారు. సభలో చంద్రబాబు ప్రసంగం ప్రారంభమైన వెంటనే జనం వెనుతిరిగారు.

బాబుకు మతి భ్రమించింది: ఎమ్మెల్యే కైలే



పామర్రు: టీడీపీ అధినేత చంద్రబాబు మతిభ్రమించి మాట్లాడుతున్నారని పామర్రు ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్ విమర్శించారు. పామర్రులో జరిగిన సభలో చంద్రబాబు మాట్లాడిన తీరుపై ఆయన నిప్పులు చెరిగారు. ఆదివారం సాయంత్రం ఆయన ఇక్కడి తన పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. 14 ఏళ్ల సీఎంగా ఉండి పామర్రు ప్రాంతానికి ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. ఈ పుణ్యభూమిలో జన్మించిన ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి ఆయన మృతికి కారకుడైన బాబు ఆయన వారసుడినని చెప్పుకోవడం దుర్మార్గమని వ్యాఖ్యానించారు. 14 ఏళ్ల తన పాలనలో ఒక్క సెంటు భూమయినా పేదలకిచ్చారా అని ప్రశ్నించారు. ప్రజలకు అందుబాటులో ఉండేందుకు ఒక దళిత ఎమ్మెల్యేగా ఉన్న తాను ఒక ఇల్లు కట్టుకుంటే దానిపై రాజకీయాలు చేయటం ఆయన కుసంస్కారానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. లంకభూములను లీజ్‌కు ఇచ్చి ఆ ప్రాంత రైతులను ఆదుకున్నామని పేర్కొన్నారు. సభలో ఎంతసేపు గంజాయి గంజాయి అని అన్న చంద్రబాబే నిజంగా ఈ ప్రాంత గంజాయి మొక్క అని ఎద్దేవా చేశారు. పథకాల ద్వారా ఎస్సీ, బీసీలను ఆదుకున్నది సీఎం జగన్‌మోహన్‌రెడ్డేనని అన్నారు. నియోజకవర్గంలో 13 వేల ఇళ్ల పట్టాలను ఇచ్చి పేదల సొంతింటికలను నిజం చేశామన్నారు. నెమ్మలూరులో నిర్మిస్తున్న బెల్ కంపెనీ గత కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో వస్తే తానే తీసుకొచ్చానని చెప్పడం దారుణమని పేర్కొన్నారు.

మాజీ సీఎస్ ఎల్వీ వ్యాఖ్యలు విడ్డూరం

- వలంటీర్లపై వేసిన కేసుల్లో కోర్టు ఖర్చులు ఏ పెన్షన్ నుంచి చెల్లించారు?
- ఎపిక్ ఫోరం అధ్యక్షుడు విజయబాబు



సాక్షి, అమరావతి: అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలంటూ రాష్ట్ర మాజీ చీఫ్ సెక్రటరీ ఎల్వీ సుబ్రహ్మణ్యం.. మాజీ ఎన్నికల ముఖ్య అధికారి నిమ్మగడ్డ రమేష్ కుమార్‌ను పక్కన కూర్చోబెట్టుకుని వ్యాఖ్యలు చేయడం విడ్డూరంగా ఉందని ఏపీ ఇంటెలెక్చువల్స్ అండ్ సిటిజన్స్ ఫోరం అధ్యక్షుడు(ఎపిక్), మాజీ ఆర్టీఐ కమిషనర్ పి.విజయబాబు ఆదివారం ఓ ప్రకటనలో ఎద్దేవా చేశారు. ఐపీఎస్ అధికారులు, ఎన్నికల కమిషన్‌పైనా 'ఈనాడు' పత్రిక అడ్డగోలు రాతలపై స్పందించిన అధికారులు ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేయడంపై 'సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ' పేరుతో ఎల్వీ, నిమ్మగడ్డ రమేష్‌కుమార్ నీతులు వల్లించిన తీరు.. దెయ్యాలు వేదాలు వల్లించినట్టుందని విమర్శించారు. అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, తమ శీలం గొప్పదంటూ తమకి తాము కితాబిచ్చుకోవడం శోచనీయమన్నారు. తమ కార్యక్రమాలన్నీ తమకొచ్చే పెన్షన్ డబ్బులతో నిర్వహిస్తున్నామని ఎల్వీ సుబ్రహ్మణ్యం.. నిమ్మగడ్డను పక్కను కూర్చోపెట్టుకుని మాట్లాడుతుంటే నిమ్మగడ్డ ఇబ్బంది పడిన తీరును మీడియా స్పష్టంగా గమనించిందని పేర్కొన్నారు. వలంటీర్ల ఉద్యోగాలు పీకేయడానికి, అవ్వాతాతలకు నేరుగా పెన్షన్ అందకుండా వారు మండుటెండలో బాధలు పడుతుంటే చూసి ఆనందించేందుకు ఈ సిటిజన్స్ డెమొక్రసీ ప్రతినిధులు కోర్టుల చుట్టూ తిరిగినా పనికాకపోవడంతో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేసి వలంటీర్ల కర్తవ్యాన్ని కట్టడి చేశారని గుర్తు చేశారు. మరి కోర్టుల చుట్టూ తిరిగేందుకు ఖర్చు చేసిన లక్షలాది రూపాయలు ఏ పెన్షన్ నుంచి ఖర్చు చేశారో ఈ శీలవంతులు చెప్పాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల తర్వాత బాబు జైలుకే

- పోలవరం ఎందుకు పూర్తికాలేదో చర్చిద్దాం రా..
- బాబు, పవన్ ఇద్దరూ రాజకీయ డ్యాన్సర్లు
- మంగళగిరికే పరిమితమైన లోకేశ్
- రెండ్రోజుల పర్యటన.. ఐదు రోజుల జ్వరం.. ఇదీ పవన్ ప్రచారం
- మంత్రి అంబటి రాంబాబు ఫైర్



సత్తెనపల్లి: ఎన్నికల అనంతరం చంద్రబాబు జైలుకి లేదా టీడీపీని బీజేపీలో విలీనం చేస్తారని మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. సూళ్లూరుపేటలో టీడీపీ అభ్యర్థి పేరు కూడా తెలియని చంద్రబాబా తనను విమర్శించేది అని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీని, జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే నైతిక అర్హత ఆయనకు లేదన్నారు. నదులు ఎన్నో తెలుసా అని విమర్శిస్తున్న చంద్రబాబు పోలవరం ఎందుకు పూర్తికాలేదో ఈ ఎన్నికల సమయంలోనే చర్చిద్దాం రమ్మని అంబటి సవాల్ విసిరారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి, క్రోసూరులో శనివారం ప్రజాగళం సభల్లో చంద్రబాబునాయుడు చేసిన వ్యాఖ్యలపై ఆదివారం సత్తెనపల్లిలో మంత్రి అంబటి మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

ఘాటుగా విమర్శిస్తా.. దూషించను..

నేనెప్పుడూ రాజకీయ విమర్శలు సహేతుకంగా, ధర్మబద్ధంగా చేస్తా. అంతేతప్ప ఎవరిని దూషించను. నిన్ను వాడెవడు.. ఈడెవడు అని తిట్టిన వాడిని (కన్నా), నీ పక్కన పెట్టుకుని నాపై విమర్శలు చేస్తున్న చంద్రబాబూ.. అసలు నీకు సిగ్గుందా? నీ పక్కన నిలబడిన కన్నా అన్ని పార్టీలకు కన్నాలు వేసి వచ్చాడు.. ఎన్నికల తర్వాత మీ పార్టీకి కూడా సున్నం వేస్తాడు. ఇక మీ పక్కన తిరిగే పవన్‌కళ్యాణ్ డబ్బులు తీసుకుని డ్యాన్స్‌లు వేస్తే నేను కేవలం సంక్రాంతి పండక్కి మాత్రమే సంప్రదాయబద్ధంగా సంతోషంతో చేస్తా. రెండ్రోజుల ప్రచారం చేసి ఐదు రోజులు జ్వరంతో విశ్రాంతి తీసుకునే పవన్‌కి రాజకీయాలెందుకు? బాబు, పవన్ ఇద్దరూ రాజకీయ డ్యాన్సర్లు. ఇక యువగళం పేరుతో రాష్ట్రమంతా తిరిగిన లోకేశ్ ప్రస్తుతం మంగళగిరికే పరిమితమయ్యాడు.

ప్రజాగళం అట్టర్‌ఫ్లాప్..

పల్నాడు జిల్లా క్రోసూరు, సత్తెనపల్లిలో చంద్రబాబు సభలు జనంలేక అట్టర్‌ఫ్లాప్ అయ్యాయి. నీ పక్కన బీజేపీ, జనసేన పార్టీల ముఖ్య నేతలెక్కడ బాబూ? నిజానికి.. ఆ సభల్లో మీరే ఆ పార్టీల జెండాలు కూడా పట్టుకుంటున్నారు. సీఎం సహాయ నిధుల్లోనూ కక్కుర్తి పడ్డానని నాపై ఆరోపణలు చేశావు.. నీ పచ్చజెండా వాళ్లకు కూడా పనిచేసి పెట్టాను.. వారిని అడుగు నేనెంత ధర్మబద్ధంగా చేస్తున్నానో చెబుతారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో జంగా కృష్ణమూర్తి ఎమ్మెల్యేగా చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి ఆయనకు ఎమ్మెల్సీ, విప్ ఇచ్చి గౌరవించారు. అలాగే, నరసరావుపేట ఎంపీ టికెట్ బీసీలకు ఇద్దామంటే వినకుండా పార్టీ మారిన లావు శ్రీకృష్ణదేవరాయలుకు బీసీల ఓట్లు అడిగే అర్హతలేదు.

గెలిస్తేనే నిలిచేది..!

లేదంటే పార్టీలే ఖాళీ | మహారాష్ట్రలో ప్రాంతీయ పార్టీల పరిస్థితి | పవార్, ఉద్ధవ్, షిండే, అజిత్‌లకు కఠిన పరీక్ష

ఈ లోక్‌సభ ఎన్నికలు మహారాష్ట్రలో ప్రాంతీయ పార్టీలకు జీవన్మరణ పరీక్షగా మారాయి. రాజకీయ కురువృద్ధుడు ఎన్సీపీ (ఎస్‌సీపీ) అధినేత శరద్ పవార్, చీలిక వర్గం చీఫ్, ఆయన అన్న కుమారుడు అజిత్ పవార్, బాల్ ఠాక్రే కుమారుడు ఉద్ధవ్ ఠాక్రే, శివసేన చీఫ్, సీఎం ఏక్‌నాథ్ షిండే... ఈ నలుగురూ గెలుపు కోసం అన్ని అస్త్రాలనూ ఉపయోగించుకోవాల్సిన పరిస్థితి. ముఖ్యంగా శరద్ పవార్, ఉద్ధవ్ ఎన్నికలయ్యేదాకా ప్రశాంతంగా నిద్రపోయే పరిస్థితులు కూడా లేవంటే అతిశయోక్తి కాదు. శివసేనను షిండే, ఎన్సీపీని అజిత్ చీల్చి వేరుకుంపటి పెట్టుకోవడం తెలిసిందే. వాటినే అసలైన శివసేన, ఎన్సీపీగా మహారాష్ట్ర స్పీకర్‌తో పాటు కేంద్ర ఎన్నికల సంఘం కూడా ప్రకటించింది. శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్, శరద్ పవార్ అధికారంలో భాగస్వాములుగా లేరు. పైగా మహావికాస్ అఘాడీ కూటమి పొత్తులో భాగంగా కొన్ని స్థానాలకే పోటీ చేస్తున్నారు. కనుక గణనీయమైన సీట్లు సాధిస్తే తప్ప వారి రాజకీయ ఉనికే ప్రశ్నార్థకంగా మారుతుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. వీరిలో శరద్ పవార్ 50 ఏళ్లలో ఒక్క ఓటమీ ఎదుర్కోని నేత కాగా, ఉద్ధవ్ ఠాక్రే ఒక్కసారీ ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ పడని నేత కావడం విశేషం!



ఠాక్రే... వీలైనన్ని చోట్ల పోటీ

2019లో బీజేపీతో పొత్తులో భాగంగా శివసేన 23 స్థానాల్లో పోటీ చేసి 18 గెలుచుకుంది. తర్వాత పార్టీని షిండే చీల్చడంతో ఉద్ధవ్ రాజకీయ భవితవ్యమే అనిశ్చితిలో పడింది. ఈసారి సాధ్యమైనన్ని స్థానాల్లో పోటీ చేసి సత్తా చాటే క్రమంలో 21 స్థానాలకు ఆయన అభ్యర్థులను ప్రకటించేశారు. ఈ ఏడాది చివర్లో జరిగే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల వరకైనా ఉద్ధవ్ తన కేడర్‌ను కాపాడుకోవాలంటే కనీసం ఆరేడు లోక్‌సభ స్థానాలు గెలిచి తీరాలని రాజకీయ విశ్లేషకుడు అకోల్కర్ విశ్లేషించారు.

\- ముంబై

బారామతిలో ఎవరిదో పరపతి!

శరద్ పవార్ ఆధ్వర్యంలోని ఎన్సీపీ 10 లోక్‌సభ స్థానాల్లో పోటీ చేస్తోంది. వాటిలో బారామతి పవార్‌కు కీలకమైనది. అక్కడ 3సార్లుగా ఎంపీగా గెలుస్తున్న పవార్ కుమార్తె సుప్రియా సులే ఈ విడత అజిత్ పవార్ భార్య సునేత్ర గట్టి సవాలు విసురుతున్నారు. ''బారామతిలో సుప్రియ ఓడితే పవార్ అంతా కోల్పోయినట్టే. అలా చూస్తే ఈ యుద్ధం శరద్, అజిత్ మధ్యే!'' అని పరిశీలకులు అంటున్నారు.

కేడర్, ఓటర్ ఎటువైపు

శరద్ పవార్, ఉద్ధవ్‌లకు ఈ ఎన్నికలు గట్టి పరీక్షేనని సీనియర్ జర్నలిస్ట్ అభయ్ దేశ్‌పాండే అన్నారు. అయితే పార్టీలు చీలినా సంప్రదాయ ఓటర్లు, కేడర్ మద్దతు వావైపేనని అభిప్రాయపడ్డారు. ''పైగా బీజేపీ కేడర్‌లోనూ అశాంతి నెలకొని ఉంది. కనుక వాళ్లు అజిత్, షిండే అభ్యర్థుల విజయానికి మనస్ఫూర్తిగా పనిచేస్తారా అన్నది అనుమానమే'' అని ఆయన సందేహం వెలిబుచ్చారు. 2019 ఎన్నికల్లో బీజేపీ–శివసేన 41 లోక్‌సభ స్థానాలను గెలుచుకున్నాయి. వాటిని నిలుపుకోవడం వాటికి ప్రతిష్ఠాత్మకమని, ఆ లెక్కన ఈ ఎన్నికలు అధికార బీజేపీ–షిండే–అజిత్ కూటమికే అసలైన పరీక్ష అని ఉద్ధవ్, శరద్ పవార్ వర్గీయులు వాదిస్తున్నారు.

ఓట్ల చీలిక..

సీఎంగా ఉండగా ఇల్లు కదల్లేదన్న విమర్శలు మూటగట్టుకున్న ఉద్ధవ్ ఇప్పుడు పార్టీని బతికించుకునేందుకు రాష్ట్రమంతా చుడుతున్నారు. ఆయన ర్యాలీలకు మంచి స్పందనే వస్తోంది. శరద్ పవార్ ఉన్నచోటి నుంచే చక్రం తిప్పుతున్నారు. బారామతిలో కుమార్తె గెలుపు కోసం పుణె జిల్లాలో పూర్వపు ప్రత్యర్థులైన కాంగ్రెస్ నేతల మద్దతుకూ ప్రయత్నిస్తున్నారు. అంబేడ్కర్ మనవడైన ప్రకాశ్ అంబేడ్కర్ ఆధ్వర్యంలోని వంచిత్ బహుజన్ అఘాడి (వీబీఏ)తో ఎంవీఏ కూటమి సీట్ల పంపకం చర్చలు విఫలమయ్యాయి. దాంతో త్రిముఖ పోటీ నెలకొంది. ఇది అధికార కూటమికి అనుకూలిస్తుందంటున్నారు.



ఎన్నికల విచిత్రం

భువనేశ్వర్ లోక్‌సభ స్థానంలో బీజేపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎంపీ అపరాజితా సారంగి (చీరకట్టులో ఉన్న వ్యక్తి) ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆనంద బన అర్బన్ ఫారెస్టులో ఇలా జుంబా డాన్స్ చేసి అలరించారు

ఈసీ 'సోషల్' బాట



న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ పర్వంలో యువత ముఖ్యంగా పట్టణ ఓటర్లను మరింతగా భాగస్వాములను చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం నడుంబిగించింది. తొలిసారిగా ఓటు హక్కును వినియోగించుకుంటున్న వారి కోసం 'టర్నింగ్ 18' పేరిట కొత్త ప్రచార కార్యక్రమానికి ఈసీ శ్రీకారం చుట్టింది. తొలి ఓటును వృథా చేయొద్దని, ఖచ్చితంగా పోలింగ్ స్టేషన్‌కొచ్చి ఓటేయాలని వారికి విజ్ఞప్తిచేస్తోంది. ఎన్నికల క్రతువులో ప్రతి ఒక్కరూ చాలా ముఖ్యమంటూ 'యు ఆర్ ది వన్' కార్యక్రమానికి తెర తీసింది. ఓటర్లు మొదలుకుని పార్టీల దాకా, బూత్ స్థాయి అధికారులు(బీఎల్ఓ), కిందిస్థాయి సిబ్బంది, పోలింగ్ బృందాలు, నిర్వహణ సిబ్బంది, మీడియా వర్గాలు, కేంద్ర బలగాలు, భద్రతా సిబ్బంది ఇలా ప్రతి ఒక్కరు ఎన్నికల ప్రక్రియలో అత్యంత ప్రధానమేనంటూ సోషల్ మీడియా వేదికగా వినూత్న ప్రచారం చేస్తోంది. స్వేచ్ఛాయుత ఎన్నికల ప్రయోజనాలను చిన్న కథల రూపంలో, విజువల్స్‌తో ప్రచార వీడియోలను సామాజిక మాధ్యమాల వేదికగా అందరికీ చేరవేస్తోంది. ఎన్నికలకు సంబంధించి పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న అవాస్తవాలు, తప్పుడు కథనాలు, నకిలీ వార్తలు, అబద్ధపు సమాచారాన్ని పోల్చి చూసుకునేందుకు 'వెరిఫై బిఫోర్ యు యాంప్లిఫై' పేరిట మరో విధానాన్ని ఈసీ అందుబాటులోకి తెచ్చింది. సోషల్ మీడియాలో విస్తృతంగా షేర్ అవుతున్న తప్పుడు కథనాలు, నకిలీ వార్తల కట్టడికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని ఈసీ ఆశిస్తోంది. 'కచ్చితమైన, వాస్తవిక, నిర్దిష్టమైన ఎన్నికల సమాచారాన్ని మాత్రమే ప్రజలు పొందేలా చేయడమే ఈ కార్యక్రమాల ఉద్దేశం. ప్రజలకు ఏది నిజమో ఏది అవాస్తవమో తెలిసేలా చేయగల్గిన నాడే ఎన్నికల సమగ్రతను కాపాడగలిగిన వారమవుతాం' అని ఈసీ పేర్కొంది.

కేజ్రీవాల్ అరెస్టుపై ఆప్ నిరాహార దీక్షలు

న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు ఆదివారం జంతర్‌మంతర్ వద్ద సామూహిక నిరాహార దీక్ష చేశారు. రోజంతా ఈ దీక్షలు కొనసాగాయి. ఢిల్లీ మంత్రులు, ప్రజాప్రతినిధులతోపాటు పార్టీ మద్దతుదారులు, అభిమానులు కూడా పాల్గొన్నారు. కేజ్రీవాల్‌కు అనుకూలంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం నిరంకుశ పాలన సాగిస్తోందని ఆరోపించారు. ఢిల్లీతోపాటు దేశవ్యాప్తంగా ఇతర రాష్ట్రాల్లోనూ నిరాహార దీక్షలు చేపట్టారు. విదేశాల్లోనూ పలు నగరాల్లో దీక్షలు జరిగాయి. బోస్టన్, లాస్ ఏంజెలెస్, వాషింగ్టన్ డీసీ, న్యూయార్క్, టోరంటో, లండన్, మెల్‌బోర్న్ తదితర నగరాల్లో నిరాహార దీక్షలు జరిగినట్లు ఆప్ నేతలు వెల్లడించారు. జంతర్‌మంతర్ వద్ద ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ ప్రసంగించారు. నిజాతీయపరుడైన అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం దుర్మార్గం అని మండిపడ్డారు. ఢిల్లీ మద్యం కుంభకోణంలో సాక్ష్యాధారాలు లేకపోయినా అరెస్టు చేయడం దారుణమని విమర్శించారు. కేజ్రీవాల్ ఎప్పటికీ నిజాతీయపరుడిగానే ఉంటారని చెప్పారు. దేశంలో నిరంకుశ పాలన అంతం కావాలంటే సార్వత్రిక ఎన్నికల్లో నరేంద్ర మోదీని గద్దె దించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. బీజేపీపై యుద్ధం మొదలైందని, ఇకపై ఆ పార్టీ నాయకులకు నిద్రలేని రాత్రులేనని ఢిల్లీ మంత్రి అతిశీ అన్నారు. ఢిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో కేజ్రీవాల్ మార్చి 21న అరెస్టవడం తెలిసిందే.



ఆదివారం ఢిల్లీలో దీక్ష చేస్తున్న అతిశి తదితరులు

కేజ్రీవాల్ రాజీనామా చేయాలని బీజేపీ నిరసన

మద్యం కుంభకోణంలో నిందితుడైన ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ వెంటనే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నేతలు, కార్యకర్తలు ఆదివారం ఢిల్లీలో భారీ నిరసన చేపట్టారు. కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. ఢిల్లీ ప్రజల సొమ్మును కేజ్రీవాల్ లూటీ చేశారని బీజేపీ నేతలు ఆరోపించారు.

కశ్మీర్ భారత్‌లో లేదా?

ప్రతిపక్షాలను నిలదీసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

నవదా/జల్పాయ్‌గురి/జబల్పూర్: కాంగ్రెస్ పార్టీపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరోసారి విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ మేనిఫెస్టో అచ్చంగా ముస్లిం లీగ్ విధానాలను పోలి ఉందని విమర్శించారు. అది మేనిఫెస్టో కాదు, బుజ్జగింపు పత్రం అని ధ్వజమెత్తారు. ఆదివారం బిహార్‌లోని నవదా జిల్లాలో ఎన్నికల ప్రచార సభలో మోదీ ప్రసంగించారు. ఆర్టికల్ 370 రద్దు గురించి బీజేపీ నాయకులు ఇతర రాష్ట్రాల్లో ఎందుకు ప్రస్తావిస్తున్నారన్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యలపై మండిపడ్డారు. ''దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాలకు చెందిన భద్రతా సిబ్బంది జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదులతో పోరాడుతూ ప్రాణాలు కోల్పోయారు. వారి పార్థివ దేహాలు త్రివర్ణ పతాకాలతో స్వస్థలాలకు చేరుకున్నాయి. రాజ్యాంగాన్ని జమ్మూకశ్మీర్‌లో గతంలో ఎందుకు పూర్తిస్థాయిలో అమలు చేయలేదో ప్రతిపక్ష నేతలు చెప్పాలి. అది దేశంలో అంతర్భాగం కాదా?'' అని ప్రశ్నించారు.

రన్‌వేపై మా గ్రోత్ ఇంజన్ సిద్ధం

దేశాన్ని రెండు విభజించాలన్నదే కాంగ్రెస్ ఆలోచనా విధానమని మోదీ ఆక్షేపించారు. ''ప్రజల విరాళాలతో నిర్మించిన అయోధ్య రామమందిర ప్రాణప్రతిష్ట కార్యక్రమాన్ని కాంగ్రెస్ పెద్దలు బహిష్కరించారు. హాజరైన పార్టీ నేతలను బహిష్కరించారు. శ్రీరామనవమి రాబోతోంది. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు చేసిన పాపాలను మర్చిపోవద్దు'' అని ప్రజలకు సూచించారు. తమ పదేళ్ల పాలన ట్రైలర్ మాత్రమేనని, తమ గ్రోత్ ఇంజన్ రన్‌వేపై సిద్ధంగా ఉందని, ఇక టేకాఫ్ తీసుకుంటుందని అన్నారు. బెంగాల్‌లోని జల్పాయ్‌గురిలో ఎన్నికల మెగా ర్యాలీలో, మధ్యప్రదేశ్‌లోని జబల్పూర్‌లో రోడ్ షోలో మోదీ పాల్గొన్నారు. పశ్చిమ బెంగాల్‌లో అవినీతికి, హింసాకాండకు ఉచిత లైసెన్స్ ఇవ్వాలని అధికార టీఎంసీ కోరుకుంటోందని మండిపడ్డారు.



ఆదివారం జబల్‌పూర్‌లో మోదీ రోడ్ షో

భార్యను 224 ముక్కలుగా నరికేశాడు

లండన్: భార్యను భర్త హత్యచేసి ఏకంగా 224 ముక్కలుగా నరికి మృతదేహాన్ని మాయంచేసిన దారుణ ఘటన బ్రిటన్‌లో చోటుచేసుకుంది. నికొలస్ మెట్సన్ (28), హోలీ బ్రామ్లీ (26) లింకన్ సిటీలోని బస్సింగ్‌హామ్‌లో ఉంటున్నారు. గత నెల 17 నుంచి బ్రామ్లీ కనిపించట్లేదని పోలీసులకు ఫిర్యాదు అందింది. ఆమె తనను చితకబాది వెళ్లిపోయిందని పోలీసులకు నికొలస్ చెప్పాడు. ఫ్లాట్‌ను తనిఖీ చేయగా పెద్ద మొత్తంలో రక్తపు మరకలు, అతిగా శుభ్రం చేసినట్లు అమ్మోనియా, బ్లీచింగ్ ఆనవాళ్లు కనిపించాయి. దాంతో అతన్ని అరెస్ట్‌చేసి విచారణ మొదలెట్టారు. తనకేం తెలీదని మెట్సన్ తొలుత వాదించాడు. ఈలోపు సమీపంలోని విథమ్ నదిలో నరికిన చేయి సహా చిన్నచిన్న శరీరభాగాలున్న ప్లాస్టిక్ బ్యాగులు కొట్టుకుపోవడం చూసి స్థానికుడు పోలీసులకు సమాచారమిచ్చాడు. పోలీసు గజ ఈతగాళ్లు వాటిని సేకరించి ల్యాబ్‌కు పంపించారు. అసలేమాత్రం గుర్తుపట్టలేనంతగా హోలీ బ్రామ్లీ శరీరాన్ని పలుమార్లు పొడిచి 224 ముక్కలుగా నరికి భర్త నదిలో పడేశాడు. శరీరభాగాలను పడేయటంతో సాయపడినట్లు భర్త స్నేహితుడు జాషువా హ్యాన్‌కాక్ తన నేరాన్ని అంగీకరించాడు. పోలీసులు తమదైన శైలిలో విచారించడంతో ఎట్టకేలకు భర్త తన నేరాన్ని ఒప్పుకున్నాడు. ఆమె చంపడానికి ముందు పెంపుడు కుక్క పిల్ల, పెంపుడు ఎలుకలనూ చంపేశాడు. తన మాజీ జీవితభాగస్వాములనూ మెట్సన్ హింసించినట్లు 2013, 2016, 2017 పోలీసు రికార్డుల్లో ఉంది. జంతువుల పట్ల అతను అమానుషంగా ప్రవర్తించేవాడని పోలీసు విచారణలో వెల్లడైంది. హత్యచేసి దాదాపు వారంపాటు శరీరం ముక్కలున్న బ్యాగులను దాచి తర్వాత వాటిని పడేశాడు. హత్య తర్వాత భార్య బ్యాంక్ ఖాతా నుంచి 50 పౌండ్లు విత్‌డ్రా చేసి వాడుకున్నాడు. 'భార్యను హత్య చేస్తే భర్తకు కలిగే లాభాలేంటి?. ఆ తర్వాత నన్ను ఎవరైనా వెంబడిస్తారా?. కూపీ లాగుతారా?' అంటూ హత్యకు ముందు కొన్ని అంశాలపై ఆన్‌లైన్‌లో సెర్చ్‌చేశాడు. ఈ ఆన్‌లైన్ సెర్చ్ హిస్టరీని సైతం పోలీసులు వెలికితీశారు.

సహజీవనం చేసినా భరణం

మధ్యప్రదేశ్ హైకోర్టు తీర్పు

భోపాల్: చట్టబద్ధంగా వివాహం చేసుకోకపోయినా ఒక పురుషుడితో చాలాకాలం సహజీవనం చేసి విడిపోయిన మహిళ భరణానికి అర్హురాలేనని మధ్యప్రదేశ్ హైకోర్టు తీర్పు చెప్పింది. భరణం ఇవ్వాలన్న కింది కోర్టు ఉత్తర్వును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను కొట్టివేసింది. 38 ఏళ్ల శైలేంద్ర బాప్చే, 48 ఏళ్ల అనిత చాలాఏళ్లు సహజీవనం చేశారు. కుమారుడు పుట్టాక విడిపోయారు. బిడ్డను పోషించుకోవడానికి, తన జీవనానికి భరణం ఇవ్వాలని అనిత డిమాండ్ చేయగా శైలేంద్ర అంగీకరించలేదు. దాంతో ఆమె ట్రయల్ కోర్టును ఆశ్రయించింది. అనిత్ పిటిషన్‌పై విచారణ జరిపిన ట్రయల్ కోర్టు ఆమెకు నెలకు రూ.1,500 చొప్పున భరణం చెల్లించాలని శైలేంద్రను ఆదేశించింది. ఈ ఉత్తర్వులపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ శైలేంద్ర హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. దీనిపై జస్టిస్ జేఎస్ అహ్లూవాలియా ధర్మాసనం విచారణ చేపట్టింది. ట్రయల్ కోర్టు ఉత్తర్వును సమర్థించింది. శైలేంద్ర పిటిషన్‌ను కొట్టివేసింది. సహజీవనం చేసి విడిపోయిన మహిళ తనను తాను పోషించుకోలేని స్థితిలో ఉంటే సీఆర్‌పీసీ సెక్షన్ 125 కింద ఆమెకు భరణం చెల్లించాలని ధర్మాసనం స్పష్టం చేసింది.

శిబిరాల నుంచే ఓటు

మణిపూర్‌లో భిన్న వాతావరణం
సగం పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకమే


ఇంఫాల్: గత ఏడాదంతా జాతుల వైరంతో అట్టుడికిపోయిన మణిపూర్ ఇంకా నివురుగప్పిన నిప్పులానే ఉంది. సార్వత్రిక ఎన్నికల వేళ ప్రచారంతో మోతెక్కిపోయే రాష్ట్రాలకు భిన్న వాతావరణం మణిపూర్‌లో నెలకొంది. మెయితీ, కుకీ తెగల గొడవలతో 50,000 మందికిపైగా స్థానికులు సహాయక, పునరావాస శిబిరాల్లో తలదాచుకుంటున్నారు. తమ సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోలేదన్న భావన వారిలో గూడుకట్టుకుంది. లోక్‌సభ ఎన్నికలపైనా వ్యతిరేక భావన నెలకొంది. దాంతో మరో రెండు వారాల్లో పోలింగ్ ఉన్నా ఎన్నికల హడావుడే కనిపించలేదు. ''మణిపూర్‌లో 2,955 పోలింగ్ స్టేషన్లలో సగం సమస్యాత్మక ప్రాంతాల్లో ఉన్నాయి. రాష్ట్రంలో వేరే ప్రాంతాలకు వలస పోయిన వారి కోసం 94 స్టేషన్లు ఏర్పాటుచేస్తున్నాం. 24,000 మంది శిబిరాల నుంచే ఓటేయనున్నారు'' అని రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ప్రదీప్ కుమార్ ఝా అన్నారు. ఓటర్లతో మాట్లాడి ఎన్నికలపై సదాభిప్రాయం పెంచి పోలింగ్ శాతం పెంచేందుకు ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నట్టు చెప్పారు. గత ఏడాది మే మూడో తేదీన లోయ ప్రాంతాల్లో ఉండే మెజారిటీ జనాభా మైతేయ్‌లకు రాష్ట్రంలో ఎస్టీ హోదా డిమాండ్‌కు వ్యతిరేకంగా కుకీలు చేపట్టిన గిరిజనుల సంఘీభావ ర్యాలీ తర్వాత హింస ప్రజ్వరిల్లింది. మైతేయ్, కుకీల విద్వేషకాండలో 219 మంది ప్రాణాలు కోల్పోయారు. వేల మంది ప్రాణభయంతో సొంతూరిని వదిలి పారిపోయి ఐదు లోయ జిల్లాలు, మూడు కొండ జిల్లాల్లోని శిబిరాల్లో దాక్కున్నారు. ఘర్షణలు పూర్తిగా సద్దుమణకముందే రాష్ట్రంలో ఎన్నికలు అవసరమా? అంటూ వేలాది మంది బాధితులు, కొన్ని పౌర సంఘాలు ప్రశ్నిస్తూ ఎన్నికల బాయ్‌కాట్‌కు పిలుపునిచ్చాయి. ''గత లోక్‌సభ ఎన్నికల్లో మణిపూర్‌లో చక్కటి పోలింగ్ శాతం నమోదైంది. ఇది ఎన్నికల ప్రక్రియపై రాష్ట్ర ఓటర్ల నమ్మకానికి అద్దంపడుతోంది. ఈసారి గణనీయమైన పోలింగ్‌కు కృషిచేస్తాం'' అని ప్రదీప్ ఝా అన్నారు.

జపోరిజియా అణు ప్లాంట్‌పై ఉక్రెయిన్ డ్రోన్ దాడులు

కీవ్: రష్యా ఆక్రమిత జపోరిజియా అణు విద్యుత్ ప్లాంట్‌పై డ్రోన్ దాడి జరిగిందని అధికారులు తెలిపారు. ప్లాంట్‌లోని ఆరో యూనిట్ డోమ్ సహా పలు చోట్ల ఉక్రెయిన్ మిలటరీ డ్రోన్లు ఆదివారం దాడి చేశాయన్నారు. అయితే ఎటువంటి నష్టం వాటిల్లలేదని, ఎవరూ చనిపోలేదని అన్నారు. ప్లాంట్‌లో అణుధార్మికత స్థాయిలు కూడా సాధారణంగానే ఉన్నట్లు వివరించారు. దాడి సమాచారం తమకు అందిందని అంతర్జాతీయ అణు శక్తి సంస్థ(ఐఏఈఏ) తెలిపింది. ఇటువంటి దాడులతో భద్రతాపరమైన ప్రమాదాలున్నాయని హెచ్చరించింది. యూరప్‌లోనే అతి పెద్దదైన జపోరిజియా అణు విద్యుత్కేంద్రం 2022 నుంచి రష్యా ఆధీనంలోనే ఉంది. ఇందులోని ఆరు యూనిట్లు కొద్ది నెలలుగా మూతబడి ఉన్నాయి.

అరుణాచల్‌లో ఆమె ప్రాతినిధ్యమేది?

ఎన్నికల బరిలో కనిపించని మహిళలు • రెండు లోక్‌సభ స్థానాలకు ఒక్కరు, 50 అసెంబ్లీ స్థానాలకు 8 మంది



ఈటానగర్: చట్టసభల్లో మహిళా ప్రాతినిధ్యం విషయంలో అరుణాచల్ ప్రదేశ్ అందుకు మినహాయింపేమీ కాదు. రెండు లోక్‌సభ స్థానాలతో పాటు రాష్ట్రంలో 50 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఏకకాలంలో ఏప్రిల్ 19న ఎన్నికలు జరగనున్నాయి. కానీ ఈ ఈశాన్య రాష్ట్రంలో ఎన్నికల బరిలో దిగిన మహిళల సంఖ్య మాత్రం అంతంతే...

ఇప్పటివరకు 15 మంది...

అరుణాచల్ ఈస్ట్, అరుణాచల్ వెస్ట్ రెండు లోక్‌సభ స్థానాలకు మొత్తం 14 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా.. గణ సురక్ష పార్టీకి ప్రాతినిధ్యం వహిస్తున్న టోకో శీతల్ ఒక్కరే మహిళ. 50 అసెంబ్లీ స్థానాలకు ఎనిమిది మంది మహిళలు మాత్రమే నామినేషన్లు వేశారు. వారిలో అధికార బీజేపీ నుంచి నలుగురు, కాంగ్రెస్ నుంచి ముగ్గురు కాగా ఒకరు ఇండిపెండెంట్. వీరిలో హయులియాంగ్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి దాసంగ్లు పుల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1987లో అరుణాచల్ ప్రదేశ్ పూర్తిస్థాయి రాష్ట్రంగా ఏర్పడినప్పటి నుంచి కేవలం 15 మంది మహిళలు మాత్రమే అసెంబ్లీకి ఎన్నికయ్యారు. ఇప్పటివరకు రాష్ట్రం నుంచి ఒక మహిళ మాత్రమే రాజ్యసభలో ప్రాతినిధ్యం వహించారు. సిబో కైను 1978లో అసెంబ్లీకి గవర్నర్ నామినేట్ చేశారు. పీపుల్స్ పార్టీ ఆఫ్ అరుణాచల్ (పీపీఏ) అభ్యర్థిగా సెప్పా నియోజకవర్గం నుంచి 1980లో అసెంబ్లీకి ఎన్నికైన మొదటి మహిళ న్యారీ వెల్లి. కోమోలి మొసాంగ్ 1980లో నాంపాంగ్ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికయ్యారు. 1990లో కాంగ్రెస్ అభ్యర్థిగా తిరిగి ఆమె విజయం సాధించారు. ఒమేమ్ మోయెంగ్ డియోరీ 1984లో రాజ్యసభకు ఎన్నికయ్యారు. 1990లో కాంగ్రెస్ టిక్కెట్‌పై లేకాంగ్ అసెంబ్లీ స్థానం నుంచి కూడా గెలుపొందారు.

బలమైన గొంతుకలు కావాలి..

సాంస్కృతిక అడ్డంకులు, సామాజిక–ఆర్థిక పరిమితులు, అవగాహన లేమి వంటి అనేక అంశాలు ఎన్నికల రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యాన్ని ప్రభావితం చేస్తున్నాయనేది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. రాజకీయ ప్రక్రియలో మహిళల ప్రమేయాన్ని ప్రోత్సహించే వాతావరణాన్ని సృష్టించేందుకు ప్రభుత్వం, పౌర సమాజ సంస్థల సమష్టి కృషి అవసరమని అరుణాచల్ ప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ కెంజుమ్ పాకం అన్నారు. రాజకీయాల్లో మహిళలకు రిజర్వేషన్లపై చట్టాన్ని వీలైనంత త్వరగా అమలు చేయాలని రాజీవ్ గాంధీ విశ్వవిద్యాలయంలో రాజనీతి శాస్త్ర అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నాని బాత్ సూచించారు. అప్పుడే అరుణాచల్ వంటి చోట్ల వారికి ప్రాతినిధ్యం దక్కుతుందన్నారు.

ఎలక్షన్ బీట్

ఆజాద్‌పై మెహబూబా ముఫ్తీ పోటీ

శ్రీనగర్: లోక్‌సభ ఎన్నికల్లో అనంత్‌నాగ్–రాజౌరీ లోక్‌సభ స్థానంలో డీపీఏపీ అధ్యక్షుడు గులాం నబీ ఆజాద్‌పై పీపుల్స్ డెమోక్రాటిక్ పార్టీ(పీడీపీ) చీఫ్ మెహబూబా ముఫ్తీ బరిలో దిగుతున్నారు. కశ్మీర్లో మరో రెండు స్థానాలకు అభ్యర్థులను ఆమె ఆదివారం ప్రకటించారు. తనకు మద్దతివ్వాల్సిందిగా కాంగ్రెస్, ఎన్సీలను కోరారు.

బీజేపీ తెచ్చిపెట్టిన నిరుద్యోగమిది: ఖర్గే

న్యూఢిల్లీ: దేశంలో బీజేపీ తెచ్చిపెట్టిన నిరుద్యోగ సమస్యే లోక్‌సభ ఎన్నికల్లో ప్రధానాంశమని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే అన్నారు. ఉద్యోగాలు దొరక్క యువత అల్లాడుతోందని ఆదివారం ఆయన ఆవేదన వెలిబుచ్చారు. ''ఐఐటీ, ఐఐఎం పట్టభద్రులకే ఉపాధి దొరకడం లేదంటే దేశ యువత భవితను బీజేపీ ఎలా నాశనం చేస్తోందో ఊహించుకోవచ్చు. మోదీ హయాంలో 2014 నుంచి దేశంలో నిరుద్యోగం మూడు రెట్లు పెరిగింది'' అన్నారు.

జూన్ 4 తర్వాత మోదీకి లాంగ్ లీవ్ తప్పదు

మోదీ అబద్ధాలు వినీ వినీ దేశ ప్రజలు విసిగిపోయారని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ అన్నారు. జూన్ 4 తర్వాత ఆయన లాంగ్ లీవ్‌పై వెళ్లక తప్పదన్నారు.

అవినీతి అంతమే ప్రధాని పంతం: నడ్డా

అరియలూర్ (తమిళనాడు): దేశంలో అవినీతిని అంతం చేసేందుకు ప్రధాని మోదీ తీవ్రంగా కృషి చేస్తోంటే..జైలులోనో, బెయిలుపైనో ఉన్న ఇండియా కూటమి నేతలు అవినీతిపరులను కాపాడేందుకు కంకణం కట్టుకున్నారని బీజేపీ చీఫ్ జేపీ నడ్డా వ్యాఖ్యానించారు. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ వంటి వారు జైలుకెళ్లగా, కాంగ్రెస్ నేతలు సోనియా, ఆమె కుమారుడు రాహుల్ గాంధీ తదితరులు బెయిల్ తెచ్చుకున్నారన్నారు. తమిళనాడులో అధికార డీఎంకే వసూళ్ల పాల్పడుతూ ప్రైవేట్ పంచాయతీలు చేస్తోందన్నారు.

బీజేపీలో చేరకుంటే దాడులే!

దర్యాప్తు సంస్థలే బెదిరిస్తున్నాయి: మమత

కోల్‌కతా: అధికార బీజేపీపై తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మరోసారి ఫైరయ్యారు. బీజేపీలో చేరాలని, లేదంటే దాడులను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని తమ పార్టీ నేతలను దర్యాప్తు సంస్థలు బెదిరిస్తున్నాయని ఆరోపించారు. ఆదివారం పురులియా జిల్లాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆమె ప్రసంగించారు. ఈడీ, సీబీఐ, ఎన్ఐఏ, ఐటీ వంటి జాతీయ దర్యాప్తు సంస్థలను ఆయుధంగా చేసుకొని బీజేపీ తమ పార్టీ నేతలను వేధిస్తోందని ఆమె మండిపడ్డారు. ముందస్తు సమాచారం లేకుండా ఆయా సంస్థలు ఇళ్లలోకి చొరబడుతున్నాయని విమర్శించారు. శ్రీరామ నవమి నేపథ్యంలో మత కల్లోహాలు సృష్టించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

జమ్మూలో మహిళా భద్రతా బృందం

జమ్మూ: జమ్మూ లోక్‌సభ స్థానానికి ఏప్రిల్ 26న జరగనున్న పోలింగ్‌కు భద్రత కోసం జమ్మూ కశ్మీర్ పోలీస్ స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ (ఎస్‌వోజీ)లోని ప్రత్యేక మహిళా దళం మోహరించింది. పూర్తి ఆటోమేటిక్ ఆయుధాలు, బుల్లెట్ ప్రూఫ్ దుస్తులు ధరించిన ఎనిమిది మంది సభ్యుల బృందం పెట్రోలింగ్ విధులు నిర్వహించనుంది. సోదాలు, వాహన తనిఖీలు చేయనుంది. దీన్ని మహిళా ప్రయాణికులు స్వాగతించారు.

ఎన్డీఏకు 4,000 సీట్లు ఖాయం: నితీశ్

పట్నా: బిహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ మరోమారు నాలుక్కరుచుకున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే 4 వేలకు పైగా సీట్లు సాధించనుందని ఆదివారం బిహార్‌లోని నవడా ర్యాలీలో ప్రధాని నరేంద్ర మోదీ సమక్షంలోనే అన్నారాయన. తొలుత ఎన్డీఏ నాలుగు లక్షలకు పైగా సీట్లు సాధించనుందన్నారు. వెంటనే నాలుక్కరుచుకుని, నాలుగు వేల సీట్లు గెలుస్తుందన్నారు. చివరికి 400కు పైగా సీట్లు సాధిస్తుందంటూ సరి చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.

మోదీ గ్యారెంటీ... బంగారమే: రాజ్‌నాథ్

జైపూర్: ప్రధాని నరేంద్ర మోదీ గ్యారెంటీ అంటే 24 క్యారెట్ల స్వచ్ఛ బంగారంతో సమానమని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఆయన చెప్పినవన్నీ చేస్తున్నారు, ప్రజలే ఇందుకు సాక్ష్యమని చెప్పారు. ఆదివారం ఆయన జైపూర్‌లో మీడియాతో మాట్లాడారు. భారీగా హామీలిచ్చి, అమలు చేయని కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మరన్నారు. మోదీ ప్రభుత్వ విశ్వసనీయతపై విదేశాలకు కూడా ఎలాంటి సందేహాలు లేవని స్పష్టం చేశారు.

సువిధ పోర్టల్‌కు 73వేల దరఖాస్తులు

సాక్షి, న్యూఢిల్లీ: నిష్పాక్షిక, స్వేచ్ఛాయుత, పారదర్శక ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన సువిధ' పోర్టల్‌కు పార్టీలు, అభ్యర్థుల నుంచి 73 వేలకు పైగా దరఖాస్తులు, అభ్యర్థనలు అందినట్లు కేంద్ర ఎన్నికల సంఘం ఆదివారం వెల్లడించింది. తెలంగాణ నుంచి 863, ఆంధ్రప్రదేశ్ నుంచి 1,153 వచ్చాయని తెలిపింది. వీటిలో 44,626 అభ్యర్థనలను ఆమోదించామని తెలిపింది.

'కాంగ్రెస్ ఓడితే రాహుల్ తప్పుకోవాలి'

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఆశించిన ఫలితాలను సాధించకుంటే ఆ పార్టీ అగ్రనేత రంగం నుంచి తప్పుకుంటే బాగుంటుందని ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ అభిప్రాయపడ్డారు. దాదాపు పదేళ్లుగా కాంగ్రెస్ పార్టీకి చెప్పుకోదగ్గ విజయాలను అందించలేకపోయినప్పటికీ రాహుల్ గాంధీ పక్కకు తప్పుకోవడం లేదా వేరొకరికి బాధ్యతలను అప్పగించకుండా పార్టీని నడుపుతున్నారని చెప్పారు. తనను అడిగితే ఇలాంటి వైఖరి సైతం ప్రజాస్వామ్య వ్యతిరేకమని అంటానన్నారు.



అసోంలోని నగాన్ జిల్లాలో ఆదివారం ఇంటినుంచే ఓటేస్తున్న ఓ 85 ఏళ్ల వృద్ధురాలు. 80 ఏళ్లు దాటినవారు ఇంటినుంచే ఓటేసేందుకు ఈసారి ఈసీ వెసులుబాటు కల్పించడం తెలిసిందే.

బాబును నమ్మితే పులికి బలే

కొనకనమిట్ల 'మేమంతా సిద్ధం' సభలో ముఖ్యమంత్రి జగన్



కొనకనమిట్ల జంక్షన్‌లో జరిగిన సభకు హాజరైన అశేష జనసందోహానికి అభివాదం చేస్తున్న సీఎం జగన్



అశేష జనవాహిని స్వాగతం నడుమ సభాస్థలికి వెళుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: 'ప్రకాశం జిల్లా పొదిలిలో ఈరోజు ఇసుక వేసినా రాలనంతగా జనసముద్రం, ప్రజా కెరటం కనిపిస్తోంది. మంచి చేసిన మన ప్రభుత్వానికి మద్దతుగా ఆ మంచిని కొనసాగించేందుకు చేయీ చేయీ కలిపి చేస్తున్న నినాదమే సిద్ధం.. సిద్ధం! ప్రజల అజెండాతో మనం, జెండాలు జత కట్టి వారు తలపడుతున్న ఈ ఎన్నికల్లో పేదల వ్యతిరేకులను ఓడించి ఇంటింటా అభివృద్ధి, సంక్షేమాన్ని కొనసాగించేందుకు మీరంతా సిద్ధమేనా?' అని ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రశ్నించారు. 10వ రోజు బస్సు యాత్ర సందర్భంగా ప్రకాశం జిల్లా మార్కాపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని కొనకనమిట్ల జంక్షన్ వద్ద ఆదివారం జరిగిన ''మేమంతా సిద్ధం'' బహిరంగ సభలో సీఎం జగన్ మాట్లాడారు. ఎండ నిప్పులు చెరుగుతున్నా భారీ ఎత్తున తరలివచ్చిన జనసందోహాన్ని ఉద్దేశించి సీఎం మాట్లాడారు. 'ప్రజల రాజ్యాన్ని, అవ్వాతాతల సంక్షేమ రాజ్యాన్ని, రైతు రాజ్యాన్ని, మహిళా పక్షపాత రాజ్యాన్ని, పిల్లల అభివృద్ధి రాజ్యాన్ని ధ్వంసం చేసేందుకు వస్తున్న మూడు పార్టీల కూటమిని అడ్డుకునేందుకు మీరంతా సిద్ధమేనా? ఈ ఎన్నికలు కేవలం ఎమ్మెల్యేలను, ఎంపీలను ఎన్నుకునేందుకు జరుగుతున్నవి కాదు. గత ఐదేళ్లుగా బాగుపడ్డ మీ పిల్లలు బడులు, చదువులు, అక్కచెల్లెమ్మల సాధికారత, అవ్వాతాతల సంక్షేమం, రైతుకు అందుతున్న భరోసా, సామాజిక న్యాయం.. ఇవన్నీ కొనసాగి మరో రెండు అడుగులు ముందుకు వేయాలా? లేక మోసపోయి వెనక్కు వెళ్లాలా? అన్నది నిర్ణయించే ఎన్నికలు ఇవి. ఈ ఎన్నికలు మన భవిష్యత్తును నిర్దేశిస్తాయి. రెండు అడుగులు ముందుకు వేయాలా? లేక మళ్లీ మోసపోయి వెనక్కు వెళ్లాలా? అనే అంశాన్ని నిర్ణయించే ఎన్నికలు అని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని కోరుతున్నా' అని పేర్కొన్నారు. సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

కొనసాగింపు.. ముగింపు మధ్య పోరాటం

ఇవి జగన్‌కు, చంద్రబాబుకు మధ్య జరుగుతున్న ఎన్నికలు కావు. పేదలకు, బాబు మోసాలకు మధ్య జరుగుతున్న ఎన్నికలివి. ఈ ఎన్నికల్లో మీ బిడ్డ జగన్‌ది పేదల పక్షం అని గర్వంగా చెబుతున్నా. మీ ప్రతి ఓటూ వచ్చే ఐదేళ్లు ఏ దారిలో నడవాలో నిర్ణయిస్తుంది. మీకు, మీ కుటుంబానికి మంచి కొనసాగుతుందా? లేదా? అనేది నిర్ణయిస్తుంది. ఐదు వారాల్లో జరగబోయే ఈ ఎన్నికల కురుక్షేత్రంలో జగన్‌కు ఓటు వేస్తే జరుగుతున్న ప్రతి మంచీ కొనసాగుతుంది. అదే చంద్రబాబుకు వేస్తే జగన్ తెచ్చిన పథకాలన్నింటికి ముగింపు పలికినట్లే. అందుకే బాగా ఆలోచించండి. ఓటు వేసే ముందు ఈ విషయాలన్నీ గుర్తుంచుకోండి.

బాబు దారి ఎప్పుడూ అడ్డదారే...

చంద్రబాబు దారి ఎప్పుడూ అడ్డదారే. ఆయనకు విలువలు, విశ్వసనీయత అన్న పదాలకు అర్థం తెలియదు. చంద్రబాబు మార్కు రాజకీయం ఏమిటంటే.. వెన్నుపోట్లు, దగా, మోసం, అబద్ధాలు, కుట్రలు. అవ్వాతాతా... ఈ చంద్రబాబు ఏం చేశాడో తెలుసా? తన మనిషి నిమ్మగడ్డ రమేష్‌తో నేరుగా ఎన్నికల కమిషన్ కు ఫిర్యాదు చేయించాడు. పెన్షన్లు పేదవాడి ఇంటికి వెళ్లకూడదట. వలంటీర్లు అలా వెళ్లటం నేరమట. పెన్షన్లు ఇంటికి వెళ్లి ఇచ్చే కార్యక్రమం ఇవాళ కొత్తగా జరగడం లేదు. ఇంటికి వెళ్లి అందించి ప్రతి అవ్వాతాత ముఖంలో చిరునవ్వు చూసే కార్యక్రమం గత 58 నెలలుగా జరిగింది. చంద్రబాబు హయాంలో ఎప్పుడూ జరగని విధంగా మన ప్రభుత్వం వచ్చాకే అది ఆదివారమైనా, సెలవురోజైనా 1వ తారీఖు ఉదయాన్నే వలంటీర్ మనవడు, మనవరాళ్లు అవ్వాతాతల వద్దకు ఇంటికివెళ్లి చేతిలో పెన్షన్లు పెట్టారు. చంద్రబాబు హయాంలో రూ.1,000 మాత్రమే అరకొరగా ఇస్తే మీ బిడ్డ ప్రభుత్వం వచ్చాక రూ.3 వేలకు పెంచుకుంటూ వెళ్లి ఇంటివద్దే అందించే ఓ గొప్ప వ్యవస్థను తెచ్చింది. చంద్రబాబు హయాంలో మాదిరిగా జన్మభూమి కమిటీలు, లంచాలు, వివక్ష లేదు. ఎక్కడెక్కడికో తిరిగి క్యూలో నిలబడి నరకయాతన అనుభవించిన రోజులు చంద్రబాబు పాలనలో చూశాం. వలంటీరు వ్యవస్థ చంద్రబాబు గుండెల్లో రైళ్లు పరుగెత్తించింది. అందుకే కుట్ర రాజకీయాలు చేస్తున్నారు. వలంటీర్లు మన ఇంటికి రాకుండా కట్టడి చేసే దిక్కుమాలిన ఆలోచనలు చేస్తున్నాడు.

అవ్వాతాతల మరణాలకు కారకుడు..

ఇలాంటి దిక్కుమాలిన ఫిర్యాదు చేసి ఈరోజు అవ్వాతాతలను, వ్యాధిగ్రస్తులను, అభాగ్యులైన నా అక్కచెల్లెమ్మలను, దివ్యాంగులను మండే ఎండలో నడి రోడ్డుపై నిలబెట్టడమే కాకుండా 30 మంది పైచిలుకు అవ్వలు, తాతల చావులకు కారకుడైన చంద్రబాబు సిగ్గుతో తలొంచుకోవాలి. తన స్వార్థ రాజకీయాలకు అనేక మంది మరణానికి కారణమైన ఈ అన్యాయస్తుడిని శాడిస్ట్ అనక మరేమంటారో మీరే చెప్పండి. ఈ ఎన్నికల సమయంలో, అధికారం మన చేతుల్లో లేని సమయంలో మాత్రమే పెన్షన్ మన ఇంటికి రాకుండా ఎందుకు ఆగింది? అది ఆగలేదు.. అడ్డుకోబట్టే రాకుండా పోయింది.

వలంటీర్లను కించపరిచిన శాడిస్ట్ గ్యాంగ్..

సేవా భావంతో ఇంటింటికీ ప్రభుత్వ పథకాలను చేరవేస్తున్న వలంటీర్లను కించపరుస్తూ మూటలు మోసే వాళ్లని, ఇంట్లో మగవాళ్లు లేనప్పుడు తలుపులు కొడుతున్నారని, ఆబోతుల్లా పడుతున్నారని, అమ్మాయిలను ట్రాఫికింగ్ చేయిస్తున్నారని నీచంగా మాట్లాడిన నువ్వు, నీ గ్యాంగు శాడిస్టులు కాకపోతే మరి ఎవరయ్యా? అని అడుగుతున్నా చంద్రబాబును. మన ప్రభుత్వం వల్ల తనకు మేలు జరిగింది అని చెప్పినందుకు నా చెల్లెమ్మ గీతాంజలిని సోషల్ మీడియా సైకోలతో వేధించి ప్రాణం తీసిన నీకంటే పెద్ద శాడిస్ట్ ఎవరైనా ఉంటారా చంద్రబాబూ? 14 ఏళ్లు సీఎంగా చేసిన చంద్రబాబు పేరు చెబితే ఒక్కటంటే ఒక్క స్కీమైనా గుర్తుకొస్తుందా?

శాడిస్ట్ అంటే ఎవరంటే...

తన 14 ఏళ్ల పాలనలో ఏనాడూ ఇంటికి పెన్షన్ ఇవ్వని చంద్రబాబు కుట్రలతో, అక్కసుతో ఆపించాడు. కాబట్టే ఈరోజు నేను చంద్రబాబును, దొంగల ముఠాను అడుగుతున్నా. శాడిస్ట్ అంటే ఎవరు? శాడిజం అంటే ఏమిటి? ఒకరికి మంచి జరుగుతుంటే చూడలేని వాడు శాడిస్ట్. పేదవాడు పెద్దవాడు అవుతుంటే ఓర్వలేని వాడు శాడిస్ట్. పేదలకు ఇళ్లు కట్టించడం కోసం ప్రభుత్వం స్థలాలు ఇస్తుంటే కోర్టుకు వెళ్లి మరీ అడ్డుకునే వాళ్లను శాడిస్ట్ అంటారు. వ్యవసాయం దండగ అని మాట్లాడిన మనిషిని శాడిస్ట్ అంటారు. రైతులకు ఉచితంగా విద్యుత్ ఇస్తే ఆ కరెంటు తీగలపై బట్టలు ఆరేసుకోవాల్సిన పరిస్థితి ఉంటుందని వెటకారం చేసిన వ్యక్తి శాడిస్ట్ అంటే. ముఖ్యమంత్రి స్థానంలో ఉంటూ ఎస్సీలను, బీసీలను, ఎస్టీలను, మైనార్టీలను కించపరుస్తూ మాట్లాడితే గ్రామాల్లో వాళ్ల పరిస్థితి ఏమిటి అని కూడా ఆలోచన చేయకుండా దళితులుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా? అని అవమానించిన చంద్రబాబును శాడిస్ట్ అంటారు. అవునా? కాదా? ప్రభుత్వ బడుల్లో ఇంగ్లిషు మీడియం పెడుతుంటే అడ్డుకుని అక్కసు వెళ్లగక్కిన బాబుకన్నా పెద్ద శాడిస్టు ప్రజాస్వామ్య చరిత్రలో ఎవరైనా ఉంటారా? మీ బిడ్డ నేరుగా అందించే డీబీటీ స్కీముల వల్ల పేదలకు మంచి జరుగుతోందని తెలిసి కూడా రాష్ట్రం శ్రీలంకలా అయిపోతోందంటూ దిక్కుమాలిన ప్రచారం చేసిన నిన్ను శాడిస్ట్ అనక ఏమనాలి చంద్రబాబూ?

- ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులను సీఎం జగన్ ఈ సందర్భంగా ప్రజలకు పరిచయం చేశారు. అభ్యర్థులందరినీ ఆశీర్వదించాలని కోరారు.

ఫ్లాష్ బ్యాక్‌లోకి వెళ్దామా?



మన జెండా తలెత్తుకుని రెపరెపలాడుతుంటే.. వారి జెండా మరో నాలుగు జెండాలతో జత కట్టినా కూడా ఎగరలేక కింద పడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. చంద్రబాబు, కూటమి చరిత్ర ఏమిటి? 2014లో ఏం చెప్పారో ఒక్కసారి ఫ్లాష్ బ్యాక్‌లోకి వెళ్దామా? ముఖ్యమైన హామీలు ఒక్కసారి చూద్దాం. రూ.87,612 కోట్ల రైతుల రుణమాఫీ చేశాడా? రూ.14,205 కోట్ల పొదుపు సంఘాల రుణాలు ఒక్క రూపాయి అయినా మాఫీ చేశాడా? ఆడబిడ్డ పుట్టిన వెంటనే మహాలక్ష్మి పథకం కింద రూ.25 వేలు బ్యాంకులో డిపాజిట్ చేశారా? ఇంటింటికీ ఒక ఉద్యోగం లేదంటే రూ.2 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామన్నాడు. 60 నెలల్లో నెలకు రూ.2 వేల చొప్పున రూ.1.20 లక్షలు మీ ఇంటికి వచ్చాయా? పేదలకు 3 సెంట్ల స్థలం కథ దేవుడెరుగు ఒక్క సెంటు స్థలమైనా, కనీసం ఒక్కరికైనా ఇచ్చాడా? రూ.10 వేల కోట్లతో బీసీ సబ్ ప్లాన్, చేనేత, పవర్ లూమ్స్ రుణాల మాఫీ.. అయ్యాయా? మహిళల రక్షణకు ఉమెన్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఏర్పాటు చేశాడా? రాష్ట్రాన్ని సింగపూర్‌కు మించి అభివృద్ధి చేస్తామన్నాడు చేశాడా? ప్రతి నగరంలోనూ హైటెక్ సిటీ నిర్మిస్తామన్నాడు. మీ పొదిలిలో ఏమన్నా హైటెక్ సిటీ కనిపిస్తోందా? మార్కాపురంలో అయినా కనిపిస్తోందా? పోనీ ఒంగోలులో కనిపిస్తోందా? పోనీ ప్రత్యేక హోదా ఇచ్చారా? ఇదే చంద్రబాబు మరోసారి కూటమి కట్టి మళ్లీ వస్తున్నాడు. చంద్రబాబును నమ్మడం అంటే పులి నోట్లో తలకాయ పెట్టడమే. ఇలాంటి మోసగాళ్ల బారి నుంచి రాష్ట్ర భవిష్యత్తును కాపాడుకునేందుకు మీరంతా సిద్ధమేనా? సెల్ ఫోన్ టార్చ్ లైట్ వెలిగించి సిద్ధమే అని గట్టిగా నినదించండి.



కొనకనమిట్లలో ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం జగన్

ఇంటింటా జగన్ మార్కు



- మన 58 నెలల పాలన ప్రోగ్రెస్ రిపోర్టును పరిశీలిస్తే గ్రామ గ్రామాన తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులు కనిపిస్తాయి. గ్రామ, వార్డు సచివాలయాలంటే మీ జగన్. రైతు భరోసా కేంద్రాలంటే మీ జగన్. విలేజ్ హెల్త్ క్లినిక్ అంటే మీ జగన్. ఫ్యామిలీ డాక్టర్, ఆరోగ్య సురక్ష అంటే మీ జగన్. అవ్వాతాతలకు ఇంటికే వచ్చిన రూ.3 వేల పెన్షన్ అంటే మీ బిడ్డ జగన్. ఇంటింటికీ వలంటీర్ సేవలంటే మీ జగన్. రైతు భరోసా అంటే మీ జగన్. పగటిపూటే నాణ్యమైన ఉచిత కరెంట్, సమయానికి ఇన్ పుట్ సబ్సిడీ, సున్నా వడ్డీకే రుణాలు, ఉచిత పంటల బీమా.. ఇవన్నీ అంటే మీ బిడ్డ జగన్. ఆక్వా రైతులకు రూపాయిన్నరకే కరెంటు అంటే కూడా మీ జగనే. అమూల్ ద్వారా పాడి రైతులకు లీటరుకు రూ.10 నుంచి రూ.20 వరకు సేకరణ ధరలు పెరిగాయంటే కారణం మీ జగన్. వందేళ్ల తర్వాత భూముల రీ సర్వే చేయిస్తున్నది ఎవరంటే మీ జగన్. ఏకంగా 35 లక్షల ఎకరాల మీద పేదలకు సంపూర్ణ హక్కులు కల్పించింది ఎవరంటే మీ జగన్. ఇన్ని విప్లవాలు ఒక్క జగన్ పాలనలోనే 58 నెలల్లో సాకారం కావడంతో చంద్రబాబు 20 జెలూసిల్ మాత్రలు వేసుకున్నా తగ్గనంత అసూయతో, కడుపు మంటతో బాధపడుతున్నాడు.
- నాడు నేడు, ఇంగ్లీషు మీడియంతో ప్రభుత్వ బడుల రూపు రేఖలు మారాయంటే కారణం మీ జగన్. పిల్లల చదువులను ప్రోత్సహిస్తూ అక్కచెల్లెమ్మలకు అమ్మ ఒడి అందుతోందంటే కారణం మీ జగన్. విద్యాదీవెన, వసతి దీవెన, విద్యా కానుక, గోరు ముద్ద, బైలింగ్వల్ టెక్ట్స్‌బుక్స్, ట్యాబులు, 6వ తరగతి నుంచి ప్రతి క్లాసులో ఐఎఫ్‌పీ ప్యానెల్స్‌తో క్లాసు రూములు ఉన్నాయంటే కారణం మీ జగన్.
- పేదలెవరూ అప్పులపాలయ్యే పరిస్థితి రాకూడదని ఆరోగ్యశ్రీని విస్తరించి ఏకంగా రూ.25 లక్షల దాకా ఉచితంగా వైద్యం అందిస్తున్న ప్రభుత్వం మీ జగన్‌దే. ఆరోగ్య ఆసరా అందుతోందంటే కారణం మీ జగన్. ప్రభుత్వ ఆస్పత్రులు మారాయంటే కారణం మీ జగన్. ఏకంగా 54 వేల కొత్త పోస్టులు వైద్య రంగంలో భర్తీ అయ్యాయంటే, రాష్ట్రంలో 17 కొత్త మెడికల్ కాలేజీలు వస్తున్నాయంటే కారణం మీ జగన్. ఈబీసీ నేస్తం, కాపు నేస్తం, అక్కచెల్లెమ్మల పేరిట 31 లక్షల ఇళ్ల పట్టాలు, 22 లక్షల ఇళ్లు నిర్మాణం జరుగుతున్నాయంటే కారణం మీ జగన్. ఆసరా, సున్నా వడ్డీ, దిశా యాప్‌తో అక్కచెల్లెమ్మలు భరోసాగా ఉన్నారంటే కారణం మీ జగన్. నేతన్న నేస్తం, మత్స్యకార భరోసా, వాహన మిత్ర, చేదోడు, లా నేస్తం అంటే మీ జగన్. ఏకంగా చట్టం చేసి మరీ నామినేటెడ్ పదవులు, కాంట్రాక్టుల్లో అక్కచెల్లెమ్మలకు 50 శాతం రిజర్వేషన్లతో రాజకీయ సాధికారత దక్కిందంటే కారణం మీ బిడ్డ జగన్.
- 2.31 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను ఈ 58 నెలల కాలంలో భర్తీ చేస్తే ఏకంగా 80 శాతం ఉద్యోగాలు నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలే తమ్ముళ్లు, చెల్లెమ్మలకే దక్కాయి. బటన్ నొక్కి డీబీటీతో అక్కచెల్లెమ్మల కుటుంబాల ఖాతాల్లోకి నేరుగా పంపించిన రూ.2.70 లక్షల కోట్లలో ఏకంగా 75 శాతం పైచిలుకు నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకే లబ్ధి చేకూరిందంటే సామాజిక న్యాయానికి ఇంతకన్నా గొప్ప అర్థం ఏముంటుంది?
- ఈరోజు రాష్ట్రంలో కొత్తగా నాలుగు పోర్టులు వేగంగా నిర్మాణంలో ఉన్నాయి. 10 కొత్త ఫిషింగ్ హార్బర్లు, కొత్తగా 6 ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు నిర్మాణం జరుగుతున్నాయి. భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు వాయువేగంతో నిర్మాణం జరుగుతోంది. 17 కొత్త మెడికల్ కాలేజీల నుంచి ఏది తీసుకున్నా ఈ 58 నెలల కాలంలోనే అడుగులు పడ్డాయని గర్వంగా చెబుతున్నా. ఇవన్నీ మన కళ్ల ఎదుటే కనిపిస్తున్న సత్యాలు.
- ప్రజలు ఇచ్చిన అధికారాన్ని ప్రతి ఒక్కరి మంచి కోసం, ఇంటింటి అభివృద్ధి కోసం మీ బిడ్డ ఉపయోగిస్తే చంద్రబాబు మాత్రం దోచుకోవడానికి, పంచుకోవటానికి ఉపయోగించాడు. అప్పుడు కూడా ఇదే రాష్ట్రం, ఇదే బడ్జెట్. కానీ అప్పుల గ్రోత్ రేటు అప్పటికన్నా ఇప్పుడే తక్కువ. మరి మీ బిడ్డ ఈ కార్యక్రమాలన్నీ ఎలా చేయగలిగాడు? చంద్రబాబు ఎందుకు చేయలేకపోయాడు? అని ప్రతి ఒక్కరూ ఆలోచన చేయాలి.

ఆయనకన్నా పెద్ద శాడిస్టు ఎవరుంటారు...?

- గీతాంజలి ప్రాణం తీయించింది చంద్రబాబే కదా
- అభివృద్ధి ఈ 58 నెలలలోనే
- ట్వీట్‌లో ప్రస్తావించిన సీఎం జగన్

సాక్షి, అమరావతి : మన ప్రభుత్వంలో తనకి మేలు జరిగిందని చెప్పినందుకు నా చెల్లెమ్మ గీతాంజలిని సోషల్ మీడియాలో టీడీపీ సైకోలతో వేధించి ప్రాణం తీసిన చంద్రబాబు కన్నా పెద్ద శాడిస్ట్ ఈ రాష్ట్రంలో ఎవరైనా ఉంటారా? అని సీఎం జగన్ ప్రశ్నించారు.

రాష్ట్రంలో ఎప్పుడూ చూడని విధంగా...

గతంలో ఎప్పుడూ చూడని విధంగా ప్రతి గ్రామంలో సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ క్లినిక్‌లు, ఇంగ్లీష్ బడులు కనిపిస్తున్నాయి. ఇలా ఏది తీసుకున్నా జరిగింది ఈ 58 నెలల కాలంలోనే, మీ బిడ్డ ముఖ్యమంత్రిగా ఉండగానే అంటూ ఆదివారం సీఎం జగన్ ట్వీట్ చేశారు.

మీ నమ్మకాన్ని నిలబెట్టుకుంటా



కొనకనమిట్ల: 'జగనన్న ఆశీస్సులతో ఒంగోలు పార్లమెంట్ స్థానానికి పోటీ చేస్తున్నా.. మీ ఆశీస్సులు అందించండి. నమ్మకాన్ని నిలబెట్టుకుంటా. మీ కుటుంబ సభ్యుల్లో ఒకడిగా ఉంటా..' అని ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. 1988 నుంచి 36 ఏళ్లుగా వైఎస్సార్ కుటుంబంతో తన అనుబంధం కొనసాగుతోందన్నారు. 'ఒంగోలు ప్రజలు ఎంతో మంచివారు. ఈ పార్లమెంట్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయమని జగనన్న నన్ను పంపాడు. మీ అందరి అండదండలు నాకు ఉండాలి. నాకు వ్యాపారాలు, వ్యాపకాలు, వ్యసనాలు లేవు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలను అభివృద్ధి చేయడమే నా లక్ష్యం. నేనిక్కడే నివాసముంటా. మీ కష్టసుఖాల్లో తోడుగా ఉంటా. ఒంగోలు పార్లమెంట్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా' అని చెప్పారు. ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న తనతోపాటు ఏడుగురు ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని కోరారు. తండ్రి ఆశయం కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం తపిస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్ అని తెలిపారు.

– ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి

ఆకాంక్షలు నెరవేర్చిన జననేత



మార్కాపురం: ఐదేళ్ల పాలనలో 99 శాతం హామీలను నెరవేర్చిన ఏకైక సీఎం వైఎస్ జగన్ అని మార్కాపురం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నా రాంబాబు పేర్కొన్నారు. వైఎస్ జగన్‌కు ఓటు ఎందుకు వేయాలి? ప్రతిపక్షాలకు ఎందుకు వేయకూడదు? అనేది ప్రజలు ఆలోచించాలన్నారు. నవరత్నాలు అనే రెండు పేజీల మేనిఫెస్టో ద్వారా జగనన్న ప్రజల ఆకాంక్షలను నెరవేర్చారన్నారు. చెప్పినవే కాకుండా చెప్పనివాటిని సైతం అమలు చేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్ అని చెప్పారు. మీ కుటుంబానికి మంచి జరిగితే ఓటు వేసి ఆశీర్వదించాలని ధైర్యంగా అడిగిన నేత ఒక్క జగనన్న మాత్రమేనన్నారు. పేదలకు అండగా ఉండేందుకు ఈ ప్రభుత్వానికి మరోసారి ఆశీస్సులు అందించాలని కోరారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయడమే కాకుండా మెడికల్ కాలేజీని కూడా మంజూరు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌దేనన్నారు. వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకుని రాష్ట్రాభివృద్ధి కొనసాగేందుకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు.

– అన్నా రాంబాబు, మార్కాపురం ఎమ్మెల్యే అభ్యర్థి

నేడు మేమంతా సిద్ధం బస్సు యాత్ర ఇలా..

- ఉదయం 9 గంటలకు వెంకటాచలంపల్లి ప్రాంతం నుంచి యాత్ర ప్రారంభం
- వెంకటాచలంపల్లి వద్ద పింఛన్ లబ్ధిదారులతో సీఎం ముఖాముఖి
- వినుకొండ అడ్డరోడ్డు వద్ద భోజన విరామం
- వినుకొండలో 3 గంటలకు రోడ్ షో..
  గంటావారిపాలెం వద్ద రాత్రి బస



సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్ చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర 11వ రోజైన సోమవారం(ఏప్రిల్ 8) షెడ్యూల్‌ను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం ఆదివారం విడుదల చేశారు. ఈ యాత్రలో భాగంగా సీఎం వైఎస్ జగన్ ఆదివారం రాత్రి బస చేసిన వెంకటాచలంపల్లి ప్రాంతం దగ్గర నుంచి సోమవారం ఉదయం 9 గంటలకు బయలుదేరుతారు. ఉదయం 9.30 గంటలకు వెంకటాచలంపల్లి వద్ద సామాజిక పింఛన్ లబ్ధిదారులతో ముఖాముఖి కార్యక్రమంలో సీఎం పాల్గొంటారు. బొదనంపాడు, కురిచేడు, చింతల చెరువు మీదుగా వినుకొండ అడ్డరోడ్డు వద్దకు చేరుకొని భోజన విరామం తీసుకుంటారు. చీకటిగల పాలెం మీదుగా మధ్యాహ్నం 3 గంటలకు వినుకొండకు చేరుకొని రోడ్ షోలో పాల్గొంటారు. కనమర్లపూడి, శావల్యాపురం మీదుగా గంటావారిపాలెంలో రాత్రి బసకు చేరుకుంటారు.

ప్రకాశం జిల్లా సిద్ధమా?

మేమంతా సిద్ధం బస్సు యాత్ర ఆదివారం ప్రకాశం జిల్లాలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా 'ప్రకాశం జిల్లా సిద్ధమా?' అంటూ సీఎం వైఎస్ జగన్ ట్వీట్ చేశారు. ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో మేమంతా సిద్ధమంటూ సీఎం జగన్‌తో కలిసి బస్సు యాత్రలో పాల్గొన్నారు.

–సాక్షి, అమరావతి

10 వ రోజు

స్టార్ క్యాంపెయినర్‌లతో
సీఎం వైఎస్ జగన్

'మేమంతా సిద్ధం యాత్రలో పదో రోజున నా స్టార్ క్యాంపెయినర్లతో..' అంటూ సీఎం జగన్ ఆదివారం కొన్ని ఫొటోలను ట్వీట్ చేశారు. ఓ చిన్నారిని ఆప్యాయంగా దగ్గరకు తీసుకున్న సీఎం జగన్.. 'బాగా చదువుకో తల్లి.. నీకు అండగా ఉంటా'నంటూ భరోసా ఇచ్చారు. మహిళా కార్మికులతో మమేకమయ్యారు. అలాగే పలువురు తమ సమస్యలు చెప్పుకోగా.. వారికి నేనున్నానంటూ భరోసా కల్పించారు. ఓ అవ్వ సీఎం జగన్‌ను కలిసి 'చల్లగా ఉండు బిడ్డా.. చిరంజీవిగా వర్థిల్లు' అంటూ దీవించగా.. సీఎం జగన్ ఆమెను ఆప్యాయంగా పలకరించారు. - సాక్షి, అమరావతి









ప్రకాశం జిల్లా దర్శిలో సీఎం వైఎస్ జగన్ రోడ్ షో (ఇన్‌సెట్లో) హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు





ఉత్సాహంగా యువతులు

జన సునామీ

మండుటెండలోనూ 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రకు బ్రహ్మరథం

- సార్వత్రిక ఎన్నికల వేళ జన సునామీని సృష్టిస్తున్న వైఎస్సార్‌సీపీ
- జగన్ కోసం ఏ సంగ్రామానికైనా సిద్ధమంటూ గర్జించిన ప్రజానీకం
- జనజాతరను తలపించిన ప్రకాశం జిల్లాలోని కొనకమెట్ల బహిరంగ సభ
- ఊరూరా పూలవర్షం.. గజమాల తోరణాలతో సీఎంకు ఘన స్వాగతం
- అభిమాన నేతకు గుమ్మడి కాయలతో దిష్టి తీసిన మహిళలు
- ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగిన సీఎం వైఎస్ జగన్
- మేమే స్టార్ క్యాంపెయినర్లం అంటూ హోరెత్తించిన లబ్ధిదారులు



కనిగిరి రోడ్‌షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

మేమంతా సిద్ధం బస్సు యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి:

రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలకు ముందు వైఎస్సార్ సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర ప్రభంజనం సృష్టిస్తోంది. ప్రకాశం జిల్లాలో ఆదివారం 46 డిగ్రీల మండుటెండలోనూ జన జాతర హోరెత్తింది. ఊరూ–వాడా ఏకమై తమ అభిమాన నేతకు ఘన స్వాగతం పలకగా.. వేసవి తాపాన్ని లెక్కచేయక చిన్నా, పెద్దా వెంట నడిచింది. కొనకనమిట్ల జంక్షన్‌లో జరిగిన బహిరంగ సభలోనూ తమ అభిమాన నేతను చూసేందుకు జన సంద్రం ఉవ్వెత్తున ఎగిసిపడింది. బాబు మోసాలను ఎండగడుతూ సీఎం జగన్ 'రైతు రుణ మాఫీ చేశాడా? పొదుపు సంఘాల రుణాలు మాఫీ చేశాడా? ఆడబిడ్డ పుట్టిన వెంటనే మహాలక్ష్మి పథకం ద్వారా రూ.25 వేలు వేశాడా? ఇంటింటికీ ఉద్యోగం, లేకుంటే నిరుద్యో భృతి ఇచ్చాడా? అర్హులకు మూడు సెంట్ల ఇంటి స్థలం ఇచ్చాడా? ఉమెన్ ప్రొటెక్షన్ ఫోర్స్ పెట్టాడా? ఏపీని సింగపూర్ చేశాడా? హోదా తీసుకొచ్చాడా? వీటిల్లో ఒక్కటైనా అమలు చేశాడా? లేదా?' అని ప్రశ్నించగానే ప్రజలు లేదు..లేదు.. అంటూ రెండు చేతులు పైకెత్తి గళమెత్తారు. యుద్ధ నినాదమై గర్జించారు. తనకు ప్రజలే అజెండా అని.. జెండాలు జట్టుకట్టిన ప్రతిపక్షాలు బూటకపు హామీలను నమ్ముతారా? అనగానే బాబును నమ్మేది లేదంటూ 'మా నమ్మకం నువ్వే జగన్' అంటూ ధ్వనించిన జననినాదానికి దిక్కులు పిక్కటిల్లాయి. ధర్మాన్ని కాపాడుతూ.. విశ్వసనీయతకు నీరాజనం పట్టేందుకు, పేదలకు.. చంద్రబాబు కుట్రలకు మధ్య జరిగే యుద్ధానికి సిద్ధమా? అని పిలుపివ్వగానే.. మేమంతా సిద్ధమే అంటూ అశేష జనవాహిని నినదించింది. సీఎం వైఎస్ జగన్ 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర ఆదివారం పదో రోజుకు చేరుకుంది. ప్రకాశం జిల్లాలో సూర్యుడి భగభగలను సైతం ఎదురించి జైత్ర యాత్రలా కొనసాగింది. జువ్విగుంట బస శిబిరం నుంచి ఉదయం 10 గంటలకు యాత్ర ప్రారంభం కాగా.. ఉదయం నుంచే రోడ్లపై జనాలు బారులు తీరారు. అంతకు ముందు తనను కలిసిన కొండెపి, కనిగిరి, కందుకూరు నియోజకవర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తలకు సీఎం జగన్ ఎన్నికల సన్నద్ధతపై దిశానిర్దేశం చేశారు.

వేకువ జామునే ఉదయించిన అభిమానం..

జువ్విగుంట శిబిరం వద్ద సీఎం జగన్ యాత్ర అప్పటికే వేచి ఉన్న జనవాహినిలో నుంచి రోడ్డుపైకి వచ్చింది. కూతవేటు దూరంలోనే రాజుపాలెంలో ప్రజల నుంచి అపూర్వ స్వాగతం లభించింది. భారీ గజమాల తోరణాలతో తమ అభిమానాన్ని చాటుకున్నారు. ట్రాక్టర్లో బంతిపూలు తరలించి రోడ్డుపై ప్రజలు విరిబాటగా పరిచారు. అనంతరం కొండేపి నియోజకవర్గంలోని కె.అగ్రహారంలో యువత పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి జననేత రాకను నలుదిక్కులా చాటి చెప్పారు. ఎండలోనూ సీఎం జగన్ అశేష జనవాహినికి నమస్కరించారు. రాత్రి బస శిబిరం నుంచి 4 కిలో మీటర్ల దూరంలోని కె.అగ్రహారానికి యాత్ర చేరుకోవడానికి దాదాపు గంటపైనే సమయం పట్టింది. షెడ్యూల్‌లో లేని పాయింట్ల వద్ద కూడా తమ బాధలు చెప్పుకునేందుకు వచ్చిన వృద్ధులు, దివ్యాంగుల, మహిళలను సీఎం జగన్ ఆప్యాయంగా పలకరిస్తూ నెమ్మదిగా ముందుకు సాగారు. పర్చూరివారిపాలెం, పాలేటి గంగమ్మతల్లి సెంటర్‌లో రోడ్డుకిరువైపులా మహిళలు పూలవర్షం కురిపించారు. అంతటి ఎండలోనూ బస్సు దిగివచ్చిన సీఎం ఓ దివ్యాంగుడి బాధను విని సమస్య పరిష్కారానికి ఆదేశించారు. రామాపురంలో గ్రామ సచివాలయం, ఆర్బీకే, విలేజ్ హెల్త్ క్లీనిక్స్ సేవలపై సీఎం ప్రజలను ఆరా తీశారు. ప్రభుత్వ సేవలపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేసి ఆశీర్వదించారు.

మాస్ క్రౌడ్ పుల్లర్..

సీఎం వైఎస్ జగన్ సభలకు వస్తున్న అశేష జన ప్రవాహాన్ని చూసి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ సునామీని సృష్టించడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు. అందుకే.. జగన్‌ను మాస్ క్రౌడ్ పుల్లర్‌గా అభివర్ణిస్తున్నారు. కొనకనమిట్ల బహిరంగ సభకు మేము సిద్ధం అంటూ జిల్లా నలుమూలల నుంచి వైఎస్సార్‌సీపీ అభిమానులు, లబ్ధిదారులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఉదయం 11 గంటల కంటే ముందే సభా ప్రాంగణానికి చేరుకున్నారు. సభా వేదికకు సమీపంలో రోడ్లపై మహిళలు, యువత సీఎం జగన్‌ను అనుకరిస్తూ కనిపించారు. ప్రకాశం జిల్లాలోని కర్నూలు జాతీయ రహదారి పొడవునా అభిమానం కట్టలు తెచ్చుకుంది. సాయంత్రం భోజన విరామ శిబిరం నుంచి 4.20 గంటలకు బయలు దేరిన సీఎం జగన్ 5.05 గంటలకు సభావేదిక వద్దకు చేరుకున్నారు. 5.15 గంటలకు ర్యాంప్ వాక్ చేస్తూ ప్రజలకు అభివాదం చేశారు. అనంతరం 6.20 గంటల వరకు తన ప్రసంగంలో చంద్రబాబు కుట్రలపై నిప్పులు చెరిగారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను ప్రజలకు గెలిపించాలని కోరారు.

పొద్దు పోయినా..

సాయంత్రం 6.30 గంటల తర్వాత బహిరంగ సభ నుంచి బత్తువారి పల్లి, సలకనూతల క్రాస్ మీదుగా పొదిలి చేరుకున్న సీఎంకు అపూర్వ స్వాగతం లభించింది. రాత్రి 7 గంటల సమయంలోనూ ప్రజలు రోడ్లపై జననేత కోసం ఎదురు చూశారు. అనంతరం రాజంపల్లిలో మేళతాళాలు, గజమాల తోరణాలతో సీఎంను ఆహ్వానించారు. అక్కడి ఉంచి దర్శి ఎంట్రన్స్‌కు చేరుకోవడానికి రాత్రి 9.30 గంటలు దాటింది. దర్శిలో నాయకుల భారీ స్వాగత ఏర్పాట్ల మధ్య తరలివచ్చిన జనసందోహానికి రోడ్‌షోలో అభివాదం చేస్తూ సీఎం జగన్ ముందుకు కదిలారు. అనంతరం 10.20 గంటలకు వెంకటాచలం పల్లిలో ఏర్పాటు చేసిన రాత్రి బస శిబిరానికి చేరుకున్నారు.

కదంతొక్కిన కనిగిరి..

తలపై చెంగు, టోపీలు ధరించి మహిళలు పెద్ద ఎత్తున సీఎం జగన్ రోడ్ షోకు హాజరయ్యారు. కనిగిరి మెయిన్ రోడ్డుపై సెగలు పుడుతున్నప్పటికీ అభిమానం ఎగిసిపడింది. రెండు గంటలకు అశేష జనవాహిని మధ్య సీఎం జగన్ రోడ్ షో చేశారు. మహిళలు గుమ్మడికాయలతో దిష్టి తీశారు. చిన్నారులు, విద్యార్థులతో షేక్ హ్యాండ్స్, సెల్ఫీలు, ఆత్మీయ పలకరింపులతో సీఎం జగన్ ముందుకు సాగారు. 2.30 గంటలకు నందెలమర్లెక్కి చేరుకున్న సీఎంకు ప్రజలు స్వాగతం పలికారు.

జగనన్నను మళ్లీ సీఎంగా చూడాలన్నదే లక్ష్యం

బైక్‌పై ప్రచారం చేస్తున్న 'స్టార్ క్యాంపెయినర్'



బుర్రాను కలిసిన రామిరెడ్డి అమర్‌నాథ్‌రెడ్డి

కందుకూరు: 'రాష్ట్ర భవిష్యత్తును కాపాడేందుకు, పేదల అభివృద్ధి కోసం ప్రతి గడప నుంచి ఒక స్టార్ క్యాంపెయినర్ రావాలి' అని సీఎం జగన్ ఇచ్చిన పిలుపునందుకున్న ఓ యువకుడు వైఎస్సార్‌సీపీ కోసం విస్తృతంగా ప్రచారం చేస్తున్నాడు. తన బైక్‌నే ప్రచార రథంగా మార్చి.. రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరిస్తున్నాడు. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు నియోజకవర్గానికి చెందిన రామిరెడ్డి అమర్‌నాథ్‌రెడ్డి సీఎం వైఎస్ జగన్‌పై అభిమానంతో ఉద్యోగాన్ని సైతం పక్కన పెట్టి రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేస్తూ ఆదివారం కందుకూరుకు చేరుకున్నాడు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో స్థానిక అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్‌ను కలిశారు. అనంతరం అమర్‌నాథ్‌రెడ్డి 'సాక్షి'తో మాట్లాడుతూ.. 'జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా చూడాలనే లక్ష్యంతో ఈ ప్రచారానికి శ్రీకారం చుట్టాను. వైఎస్సార్ జిల్లాకు చెందిన నేను విశాఖపట్నం సమీపంలోని ఓ ప్రైవేట్ కంపెనీలో క్వాలిటీ కంట్రోల్ విభాగంలో ఉద్యోగం చేస్తున్నా. రాష్ట్రంలో ఎన్నికలు దగ్గరపడటంతో ఉద్యోగాన్ని వదిలిపెట్టి వైఎస్సార్‌సీపీ కోసం ప్రచారం ప్రారంభించాను. సిద్ధం, మేమంతా సిద్ధం సభల్లో పాల్గొంటున్నాను. బైక్‌కు ఏర్పాటు చేసుకున్న చిన్న మైక్ ద్వారా జనం ఎక్కువగా ఉన్నచోట ఆగి సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి వివరిస్తున్నాను' అని చెప్పారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ, బీజేపీ, కాంగ్రెస్ నేతలు

సీఎం జగన్ సమక్షంలో పార్టీలో చేరిన దెందులూరు, కనిగిరి, మార్కాపురం నాయకులు

సాక్షి, అమరావతి: టీడీపీ, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు ముఖ్య నాయకులు ఆదివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. మేమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా జువ్విగుంట క్రాస్ వద్దకు వచ్చిన సీఎం జగన్ సమక్షంలో దెందులూరు నియోజకవర్గానికి చెందిన టీడీపీ, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. టీడీపీ బీసీ సాధికార స్టేట్ కన్వీనర్, ఏపీ గౌడ సంఘం అధ్యక్షుడు చలుమోలు అశోక్‌గౌడ్, క్లస్టర్ ఇన్‌చార్జ్ భాను ప్రకాశ్, సొసైటీ మాజీ అధ్యక్షుడు మేడికొండ శ్రీనివాసరావు, గౌడ సంఘం నేత ఎం.వరప్రసాద్, ఏపీసీసీ జనరల్ సెక్రటరీ, నియోజకవర్గ ఇన్‌చార్జ్ డీవీఆర్‌కే చౌదరి, డీసీసీ కార్యదర్శి సీహెచ్ కిరణ్, బీజేపీ పెదవేగి మండల అధ్యక్షుడు పొన్నూరు శంకర్‌గౌడ్ తదితరులకు సీఎం జగన్ పార్టీ కండువా కప్పి సాదరంగా వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. అలాగే పెద్ద ఆరికట్ల వద్ద కనిగిరి, మార్కాపురం నియోజకవర్గాల టీడీపీ నాయకులు సిద్ధమూర్తి నారాయణరెడ్డి, ఉస్మాన్, మాజీ ఎంపీపీ శ్రావణి వేంకటేశ్వర్లు తదితరులు సీఎం జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు.



మావయ్య అంటూ దగ్గరికి వచ్చిన చిన్నారి ప్రీతిని ఆప్యాయంగా ఎత్తుకున్న సీఎం జగన్

మావయ్యా.. జగన్ మామయ్యా..

సీఎం జగన్ బస్సుయాత్ర ప్రకాశం జిల్లా కనిగిరిలోకి ప్రవేశించింది. చింతలపాలెం ఎస్సీ కాలనీ వద్ద రోడ్డుకు దూరంగా చిన్నారులు, వారి తల్లిదండ్రులు నిలబడి ఉన్నారు. ఇంతలో ఓ బాలుడు 'మావయ్యా.. జగన్ మామయ్యా'..అంటూ కేకలు వేస్తూ ముందుకు రాగా రోప్ పార్టీ అతన్ని అడ్డుకున్నారు. గమనించిన జగన్ వెళ్తున్న బస్సును ఆపి కిందకు దిగారు. ఆ బాలున్ని దగ్గరకు తీసుకుని ముద్దాడి ఆత్మీయతపంచారు. అక్కడే ఉన్న చిన్నారుల తల్లిదండ్రులు పరిగెత్తుకుని జగన్ దగ్గరకు వెళ్లారు. వారందరినీ దగ్గరకు తీసుకొని ఆప్యాయతను చాటారు. చిన్న పిల్లలను తల్లుల చేతిలోంచి తీసుకొని...ఎత్తుకుని లాలించారు. దీంతో కాలనీవాసుల్లో అంతులేని ఆనందం నెలకొంది. - కనిగిరి రూరల్



మీ అభిమానం చల్లగుండ..

కొనకనమిట్లలో సీఎం జగన్‌ను చూసేందుకు లైటింగ్ టవర్ ఎక్కిన అభిమానులు



మళ్లీ జగనే సీఎం కావాలని...

ఏపీలో సీఎం వైఎస్ జగన్ మళ్లీ అధికారంలోకి రావాలని ఆకాంక్షిస్తూ ఆయన అభిమానులు పాదయాత్ర చేశారు. తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నాగినేనిప్రోలు రెడ్డిపాలెం నుంచి భద్రాచలం రామాలయానికి ఆదివారం పాదయాత్రగా వెళ్లారు. మొదట రెడ్డిపాలెం రామాలయంలో, ఆ తర్వాత భద్రాచలం రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలే ఆయనకు శ్రీరామరక్షగా నిలుస్తాయన్నారు. ఏపీలోని పురుషోత్తపట్నం ఎంపీటీసీ సభ్యులు వెంకట్రామిరెడ్డి, అక్కడి ప్రజాప్రతినిధులు, నాయకులు కూడా పాదయాత్రలో పాల్గొన్నారు. - బూర్గంపాడు

బాధపడొద్దు.. నేనున్నా

సమస్యలు విన్నవించిన బాధితులకు సీఎం జగన్ భరోసా

సావధానంగా ఆలకించి అర్జీలను స్వీకరించిన సీఎం

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఆదివారం "మేమంతా సిద్ధం" బస్సు యాత్ర సందర్భంగా పలువురు అనారోగ్య బాధితులు, వృద్ధులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలసి తమ సమస్యలు విన్నవించి ఆదుకోవాలని అభ్యర్థించారు. వారి కష్టాలను సావధానంగా ఆలకించిన సీఎం జగన్ ప్రతి ఒక్కరి నుంచి అర్జీలను స్వీకరించారు. "బాధపడొద్దు.. నేను ఉన్నాను. తప్పకుండా మీ సమస్యలను త్వరగా పరిష్కరిస్తా" అని భరోసా ఇచ్చి అర్జీలను వ్యక్తిగత సిబ్బందికి అందజేశారు.

- సింగరాయకొండ (మర్రిపూడి) పొన్నలూరు/పీసీపల్లి

టీడీపీ వాళ్లు పొలం కబ్జా చేశారయ్యా..



మర్రిపూడి మండలం చిలంకూరు గ్రామానికి చెందిన రాయిపాటి లక్ష్మీనరసయ్య (70) వైఎస్సార్ మరణానంతరం వైఎస్ జగన్ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటూ పదేళ్ల పాటు గడ్డం పెంచాడు. 2019 ఎన్నికలకు ముందు జగన్‌తో పాటు పాదయాత్రలో పాల్గొన్నాడు. దీనిపై కక్షగట్టిన టీడీపీ సానుభూతిపరులు లక్ష్మీనరసయ్యకి చెందిన 9 ఎకరాల పొలాన్ని కబ్జా చేశారు. బస్సు యాత్ర సందర్భంగా ఈ విషయాన్ని సీఎం జగన్ దృష్టికి తేవడంతో పెద్దాయన సమస్యను నమోదు చేసి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఉద్యోగం కోసం వినతి



2017లో బీకాం చదివిన పీసీపల్లి మండలం అలవలపాడు కొత్తూరుకు చెందిన రావి సురేష్ ప్రస్తుతం వలంటీర్‌గా పని చేస్తున్నాడు. కుటుంబ పోషణ భారంగా ఉన్నందున ఉద్యోగం ఇప్పించాలని కోరుతూ సీఎం జగన్‌కు వినతిపత్రం అందజేశాడు.

ట్రై సైకిల్ ఇప్పించండన్నా



బస్సు యాత్ర కనిగిరి మండలం అజీజ్‌పురానికి చేరుకున్న సమయంలో గ్రామానికి చెందిన కేశారపు దేవమ్మ అనే దివ్యాంగురాలు సీఎం జగన్‌ను కలిసింది. దివంగత వైఎస్సార్ గతంలో తనకు ఇచ్చిన ట్రైసైకిల్ మూలనపడినందున కొత్తది ఇప్పించాలని విన్నవించింది.

నలుగురు బిడ్డలున్నా...



"**చూపు** కోల్పోయి పని చేయడానికి వీలు లేకుండా పోయింది. కుటుంబ పోషణ అంతంత మాత్రం. ఆర్థిక సాయం చేయండి సారూ'' అంటూ కనిగిరి మండలం అజీస్‌పురంలో కేశారపు రోశయ్య వేడుకున్నాడు. తనకు నలుగురు పిల్లలున్నా పట్టించుకోవడం లేదని, ఒంటరినయ్యానని సీఎం జగన్ వద్ద ఆవేదన వ్యక్తం చేశాడు. ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలంటూ విలపించాడు.

దివ్యాంగుడిని ఆదుకోండయ్యా



కనిగిరి మండలం ఏరువారిపల్లిలో గ్రామానికి చెందిన లక్కె మంగమ్మ దివ్యాంగుడైన తన కుమారుడు లక్కె సాయిని వెంటబెట్టుకుని సీఎం జగన్‌ను కలిసింది. మన ప్రభుత్వంలో దివ్యాంగ పింఛన్ వస్తోందని తెలిపింది. తన కుమారుడికి ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలంటూ విన్నవించింది.

- శారీరక ఎదుగుదల లేని పొన్నలూరు గ్రామానికి చెందిన వెలగపూడి ఏసుబాబు అర్హత ఉన్నా తనకు సదరం సర్టిఫికెట్ మంజూరు చేయడం లేదని, పింఛన్ పొందలేకపోతున్నానని విన్నవించాడు.
- పరుచూరివారిపాలెం గ్రామానికి చెందిన నేలపాటి నరసింహం ఎడమ కాలు రోడ్డు ప్రమాదంలో విరిగిపోయింది. తనకు మెరుగైన వైద్యం అందించాలని సీఎంకు విన్నవించాడు.
- కల్లూవారిపాలెం గ్రామానికి చెందిన కప్పల రియాగ్రేస్‌కు రెండు కళ్లు కనిపించకపోవడంతో శస్త్ర చికిత్స చేశారు. అయితే దురదృష్టవశాత్తూ శస్త్ర చికిత్స విఫలమైందని, మరోసారి శస్త్ర చికిత్స కోసం ఆర్థికంగా ఆదుకోవాలని ఆమె తల్లిదండ్రులు కోరారు.
- మరికొందరు వృద్ధులు తమకు ఆరోగ్య సమస్యలున్నాయని, వాటిని నయం చేసేందుకు వైద్య సాయం అందించాలని వేడుకున్నారు.

అభివృద్ధి వికేంద్రీకరణకు సీఎం కట్టుబడి ఉన్నారు

- నేషనల్ దళిత జేఏసీ చైర్మన్ పెరికె వరప్రసాదరావు



సాక్షి, అమరావతి: అభివృద్ధి వికేంద్రీకరణ, మూడు రాజధానులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కట్టుబడి ఉన్నారని, ఎల్లో మీడియా, ఎల్లో బ్యాచ్, నారా చంద్రబాబు నాయుడు కలిసి ఈ అంశాన్ని కోర్టులో వేసి అడ్డుకొన్నారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు, నేషనల్ దళిత జేఏసీ చైర్మన్ పెరికె వరప్రసాదరావు విమర్శించారు. ఆదివారం ఆయన తాడేపల్లిలో మీడియాతో మాట్లాడారు. 2024లో అధికారంలో రాగానే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విశాఖను రాజధానిగా మారుస్తుందని అన్నారు. సోషల్ డెమోక్రటిక్ ఫ్రంట్ నిర్వాహకుడు మాదిగాని గురునాథం చేసే వ్యాఖ్యలు అసత్యమని దుయ్యబట్టారు. అతను ఒక మానసిక రోగిగా మారారని విమర్శించారు. తమ నుంచి దూరమైనా, గురునాథం అసంబద్ధ ఆరోపణలు చేస్తుంటారన్నారు. వాటిని ప్రజలు పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు.

రాష్ట్రంలో మాఫియా రాజ్యం

కమలాపురం ఎన్నికల ప్రచారంలో షర్మిల



కమలాపురం/పెండ్లిమర్రి/కడప అర్బన్ : రాష్ట్రంలో అక్రమాలు, దౌర్జన్యాలతో మాఫియా రాజ్యమేలుతోందని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆరోపించారు. ఆదివారం వైఎస్సార్ జిల్లా కమలాపురం నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం కొనసాగించారు. పెండ్లిమర్రి, నందిమండలం, కమలాపురం, చెన్నూరులో ఆమె ప్రసంగించారు. రాష్ట్రమంతా హత్యలు, దోపిడీలు, ఇసుక మాఫియా, మైనింగ్ మాఫియా కొనసాగుతోందని.. అభివృద్ధి ఎక్కడా కన్పించదన్నారు. వైఎస్సార్ హయాం తర్వాత పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు దిక్కులేకుండా పోయాయన్నారు. దివంగత వైఎస్సార్ బతికి ఉంటే కడప స్టీల్‌ప్లాంట్ ఎప్పుడో పూర్తయ్యేదని ఆమె తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుంభకర్ణుడు నిద్రపోయినట్లు నాలుగున్నరేళ్లుగా నిద్రపోయి, ఆరు నెలల ముందు లేచారని విమర్శించారు. ఇక మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య జరిగి ఐదేళ్లయిందని.. అన్ని ఆధారాలున్నా హత్య చేసినోళ్లు బయటే తిరుగుతున్నారన్నారు. ఈ కేసులో అవినాష్‌రెడ్డిని సీబీఐ నిందితుడిగా చేర్చినప్పటికీ జగనన్న ఆయనకు మళ్లీ ఎంపీ టికెట్ ఇచ్చారని తెలిపారు. ఇదీ హత్యా రాజకీయాలను ప్రోత్సహించినట్లేనన్నారు. షర్మిలను చూస్తే వైఎస్సార్ గుర్తుకు వస్తారని, వైఎస్సార్ గుణగణాలన్నీ షర్మిలలో ఉన్నాయని వివేకా కుమార్తె నర్రెడ్డి సునీత చెప్పారు. ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అర్థంలేని మాటలు మాట్లాడుతున్నారని ఆమె ఆరోపించారు.

షర్మిలపై ఎంసీసీ కేసు..

షర్మిలతో పాటు, పలువురు కాంగ్రెస్ నేతలపై ఆదివారం వైఎస్సార్ జిల్లా కడప వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ (ఎంసీసీ) కింద కేసు నమోదు చేసినట్లు సీఐ సి. భాస్కర్‌రెడ్డి తెలిపారు. కడపలో శనివారం ఆమె చేపట్టిన బస్సు యాత్రకు ఎలాంటి ముందస్తు అనుమతులను తీసుకోలేదని, ఎన్నికల నిబంధనలు పాటించలేదని ఏఈ ఏ.వి రమణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో షర్మిలతో పాటు సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు నర్రెడ్డి తులసిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకుడు, రాజంపేట ఎంపీ అభ్యర్థి నజీర్ అహ్మద్‌తో పాటు మరికొందరిపై కేసు నమోదైంది.

'మా' అధ్యక్షుడిగా మంచు విష్ణు



సాక్షి, హైదరాబాద్: మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్(మా) అధ్యక్షుడిగా హీరో మంచు విష్ణు మరోసారి ఎన్నికయ్యారు. అయితే ఈసారి 'మా' కమిటీ మంచు విష్ణును ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఆయన పదవీకాలం పూర్తయింది. 'మా'కు ఎన్నికలు జరగాల్సి ఉండగా.. 26 మంది కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు

నాడు చతికిల'బడి'.. నేడు ఉజ్వలంగా మారి..

సర్కారు బడులను నిర్వీర్యం చేసిన గత ప్రభుత్వం.. 2014-19 మధ్య 1,785 స్కూళ్ల మూసివేత

- ప్రైవేటు పాఠశాలల ప్రోత్సాహానికే కుటిల యత్నాలు
- ప్రస్తుత ప్రభుత్వ హయాంలో పాఠశాలలకు మహర్దశ
- 2021లో సమగ్ర అధ్యయనం.. సంస్కరణలు అమలు చేసిన జగన్
- మూతబడిన పాఠశాలలను తిరిగి తెరిపించిన ప్రభుత్వం
- మనబడి నాడు–నేడుతో అత్యాధునికంగా మారిన విద్యాలయాలు
- రూపుమారిన 45 వేల ప్రభుత్వ పాఠశాలలు



నాడు

చంద్రబాబు పాలనలో ప్రకాశం జిల్లా మురారిపల్లి ప్రభుత్వ పాఠశాల దుస్థితి



నేడు

సీఎం జగన్ పాలనలో అన్ని వసతులతో అభివృద్ధి చెందిన మురారిపల్లి ప్రభుత్వ పాఠశాల

విద్య అందించడం ప్రభుత్వ బాధ్యత కాదు, సదుపాయాలు కల్పించాల్సిన అవసరం లేదు. ప్రైవేటు విద్యా సంస్థల్లో అన్ని సదుపాయాలు ఉంటాయి. డబ్బున్నవారు అక్కడ చదువుకుంటారు. మీకు ఏం కావాలో నిర్ణయించుకోండి.

– గత సీఎం చంద్రబాబు చెప్పిన మాట

చదువు ప్రభుత్వ బాధ్యత, ఆర్థిక ఇబ్బందులతో ఏ పేదింటి బిడ్డ చదువు ఆగిపోరాదు. చదువుకు ఎంత ఖర్చయినా ప్రభుత్వమే భరిస్తుంది. పాఠశాలలను అత్యాధునికంగా తీర్చిదిద్ది చక్కని చదువులు అందివ్వాలి.

ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్ అభిప్రాయం

సర్కారు బడుల నిర్వహణలో ఇద్దరికీ ఉన్న వ్యత్యాసం ఇది. గత ప్రభుత్వం సర్కారు బడులపై చిన్నచూపు చూసింది. ప్రైవేటు యాజమాన్యాల మత్తులో పడి పూర్తిగా నిర్వీర్యం చేసింది. రకరకాల కారణాలతో పెద్ద సంఖ్యలో మూసివేసింది. పైగా విద్యనందించడం ప్రభుత్వ బాధ్యత కాదంటూ సరికొత్త భాష్యం చెప్పింది. ఫలితంగా వేలాదిమంది నిరుపేదలు చదువులకు దూరమయ్యారు. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ సర్కారు విద్యారంగంలో ప్రత్యేక సంస్కరణలు తీసుకొచ్చింది. ఆధునిక దేవాలయాలుగా తీర్చిదిద్దింది. ప్రతి గ్రామంలో సాంకేతిక పరిజ్ఞానంతో అత్యంత ఆకర్షణీయంగా తరగతిగదులను మార్చింది. మూతపడిన పాఠశాలలను తెరిపించడమే గాకుండా ప్రైవేటు పాఠశాలలకు దీటుగా తయారు చేసింది. ఆంగ్ల మాధ్యమాన్ని అమలు చేసి... జాతీయ స్థాయి పరీక్షలను సమర్థంగా ఎదుర్కొనేలా పిల్లలకు తర్ఫీదునిచ్చింది. రాష్ట్రంలో నెలకొన్న విద్యావిప్లవం నేడు అంతర్జాతీయ వేదికల ప్రశంసలు అందుకునేలా చేసింది.

సాక్షి, అమరావతి: ప్రభుత్వ బడులను గత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పూర్తిగా నిర్వీర్యం చేశారు. బడుల అభివృద్ధిని పూర్తిగా వదిలేయడంతో చాలా వరకూ శిథిలావస్థకు చేరాయి. ఇలాంటి బడుల్లో ఉండలేక చాలామంది పేదింటి పిల్లలు చదువుకు దూరమయ్యారు. బడులను బాగు చేయాల్సిన ఆ ప్రభుత్వం.. సరిపడినంత మంది విద్యార్థులు లేరన్న సాకుతో 2014–19 మధ్య 1,785 పాఠశాలలను మూసివేసింది. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను సైతం విద్యా సంవత్సరం ముగిసిపోతున్నా పూర్తిస్థాయిలో అందివ్వలేకపోయింది. పేద పిల్లలకోసం ప్రవేశపెట్టిన మధ్యాహ్న భోజనాన్ని నాణ్యతలేకుండా చేసింది. తన వర్గంగా భావించిన నారాయణ, శ్రీచైతన్య వంటి విద్యా సంస్థలకు మేలు చేసేలా ప్రభుత్వ విద్యను పూర్తిగా నిర్వీర్యం చేశారు. చివరికి ఎంతో అనుభవం ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయులకు కూడా నారాయణ విద్యా సంస్థల సిబ్బందితో శిక్షణ ఇచ్చేందుకు కాంట్రాక్టు అప్పగించేలా దిగజార్చింది.

జగన్ హయాంలో బడులకు మహర్దశ

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదింటి పిల్లలు ప్రపంచంతో పోటీ పడాలని అనేక సంస్కరణలను అమలు చేసింది. 58 నెలల్లో దాదాపు రూ.73 వేల కోట్ల నిధులను వెచ్చించి 45 వేల ప్రభుత్వ పాఠశాలలను సమూలంగా మార్చేలా ప్రణాళికను అమలు చేసింది. ఓ పక్క పిల్లలను బడికి పంపించే ప్రతి తల్లి ఖాతాలో జగనన్న అమ్మఒడి కింద రూ.15 వేలు జమ చేసే సంక్షేమ పథకాన్ని అందిస్తూనే మరో పక్క విద్యా సంస్కరణలను అమలు చేసింది. తద్వారా బడిలో హాజరుశాతం గణనీయంగా పెరిగింది. రాష్ట్ర ప్రభుత్వం 2021లో విద్యా సంస్కరణలపై అధ్యయనం చేసింది. ఎంతోమంది నిపుణులైన ఉపాధ్యాయుల సూచనలతో 'నాడు–నేడు' పథకానికి శ్రీకారం చుట్టింది. మూడో తరగతి నుంచే అత్యున్నత ప్రమాణాలను అందిస్తూ సబ్జెక్టు టీచర్లతో విద్యా బోధన చేపట్టింది. ఫలితంగా 3వ తరగతి నుంచే విద్యార్థులకు బీఈడీ అర్హత గల సబ్జెక్టు టీచర్ల ద్వారా విద్యాబోధన అందిస్తున్నారు. అంతేగాక 2014–2019 మధ్య చంద్రబాబు ప్రభుత్వం మూసివేసిన 1,785 పాఠశాలలను తిరిగి తెరిపించింది.

ఉత్తమ ఫలితాల సాధనలో ముందంజ

గత ప్రభుత్వం విధానాలతో నిర్వీర్యమైన ప్రభుత్వ విద్యను గాడిన పెట్టేందుకు ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. అప్పటికే పలు సంస్థలు చేసిన అధ్యయనాల్లో ప్రాథమిక పాఠశాలల్లోని పిల్లలు వయసుకు తగిన అభ్యాస ఫలితాలను సాధించలేకపోతున్నారని, బోధనా ప్రమాణాలు సైతం తక్కువగా ఉన్నాయని తేల్చారు. ఆరో తరగతికి వచ్చే విద్యార్థులు తక్కువ లెర్నింగ్ స్టాండర్డ్స్‌తో ఉంటున్నారని, సిలబస్‌ను సైతం అర్థం చేసుకోలేకపోతున్నారని, బేసిక్స్ కూడా తెలియడం లేదని తెలుసుకున్నారు. అప్పటినుంచి దానిని అధిగమించేందుకు ప్రత్యేక దృష్టిసారించారు.

- ▲ 2021–22 విద్యా సంవత్సరం నుంచి అంగన్వాడీల నుంచి ఉన్నత పాఠశాలల వరకు ప్రభుత్వంలోని అన్ని మేనేజ్‌మెంట్లలోని పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు శ్రీకారం చుట్టారు. ఒకటో తరగతి నుంచి ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టారు.
- ▲ అంగన్వాడీలను పీపీ–1, పీపీ–2 బోధన స్థాయికి పెంచడంతో పాటు ప్రాథమిక పాఠశాలల్లో 45 వేల స్మార్ట్ టీవీలతో, హైస్కూళ్లల్లో 62 వేల ఐఎఫ్‌పీ స్క్రీన్స్‌తో డిజిటల్ విద్యాబోధన ప్రవేశపెట్టారు. ప్రభుత్వ బడిపిల్లలు ఇంగ్లిష్‌లో రాణించేందుకు టోఫెల్ శిక్షణను ప్రవేశపెట్టారు.
- ▲ బైలింగ్వల్ పాఠ్యపుస్తకాలను ప్రవేశపెట్టి ఇంగ్లిష్ నేర్చుకోవడం సులభతరం చేశారు. ప్రాథమిక పాఠశాలల్లోని ఒకటి నుంచి 5 తరగతుల విద్యార్థులకు పాఠ్య పుస్తకాల్లో పదాలతోనే పిక్టోరియల్ డిక్షనరీని రూపొందించి అందించారు. 'రోజుకో ఇంగ్లిష్ పదం' నేర్చుకునే విధానం ప్రవేశపెట్టారు.
- ▲ 1000 పాఠశాలల్లో సీబీఎస్ఈ బోధనను అమలు చేశారు. ఈ సంస్కరణల ఫలితాలను సైతం తల్లిదండ్రులు చూశారు. 2023–24 విద్యా సంవత్సరంలో దాదాపు 94 శాతం మంది విద్యార్థులు ఇంగ్లిష్ మీడియంలోనే పరీక్షలు రాశారు. 2022–23లో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు అన్నీ ప్రభుత్వ విద్యార్థులే కైవసం చేసుకున్నారు. 2025 జూన్ నుంచి ఇంటర్నేషనల్ బాకలారియెట్ బోధనకు శ్రీకారం చుట్టనున్నారు.

జగన్‌తోనే బీసీల సామాజికాభివృద్ధి

రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య



మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

కపిలేశ్వరపురం/మండపేట/రాజమహేంద్రవరం సిటీ: వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనలో బీసీ సామాజిక వర్గాల బతుకులు మెరుగుపడ్డాయని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు, ఆర్.కృష్ణయ్య అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులు ఆధ్వర్యాన ఆదివారం బీసీ సామాజిక సదస్సు నిర్వహించారు. జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు పిల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో కృష్ణయ్య, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్, వైఎస్సార్ సీపీ అమలాపురం ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కృష్ణయ్య మాట్లాడుతూ, గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన పాదయాత్ర చరిత్రాత్మకమైనదని, దానివల్ల బీసీ సామాజిక వర్గీయుల సమస్యలను గుర్తించే అవకాశం ఆయనకు కలిగిందని అన్నారు. జగన్ విద్యా విధానాల వల్ల పేద, మధ్య తరగతి పిల్లలు ఇంగ్లిష్ విద్య అభ్యసించగలుగుతున్నారన్నారు. సంక్షేమ పథకాల మేలు మారుమూల గ్రామాల్లో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు మద్దతు పలకాలని కృష్ణయ్య పిలుపునిచ్చారు.

జగన్ మళ్లీ సీఎం అయితేనే బీసీ బిల్లు సాధన

చట్టసభల్లో బీసీలకు 50% రిజర్వేషన్లు రావాలంటే సీఎం జగన్ మరోసారి ముఖ్యమంత్రి అయ్యేందుకు అందరూ కృషి చెయాలని ఆర్.కృష్ణయ్య కోరారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ ఎన్నికల కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చట్టసభల్లో బీసీలకు 50% రిజర్వేషన్లు కల్పించాలంటూ 14 రాజకీయ పార్టీల మద్దతు కూడగట్టి, రెండేళ్ల కిందట పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి సీఎం జగన్ చరిత్ర తిరగరాశారని గుర్తు చేశారు. బీజేపీ వ్యతిరేకించడంతో ఈ బిల్లు పెండింగ్‌లో పడిందన్నారు. సీఎం జగన్ ఇటీవల 18 ఎమ్మెల్సీ పదవుల్లో 11 బీసీలకు కేటాయించారన్నారు. 25 మందితో కూడిన మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో ఏకంగా 17 పదవులు (70 శాతం) ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకే కేటాయించడం ద్వారా సరికొత్త సామాజిక మహా విప్లవాన్ని సీఎం జగన్ ఆవిష్కరించారని చెప్పారు.

నిజాయితీ ఆఫీసర్లపై బాబు, పురందేశ్వరి కుట్రలు

- ఎన్ని కుట్రలు చేసినా అధికారం వైఎస్సార్‌సీపీదే
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి, పక్కన ఎంపీ రెడ్డెప్ప తదితరులు

చౌడేపల్లె(చిత్తూరు జిల్లా) : రాష్ట్రంలో నిజాయితీ గల అధికారులపై వదిన, మరిదిలు పురందేశ్వరి, చంద్రబాబులు కలిసి కుట్ర పన్ని ఇష్టానుసారంగా ఎలక్షన్ కమిషన్‌కు లేఖలు రాస్తూ వారిని బదిలీ చేయించడం తగదని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. చౌడేపల్లె మండలంలోని 19 గ్రామ పంచాయతీ కేంద్రాల్లో ఆదివారం మేమంతా సిద్ధం సభలు నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి వరకు మంత్రి ప్రజలతో మమేకమవుతూ రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని ఓటర్లను అభ్యర్థించారు. సిద్ధం సభలో మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం జగన్ తలపెట్టిన సిద్ధం సభలన్నీ విజయవంతమయ్యాయన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజాబలంతో గెలవాలని భావించే వ్యక్తి జగన్ అయితే, కుట్రలు, కుతంత్రాలు, మేనేజ్‌మెంట్, పొత్తులతో గెలవాలనుకుంటున్న వ్యక్తి చంద్రబాబని ఎద్దేవా చేశారు. చంద్రబాబు కనుసన్నల్లోనే పురందేశ్వరి పనిచేస్తున్నారని ఆరోపించారు. వలంటీర్ల వ్యవస్థపై ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదులు చేసి నిర్వీర్యం చేశారని, నిజాయితీ ఆఫీసర్ల మనోభావాలు దెబ్బతినేలా ప్రవర్తించడం తగదన్నారు. రానున్న ఎన్నికల్లో 175కు 175 సీట్లు సాధిస్తామని చెప్పారు. కార్యక్రమంలో చిత్తూరు ఎంపీ ఎన్.రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, మండల పార్టీ కన్వీనర్ అంజిబాబు, బోయకొండ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పురందేశ్వరి వైఖరికి నిరసనగా బీజేపీ నేతల రాజీనామా

గన్నవరం: బీజేపీని టీడీపీకి పూర్తిగా తాకట్టు పెట్టేలా వ్యవహరిస్తోన్న ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి వైఖరికి నిరసనగా తమ పార్టీ పదవులకు మూకుమ్మడిగా రాజీనామా చేస్తున్నట్లు విజయవాడ రూరల్ మండలానికి చెందిన నేతలు ప్రకటించారు. ఈ మేరకు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొల్రపోలు శ్రీనివాసరావు, లీగల్ సెల్ కన్వీనర్ మల్లిపూడి సతీష్‌బాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు జానపాటి రవికుమార్, వేణుగోపాల్, మండల కమిటీ సభ్యురాలు సర్నాల విజయదుర్గ, మరో ఏడుగురు నేతలు రాజీనామా పత్రాలను పార్టీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ రాజబాబుకు పంపారు. రాష్ట్రంలో బీజేపీని పురందేశ్వరి సర్వనాశనం చేస్తున్నారని ఆరోపించారు. టీడీపీ ప్రయోజనాలు కోసమే ఆమె పాకులాడుతున్నారని విమర్శించారు. రాజమహేంద్రవరం నుంచి ఎంపీగా గెలిచి మరోసారి కేంద్ర మంత్రి కావాలనే ఆలోచన తప్ప పార్టీ ప్రయోజనాలు పురందేశ్వరికి పట్టడం లేదని మండిపడ్డారు. పార్టీలో పురందేశ్వరి నిరంకుశ వైఖరికి విసిగిపోయి పార్టీ పదవులకు రాజీనామాలు చేస్తున్నట్లు చెప్పారు.

ఆ డబ్బులు మావే ఇచ్చేయండి

రూ.51,99,800 నగదుతోపాటు చెక్కులు కూడా ఇవ్వండి

- రామోజీరావుకి చెందిన మార్గదర్శి చిట్‌ఫండ్స్ లొల్లి
- ఆధారాలు చూపించాలని అధికారులు అడిగితే చూపకుండా పరారీ
- ఓట్ల కొనుగోలుకు టీడీపీ నేతలకు అందించడానికి మార్గదర్శి పక్కా ప్లాన్
- ఎఫ్ఐఆర్ నమోదు చేయడంతో కేసు ఐటీ శాఖ చేతికి..



సాక్షి, విశాఖపట్నం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో విశాఖపట్నంలో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా.. ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.51,99,800 నగదుతోపాటు రూ.36,88,675 విలువైన 51 చెక్కులను స్వాధీనం చేసుకున్న వ్యవహారంలో పచ్చ పత్రికాధినేత రామోజీరావుకు చెందిన మార్గదర్శి చిట్‌ఫండ్స్ డ్రామాలకు తెరలేపింది. ఆ నగదుతోపాటు చెక్కులు కూడా తమవేనని చెబుతున్న మార్గదర్శి ఇందుకు సంబంధించిన ఆధారాలు చూపమంటే చూపడం లేదు. దీంతో ఈ సొమ్ము మార్గదర్శిది కాదని.. టీడీపీ నేతలు ఓట్ల కొనుగోలుకు తరలిస్తున్న నగదని అంతా చెబుతున్నారు. ఇప్పటికే ఈ నగదుకు సంబంధించి కేసు కూడా నమోదైంది. అంతేకాకుండా ఈ వ్యవహారం ఆదాయ పన్ను శాఖ పరిధిలోకి వెళ్లిపోయింది. ఆధారాలు చూపించి నగదును తీసుకునే అవకాశం ఉన్నా ఆ పనిచేయకుండా జిల్లా ఎన్నికల యంత్రాంగం చుట్టూ మార్గదర్శి సిబ్బంది తిరగడం చర్చనీయాంశంగా మారింది.

ఆధారాల్లేకుండా అధికారుల చుట్టూ..

ఈ నెల 2న విశాఖ ద్వారకానగర్ ప్రాంతంలో రూ.51,99,800 నగదుతో పాటు రూ.36,88,675 విలువైన 51 చెక్కులు పట్టుబడ్డాయి. వీటిని ఇద్దరు మార్గదర్శి సిబ్బంది స్కూటీపై సూట్‌కేసులో తరలిస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నగదు, చెక్కులకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో వాటిని స్వాధీనం చేసుకుని ఎన్నికల అధికారులకు అప్పగించారు. నగదు తరలింపుపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేయడంతో ఈ వ్యవహారం తమ పరిధిలో లేదని రెండు రోజుల క్రితం మార్గదర్శి సిబ్బందికి ఎన్నికల అధికారులు స్పష్టం చేశారు. అయినప్పటికీ.. కలెక్టరేట్‌లోని ఎన్నికల యంత్రాంగం చుట్టూ మార్గదర్శి సిబ్బంది ప్రదక్షిణలు చేస్తూ.. నగదు, చెక్కులు ఇప్పించాలంటూ హడావుడి చేస్తున్నారు. తమ పరిధిలో లేదని చెబుతున్నా వదలకపోవడంతో 'ఆధారాలు చూపించండి.. పోలీసులు, ఐటీ సిబ్బందికి ఇస్తాం' అని ఎన్నికల యంత్రాంగం చెప్పడంతో.. తామేమీ ఆధారాలు తీసుకురాలేదని అక్కడి నుంచి మార్గదర్శి సిబ్బంది పలాయనం చిత్తగించారు. అయితే శనివారం సాయంత్రం మళ్లీ ఎన్నికల అధికారుల వద్దకు వచ్చి నగదు కోసం ఒత్తిడి తెచ్చారు. విధులకు ఆటంకం కలిగిస్తుండటంతో మార్గదర్శి సిబ్బందిపై ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.

ఐటీ అధికారులకు ఆధారాలు చూపాల్సిందే..

ఎఫ్ఐఆర్ నమోదుతో మార్గదర్శి పేరుతో జరిగిన మనీలాండరింగ్‌కు సంబంధించిన అంశం ఐటీ శాఖ చేతుల్లోకి వెళ్లింది. దీంతో పట్టుబడిన ప్రతి పైసాకు లెక్కలతో సహా ఆధారాల్ని పోలీసులతో పాటు ఐటీ అధికారులకు మార్గదర్శి సమర్పించాల్సి ఉంటుంది. కానీ.. ఆ సొమ్ము మార్గదర్శిది కాదని.. అందుకే ఐదు రోజులు గడుస్తున్నా లెక్కా పత్రాలు చూపించడం లేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల ఖర్చులకు తమకు అనుకూలమైన పార్టీకి చెందిన రాజకీయ నాయకులకు అందించేందుకు మార్గదర్శి పేరుతో పక్కా ప్లాన్ వేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నగదు ఎక్కడి నుంచి వచ్చింది.. ఎవరికి ఇస్తున్నారో అధికారులు దర్యాప్తు చేసి రామోజీరావు నడిపిస్తున్న మనీలాండరింగ్ వ్యవహారాన్ని నిగ్గు తేల్చాలని డిమాండ్ చేస్తున్నారు.

కూటమిలో కత్తులు

- బాబు డీఎస్‌పి వెన్నుపోటును వంటబట్టించుకున్న నేతలు
- పోటీలో ఉన్న మిత్రపార్టీలకు వెనుక దెబ్బ
- సామాజిక న్యాయానికి పాతరేసిన పార్టీలు
- ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఆరు నియోజకవర్గాలు ఓసీలకే కేటాయింపు
- పోలవరంలో జనసేన అభ్యర్థికి చుక్కలు చూపిస్తున్న టీడీపీ శ్రేణులు
- ఉమ్మడి అనంతపురంలో సీనియర్లకు రాజకీయ సన్యాసం!
- తంబళ్లపల్లె టీడీపీ అభ్యర్థిని మార్చాలని మాజీ ఎమ్మెల్యే శంకర్ వర్గీయుల అల్టిమేటం
- పాలకొల్లు బాబు సభలో బన్నీవాసుకు అవమానం.. జనసైనికుల మండిపాటు
- గిద్దలూరులో రెబల్‌గా ఆమంచి స్వాములు

సాక్షి నెట్‌వర్క్ : ఏలూరు జిల్లా పోలవరం అసెంబ్లీ టికెట్ ఎవరికి ఇచ్చినా కలిసి పనిచేసుకుంటామని ఇన్నాళ్లూ చెబుతూ వచ్చిన టీడీపీ, జనసేన మధ్య ఇప్పుడు విభేదాలు రచ్చకెక్కాయి. ఇక్కడ జనసేన అభ్యర్థి చిర్రి బాలరాజును మార్చాలని టీడీపీ ఇన్‌చార్జి బొరగం శ్రీనివాస్ వర్గీయులు ఆందోళన చేస్తున్నారు. ఈ విషయమై రెండురోజుల క్రితం తూర్పుగోదావరి జిల్లా నల్లజర్లలో బస చేసిన చంద్రబాబు క్యాంప్ వద్దకు వెళ్లి మరీ బొరగం వర్గీయులు ధర్నా చేశారు. పేరుకే రిజర్వుడు నియోజకవర్గమైనా ఇక్కడ పెత్తనమంతా బాబు, పవన్ సామాజికవర్గాలదే. దీంతో బాబు వర్గం బొరగం వర్గీయుల్లో అసమ్మతిని రాజేసింది. ప్రతిపనికీ పవన్ సామాజిక వర్గం వద్దకు వెళ్లి అడగలేమని, ఇక్కడ అభ్యర్థిని మార్చి టీడీపీకి ఇవ్వాలని బాబు సామాజికవర్గం డిమాండ్ చేస్తోంది. ముందు సీటు ఎవరికి ఇచ్చినా ఓకే అన్న బొరగం భీమవరంలో అంజిబాబు తరహాలో తనను జనసేనలో చేర్చుకుని టికెట్ ఇస్తారని ఆశించారు. అయితే అనూహ్యంగా జనసేన నేతకు ఇవ్వడంతో బొరగంతోపాటు బాబు సామాజికవర్గ నేతలు కంగుతిన్నారు.

- ఉమ్మడి అనంతపురం జిల్లాలో టీడీపీ అధినేత చంద్రబాబు పుణ్యమా అని పలువురు సీనియర్ నాయకులు రాజకీయ నైరాశ్యంలో మునిగిపోయారు. టికెట్ ఆశ చూపి చివరకు రూ.కోట్లకు పడగలెత్తిన అభ్యర్థులకు పెద్దపీట వేయడంతో దశాబ్దాల తరబడి పార్టీ కోసం రెక్కలుముక్కలు చేసుకున్న నేతలు లబోదిబోమంటున్నారు. కళ్యాణదుర్గంలో ఉన్నం హనుమంతరాయ చౌదరి, ఉమామహేశ్వరనాయుడికి బాబు మొండిచేయి చూపారు. ఉమామహేశ్వరనాయుడు వైఎస్సార్ సీపీలో చేరారు. హనుమంతరాయచౌదరి పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. గుంతకల్లులో గుమ్మనూరు జయరాంకు టికెట్ ఇవ్వడంతో మాజీ ఎమ్మెల్యే జితేందర్ గౌడ్ కోలుకోలేని దెబ్బతిన్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గ నేత ప్రభాకర్ చౌదరికి రాజకీయ సన్యాసం తప్పదని విశ్లేషకులు భావిస్తున్నారు. గతంలో రెండుసార్లు ఎంపీగా చేసిన బీసీ నేత నిమ్మల కిష్టప్పనూ బాబు నట్టేట ముంచారు.



అన్నమయ్యజిల్లా కలికిరిలో కిరణ్‌కుమార్‌రెడ్డితో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణ

- అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె టీడీపీ అభ్యర్థిని మార్చకుంటే ఘోర పరాజయం తప్పదని మాజీ ఎమ్మెల్యే శంకర్ వర్గం మాజీ సీఎం, రాజంపేట పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కిరణ్ కుమార్ రెడ్డికి తేల్చి చెప్పింది. ఆదివారం కలికిరిలోని పార్టీ కార్యాలయంలో శంకర్ వర్గీయులు కిరణ్‌తో సమావేశమయ్యారు. శంకర్‌కి టికెట్ ఇవ్వకుంటే సహకరించబోమని స్పష్టం చేశారు.
- తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు రెండురోజుల క్రితం పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో నిర్వహించిన ప్రజాగళం సభలో జనసేన పార్టీ రాష్ట్ర ప్రచార విభాగం చైర్మన్, సినీ నిర్మాత బన్నీ వాసుకు ఘోర అవమానం జరిగింది. వేదిక ఎక్కుతున్న సమయంలో సెక్యూరిటీ సిబ్బంది ఆయనను అడ్డుకున్నారు. జనసేన ఇన్‌చార్జి అని చెప్పినా వినిపించుకోలేదు. అక్కడే ఉన్న టీడీపీ నాయకులూ దీనిని పట్టించుకోలేదు. అవమానంగా భావించిన బన్నీ వాసు అక్కడి నుంచి నిష్క్రమించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు బన్నీ వాసుకు ఫోన్ చేసినా ఫలితం లేకపోవడంతో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు (మాజీ మంత్రి పితాని సత్యనారాయణ బావమరిది)ని రాజీకి పంపారు. ఆయన వాసు దగ్గరకు వెళ్లి బుజ్జగించి చంద్రబాబు వద్దకు తీసుకెళ్లారు. వాసుకు జరిగిన అవమానంపై జనసైనికులు మండిపడుతున్నారు.
- ప్రకాశం జిల్లా గిద్దలూరు నియోజకవర్గంలో టీడీపీ అశోక్‌రెడ్డికి సీటు కేటాయించడంపై జనసేన నేత ఆమంచి స్వాములు కారాలుమిరియాలు నూరుతున్నారు. తాను ఇండిపెండెంట్‌గా బరిలో ఉంటానని పార్టీ అధిష్టానానికి అల్టిమేటం జారీ చేశారు. గిద్దలూరు జనసేన ఇన్‌చార్జ్ బెల్లంకొండ సాయిబాబుతోనూ ఆయనకు పొసగడం లేదు. కాపు సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఉన్న స్వాములు వెంటే ఆ సామాజికవర్గం ఉండడంతో టీడీపీ అభ్యర్థి అశోక్‌రెడ్డి ఆందోళన చేస్తున్నారు.
- కర్నూలు జిల్లా ఆదోనిలో కూటమి అభ్యర్థిగా బీజేపీ తరఫున పోటీ చేస్తున్న డాక్టర్ పార్థసారథికి సహకరించేది లేదని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత ప్రకాష్‌జైన్ తేల్చిచెప్పారు.

కూటమిలో ఆ ఆరు ఓసీలకే..

ఉమ్మడి కృష్ణాజిల్లాలో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి సామాజిక న్యాయానికి పాతరేసింది. విజయవాడ తూర్పు, సెంట్రల్, వెస్ట్, మైలవరం, పెనమలూరు, గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓసీలకే సీట్లు కేటాయించింది. ఈ ఆరు నియోజకవర్గాల్లో ఐదు టీడీపీ అధినేత సొంత సామాజికవర్గానికే కేటాయించారు. ఒకటి పవన్ కళ్యాణ్ సామాజికవర్గానికి ఇచ్చారు. దీంతో బలహీనవర్గాల్లో ఆగ్రహం పెల్లుబుకుతోంది. వాస్తవానికి విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో మైనార్టీలు ఎక్కువ. చంద్రబాబు తొలుత మైనార్టీలకు సీటు ఇస్తామని చెప్పి, పొత్తులో భాగంగా బీజేపీకి ఇచ్చారు. ఆ పార్టీ తన సామాజికవర్గానికి చెందిన సుజనా చౌదరికే టిక్కెట్టు ఇచ్చేలా చక్రం తిప్పారు. ఈ సీటు తొలుత జనసేనకు కేటాయించారు. ఇక్కడ పదేళ్లుగా బీసీ అయిన పోతిన మహేష్ డబ్బులు ఖర్చుపెట్టి పార్టీ జెండా మోశారు. తీరా చివరకు బీజేపీకి సీటు ఇవ్వడంతో పోతిన నైరాశ్యంలో కూరుకుపోయారు.

సామాజిక న్యాయం పాటించిన వైఎస్సార్ సీపీ

సామాజిక న్యాయం అంటే ఏమిటో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి టికెట్ల కేటాయింపులో చేసి చూపారు. విజయవాడ తూర్పులో దేవినేని అవినాష్ (కమ్మ), సెంట్రల్‌లో వెలంపల్లి శ్రీనివాస్ (వైశ్య), విజయవాడ వెస్ట్‌లో షేక్ ఆసిఫ్ (ముస్లిం మైనార్టీ), పెనమలూరులో జోగి రమేష్ (గౌడ–బీసీ), మైలవరంలో సర్నాల తిరుపతిరావు (యాదవ బీసీ), గన్నవరంలో వల్లభనేని వంశీ (కమ్మ)కి టికెట్లు ఇచ్చారు. దీంతో క్షేత్రస్థాయిలో వైఎస్ జగన్‌కు విశేష ఆదరణ లభిస్తోంది.

పిఠాపురంలో జనసేనానికి అసమ్మతిసెగ

కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గ జనసేన పార్టీలో అసమ్మతి సెగ రేగింది. స్థానికేతరులు పిఠాపురంలో పెత్తనం చెలాయిస్తున్నారంటూ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌ను ఉద్దేశించి జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు ఆ పార్టీ గొల్లప్రోలు మండల నేత అరవ వెంకటాద్రి నాయుడు (భారతీయుడు) ఆదివారం లేఖ రాయడం చర్చనీయాంశమైంది. ఇక్కడి నుంచి పోటీకి దిగిన జనసేనాని పవన్ కళ్యాణ్ కూడా స్థానికేతరుడే కావడంతో లేఖ పార్టీలో కలకలం రేపింది.



భారత హాకీ జట్టుకు రెండో పరాజయం

ఆస్ట్రేలియా పర్యటనలో భారత పురుషుల హాకీ జట్టు వరుసగా రెండో పరాజయాన్ని చవిచూసింది. ఆదివారం పెర్త్‌లో జరిగిన రెండో మ్యాచ్‌లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ నాయకత్వంలోని టీమిండియా 2–4 గోల్స్ తేడాతో ఓడిపోయింది. భారత్ తరఫున జుగ్‌రాజ్ సింగ్ (9వ ని.లో), హర్మన్‌ప్రీత్ సింగ్ (30వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. ఆస్ట్రేలియా తరఫున జెరెమి హేవార్డ్ (6వ, 34వ ని.లో) రెండు గోల్స్ సాధించగా... జేకబ్ అండర్సన్ (42వ ని.లో), నాథన్ ఎఫ్రామ్స్ (45వ ని.లో) ఒక్కో గోల్ చేశారు.

మహిళల హాకీ జట్టు చీఫ్ కోచ్‌గా హరేంద్ర సింగ్!

ఏడేళ్ల తర్వాత రెండోసారి భారత మహిళల హాకీ జట్టు చీఫ్ కోచ్‌గా హరేంద్ర సింగ్ రానున్నారు. 2017 సెప్టెంబర్‌లో తొలిసారి మహిళల జట్టు చీఫ్ కోచ్‌గా నియమితులైన హరేంద్ర సింగ్ ఆరు నెలలపాటు ఈ పదవిలో ఉన్నారు. ఆ తర్వాత హరేంద్రను పురుషుల జట్టుకు కోచ్‌గా నియమించారు. 2018 పురుషుల ప్రపంచకప్‌లో టీమిండియా వైఫల్యం తర్వాత ఆయనను కోచ్ పదవి నుంచి తొలగించారు. అనంతరం హరేంద్ర స్వదేశం వీడి అమెరికా జట్టుకు కోచ్‌గా వెళ్లిపోయారు.



42 ఏళ్ల తర్వాత...


సుమిత్

మోంటెకార్లో (మొనాకో): ఈ ఏడాది తన నిలకడైన ప్రదర్శన కొనసాగిస్తూ... భారత టెన్నిస్ నంబర్ వన్ సుమిత్ నగాల్ ప్రతిష్టాత్మక మోంటెకార్లో ఓపెన్ మాస్టర్స్ సిరీస్–1000 టోర్నీలో మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించాడు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వాలిఫయింగ్ చివరి రౌండ్ మ్యాచ్‌లో ప్రపంచ 95వ ర్యాంకర్ సుమిత్ 7–5, 2–6, 6–2తో ప్రపంచ 55వ ర్యాంకర్ ఫాసుండో డియాజ్ అకోస్టా (అర్జెంటీనా)పై సంచలన విజయం సాధించాడు. తద్వారా ఈ టోర్నీలో 42 ఏళ్ల తర్వాత సింగిల్స్ మెయిన్ 'డ్రా'కు అర్హత పొందిన తొలి భారతీయ ప్లేయర్‌గా సుమిత్ గుర్తింపు పొందాడు. చివరిసారి భారత్ తరఫున 1982లో రమేశ్ కృష్ణన్ మోంటెకార్లో టోర్నీలో మెయిన్ 'డ్రా'లో పోటీపడి తొలి రౌండ్‌లో ఓడిపోయాడు.

వెర్‌స్టాపెన్‌కు మూడో విజయం



సుజుకా (జపాన్): జపాన్ గ్రాండ్‌ప్రి ఫార్ములావన్ రేసులో రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ విజేతగా నిలిచాడు. ఆదివారం జరిగిన ఈ రేసును వెర్‌స్టాపెన్ 'పోల్ పొజిషన్'తో ప్రారంభించాడు. నిర్ణీత 53 ల్యాప్‌లను అందరికంటే వేగంగా ఒక గంటా 54 నిమిషాల 23.566 సెకన్లలో పూర్తి చేసి ఈ నెదర్లాండ్స్ డ్రైవర్ అగ్రస్థానాన్ని దక్కించుకొని కెరీర్‌లో 57వ టైటిల్‌ను సాధించాడు. ఈ సీజన్‌లో వెర్‌స్టాపెన్‌కిది మూడో విజయంకాగా... జపాన్ గ్రాండ్‌ప్రిలో వరుసగా మూడో గెలుపు కావడం విశేషం. రెడ్‌బుల్ జట్టుకే చెందిన సెర్జియో పెరెజ్ రెండో స్థానంలో నిలిచాడు. ఈ సీజన్‌లో నాలుగు రేసుల తర్వాత వెర్‌స్టాపెన్ 77 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో కొనసాగుతుండగా... 64 పాయింట్లతో పెరెజ్ రెండో స్థానంలో, 59 పాయింట్లతో లెక్‌లెర్క్ (ఫెరారీ) మూడో స్థానంలో ఉన్నారు. సీజన్‌లోని ఐదో రేసు చైనా గ్రాండ్‌ప్రి ఈనెల 21న జరుగుతుంది.

ముంబై అదిరే బోణీ...

- 29 పరుగులతో ఢిల్లీపై గెలుపు
- చెలరేగిన రోహిత్, టిమ్ డేవిడ్, కిషన్
- చివరి ఓవర్లో షెఫర్డ్ విధ్వంసం
- పృథ్వీ షా, స్టబ్స్ పోరాటం వృథా


షెఫర్డ్

ముంబై: ఎట్టకేలకు ముంబై ఇండియన్స్ ఐపీఎల్ తాజా సీజన్‌లో గెలుపు బోణీ కొట్టింది. ఆరంభం నుంచి ఆఖరి బంతిదాకా బ్యాటర్లంతా దంచేయడంతో ముంబై 29 పరుగుల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌పై విజయం సాధించింది. మొదట ముంబై 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 234 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓపెనర్లు రోహిత్ శర్మ (27 బంతుల్లో 49; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు), ఇషాన్ కిషన్ (23 బంతుల్లో 42; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), టిమ్ డేవిడ్ (21 బంతుల్లో 45 నాటౌట్; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపులు... 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రొమారియో షెఫర్డ్ (10 బంతుల్లో 39 నాటౌట్; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) విధ్వంసం ఢిల్లీ బౌలర్లను చేష్టలుడిగేలా చేసింది. అక్షర్ పటేల్‌కు 2 వికెట్లు దక్కాయి. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 205 పరుగులు చేయగలిగింది. పృథ్వీ షా (40 బంతుల్లో 66; 8 ఫోర్లు, 3 సిక్స్‌లు), ట్రిస్టన్ స్టబ్స్ (25 బంతుల్లో 71 నాటౌట్; 3 ఫోర్లు, 7 సిక్స్‌లు) పోరాడినా ఫలితం లేకపోయింది. ముంబై బౌలర్ కొయెట్జీ 4 వికెట్లు తీశాడు.

మూడు దశల్లో ముంబై వీర విహారం

ఓపెనర్లు రోహిత్, ఇషాన్ తొలిదశకు అద్భుతంగా శ్రీకారం చుట్టారు. ఇద్దరు అడ్డుఅదుపులేని బాదుడుతో 4.1 ఓవర్లో ముంబై స్కోరు 50కి చేరింది. ఇంకో మూడు ఓవర్లలోనే జట్టు స్కోరు 80 దాటింది. అక్కడే రోహిత్ అవుట్‌కాగా స్వల్ప వ్యవధిలో సూర్యకుమార్ (0), ఇషాన్ కిషన్‌లు కూడా అవుటయ్యారు. తిలక్‌వర్మ (6) అవుటయ్యాక రెండో దశను హార్దిక్ పాండ్యా (33 బంతుల్లో 39; 3 ఫోర్లు, 1 సిక్స్), టిమ్ డేవిడ్ ధాటిగా నడిపించారు. 16వ ఓవర్లో 150 దాటింది. డేవిడ్ సిక్స్‌లతో విరుచుకుపడటంతో మరో మూడు ఓవర్లలో 200 (19వ ఓవర్లో) మైలురాయిని చేరుకుంది. ఆఖరి దశ మాత్రం షెఫర్డ్ అరివీర బాదుడుతో స్టేడియం ఊగిపోయింది. నోర్జే వేసిన 20వ ఓవర్ ఆసాంతం ఆడుకున్న షెఫర్డ్ 4, 6, 6, 6, 4, 6లతో ఏకంగా 32 పరుగులు పిండేశాడు. ఏ ఒక్కరు కనీసం ఫిఫ్టీ అయినా బాదకుండా టి20 క్రికెట్‌లో అత్యధిక స్కోరు చేసిన జట్టుగా ముంబై రికార్డు నమోదు చేసింది.

పృథ్వీషా, స్టబ్స్ మెరుపులు

మ్యాచ్‌లో ఓడింది కానీ... ఢిల్లీ క్యాపిటల్స్ ఆఖరి దాకా పోరాడింది. వార్నర్ (10)తో ఆరంభం కుదరకపోయినా పృథ్వీ షా చక్కని షాట్లతో ఇన్నింగ్స్‌ను నడిపించాడు. అభిషేక్ పోరెల్ (31 బంతుల్లో 41; 5 ఫోర్లు)తో రెండో వికెట్‌కు చకచకా 88 పరుగులు జోడించాక 12వ ఓవర్లో బుమ్రా కళ్లు చెదిరే యార్కర్‌కు పృథ్వీ షా నిష్క్రమించాడు. తర్వాత స్టబ్స్ భారీ సిక్సర్ల విధ్వంసంతో ముంబై ఇండియన్స్ బౌలర్లను వణికించాడు. కానీ అవతలి వైపు నిలిచే బ్యాటరే కరువవడంతో ఛేజింగ్‌లో వెనుకబడింది.

స్కోరు వివరాలు

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: రోహిత్ (బి) అక్షర్ 49; కిషన్ (సి అండ్ బి) అక్షర్ 42; సూర్యకుమార్ (సి) సబ్–ఫ్రేజర్ (బి) నోర్జే 0; హార్దిక్ (సి) సబ్–ఫ్రేజర్ (బి) నోర్జే 39; తిలక్ వర్మ (సి) పటేల్ (బి) ఖలీల్ 6; టిమ్ డేవిడ్ (నాటౌట్) 45; షెఫర్డ్ (నాటౌట్) 39; ఎక్స్‌ట్రాలు 14; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 234. వికెట్ల పతనం:** 1–80, 2–81, 3–111, 4–121, 5–181. **బౌలింగ్:** ఖలీల్ 4–0–39–1, ఇషాంత్ 3–0–40–0, రిచర్డ్‌సన్ 4–0–40–0, అక్షర్ 4–0–35–2, లలిత్ 1–0–15–0, నోర్జే 4–0– 65–2.

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: పృథ్వీ షా (బి) బుమ్రా 66; వార్నర్ (సి) పాండ్యా (బి) షెఫర్డ్ 10; పోరెల్ (సి) డేవిడ్ (బి) బుమ్రా 41; స్టబ్స్ (నాటౌట్) 71; రిషభ్ పంత్ (సి) హార్దిక్ (బి) కొయెట్జీ 1; అక్షర్ పటేల్ (రనౌట్) 8; లలిత్ (సి) ఇషాన్ (బి) కొయెట్జీ 2; కుశాగ్ర (సి) తిలక్ వర్మ (బి) కొయెట్జీ 0; రిచర్డ్‌సన్ (సి) రోహిత్ (బి) కొయెట్జీ 2; ఎక్స్‌ట్రాలు 3, **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 205. వికెట్ల పతనం:** 1–22, 2–110, 3–144, 4–153, 5–194, 6–203, 7–203, 8–205. **బౌలింగ్:** కొయెట్జీ 4–0–34–4, బుమ్రా 4–0–22–2, ఆకాశ్ మధ్వాల్ 4–0–45–0, రొమారియో షెఫర్డ్ 4–0–54–1, నబీ 2–0–17–0, పీయూశ్ చావ్లా 2–0– 32–0.

ఐపీఎల్‌లో నేడు

చెన్నై × కోల్‌కతా

వేదిక: చెన్నై

రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
రాజస్తాన్	4	4	0	8	1.120
కోల్‌కతా	3	3	0	6	2.518
లక్నో	4	3	1	6	0.775
చెన్నై	4	2	2	4	0.517
హైదరాబాద్	4	2	2	4	0.409
పంజాబ్	4	2	2	4	-0.220
గుజరాత్	5	2	3	4	-0.797
ముంబై	4	1	3	2	-0.704
బెంగళూరు	5	1	4	2	-0.843
ఢిల్లీ	5	1	4	2	-1.370

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

లక్నో 'హ్యాట్రిక్' విక్టరీ

33 పరుగులతో గుజరాత్ ఓటమి ● 5 వికెట్లతో అదరగొట్టిన యశ్ ఠాకూర్


యశ్ ఠాకూర్

లక్నో: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో లక్నో సూపర్ జెయింట్స్ ఐపీఎల్ 17వ సీజన్‌లో 'హ్యాట్రిక్' విజయాన్ని నమోదు చేసింది. గత సీజన్ రన్నరప్ గుజరాత్ టైటాన్స్‌తో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో లక్నో జట్టు 33 పరుగుల తేడాతో గెలిచింది. మొదట లక్నో 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 163 పరుగులు చేసింది. గుజరాత్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో లక్నో 18 పరుగులకే 2 కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. కెప్టెన్ కేఎల్ రాహుల్ (31 బంతుల్లో 33; 3 ఫోర్లు), స్టొయినిస్ (43 బంతుల్లో 58; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) మూడో వికెట్‌కు 73 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. ఆఖర్లో నికోలస్ పూరన్ (22 బంతుల్లో 32; 3 సిక్స్‌లు), ఆయూశ్ బదోని (11 బంతుల్లో 20; 3 ఫోర్లు) ధాటిగా ఆడారు. అనంతరం సులువైన లక్ష్యమే ఎదురైనా... గుజరాత్ బ్యాటర్ల నిర్లక్ష్యం జట్టును ముంచింది. చివరకు గుజరాత్ 18.5 ఓవర్లలో 130 పరుగులకే కుప్పకూలింది. మీడియం పేసర్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' యశ్ ఠాకూర్ (5/30), స్పిన్నర్ కృనాల్ పాండ్యా (3/11) గుజరాత్‌ను దెబ్బ తీశారు. 54 పరుగుల వరకు వికెట్ కోల్పోని గుజరాత్ అనూహ్యంగా మరో 76 పరుగుల వ్యవధిలో 10 వికెట్లు చేజార్చుకోవడం గమనార్హం. కెప్టెన్ శుబ్‌మన్ గిల్ (19; 2 ఫోర్లు)ను యశ్ ఠాకూర్ బౌల్డ్ చేయగా, రవి బిష్ణోయ్ కళ్లు చెదిరే రిటర్న్ క్యాచ్‌తో కేన్ విలియమ్సన్ (1) నిష్క్రమించాడు. కృనాల్ పాండ్యా కూడా స్పిన్‌తో తిప్పేయడంతో గుజరాత్ క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయి ఓటమిని ఆహ్వానించింది.

స్కోరు వివరాలు

లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్: డికాక్ (సి) నూర్ (బి) ఉమేశ్ 6; కేఎల్ రాహుల్ (సి) తెవాటియా (బి) దర్శన్ 33; పడిక్కల్ (సి) శంకర్ (బి) ఉమేశ్ 7; స్టొయినిస్ (సి) శరత్ (బి) దర్శన్ 58; పూరన్ (నాటౌట్) 32; బదోని (సి) ఉమేశ్ (బి) రషీద్ ఖాన్ 20; కృనాల్ పాండ్యా (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 163. వికెట్ల పతనం:** 1–6, 2–18, 3–91, 4–112, 5–143. **బౌలింగ్:** ఉమేశ్ 3–0–22–2, జాన్సన్ 4–0–32–0, రషీద్ 4–0–28–1, మోహిత్ 3–0–34–0, నూర్ 4–0–22–0, దర్శన్ 2–0–21–2.

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాయి సుదర్శన్ (సి) రవి బిష్ణోయ్ (బి) కృనాల్ 31; గిల్ (బి) యశ్ ఠాకూర్ 19; విలియమ్సన్ (సి అండ్ బి) రవి బిష్ణోయ్ 1; శరత్ (సి) బదోని (బి) కృనాల్ 2; విజయ్ శంకర్ (సి) రాహుల్ (బి) యశ్ 17; దర్శన్ (సి) యశ్ ఠాకూర్ (బి) కృనాల్ 12; తెవాటియా (సి) పూరన్ (బి) యశ్ 30; రషీద్ ఖాన్ (సి) సబ్–హుడా (బి) యశ్ ఠాకూర్ 0; ఉమేశ్ (సి) డికాక్ (బి) నవీనుల్ 2; జాన్సన్ (నాటౌట్) 0; నూర్ అహ్మద్ (సి) డికాక్ (బి) యశ్ ఠాకూర్ 4; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (18.5 ఓవర్లలో ఆలౌట్) 130. వికెట్ల పతనం:** 1–54, 2–56, 3–58, 4–61, 5–80, 6–93, 7–93, 8–102, 9–126, 10–130. **బౌలింగ్:** సిద్ధార్థ్ 4–0–29–0, నవీనుల్ 4–0–37–1, మయాంక్ 1–0–13–0, యశ్ ఠాకూర్ 3.5–1– 30–5, కృనాల్ 4–0–11–3, రవి బిష్ణోయ్ 2–0–8–1.

హంపి మూడో గేమ్ 'డ్రా'... ప్రజ్ఞానంద, వైశాలి విజయం





టొరంటో: క్యాండిడేట్స్ చెస్ టోర్నమెంట్ మహిళల విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్, ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణి కోనేరు హంపి వరుసగా మూడో 'డ్రా' నమోదు చేసింది. టాన్ జోంగి (చైనా)తో జరిగిన మూడో రౌండ్ గేమ్‌ను హంపి 32 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించింది. మరో భారత గ్రాండ్‌మాస్టర్ వైశాలి తొలి విజయాన్ని అందుకుంది. సలీమోవా నుర్గుల్ (బల్గేరియా)తో జరిగిన మూడో రౌండ్ గేమ్‌లో తమిళనాడు అమ్మాయి వైశాలి 33 ఎత్తుల్లో గెలిచింది. ఓపెన్ విభాగంలో వైశాలి తమ్ముడు ప్రజ్ఞానంద కూడా తొలి విజయం సాధించాడు. భారత్‌కే చెందిన విదిత్ సంతోష్ గుజరాతితో జరిగిన మూడో రౌండ్ గేమ్‌లో ప్రజ్ఞానంద 45 ఎత్తుల్లో నెగ్గాడు. నెపోమ్‌నియాషి (రష్యా)తో జరిగిన గేమ్‌ను భారత గ్రాండ్ మాస్టర్ గుకేశ్ 40 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు.

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఏపీ పీజీసెట్-2024

ఏపీ ఉన్నత విద్యా మండలి(ఏపీఎస్‌సీహెచ్‌ఈ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని యూనివర్శిటీలు, వాటి అనుబంధ పీజీ కళాశాలల్లో పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాలకు పోస్ట్ గ్రాడ్యుయేట్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్–2024 నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పరీక్షను ఆంధ్ర యూనివర్శిటీ నిర్వహించనుంది.

» **పీజీ కోర్సులు:** ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ, ఎంసీజే, ఎంఎల్ఐబీఎస్సీ, ఎంఈడీ, ఎంపీఈడీ, ఎంఎస్సీటెక్ తదితరాలు.
» **అర్హత:** సంబంధిత సబ్జెక్టులతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. చివరి సంవత్సరం పరీక్ష రాస్తున్న విద్యార్థులు అర్హులే.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష(ఎంపీఈడీ మినహా)లో సాధించిన మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.
» **పరీక్ష విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష(సీబీటీ) విధానంలో పరీక్ష జరుగుతుంది. ప్రశ్నాపత్రం 100 మార్కులకు ఉంటుంది. లాంగ్వేజ్ స్పెషలైజేషన్ పేపర్లు మినహా మిగతా అన్ని ప్రశ్నాపత్రాలు ఇంగ్లిష్ మాధ్యమంలో ఉంటాయి. ఆబ్జెక్టివ్ రూపంలో ప్రశ్నలు ఉంటాయి. నెగిటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం 90 నిమిషాలు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆలస్య రుసుము లేకుండా ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 04.05.2024.
» **ప్రవేశ పరీక్షలు ప్రారంభం:** 10.06.2024.
» **వెబ్‌సైట్:** https://cets.apsche.ap.gov.in

హెచ్‌ఎస్‌సీసీ, నోయిడాలో 38 ఎగ్జిక్యూటివ్ పోస్టులు

నోయిడాలోని హాస్పిటల్ సర్వీసెస్ కన్సల్టెన్సీ కార్పొరేషన్ లిమిటెడ్(హెచ్‌ఎస్‌సీసీ).. రెగ్యులర్ ప్రాతిపదికన ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 38
» **పోస్టుల వివరాలు:** ఎగ్జిక్యూటివ్–19, డిప్యూటీ మేనేజర్–08, మేనేజర్–07, సీనియర్ మేనేజర్–03, డిప్యూటీ జనరల్ మేనేజర్–01.
» **విభాగాలు:** సివిల్, హెచ్‌ఆర్ఎం, బయో మెడికల్, ఫార్మసీ, లీగల్, ఇన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, మెకానికల్, ఎలక్ట్రికల్, సిస్టమ్, ఫైనాన్స్.
» **అర్హత:** సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులవ్వాలి. పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాత, నైపుణ్య పరీక్షలు, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటరాక్షన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.04.2024.
» **వెబ్‌సైట్:** http://www.hsccltd.co.in

సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వేలో 1,113 ట్రేడ్ అప్రెంటిస్‌లు

సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వే రాయ్‌పూర్ డివిజన్, వాగన్ రిపేర్ షాప్(రాయ్‌పూర్)లో 2024–25 సంవత్సరానికి సంబంధించి ట్రేడ్ అప్రెంటిస్‌ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 1,113
» **ట్రేడులు:** వెల్డర్, టర్నర్, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, స్టెనోగ్రాఫర్(ఇంగ్లిష్, హిందీ), కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామ్ అసిస్టెంట్, హెల్త్ అండ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, మెషినిస్ట్, మెకానిక్ డీజిల్, మెషిన్ రిఫ్రిజిరేటర్ అండ్ ఎయిర్ కండిషనర్, మెకానిక్ ఆటో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్.
» **అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి. సంబంధిత ట్రేడ్‌లలో ఐటీఐ ఉత్తీర్ణులవ్వాలి. **వయసు:** 02.04.2024 నాటికి 15 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** మెట్రిక్యులేషన్, ఐటీఐ పరీక్ష మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 01.05.2024.
» **వెబ్‌సైట్:** https://secr.indianrailways.gov.in

సిపెట్ అడ్మిషన్ టెస్ట్-2024

చెన్నైలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోకెమికల్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ(సీపెట్) దేశవ్యాప్తంగా ఉన్న సిపెట్ కేంద్రాల్లో డిప్లొమా, పీజీ డిప్లొమా, పోస్ట్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి సిపెట్ అడ్మిషన్ టెస్ట్–2024 నిర్వహించనుంది. అర్హులైన పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

కోర్సుల వివరాలు

» **డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ మౌల్డ్ టెక్నాలజీ–మూడేళ్ల వ్యవధి.**
» **డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ టెక్నాలజీ–మూడేళ్ల వ్యవధి.**
» **పోస్ట్–గ్రాడ్యుయేషన్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ ప్రాసెషన్–టెస్టింగ్–రెండేళ్ల వ్యవధి.**
» **పోస్ట్–గ్రాడ్యుయేషన్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ మౌల్డ్ డిజైన్ విత్ –క్యాడ్/క్యామ్–ఏడాదిన్నరేళ్ల వ్యవధి**
» **అర్హత:** కోర్సును అనుసరించి పదో తరగతి, సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్ష ద్వారా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.05.2024.
» **పరీక్షతేది:** 09.06.2024.
» **కోర్సు ప్రారంభం:** 2024 ఆగస్ట్ మొదటి వారం
» **వెబ్‌సైట్:** https://cipet24.onlineregistrationform.org/

ఎమ్మెస్సీకి బెస్ట్.. నెస్ట్

» నైసర్, సీఈబీఎస్‌లో అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ
» నెస్ట్ స్కోర్ ఆధారంగా ప్రవేశం ఖరారు
» ఇంటర్మీడియెట్ అర్హతతోనే దరఖాస్తుకు అవకాశం

సైన్స్ సబ్జెక్ట్‌లతో ఇంటర్మీడియెట్ పూర్తి చేశారా! సైన్స్ రంగంలో కెరీర్ కోరుకుంటున్నారా!! అందుకు చక్కటి మార్గం.. నేషనల్ ఎంట్రన్స్ స్క్రీనింగ్ టెస్ట్ (నెస్ట్). దేశంలో సైన్స్ విద్య, పరిశోధనలో ప్రత్యేక గుర్తింపు పొందిన నైసర్‌తో పాటు సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ బేసిక్ సైన్సెస్‌లో ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీలో నెస్ట్ స్కోర్‌తో ప్రవేశం పొందొచ్చు. ఆ తర్వాత పీహెచ్‌డీ దిశగా అడుగులు వేయొచ్చు! తాజాగా.. నెస్ట్-2024కు సంబంధించి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో.. నెస్ట్-2024తో ప్రయోజనాలు, పరీక్ష విధానం, ఈ టెస్ట్‌లో బెస్ట్ స్కోర్‌కు మార్గాలపై ప్రత్యేక కథనం..

సాధారణంగా ఎమ్మెస్సీలో చేరాలంటే.. బీఎస్సీ పూర్తి చేయాలి. నెస్ట్ ద్వారా ఇంటర్మీడియెట్ అర్హతతోనే ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీలో చేరే అవకాశం ఉంది. అది కూడా దేశంలో సైన్స్ ఎడ్యుకేషన్‌లో అత్యంత ప్రతిష్టాత్మకమైన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (భువనేశ్వర్), అదే విధంగా భారత అణుశక్తి విభాగం నేతృత్వంలో ముంబై యూనివర్సిటీలో ప్రత్యేకంగా నెలకొల్పిన సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్స్ ఇన్ బేసిక్ సైన్సెస్(సీఈబీఎస్)లలో అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీలో అడుగుపెట్టొచ్చు.

మొత్తం 257 సీట్లు

నైసర్–భువనేశ్వర్‌లో 200 సీట్లు; సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్స్ ఇన్ బేసిక్ సైన్సెస్ (యూనివర్సిటీ ఆఫ్ ముంబై)లో 57 సీట్లు ఉన్నాయి. నైసర్‌లో ఒక మేజర్ సబ్జెక్ట్‌తోపాటు బయలాజికల్ సైన్సెస్, కెమికల్ సైన్సెస్, మ్యాథమెటికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్ సబ్జెక్ట్‌లలో ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కోర్సును అందిస్తున్నారు. విద్యార్థులు వీటిలో తమకు ఆసక్తి ఉన్న స్పెషలైజేషన్‌తోపాటు బయాలజీ, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, మ్యాథమెటిక్స్, లేదా ఫిజిక్స్‌లను మైనర్ సబ్జెక్ట్‌గా ఎంచుకునే అవకాశం ఉంది.


అణుశక్తి శాఖ నేతృత్వంలోని సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్స్ ఇన్ బేసిక్ సైన్సెస్‌లో.. బయలాజికల్ సైన్సెస్, కెమికల్ సైన్సెస్, మ్యాథమెటికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్ సబ్జెక్ట్‌లలో అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కోర్సు అందుబాటులో ఉంది.

అర్హతలు

సైన్స్ గ్రూప్‌లతో 2022, 2023లో 60 శాతం మార్కులతో 10+2/ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత ఉండాలి. 2024లో ఇంటర్మీడియెట్ పూర్తి చేసుకోనున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వీరు 60 ఇంటర్‌లో శాతం మార్కులు పొందాల్సి ఉంటుంది.

ప్రవేశ ప్రక్రియ

నెస్ట్ స్కోర్ ఆధారంగా విద్యార్థులు రెండు ఇన్‌స్టిట్యూట్‌లకు వేర్వేరుగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. వచ్చిన దరఖాస్తులు, అభ్యర్థులు పొందిన నెస్ట్ ర్యాంకు, రిజర్వేషన్ నిబంధనలను పరిగణనలోకి తీసుకొని అడ్మిషన్ ఖరారు చేస్తారు. కోర్సు పూర్తి చేసుకున్న తర్వాత నైసర్‌లో సీటు పొందిన విద్యార్థులకు హోమిబాబా నేషనల్ ఇన్‌స్టిట్యూట్, సీఈబీఎస్‌లో చేరిన విద్యార్థులకు యూనివర్సిటీ ఆఫ్ ముంబై నుంచి సర్టిఫికెట్లు అందిస్తారు.



స్కాలర్‌షిప్ సదుపాయం

నెస్ట్ స్కోర్ ఆధారంగా నైసర్, సీఈబీఎస్‌లలో ప్రవేశం ఖరారు చేసుకున్న విద్యార్థులకు స్కాలర్‌షిప్ పేరిట ఆర్థిక ప్రోత్సాహకం అందిస్తారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ అమలు చేస్తున్న దిశ ప్రోగామ్ ద్వారా.. ఏటా రూ.60 వేల స్కాలర్‌షిప్ లభిస్తుంది. దీంతోపాటు సమ్మర్ ఇంటర్న్‌షిప్ చేసేందుకు వీలుగా ప్రతి ఏటా రూ.20 వేల గ్రాంట్ కూడా అందిస్తారు.

రీసెర్చ్‌కు కేరాఫ్

ఈ ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కోర్సు వ్యవధి ఐదేళ్లు. పది సెమిస్టర్లుగా ఉంటుంది. విద్యార్థులు చివరి ఆరు సెమిస్టర్లలో సదరు క్యాంపస్ ఫ్యాకల్టీ సభ్యులు చేస్తున్న రీసెర్చ్‌లో తప్పనిసరిగా పాల్గొనాల్సి ఉంటుంది. దీని ఆధారంగానూ అభ్యర్థులకు మార్కులు, క్రెడిట్స్ కేటాయిస్తారు. ఫలితంగా విద్యార్థులకు పీజీ స్థాయిలోనే పరిశోధనలపై ఆసక్తి, అవగాహన కలుగుతాయి.

బెస్ట్ స్కోర్ సాధించాలంటే

నైసర్, సీఈబీఎస్‌లలో ప్రవేశానికి వీలుగా నెస్ట్‌లో విజయం సాధించాలంటే.. విద్యార్థులు ఇంటర్మీడియెట్ స్థాయిలో తాము చదివిన అకడమిక్స్‌పై పట్టు సాధించాలి. ప్రధానంగా బయాలజీ, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్ విభాగాలకు సంబంధించి అడిగే ప్రశ్నలు.. విద్యార్థుల్లోని విశ్లేషణాత్మక దృక్పథం, సంగ్రహణ సామర్థ్యం, తులనాత్మక విశ్లేషణను గుర్తించేలా ఉంటాయి. కాబట్టి విద్యార్థులు ఆయా సబ్జెక్ట్‌లకు సంబంధించి కాన్సెప్ట్‌లపై అవగాహనతోపాటు వాటిని వాస్తవ పరిస్థితుల్లో అన్వయించగలిగే నైపుణ్యాలను పెంపొందించుకోవాలి. ఇందుకోసం చదువుతున్న అంశాలను ప్రాక్టీస్ చేయడం ఎంతో లాభిస్తుంది.

ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలతో మేలు

నెస్ట్ ఎంట్రన్స్.. విభాగాల వారీగా సిలబస్‌కు సంబంధించి గత ప్రశ్న పత్రాలను పరిశీలిస్తే.. ప్రశ్నలు సీబీఎస్ఈ సిలబస్ ఆధారంగా అడుగుతున్నట్లు తెలుస్తోంది. కాబట్టి అభ్యర్థులు పది, పదకొండు, పన్నెండు తరగతుల సీబీఎస్ఈ పుస్తకాలను ఔపోసన పట్టడం మంచిది. ముఖ్యంగా కాన్సెప్ట్‌లపై పట్టు సాధించాలి.

ఇలా అకడమిక్ సబ్జెక్ట్‌ల కాన్సెప్ట్‌లతోపాటు అప్లికేషన్ దృక్పథంతో ప్రిపరేషన్ సాగిస్తే నెస్ట్‌లో విజయావకాశాలు మెరుగుపరచ్చుకోవచ్చు. జేఈఈ-మెయిన్, జేఈఈ-అడ్వాన్స్‌డ్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు.. అదే సన్నద్ధతతో నెస్ట్‌కు కూడా హాజరై ప్రతిభ చూపే అవకాశం ఉంది. గత ప్రశ్న పత్రాలను సాధన చేయడం ద్వారా పరీక్షలో అడుగుతున్న ప్రశ్నల తీరుపైనా అవగాహన లభిస్తుంది.

బార్క్‌లో పీహెచ్‌డీ

నెస్ట్ స్కోర్‌తో ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీలో చేరిన విద్యార్థులు భవిష్యత్‌లో ప్రతిష్టాత్మక పరిశోధన కేంద్రం బాబా అటామిక్ రీసెర్చ్(బార్క్) సెంటర్ ట్రెనింగ్ స్కూల్‌లో నేరుగా పీహెచ్‌డీలో చేరే అవకాశం ఉంది. ఇందుకోసం అభ్యర్థులు ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీలో నిర్దిష్ట మార్కులతో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. ఈ మార్కులను ప్రతి ఏటా బార్క్ నిర్దేశిస్తుంది. వీరికి ఇంటర్వ్యూ ద్వారా పీహెచ్‌డీలో అడ్మిషన్ కల్పిస్తారు.

పరీక్ష ఇలా

నెస్ట్‌ను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌గా నిర్వహిస్తారు. రెండు సెషన్లుగా పరీక్ష ఉంటుంది. అభ్యర్థులు ఏదో ఒక సెషన్‌కు హాజరు కావచ్చు. పరీక్షను నాలుగు సెక్షన్లుగా 260 మార్కులకు నిర్వహిస్తున్నారు. బయాలజీ, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్ విభాగాల నుంచి ప్రశ్నలు ఉంటాయి. ప్రతి విభాగం/సబ్జెక్ట్ నుంచి 20 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు 3 మార్కులు చొప్పున ప్రతి సెక్షన్ 60 మార్కులకు ఉంటుంది. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు. మొత్తం నాలుగు సెక్షన్లలో కలిపి 240 మార్కులకు పరీక్ష ఉంటుంది. నెస్ట్‌లో ప్రతి సెక్షన్‌లోనూ అభ్యర్థులు కనీస అర్హత మార్కులు పొందాల్సి ఉంటుంది. అభ్యర్థులు ఎక్కువ మార్కులు పొందిన మూడు సెక్షన్లనే పరిగణనలోకి తీసుకుని 180 మార్కుల ప్రాతిపదికగా మూల్యాంకన చేస్తారు.

ఫైనల్ కటాఫ్ నిబంధన

నెస్ట్‌లో సెక్షన్ వారీ కటాఫ్‌తోపాటు.. మినిమమ్ అడ్మిషబుల్ పర్సంటైల్ పేరుతో ఓవరాల్ కటాఫ్‌ను కూడా నిర్దేశిస్తున్నారు. జనరల్ కేటగిరీ అభ్యర్థులు 95 పర్సంటైల్, ఓబీసీ అభ్యర్థులు 90 పర్సంటైల్, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల కేటగిరీ అభ్యర్థులు 75 పర్సంటైల్ సాధించాల్సి ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, మే 31
- **అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ సదుపాయం:** 2024, జూన్ 15
- **నెస్ట్ తేదీ:** 20024, జూన్ 30
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.nestexam.in

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	21	74,248
నిఫ్టీ ▼	1	22,514

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు		
నాస్‌డాక్	16,249	▲ 199
డోజోన్స్	38,904	▲ 307
ఎఫ్‌టీఎస్ఈ 100	7,911	▼ 65
డాక్స్	18,164	▼ 240
షాంఘై (గురువారం ముగింపు)	3,069	▼ 6
నికాయ్	38,010	▼ 808

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	83.04	84.05
£	బ్రిటన్ పౌండ్	104.22	106.77
€	యూరో	89.38	91.74
¥	జపాన్ ఎన్ (100)	54.64	55.87
AUS	ఆస్ట్రేలియా డాలర్	53.98	55.90
S$	సింగపూర్ డాలర్	59.51	64.17
SAR	సౌదీ రియాల్	21.32	22.87
UAE D	యూఏఈ దిర్హామ్	21.79	23.57
¥	చైనా యువాన్	10.39	12.47

పన్ను భారం తగ్గేదెలా..?



ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నుంచి రిటర్నులు దాఖలు చేసే వారికి నూతన పన్ను విధానం డిఫాల్ట్‌గా ఎంపికై ఉంటుంది. పాత పన్ను వ్యవస్థతోనే కొనసాగాలనుకుంటే విధిగా దానిని ఎంపిక చేసుకోవాల్సిందే. లేదంటే కొత్త విధానం అమలవుతుంది. పాత వ్యవస్థతో పోలిస్తే కొత్త పన్ను విధానంలో పన్ను భారం తక్కువ. కానీ, పాత విధానంలో పన్ను మినహాయింపులు, తగ్గింపులు ఎక్కువ. వీటిని పూర్తి స్థాయిలో వినియోగించుకుంటే కనుక కొత్త విధానంతో పోలిస్తే గణనీయమైన పన్ను భారాన్ని తగ్గించుకోవచ్చు. దీంతో నికరంగా చెల్లించే పన్ను తగ్గిపోతుంది. మరి వీటిల్లో తమకు ఏది అనుకూలమో తేల్చుకోవాలంటే, ఈ వివరాలు తెలుసుకోవాల్సిందే.

ఆదాయపన్ను భారాన్ని సాధ్యమైనంత తగ్గించుకోవాలని కోరుకునే వారికి.. పాత, కొత్త పన్ను విధానాల్లో ఎంపిక కీలకం అవుతుంది. చట్టప్రకారం మీ ఆదాయం పన్ను పరిధిలోకి వస్తుంటే, అప్పుడు విధిగా రిటర్నులు దాఖలు చేసి నిబంధనల ప్రకారం పన్ను చెల్లించాలి. పాత, కొత్త పన్ను రేట్లను ఒకసారి పరిశీలిద్దాం.

ఈ రెండు వ్యవస్థల్లోనూ కొంత పన్ను రాయితీ ఉంది. పాత విధానంలో నికరంగా రూ.5 లక్షలు, నూతన విధానంలో నికరంగా రూ.7 లక్షలు మించకుండా పన్ను వర్తించే ఆదాయం ఉంటే సెక్షన్ 87ఏ కింద ఎలాంటి పన్ను చెల్లించక్కర్లేదు. స్టాండర్డ్ డిడక్షన్ రూ.50 వేల ప్రయోజనాన్ని కూడా కలిపి చూస్తే వేతన జీవులు పాత విధానంలో రూ.5.50,000 ఆదాయం, కొత్త విధానంలో రూ.7,50,000 మించని ఆదాయంపై రూపాయి పన్ను కట్టక్కర్లేదు. ఆదాయపన్ను చట్టంలోని వివిధ సెక్షన్ల కింద వేర్వేరు సాధనాల్లో ఇన్వెస్ట్ చేసి పన్ను ప్రయోజనాన్ని క్లెయిమ్ చేసుకోలేని వారికి నూతన విధానమే అనుకూలం. పాత విధానంలో సెక్షన్ 80సీ, 80డీ, 24 ఇలా పలు సెక్షన్ల కింద పన్ను తగ్గింపులు, మినహాయింపులను వినియోగించుకుంటే, రూ.5 లక్షలకు పైన ఆదాయం ఉన్నవారు సైతం గణనీయమైన ప్రయోజనాన్ని పొందొచ్చు. ఇంతకుమించి ఆదాయం కలిగిన వారు ఈ రెండింటిలో ఏది లాభదాయకమో తేల్చుకోవాలంటే కొంత కసరత్తు అవసరం.

పాత విధానం

ఆదాయం (రూ.)	పన్ను రేటు (శాతం)
2,50,000	లేదు
2,50,001-5,00,000	5
5,00,001-10,00,000	20
10,00,001 ఆ పైన	30

కొత్త విధానం

ఆదాయం (రూ.)	పన్ను రేటు (శాతంలో)
3,00,000	లేదు
3,00,001-6,00,000	5
6,00,001-9,00,000	10
9,00,001-12,00,000	15
12,00,001-15,00,000	20
15,00,001 ఆ పైన	30 శాతం

పీపీఎఫ్, సుకన్య సమృద్ధి



దీని కింద పీపీఎఫ్, ఈఎల్ఎస్ఎస్, సుకన్య సమృద్ధి యోజన, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్, పన్ను ఆదా ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో రూ.1.5 లక్షలు ఇన్వెస్ట్ చేయడం ద్వారా ఈ మొత్తంపై పన్ను లేకుండా చూసుకోవచ్చు. జీవిత బీమా పాలసీకి చెల్లించే ప్రీమియం, పిల్లల ట్యూషన్ ఫీజులను కూడా ఈ సెక్షన్ కింద చూపించుకోవచ్చు. గృహ రుణం తీసుకుని, ఒక ఆర్థిక సంవత్సరంలో దీనికి చేల్లించే అసలును (ప్రతి ఈఎంఐలో అసలు, వడ్డీ భాగం ఉంటుంది) సెక్షన్ 80సీ కింద చూపించి, ఆ మొత్తంపై పన్ను లేకుండా చేసుకోవచ్చు.

హెల్త్ ఇన్సూరెన్స్



హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంను సెక్షన్ 80డీ కింద క్లెయిమ్ చేసుకోవచ్చు. 60 ఏళ్లలోపు వయసున్న వారు రూ.25,000 వరకు, అంతకుమించిన వయసు వారికి రూ.50,000 వరకు పన్ను మినహాయింపు ప్రయోజనం లభిస్తుంది. ఇదే సెక్షన్ కింద హెల్త్ చెకప్‌లకు చేసే వ్యయం రూ.5,000 వరకు పన్ను మినహాయింపు ఉంది.

విరాళాలు ఇస్తే..



అర్హత కలిగిన సంస్థలకు విరాళాలు ఇస్తే, ఆ మొత్తంపై సెక్షన్ 80జీ కింద పన్ను భారం ఉండదు. ఇక సెక్షన్ 80టీటీఏ కింద సేవింగ్స్ బ్యాంక్ డిపాజిట్లపై ఆర్జించే వడ్డీ రూ.10,000 మొత్తంపై పన్ను లేదు. అదే 60 ఏళ్ల నిండిన వారికి వడ్డీ ఆదాయం రూ.50,000పై పన్ను లేదు. ఇవన్నీ పాత పన్ను విధానంలో ఉన్న చక్కని పన్ను మినహాయింపు ప్రయోజనాలు.

పన్ను ఆదా, పెట్టుబడులు

పాత వ్యవస్థలో ఉన్న పన్ను ఆదా ప్రయోజనాలను ఉపయోగించుకుంటే, మరింతగా పన్ను ఆదా చేసుకోవచ్చని లాడర్7 ఫైనాన్షియల్ అడ్వైజర్స్ వ్యవస్థాపకుడు సురేష్ శడగోపన్ పేర్కొన్నారు. వివిధ సాధనాల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా ఒకవైపు పెట్టుబడులపై రాబడిని, మరోవైపు పన్ను ఆదా చేసుకోవడానికి వీలుంటుంది. కొత్త పన్ను విధానంలో పెట్టుబడులకు ఎలాంటి ప్రోత్సాహం లేదు. అంటే ఇది పెట్టుబడులను నిర్బంధం చేయదు.

ఎన్‌పీఎస్



వేతన జీవులు, స్వయం ఉపాధిలోని వారు, ప్రభుత్వరంగ ఉద్యోగులకు ఎన్‌పీఎస్‌పై పన్ను ప్రయోజనాలు ఉన్నాయి. వేతన జీవులు అయితే తమ మూలవేతనం, డీఏలో 10 శాతం మేర ఎన్‌పీఎస్‌కు చందా జమ చేయడం ద్వారా ఆ మొత్తంపై పన్ను లేకుండా చేసుకోవచ్చు. స్వయం ఉపాధిలో ఉన్న వారు తమ మొత్తం ఆదాయంలో 20 శాతంపై ఈ ప్రయోజనాన్ని పొందొచ్చు. ఈ సెక్షన్ కింద ఈ రెండు వర్గాలకు గరిష్ట ప్రయోజనం రూ.1.5 లక్షలు. ఇక 80సీసీడీ (1బి) కింద వేతన జీవులు, స్వయం ఉపాధి పొందుతున్న వారు రూ.50,000 జమలపై పన్ను మినహాయింపు పొందొచ్చు. పైన చెప్పుకున్న రూ.1.5 లక్షలకు ఇది అదనం. 80సీసీడీ(2) కింద వేతన జీవులకు అదనపు ప్రయోజనం ఉంది. ఉద్యోగి ఎన్‌పీఎస్ ఖాతాలో సంస్థ చేసే జమలు దీనికింద వస్తాయి. ప్రభుత్వరంగ ఉద్యోగులు అయితే తమ మూలవేతనం, డీఏలో 14 శాతం, ప్రైవేటు ఉద్యోగులు 10 శాతం మేర యాజమాన్యం జమలపై పన్ను మినహాయింపు పొందొచ్చు. ఇక్కడ గరిష్ట పరిమితి రూ.7.5 లక్షలు. ఈపీఎఫ్ జమలు కూడా ఈ పరిమితిలో భాగమే.

హెచ్‌ఆర్‌ఏ



అద్దె ఇంట్లో ఉంటూ, పనిచేసే సంస్థ నుంచి ఇంటి అద్దె భత్యం (హెచ్‌ఆర్‌ఏ) పొందుతుంటే అప్పుడు కూడా పన్ను ప్రయోజనాన్ని అందుకోవచ్చు. మెట్రోల్లో నివసించే వారు తమ మూల వేతనం, డీఏలో 50 శాతం మేర సెక్షన్ 10(13ఏ) కింద క్లెయిమ్ చేసుకోవచ్చు. నాన్ మెట్రోల్లోని వారికి ఈ పరిమితి 40 శాతంగా ఉంది. అలాగే, హెచ్‌ఆర్‌ఏ రూపంలో ఒక ఆర్థిక సంవత్సరంలో అందుకున్న మొత్తం.. మూలవేతనం, డీఏలో 10 శాతాన్ని వాస్తవంగా చెల్లించిన అద్దె నుంచి తీసివేయగా వచ్చే మొత్తం.. ఈ మూడింటిలో ఏది తక్కువ అయితే ఆ మొత్తంపై పన్ను మినహాయింపు పొందొచ్చు. పనిచేసే ప్రాంతంలో సొంత ఇంట్లో నివాసం ఉండే వారికి హెచ్‌ఆర్‌ఏపై పన్ను మినహాయింపు రాదు. పనిచేసే చోట అద్దె ఇంట్లో ఉంటూ, వేరే ప్రాంతంలో సొంతిల్లును అద్దెకు ఇచ్చిన వారు సైతం హెచ్‌ఆర్‌ఏపై పన్ను మినహాయింపును పొందొచ్చు. లీవ్ ట్రావెల్ అలవెన్స్ (ఎల్‌టీఏ) పన్ను పరిధిలోకి వస్తుంది. ప్రయాణాలకు చేసిన ఖర్చును చూపించి, పన్ను భారం తొలగించుకోవచ్చు.

గృహ రుణం/విద్యా రుణం



రుణంపై ఇంటిని కొనుగోలు చేసే ధోరణి పెరిగింది. ఉద్యోగంలో చేరిన తొలి నాళ్లలోనే ఇప్పుడు యువత సొంతింటి కలను సాకారం చేసుకుంటున్నారు. ఇలాంటి వారు కొంత డౌన్ పేమెంట్ చెల్లించి, మిగిలిన మొత్తానికి రుణం తీసుకుంటున్నారు. ఈ రుణానికి చేసే అసలు చెల్లింపులు ఒక ఏడాదిలో రూ.1.5 లక్షలను సెక్షన్ 80సీ కింద, వడ్డీ చెల్లింపులు రూ.2 లక్షల మేర సెక్షన్ 24(బి) కింద చూపించుకుని ఆ మొత్తంపై పన్ను కట్టక్కర్లేదు. సొంతగా నివాసం ఉన్నా లేదా అద్దెకు ఇచ్చినా సరే ఈ ప్రయోజనానికి అర్హులే. విద్యా రుణానికి ఒక ఆర్థిక సంవత్సరంలో చేసే వడ్డీ చెల్లింపులు ఎంత ఉన్నా సరే ఆ మొత్తాన్ని రిటర్నుల్లో చూపించుకుని పన్ను లేకుండా మినహాయింపు పొందొచ్చు.

మీకు ఏది అనుకూలం?

పాత విధానంలో ఇక్కడ పేర్కొన్న మినహాయింపులను పూర్తిగా వినియోగించుకుంటే.. సెక్షన్ 80సీ కింద 1.50 లక్షలు, 80 సీసీడీ (1బి) కింద రూ.50,000 (ఎన్‌పీఎస్), స్టాండర్డ్ డిడక్షన్ రూ.50,000, గృహ రుణం వడ్డీ రూ.2 లక్షలు కలిపి మొత్తం రూ.9.5 లక్షలపై పన్ను లేనట్టే. అలాగే, ప్రైవేటు ఉద్యోగులు పనిచేసే సంస్థ ద్వారా ఎన్‌పీఎస్ ఖాతాకు గరిష్టంగా రూ.7.5 లక్షల మేర జమ చేయించుకుంటే అప్పుడు మొత్తం రూ.17 లక్షలపై పన్ను లేనట్టు అవుతుంది. కొత్త విధానంలో రూ.7 లక్షల మొత్తంపై సెక్షన్ 87ఏ కింద పన్ను రాయితీ కల్పించారు. దీనికి రూ.50,000 స్టాండర్డ్ డిడక్షన్ అదనం. అంటే రూ.7.5 లక్షలపై పన్ను లేదు. ఆదాయం రూ.7,50,001 ఉన్న వారికి 87ఏ రాయితీ వర్తించదు. వారు తమ ఆదాయంపై పూర్తి పన్ను చెల్లించాలి. మొదటి మూడు లక్షలపై పన్ను లేదు. 3-6 లక్షలపై 5 శాతం ప్రకారం రూ.15,000. రూ.6.-7.51 లక్షలపై 10 శాతం ప్రకారం రూ.15,000 కలిపి మొత్తం రూ.30,000, దీనికి సెస్ అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. 7.51 లక్షల ఆదాయంపై పాత విధానంలో రిటర్నులు వేసుకునేట్టు అయితే.. 87ఏ రిబేటు, స్టాండర్డ్ డిడక్షన్‌తో కలిపి రూ.5.5 లక్షల వరకు పన్ను లేదు. 80సీ సాధనంలో 1.5 లక్షలు ఇన్వెస్ట్ చేసుకుని, దీనికి అదనంగా ఎన్‌పీఎస్‌లో రూ.50,000 ఇన్వెస్ట్ చేసుకోవడం ద్వారా రూపాయి పన్ను లేకుండా చూసుకోవచ్చు.

విధానాన్ని మార్చుకోవచ్చు..

పాత పన్ను నుంచి కొత్త పన్నుకు.. తిరిగి పాత పన్నుకు మారడంపై ఆంక్షలు ఉన్నాయి. వ్యాపారం లేదా వృత్తి రూపంలో ఆదాయం పొందని వారు ప్రతి ఆర్థిక సంవత్సరంలోనూ పాత, కొత్త పన్ను వ్యవస్థల్లో ఏదో ఒకటి ఎంపిక చేసుకోవచ్చు. వృత్తి లేదా వ్యాపారం నుంచి ఆదాయం పొందుతున్న వారు సెక్షన్ 115బీఏసీ కింద నూతన పన్ను విధానం నుంచి వైదొలిగే ఆప్షన్‌ను వినియోగించుకోవచ్చు. అప్పుడు తిరిగి నూతన పన్ను విధానానికి ఒక్కసారి మాత్రమే మారే అవకాశం ఉంటుంది. ''తక్కువ పన్ను శ్లాబుల పరిధిలో ఆదాయం కలిగిన వారికి నూతన పన్ను విధానమే మెరుగైనది. అధిక రేటు శ్లాబుల్లో ఉన్నవారు, అన్ని రకాల మినహాయింపులు వినియోగించుకుంటే వారికి పాత విధానం అనుకూలం''అని రైట్ హారిజాన్స్ సీఈవో అనిల్ రెగో సూచించారు.

పన్నుపై సర్‌చార్జ్ రేట్లు

ఆదాయం(రూ.లలో)	సర్‌చార్జ్ (పాత విధానం)	సర్‌చార్జ్ (కొత్త విధానం)
50 లక్షల నుంచి కోటి వరకు	10 శాతం	10 శాతం
కోటి నుంచి రెండు కోట్లు	15	15
రెండు నుంచి మూడు కోట్లు	25	25
ఐదు కోట్లకు పైన	37	25

సెలెక్ట్ మొబైల్స్ ఉగాది డిస్కౌంట్లు



హైదరాబాద్: సెలెక్ట్ ఉగాది పండుగ సందర్భంగా ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సంస్థ సీఎండీ వై గురు మాట్లాడుతూ, ఆఫర్లలో భాగంగా విక్రయాలపై 7.5 శాతం నుంచి 75 శాతం వరకూ తగ్గింపును ప్రకటించారు. ప్రతి మొబైల్ కొనుగోలుపై ఉచిత బహుమతులను సొంతం చేసుకోవచ్చని తెలిపారు. టీవీ, ల్యాప్‌టాప్, యాక్సెసరీస్‌పై కూడా ప్రత్యేక ఆఫర్లను అందిస్తున్నట్లు వెల్లడించారు. సెలెక్ట్ మొబైల్ స్టోర్లు అన్నింటిలో ఆఫర్లు అందుబాటులో ఉంటాయన్నారు.

బీన్యూ పండుగ ఆఫర్లు



హైదరాబాద్: ఉగాది పండుగ సందర్భంగా బీన్యూ తెలుగు ప్రజలకు ఆకర్షణీయమైన ఆఫర్లను ప్రకటించింది. ఈ మేరకు వెలువడిన ప్రకటన ప్రకారం ప్రతి స్మార్ట్‌ఫోన్ కొనుగోలుపై రూ.5,999 విలువగల స్మార్ట్‌వాచ్ లేదా బడ్స్ వినియోగదారుకు అందించనుంది. బజాజ్ ఫైనాన్స్ ద్వారా ప్రతి కొనుగోలుపై రూ.6,000 వరకూ క్యాష్ బ్యాక్ ఆఫర్ ఉంది. ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు కొనుగోలుపై రూ.5,000 వరకూ క్యాష్ బ్యాక్, హెచ్‌డీబీ ద్వారా కొనుగోలుపై 10 వరకూ క్యాష్ బ్యాక్ ఆఫర్లు ఇస్తోంది. ఐఫోన్, టీవీ, ల్యాప్‌టాప్‌ల కొనుగోలుపై కూడా పలు ఆఫర్లను అందిస్తున్నట్లు ఈడీ సాయి నితీష్ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

8-4-2024 ఫామ్ ధర...	
విశాఖ	405-00
చిత్తూరు	458-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	390-00
విజయవాడ	390-00
హైదరాబాద్	375-00
వరంగల్	377-00

మండిన సన్‌డే

- మార్కాపురంలో అత్యధికంగా 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- 107 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు
- 235 మండలాల్లో వడగాడ్పులు
- నేటినుంచి ఉష్ణ తీవ్రత తగ్గుముఖం
- రేపటి నుంచి రెండు రోజుల పాటు తేలికపాటి వర్షాలు



సాక్షి, విశాఖపట్నం: ఇప్పటికే నిప్పులు కక్కుతున్న భానుడు ఆదివారం మరింత చెలరేగిపోయాడు. శనివారం నమోదైన 44.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు.. ఆదివారానికి 46 డిగ్రీలకు దూసుకెళ్లాయి. అత్యధికంగా మార్కాపురంలో 46 డిగ్రీలు, నంద్యాల జిల్లా చాగలమర్రి, నెల్లూరు జిల్లా కలిగిరిలో 45.8 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వైఎస్సార్ జిల్లా కాజీపేట, సింహాద్రిపురంలలో 45.6, బాపట్ల జిల్లా జనకవరం పంగులూరులో 45.5, కర్నూలు జిల్లా అలూరు, ప్రకాశం జిల్లా బోట్ల గూడూరులో 45.4, పల్నాడు జిల్లా విజయపురిలో 45.2 డిగ్రీల చొప్పున అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇంకా అనేక చోట్ల 40–44 డిగ్రీలు రికార్డయ్యాయి. వీటి ప్రభావంతో 107 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 235 మండలాల్లో వడగాడ్పులు వీచాయి. అంటే రాష్ట్రంలో ఉన్న మొత్తం 670 మండలాలకు గాను సగానికి పైగా (342) మండలాల్లో వడగాడ్పులు వీచాయన్నమాట. దీంతో ప్రజలు విలవిల్లాడిపోతున్నారు. అయితే సోమవారం నుంచి రెండు రోజుల పాటు ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గుముఖం పట్టనున్నాయి. సోమవారం కేవలం రెండు మండలాల్లో (అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు, కూనవరం మండలాల్లో) తీవ్ర వడగాడ్పులు వీయనున్నాయి. మరో 93 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశాలున్నాయని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. శ్రీకాకుళం జిల్లాలో 6 మండలాలు, విజయనగరం 20, పార్వతీపురం మన్యం 8, అల్లూరి 8, అనకాపల్లి 11, కాకినాడ 6, కోనసీమ 4, ఏలూరు 4, ఎన్టీఆర్ 2, గుంటూరు 7, పల్నాడు 2, తూర్పు గోదావరి జిల్లాలో 15 మండలాల్లోను వడగాడ్పులకు ఆస్కారం ఉందని తెలిపింది. అలాగే మంగళవారం అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలంలో తీవ్ర వడగాడ్పులు, మరో 27 మండలాల్లో వడగాడ్పులు వీస్తాయని పేర్కొంది.

ద్రోణి ప్రభావంతో తేలికపాటి వర్షాలు

దక్షిణ ఛత్తీస్‌గఢ్ నుంచి కొమరిన్ ప్రాంతం వరకు విస్తరించి ఉన్న ద్రోణి సముద్రమట్టానికి 1.5 కి.మీల ఎత్తులో కొనసాగుతోంది. ఈ ద్రోణి ప్రస్తుతం అంతర్గత ఒడిశా నుంచి ఉత్తర తమిళనాడు వరకు ఛత్తీస్‌గఢ్, విదర్భ, మరఠ్వాడా, అంతర్గత కర్ణాటక మీదుగా పయనిస్తోంది. దీని ప్రభావంతో సోమ, మంగళ, బుధవారాల్లో ఉత్తర కోస్తాంధ్రలోను ఈ నెల 10, 11 తేదీల్లో రాయలసీమలోను అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ఆదివారం తెలిపింది. ద్రోణి ప్రభావంతో దక్షిణ కోస్తా, రాయలసీమల్లో సోమ, మంగళవారాల్లో పొడి వాతావరణం నెలకొంటుందని పేర్కొంది. ద్రోణి కారణంగా రాష్ట్రంలో నాలుగు రోజుల పాటు ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టి వడగాడ్పుల నుంచి ఉపశమనం కలగనుంది.

ప్రధాన నగరాలు, పట్టణాల్లో ఆదివారం నమోదైన ఉష్ణోగ్రతలు

నగరం/పట్టణం	గరిష్టం	కనిష్టం
మార్కాపురం	46.0	22.0
రాజమహేంద్రవరం	45.0	24.0
రెంటచింతల	44.3	26.6
కర్నూలు	43.3	29.2
కడప	42.8	25.2
తిరుపతి	42.0	41.5
భీమవరం	42.0	24.0
తాడేపల్లిగూడెం	41.0	24.0
నెల్లూరు	41.0	26.0
గుంటూరు	41.0	27.0
విజయవాడ	41.0	26.0
ఏలూరు	41.0	25.0
చిత్తూరు	40.8	21.0
విజయనగరం	40.0	33.0
విశాఖపట్నం	38.2	26.8

పొంచి ఉన్న వడదెబ్బ ముప్పు

- వడగాడ్పులకు జనం బెంబేలు
- మార్చి నుంచి ఇప్పటివరకు 90 మందికి వడదెబ్బ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎండలు తారెత్తిస్తున్నాయి. దీనికి తోడు వడగాడ్పులూ వీస్తుండటంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఉదయం 8, 9 గంటల ప్రాంతంలోనే ఇంటినుంచి అడుగు బయట పెట్టలేని పరిస్థితి నెలకొంటోంది. తీవ్రమైన ఎండలు, వడగాడ్పుల కారణంగా.. మార్చి నుంచి ఇప్పటివరకూ రాష్ట్రవ్యాప్తంగా 90 మంది వడదెబ్బ బారినపడ్డారు. ఈ క్రమంలో రైతులు, భవన నిర్మాణ, ఇతర కార్మికులు, ఉపాధి కూలీలు, సాధారణ ప్రజలు సైతం ముందు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. ముఖ్యంగా గర్భిణులు, చిన్న పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ఉదయం 11 గంటల తర్వాత నుంచి సాయంత్రం ఎండ తగ్గే వరకూ ఇంటి నుంచి బయటకు వెళ్లొద్దని సూచిస్తున్నారు.

వడదెబ్బ తగిలితే..

బాధితుడిని వెంటనే చల్లని ప్రదేశానికి చేర్చి ప్రథమ చికిత్స చేయాలి. దుస్తులు వదులు చేసి చన్నీటితో శరీరాన్ని తడపాలి. ఈ విధంగా చేస్తే రక్తనాళాలు కుంచించుకుపోకుండా ఆపే అవకాశం ఉంటుంది. గజ్జల్లో, చంకల్లో, మెడ వద్ద ఐస్ ప్యాక్‌లు ఉంచాలి. ఈ చర్యలు తీసుకుంటూనే వీలైనంత త్వరగా ఆస్పత్రికి తరలించడం కోసం 108కు ఫోన్ చేయాలి.



72 ఆస్పత్రుల్లో ప్రత్యేక ఏర్పాట్లు

రాష్ట్రంలో ఎండల తీవ్రత పెరుగుతుండటంతో ప్రభుత్వం ముందుజాగ్రత్త చర్యలు చేపడుతోంది. వడదెబ్బ నివారణకు, అనుసరించాల్సిన విధానాలపై ఇప్పటికే వైద్య శాఖ మార్గదర్శకాలిచ్చింది. పీహెచ్‌సీ వైద్యులు, వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లో పని చేసే కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌వో), ఏఎన్ఎంలు, ఆశా వర్కర్‌లు క్షేత్ర స్థాయిలో ప్రజలకు ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. అంగన్‌వాడీలకు ప్రభుత్వం ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేసింది. గర్భిణులు, ఆరేళ్లలోపు పిల్లలకు వీటిని పంపిణీ చేస్తున్నారు. గతేడాది అత్యధికంగా ఉష్ణోగ్రతలు నమోదై, వడదెబ్బ కేసులు ఎక్కువగా నమోదైన 72 ఆస్పత్రులను వైద్య శాఖ గుర్తించింది. వీటిల్లో క్లైమేట్ రెసిలియంట్ వార్డుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటోంది. వడదెబ్బ బాధితులకు వైద్యం అందించడానికి వీలుగా ఈ వార్డుల్లో ప్రత్యేక వసతులను ఏర్పాటు చేస్తున్నారు.

కూల్‌డ్రింక్స్ తాగొద్దు



ఇంట్లో ఉన్నా, బయట పనిలో ఉన్నా తప్పనిసరిగా గంట గంటకూ ఉప్పు, చక్కెర కలిపిన ద్రవాలు తీసుకోవాలి. కూల్‌డ్రింక్స్‌కు బదులు కొబ్బరి నీళ్లు, మజ్జిగ, నిమ్మరసం తీసుకోవాలి. శరీరంలో నీటి శాతాన్ని పెంచే పుచ్చకాయ, కీరదోస తినాలి. రోజుకు కనీసం 4 లీటర్ల నీరైనా తాగాలి. ఎండలో పనిచేస్తున్న వారైతే గంటకు 10 నిమిషాల చొప్పున నీడ పట్టున చేరి విశ్రాంతి తీసుకోవాలి. గాలి బాగా ఆడేలా వదులు దుస్తులు, ముఖ్యంగా నూలు వస్త్రాలు, తలకు టోపీ, గొడుగు ధరించాలి. బాటిల్‌లో తాగు నీటిని వెంటబెట్టుకోవాలి. వాంతులు, విరేచనాల వంటి సమస్యలు తలెత్తితే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

– డాక్టర్ నాగా చక్రవర్తి, అసిస్టెంట్ ప్రొఫెసర్, సిద్ధార్థ వైద్య కళాశాల, విజయవాడ

టీడీపీ 'కిక్కు'రాకో

- ఎన్నికల వేళ రాష్ట్రానికి భారీగా గోవా మద్యం సరఫరా
- ఇంతపెద్దమొత్తంలో మద్యం పట్టుబడడం ఇదే ప్రథమం



మునగపాక : ఎన్నికల కోడ్ కూతతో రాష్ట్రంలో మద్యం పారించేందుకు టీడీపీ కుయుక్తులు పన్నింది. గోవా నుంచి రాష్ట్రానికి అక్రమంగా మద్యం సరఫరా చేసి విక్రయాలకు పాల్పడుతోంది. ఈ గుట్టును రట్టు చేసిన పోలీసులు ఇప్పటికే అనకాపల్లి జిల్లా యలమంచిలి మండలం సోమలింగపాలేనికి చెందిన ముగ్గురు టీడీపీ నేతలను అరెస్ట్ చేశారు. తాజాగా మునగపాకకు చెందిన టీడీపీ కార్యకర్తనూ అరెస్ట్ చేసి ఆదివారం రిమాండ్‌కు పంపారు. ఈ వ్యవహారంలో సూత్రధారులెవరనే కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశారు. అసలేం జరిగిందంటే.. యలమంచిలి మండలం సోమలింగపాలేనికి చెందిన ప్రధాన నిందితుడు, టీడీపీ నేత కర్రి వెంకటస్వామి గోవా నుంచి అక్రమంగా మద్యం తీసుకువచ్చి విక్రయిస్తున్నాడు. అతనికి అదే గ్రామానికి చెందిన కర్రి ధర్మతేజ, బొడ్డేటి దినేష్‌కుమార్ సహకరించారు. పది రోజుల క్రితం గోవా నుంచి సరుకు రప్పించి తన పశువుల పాక వద్ద గడ్డివాములో దాచిపెట్టారు. ఈ మద్యాన్ని యలమంచిలి జనసేన అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్‌కు విక్రయించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఒక్కసారిగా ఇస్తే పోలీసులకు దొరికిపోయే ప్రమాదం ఉందని సమావేశాలు నిర్వహించినప్పుడల్లా వెంకటస్వామి మద్యం అందించేవాడు. శనివారం మధ్యాహ్నం మునగపాకనుంచి అక్రమ మద్యం రవాణా అవుతోందని వచ్చిన సమాచారంతో పోలీసు బృందం తనిఖీలు నిర్వహించింది. ముగ్గురు వ్యక్తులు రెండు మోటార్ సైకిళ్లపై అనుమానాస్పద వస్తువులను పట్టుకెళుతున్నట్టు గమనించి తనిఖీ చేశారు. వారి వద్ద 5 కేసుల్లో 240 రాయల్ బ్లూ లిక్కర్ బాటిళ్లు లభ్యమయ్యాయి. మరికొంత మద్యాన్ని దాచిపెట్టినట్టు వారు చెప్పడంతో గడ్డివాము వద్ద తనిఖీలు చేపట్టి స్వాధీనం చేసుకున్నారు. మొత్తం రూ.50 లక్షల విలువైన 39,168 క్వార్టర్ బాటిళ్లు (7వేల లీటర్ల మద్యం) స్వాధీనం చేసుకుని ముగ్గురినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. తాజాగా ఈ కేసులో మునగపాకకు చెందిన టీడీపీ కార్యకర్త బి.ప్రసాద్‌నూ అరెస్ట్ చేసి ఆదివారం రిమాండ్‌కు తరలించారు. కాగా.. వెంకటస్వామి, ధర్మతేజ దినేష్‌కుమార్ యలమంచిలి నియోజకవర్గం కట్టుబోలుకు ఇదే తరహాలో మద్యం బాటిళ్లను తీసుకువచ్చి అక్రమ వ్యాపారం చేసేందుకు యత్నించారు. ఈ విషయాన్ని ముందే పసిగట్టిన మునగపాక ఎస్ఐ పి.ప్రసాదరావు వారి యత్నానికి గండికొట్టారు. కేసు విచారణ సమయంలో పోలీసులకు మరింత సమాచారం అందినట్టు తెలిసింది. ఇదిలా ఉండగా మద్యాన్ని రాష్ట్రానికి తీసుకురావడంలో సహకరించిన అందరి వివరాలను సేకరించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. రాష్ట్రంలో ఇంతపెద్దమొత్తంలో మద్యం స్వాధీనం చేసుకోవడం ఇదే ప్రథమమని పోలీసులు చెబుతున్నారు.


Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

సోమవారం । 8 । ఏప్రిల్ । 2024



సూర్యోపాసన సేవ
ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): సర్వ మానవాళి సంపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ఆదివారం దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం
విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 511.20 అడుగుల వద్ద ఉంది. సాగర్ నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.



త్యాగ నిరతికి ప్రతీక
నందిగామ టౌన్: త్యాగ నిరతికి ప్రతీక రంజాన్ అని ఆదివారం వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, నందిగామ అభ్యర్థి జగన్‌మోహన రావు ఇఫ్తార్ విందులో అన్నారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (సోమ)	సహరి (మంగళ)
విజయవాడ	6.27	4.38
జగ్గయ్యపేట	6.29	4.43
మచిలీపట్నం	6.25	4.36
గుడివాడ	6.27	4.38

న్యూస్‌రీల్

ప్రత్యేక ప్రార్థనల్లో మంత్రి జోగి



పెనమలూరు: పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే ఐదు జాగారాల పండుగలో రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ పాల్గొన్నారు. కానూరు సనత్‌నగర్‌లో శనివారం రాత్రి లైలతుల్ ఖాదర్ నాలుగో రోజు రాత్రి జాగారం పండుగ షబేఖాదర్ నవాజ్‌లో మంత్రి పాల్గొని ప్రార్థన చేశారు. మంత్రి రమేష్ మాట్లాడుతూ పండుగలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందన్నారు. జగనన్న ముస్లిం సంక్షేమానికి కట్టుబడి ఉన్నారని తెలిపారు. నవరత్నాలతో పేద ముస్లింలకు న్యాయం చేశారని తెలిపారు. కార్యక్రమంలో తాడిగడప మున్సిపాలిటీ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు అన్నే శ్రావణ్ కుమార్, మాజీ ఎంపీటీసీ సభ్యులు చాంద్ బాషా, ఖాదర్, పఠాన్ అహ్మద్, నేతలు లతీఫ్, రెహమాన్ పలువురు పాల్గొన్నారు.

రేపు సంప్రదాయ వస్త్రధారణ పోటీలు

విజయవాడకల్చరల్: శత సహస్ర దీపార్చన (లక్ష) సేవా మండలి ఆధ్వర్యాన ఈ నెల 9వ తేదీ మంగళవారం దుర్గాపురంలోని ఘంటసాల సంగీత కళాశాలలో బాలబాలికలకు సంప్రదాయ వస్త్రధారణ పోటీలు నిర్వహిస్తునట్లు కన్వీనర్ నాగలింగం శివాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్, సీనియర్స్ విభాగంలో పోటీలు ఉంటాయని ప్రవేశ రుసుం లేదని సంప్రదాయ వస్త్రధారణకు ప్రాధాన్యమిస్తామని పేర్కొన్నారు. విజేతలకు అదే రోజు బహుమతీ ప్రదానం చేస్తారని తెలిపారు. పేర్ల నమోదుకు 94410 35982, 99595 41222 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఉగాది సందర్భంగా పులిపాక చంద్రశేఖర శర్మ పంచాంగ పఠనం చేస్తారని తెలిపారు.

నిత్యాన్నదానానికి రూ. 2 లక్షల విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి విజయవాడకు చెందిన భక్తులు రూ. 2 లక్షల విరాళాన్ని అందజేశారు. విజయవాడ అయోధ్యనగర్‌కు చెందిన రెడ్ల రమాదేవి కుటుంబం ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఆలయ అధికారులను కలిసిన దాతలు రెడ్ల రమాదేవి పేరిట నిత్యాన్నదానానికి రూ. 2,01,116 విరాళాన్ని అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. దాతలకు ఆలయ పర్యవేక్షకులు జగదీష్.. అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

నిర్దేశిత గడువులో 'స్పాట్' పూర్తి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనాన్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఏపీ ప్రభుత్వ పరీక్షల సంచాలకుడు డి. దేవానందరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని స్థానిక బిషప్ అజరయ్య ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జరుగుతున్న పదో తరగతి పరీక్ష పేపర్ల స్పాట్ వాల్యుయేషన్ ప్రక్రియను ఆదివారం దేవానందరెడ్డి పరిశీలించారు. అధికారులతో మాట్లాడారు. ఎంత మేర మూల్యాంకనం పూర్తైంది? ఇంకా ఎంత మేర ఉందనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్పాట్ వాల్యుయేషన్‌కు హాజరైన ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖ అధికారి యూవీ సుబ్బారావు సౌజన్యంతో ఏర్పాటు చేసిన మజ్జిగను దేవానందరెడ్డి పంపిణీ చేశారు.

సామాజిక న్యాయానికి పాతర

- విజయవాడ, సమీప ఆరు నియోజకవర్గాలూ ఓసీలకే..
- బీసీ, మైనార్టీ, ఇతర వర్గాలను పక్కన పెట్టిన కూటమి
- టీడీపీ అధినేత సామాజికవర్గానికి చెందిన వారికే పెద్దపీట
- కూటమి తీరుపై భగ్గుమంటున్న బీసీలు, ఆర్యవైశ్యులు, మైనార్టీలు
- టికెట్ల కేటాయింపులో సామాజిక న్యాయాన్ని పాటించిన వైఎస్సార్ సీపీ



సాక్షిప్రతినిధి, విజయవాడ: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి టికెట్ల కేటాయింపులో సామాజిక న్యాయానికి పాతరేసింది. విజయవాడ నగరంలో ఈస్ట్, వెస్ట్, సెంట్రల్, సమీప పరిసరాల్లో మైలవరం, గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ నియోజకవర్గ టికెట్ల కేటాయింపును పరిశీలిస్తే పొత్తులో భాగంగా టీడీపీ ఐదు నియోజక వర్గాల్లో, బీజేపీ ఒక చోట పోటీ చేస్తున్నాయి. ఈ స్థానాలన్నింటికీ అభ్యర్థులను ప్రకటించారు. ఇందులో టీడీపీ అభ్యర్థులు ప్రకటించిన ఐదు స్థానాల్లో ఆ పార్టీ అధినేత సామాజిక వర్గానికి చెందినవారు నలుగురు, కాపు సామాజిక వర్గానికి చెందిన వారు ఒకరు ఉన్నారు. బీజేపీ ప్రకటించిన అభ్యర్థి కూడా టీడీపీ అధినేత సామాజిక వర్గానికి చెందిన వారే కావడం విశేషం. దీన్ని బట్టి చూస్తే కూటమి పూర్తిగా సామాజిక న్యాయాన్ని విస్మరించిందని తెలుస్తోంది. బీసీ, మైనార్టీ , ఇతర వర్గాలను పక్కన పెట్టేసింది. కేవలం వీరిని పార్టీ జెండా మోసే కూలీలుగా చూస్తోందని చెప్పొచ్చు. ఎన్నికల సమయంలో పావులుగా వాడుకొని, ఓట్లు కొల్లగొట్టేందుకు మాయమాటలు చెప్పడం తప్ప, ఆ వర్గాలకు టికెట్ల కేటాయింపులో న్యాయం చేయలేదని విశ్లేషకులు సైతం పేర్కొంటున్నారు.

కూటమిలో పెత్తందార్లకే చోటు

కూటమి ప్రకటించిన అభ్యర్థుల్లో విజయవాడ తూర్పులో గద్దె రామ్మోహనరావు, పెనమలూరులో బోడె ప్రసాద్, గన్నవరంలో యార్లగడ్డ వెంకటరావు, మైలవరంలో వసంత కృష్ణ ప్రసాద్, విజయవాడ వెస్ట్‌లో సుజనా చౌదరి .. ఈ ఐదుగురు కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారు. విజయవాడ సెంట్రల్‌లో బొండా ఉమా కాపు సామాజిక సామాజిక వర్గం. ఇలా ఆరు మంది ఓసీ సామాజిక వర్గం వారే కావడం విశేషం. బీసీ, మైనార్టీ, ఆర్యవైశ్య వర్గాలకు మొండి చెయ్యి చూపారు. అక్కడ టీడీపీ అధినేత సామాజిక వర్గానికి చెందిన వారికి పెద్దపీట వేశారు. ఈ ఆరు నియోజక వర్గాల్లో కమ్మ, కాపు సామాజిక వర్గాలే కాకుండా బీసీలు, మైనార్టీలు ఇతర వర్గాల వారు ఉన్నారు. ఈ టికెట్ల కేటాయింపులోనే టీడీపీ అసలు రంగు బయట పడిందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. విజయవాడ పశ్చిమలో మైనార్టీలు ఎక్కువగా ఉంటారు. చంద్రబాబు మైనార్టీలకు సీటు కేటాయిస్తామని చెప్పి, పొత్తులో భాగంగా బీజేపీకి కేటాయించి , టీడీపీ తానుముక్క , తమ సామాజిక వర్గానికి చెందిన సుజనా చౌదరికే టికెట్ ఇచ్చేలా చక్రం తిప్పారు. ఈ ఆరు నియోజక వర్గాల్లో జనసేనకు ఒక్క టికెట్ కూడా ఇవ్వలేదు. విజయవాడ పశ్చిమ సీటు తొలుత పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించారు. ఇక్కడ పదేళ్లుగా బీసీ సామాజిక వర్గానికి చెందిన పోతిన మహేష్ పార్టీ జెండా మోయడంతో పాటు, జనసేన పార్టీ కార్యక్రమాలకు డబ్బులను ఖర్చు చేశారు. అయితే టికెట్ మీకే కేటాయిస్తున్నామని పవన్ మొదట పోతిన మహేష్‌కు చెప్పడంతో, ఆయన నియోజక వర్గంలో ఇంటింటి ప్రచారం చేశారు. తీరా డబ్బు మూటలు అందగానే పొత్తులో భాగంగా టికెట్‌ను బీజేపీకి కేటాయించారనే ఆరోపణలు ఉన్నాయి. పవన్.. పదేళ్లు ఓ బీసీ అభ్యర్థిని వాడుకొని టికెట్ ఇవ్వకుండా మోసం చేశారు. ఇక్కడ జనసేన బీసీ వర్గాలను, టీడీపీ మైనార్టీ వర్గాలను మోసం చేసింది. సామాజిక న్యాయాన్ని తుంగలో తొక్కిన కూటమి అభ్యర్థులకు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పడానికి ఓటర్లు సిద్ధమవుతున్నారు.

సామాజిక న్యాయాన్ని చేతల్లో చూపిన వైఎస్సార్ సీపీ

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక న్యాయం అంటే ఏంటో టికెట్ల కేటాయింపులో చూపారు. విజయవాడ తూర్పు నియోజక వర్గం దేవినేని అవినాష్ (కమ్మ), సెంట్రల్ వెలంపల్లి శ్రీనివాస్ (వైశ్య), వెస్ట్ షేక్ ఆసిఫ్ (మైనార్టీ), పెనమలూరు జోగి రమేష్ (గౌడ), మైలవరం సర్నాల తిరుపతి రావు (యాదవ), గన్నవరం వల్లభనేని వంశీ (కమ్మ) ఇలా అన్ని సామాజిక వర్గాల వారికి టికెట్లు కేటాయించారు. టికెట్ల కేటాయింపులో సామాజిక న్యాయం స్పష్టంగా కనిపిస్తోంది. విజయవాడ నగరం, దానికి అనుబంధంగా ఉండే ఆరు నియోజక వర్గాలను తీసుకొని పరిశీలిస్తే వైఎస్సార్ సీపీ రెండు కమ్మ, రెండు బీసీ, ఓ మైనార్టీ, ఓ ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన వారిని అభ్యర్థులుగా ప్రకటించారు. వైఎస్సార్ సీపీ సమతుల్యం పాటించి అన్ని వర్గాలకు టికెట్ల కేటాయింపులో ప్రాధాన్యం కల్పించారనే భావన ప్రజల్లో వ్యక్తమవుతోంది. ఇందులో మైలవరం నియోజక వర్గానికి ఓ సామాన్యుడిని, డబ్బున్న పెత్తందారుపై పోటీకి అభ్యర్థిగా నిలిపారు. విజయవాడ వెస్ట్ నియోజక వర్గంలో సైతం మైనార్టీ వర్గానికి చెందిన సామాన్య అభ్యర్థి వైపే వైఎస్సార్ సీపీ మొగ్గు చూపింది.

ఇంద్రకీలాద్రిపై 'వేసవి' ఏర్పాట్లు

- దుర్గమ్మ సన్నిధిలో చలువ పందిళ్లు
- మజ్జిగ, తాగునీటి కోసం చలివేంద్రాలు



భక్తులకు మజ్జిగను పంపిణీ చేస్తున్న దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై భక్తులు ఇబ్బంది పడకుండా 'వేసవి' ఏర్పాట్లు చేశారు. మూడు రోజులుగా నగరంలో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి చేరడంతో ఆలయ పరిసరాల్లో చేపట్టిన ఏర్పాట్లు సత్ఫలితాలనిచ్చాయి. ఎండ తీవ్రత నేపథ్యంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆలయ ప్రాంగణంలో దాతల సహకారంతో మజ్జిగ వితరణ చేశారు. ఆదివారం మజ్జిగ పంపిణీని దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ ప్రారంభించారు. ఆలయ ప్రాంగణం, మహామండపం, కళావేదిక, లక్ష్మీ గణపతి ప్రాంగణంలో చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. అమ్మవారి దర్శనానంతరం భక్తులు రావిచెట్టు, ధర్మపథం వేదిక వద్ద ఏర్పాటు చేసిన చలువ పందిళ్ల కింద సేద తీరుతున్నారు. ఘాట్‌రోడ్డులోని ఓం టర్నింగ్, లక్ష్మీ గణపతి ప్రాంగణం, స్కానింగ్ పాయింట్, మల్లేశ్వరస్వామి ఆలయాల వద్ద చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆలయ పరిసరాల్లో భక్తుల నడక మార్గాల్లో కూల్ పెయింట్ వేసిన సంగతి తెలిసిందే.



లక్ష్మీ గణపతి ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వేసవి వడదెబ్బ తగలకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నందున ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని.. ఎండ తీవ్రతకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. పంచాయతీరాజ్, మునిసిపల్, గ్రామీణ నీటి సరఫరా, వైద్య ఆరోగ్యం తదితర శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని తెలిపారు. చలివేంద్రాలు సజావుగా పని చేసేలా చూడాలన్నారు. అవసరమైతే అదనంగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. చిన్నారులు, గర్భిణులు, వృద్ధుల విషయంలో ప్రత్యేక జాగ్రతలు పాటించాలని తెలిపారు. అంగన్‌వాడీ సిబ్బంది, ఏఎన్ఎం, ఆశాలు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు

ఈ లక్షణాలుంటాయి..
తలనొప్పి, తల తిరగడం, తీవ్రమైన జ్వరం, మత్తు నిద్ర, కలవరింతలు, ఫిట్స్, పాక్షిక లేదా పూర్తి అపస్మారక స్థితి వంటివి వడదెబ్బ లక్షణాలని కలెక్టర్ వివరించారు. వడదెబ్బకు గురైతే వ్యక్తిని నీడ ఉండే ప్రదేశానికి చేర్చి.. చల్లని గాలి తగిలేలా చూడాలని తెలిపారు. ఉప్పు కలిపిన మజ్జిగ లేదా చిటికెడు ఉప్పు కలిపిన గ్లూకోజు ద్రావణం లేదా ఓరల్ రీహైడ్రేషన్ ద్రావణాన్ని (ఓఆర్ఎస్) తాగించాలన్నారు. చిన్న చిన్న జాగ్రత్తలే ప్రాణాలకు పెద్ద రక్షణగా నిలుస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు.

ఈ జాగ్రత్తలు తీసుకోండి..
వడదెబ్బ తగలకుండా నీరు, పళ్ల రసాలు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ, ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. తేలికైన కాటన్ దుస్తులు ధరించాలని తెలిపారు. రోజులో కనీసం 15 గ్లాసుల నీళ్లు తాగాలని.. పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తూ ఆహారం తక్కువ మోతాదులో ఎక్కువసార్లు తీసుకోవాలని పేర్కొన్నారు. ఎండలో వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ వంటివి ఉపయోగించాలని తెలిపారు.

ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు
- 964 ఫిర్యాదులకు 949 పరిష్కారం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) ప్రకారం ప్రతి ఫిర్యాదుపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంసీసీ అమలులోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఓటర్ హెల్ప్‌లైన్, నేషనల్ గ్రీవెన్స్ సర్వీసెస్ పోర్టల్ (ఎన్‌జీఎస్‌పీ) తదితర మార్గాల ద్వారా 964 ఫిర్యాదులు అందాయని వివరించారు. వీటిలో 949 ఫిర్యాదుల పరిష్కరించామని పేర్కొన్నారు. ఓటరు హెల్ప్‌లైన్ (1950) ద్వారా 124 ఫిర్యాదులు రాగా అన్నింటిని పరిష్కరించామని, ఎన్‌జీఎస్‌పీ ద్వారా 305 ఫిర్యాదుల్లో 304 పరిష్కరించినట్లు తెలిపారు. వాట్సాప్ నంబరు (9154970454) ద్వారా 21 ఫిర్యాదులు రాగా 20, కాల్ సెంటర్ (0866-2570051) ద్వారా 21 ఫిర్యాదులు రాగా వీటిన్నంటినీ పరిష్కరించినట్లు వివరించారు. కంప్లయింట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (సీఎంఎస్) ద్వారా 42 ఫిర్యాదులు రాగా 39, సీఈవో మెయిల్స్ ద్వారా 13 ఫిర్యాదులు రాగా తొమ్మిదింటిని పరిష్కరించినట్లు తెలిపారు. సీ-విజిల్ యాప్ ద్వారా 389 ఫిర్యాదులు రాగా వాటిని క్షుణ్ణంగాగా పరిశీలించి అన్నింటిని పరిష్కరించినట్లు వెల్లడించారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల వారీగా పరిష్కరించిన ఫిర్యాదుల వివరాలను తెలిపారు.

ముగిసిన జిల్లా స్థాయి చెస్ పోటీలు



చెస్ టోర్నీ విజేతలకు బహుమతులు అందజేసిన దృశ్యం

విజయవాడస్పోర్ట్స్: కృష్ణా జిల్లా అండర్-17 బాలబాలికల చదరంగం పోటీలు పోరంకిలోని గ్రీన్ స్కూల్‌లో ఆదివారం జరిగాయి. జిల్లాలోని 53 మంది క్రీడాకారులు పోటీలకు ప్రాతినిధ్యం వహించినట్లు కృష్ణా జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.ఎం.ఫణికుమార్ తెలిపారు. బాలుర విభాగంలో కె.సందీప్, ఎం.జితేష్‌నాగ్, బాలికల విభాగంలో ఎస్.జాయ్‌ప్రశస్త, ఎస్.జోష్లిన్ ప్రశస్త విజేతలుగా నిలిచినట్లు చెప్పారు. అండర్-7,9,11,13,15 పోటీల్లో సుహిరిత్, నాగవెంకటపుష్కల్, శ్రేయస్, వర్షిత్, దర్ష్, సుహాస్, హర్షిత్‌సాయి, సాయిసాత్విక్, ప్రవీణ్, రోహన్, దివిషచౌదరి, జోష్మిక, శ్యామ్, యశస్వి, నాగమహిశ్రీ, గీతిక, లాస్య, కావ్యశ్రీ, స్వాతి విజేతలుగా నిలిచినట్లు తెలిపారు. స్కూల్ ప్రిన్సిపాల్ జె.సాయిఅపర్ణ, ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ పి.రేణుక, చెస్ కోచింగ్ అకాడమి అధ్యక్షులు జె.సౌజన్య బహుమతులు అందజేశారు.

ఉత్సాహంగా తైక్వాండో పోటీలు



తైక్వాండో పోటీల్లో పతకాలు అందుకున్న విద్యార్థులు

విజయవాడస్పోర్ట్స్: ఉమ్మడి కృష్ణా జిల్లా అంతర పాఠశాలల తైక్వాండో పోటీలు కానూరులోని స్కాట్స్‌పైన్ స్కూల్‌లో ఆదివారం ఉత్సాహభరితంగా సాగాయి. వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీలకు 400 మంది విద్యార్థినీ,విద్యార్థులు ప్రాతినిధ్యం వహించారని కృష్ణా జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి ఎం.అంకమరావు తెలిపారు. పోటీల్లో స్కాట్స్‌పైన్ స్కూల్ విద్యార్థులు ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో మొదటి స్థానంలో నిలవగా, రెండో స్థానంలో నెక్స్‌జెన్ స్కూల్, మూడో స్థానాన్ని గ్రీన్ స్కూల్ విద్యార్థులు పొందారు. రవీంద్ర భారతి స్కూల్స్ చైర్మన్ వి.వంశీకృష్ణ, డైరెక్టర్ వి.శాంతి, సీఈవో జాహ్నవి, ప్రిన్సిపాల్ ప్రతిమ, ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) కోచ్ పి.గౌరీశంకర్ బహుమతులు అందజేశారు.

దుర్గమ్మ సేవలో 'కృష్ణా' కలెక్టర్ డీకే బాలాజీ



కలెక్టర్ బాలాజీకి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో రామరావు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన కలెక్టర్ బాలాజీకి అలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వచనాలు ఇవ్వగా, ఈవో కేఎస్ రామరావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, పట్టువస్త్రాలను అందజేశారు.

రైతులకు సంపూర్ణ సహకారం

- రైతుల సేవలో డీసీఎంఎస్
- ధాన్యం, అపరాల కొనుగోలు
- ప్రభుత్వ కార్యాలయాలకు ఫర్నిచర్, స్టేషనరీ సరఫరా
- అదనపు ఆదాయంపై ప్రత్యేక దృష్టి



ఆర్‌బీకేల్లో ధాన్యం కొనుగోళ్లు (ఫైల్)

పెనుగంచిప్రోలు: రైతుల సేవలో జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) తరిస్తోంది. తన విధులను వ్యాపారంలా కాకుండా రైతులకు సేవ అందించటమే ధ్యేయంగా నిర్వర్తిస్తోంది. రాష్ట్రంలో వ్యవసాయం, సహకార రంగాలతో పాటు మార్కెట్ రంగంలో కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఎన్నో గొప్ప మార్పులు చోటు చేసుకున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులకు డీసీఎంఎస్ విశేష సేవలందిస్తోంది. గతంలో వ్యవసాయ మార్కెట్ యార్డుల ద్వారా కార్యకలాపాలు సాగించగా, వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక రైతు భరోసా కేంద్రాల ద్వారా తన విధులను కొనసాగిస్తోంది. కృష్ణా జిల్లాలో 60, ఎన్టీఆర్ జిల్లాలో 40 ఆర్‌బీకేల్లో ధాన్యం, అపరాల కొనుగోలు, ఎరువుల విక్రయాలు జరుగుతున్నాయి. ధాన్యాన్ని సివిల్ సప్లయిస్ శాఖ, అపరాలను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తున్నారు.

ఐదేళ్లలో డీసీఎంఎస్ వ్యాపారం ఇలా..
వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ 2019 నుంచి 2024 వరకు ధాన్యం కొనుగోళ్ల ద్వారా రూ.1349.30 కోట్లకు పైగా వ్యాపారం చేసింది. రూ.56.30 కోట్లకు పైగా విలువైన అపరాలను రైతుల నుంచి కొనుగోలు చేసింది. రూ.40.15 కోట్ల ఎరువులు, రూ.46.54 లక్షల విత్తనాలు, రూ.48.26 కోట్ల ప్రొవిజన్స్, రూ.3.61 కోట్ల పురుగు మందులు, రూ.6.28 కోట్ల స్టేషనరీ, రూ.1.75 కోట్ల ఆయిల్స్, రూ.5.96 కోట్ల ప్రభుత్వ కార్యాలయాలకు అవసరమైన పాత్రలు, ఫర్నిచర్, వ్యవసాయ, 42.21 లక్షల ఉద్యాన శాఖకు సంబంధించిన పరికరాలను విక్రయించింది. ఈ ఏడాది ఖరీఫ్‌లో 2,63,775 క్వింటాళ్ల ధాన్యాన్ని సేకరించింది. క్వింటాకు రూ.2.203 చొప్పున రైతులకు చెల్లించింది.

ఇతర రంగాల్లో....
డీసీఎంఎస్ ద్వారా కొనుగోలు చేసిన ధాన్యం, అపరాలపై కమీషన్ తీసుకుంటుండగా, ఇతర రంగాలపై చేసిన వ్యాపారంలో మార్జిన్ ఆర్జిస్తోంది. టీబీ రోగుల కోసం కనెక్ట్ టు ఆంధ్ర సంస్థతో ఒప్పందం కుదుర్చుకుని కిట్ రూ.694 చొప్పున నెలకు 15 వేలు అందిస్తూ రూ.1.05 కోట్ల వ్యాపారం చేస్తోంది. ఉమ్మడి జిల్లాలో ఏడు హాస్టళ్లకు సరుకులు సరఫరా చేస్తోంది. 2019లో కొత్తగా ఏర్పడిన గ్రామ/వార్డు సచివాలయాలకు ఆర్డర్‌పై ఫర్నిచర్ అందించింది. అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు ఫర్నిచర్, స్టేషనరీ కూడా అందిస్తూ ఆదాయం ఆర్జిస్తోంది. 2020 నుంచి నవంబర్ 23 వరకు అంగన్‌వాడీ కేంద్రాలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల ద్వారా ప్రతి నెలా రూ.కోటి మేర వ్యాపారం చేసింది.

ఎన్నికలకు సంబంధించిన సామగ్రి
ఎన్నికలకు సంబంధించిన సామగ్రి, ఓటింగ్ కంపార్ట్‌మెంట్ల ఏర్పాట్లకు డీసీఎంఎస్ ఆర్డర్ తీసుకుంది. రైతులకు సేవలు అందించడమే కాకుండా ప్రభుత్వ సంస్థలకు అవసరమైన ఫర్నిచర్, స్టేషనరీ సరఫరా చేస్తోంది. అదనపు ఆదాయం కోసం పెట్రోలు బంకులు, జన ఔషధి దుకాణాలను ఏర్పాటు చేస్తోంది. తాజాగా జగ్గయ్యపేట మండలం గౌరవరం వద్ద పెట్రోల్ బంక్ ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. విజయవాడలో ప్రధానమంత్రి జన ఔషధి కేంద్రం ఏర్పాటు చేశారు.

అదనపు ఆదాయంపై దృష్టి



రైతులకు విశేష సేవలందించటంతో పాటు అదనపు ఆదాయంపై దృష్టి పెడుతున్నాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మార్కెటింగ్ రంగం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోంది. డీసీఎంఎస్ ద్వారా కొత్తగా గౌరవరం వద్ద జాతీయ రహదారి పక్కన పెట్రోల్ బంక్ ఏర్పాటు చేస్తున్నాం. విజయవాడలో జన ఔషధి కేంద్రం ద్వారా ప్రజలకు తక్కువ ధరలకు మందులు అందిస్తున్నాం.

– పడమటి స్నిగ్ధ, డీసీఎంఎస్ చైర్‌పర్సన్

ధాన్యం సొమ్ము చెల్లించాం



డీసీఎంఎస్ కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి రైతులకు పూర్తిగా నగదు చెల్లించాం. డీసీఎంఎస్ ద్వారా ఆర్‌బీకేల్లో ధాన్యం, మొక్కజొన్నలతో పాటు అపరాలు కొనుగోలు చేస్తున్నాం. రైతులకు మేలు చేయటమే ప్రధాన విధిగా సేవలు అందిస్తున్నాం. రైతులకు ధాన్యం సేకరణకు సంబంధించి సంచులు, హమాలీ చార్జీలు, రవాణా ఖర్చులు ప్రభుత్వమే ఇచ్చింది.

– గింజుపల్లి రవికుమార్, డీసీఎంఎస్ డైరెక్టర్, నవాబుపేట

ఆరోగ్య సంరక్షణ అందరి హక్కు



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో మాచర్ల సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ.. ప్రతి ఒక్కరి ప్రాథమిక హక్కుగా ఈ ఏడాది ప్రపంచ ఆరోగ్య దినోత్సవం నినాదంగా ఉన్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాచర్ల సుహాసిని మాట్లాడుతూ సమానమైన ఆరోగ్య ఫలితాలను ప్రోత్సహించడం, ఆరోగ్యవంతంగా జీవించడానికి వ్యక్తులందరికీ అవకాశం ఉండేలా చూడటం ముఖ్య ఉద్దేశంగా పేర్కొన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రపంచ దేశాల్లో ఎదురయ్యే అనారోగ్య సమస్యలకు పరిష్కారం వెదుకుతూ ఆరోగ్య సంరక్షణకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అవగాహన ముఖ్యమని, దీంతో అనేక అంటువ్యాధులను నియంత్రించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో అదనపు డీఎంహెచ్‌ఓ డాక్టర్ జూపూడి ఉషారాణి, డీఐఓ డాక్టర్ అమృత, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఇందుమతి, డీఎంఓ డాక్టర్ మోతీబాబు, ఆర్‌బీఎస్‌కే అధికారి మాధవి, డిప్యూటీ డెమో ప్రభాకర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దుర్గమ్మ సన్నిధిలో రద్దీ సాధారణం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. తెల్లవారుజామున 6 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు రద్దీ ఓ మోస్తరుగా కనిపిస్తుంది. వార్షిక పరీక్షలు, ఎండల తీవ్రత నేపథ్యంలో గత మూడు రోజులుగా భక్తుల రద్దీ తగ్గింది. మరో వైపున వివాహ సుముహూర్తాల నేపథ్యంలో నూతన వధూవరులు, వారి కుటుంబ సభ్యులు అమ్మవారిని దర్శించుకునేందుకు తరలివస్తున్నారు. దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు నిర్వహించిన పలు ఆర్జిత సేవల్లో ఉభయదాతలు పాల్గొన్నారు. తెల్లవారుజామున అమ్మవారికి నిర్వహించిన ఖడ్గమాలార్చన, ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన శ్రీచక్రనవార్చన, లక్ష కుంకుమార్చన, శాంతి కల్యాణం, చండీహోమాల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ, పల్లకీ సేవల్లో ఉభయదాతలు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోని ధర్మపథం వేదికపై విజయవాడకు చెందిన శ్రీలాస్య కూచిపూడి ఆర్ట్స్ అకాడమీకి చెందిన చిన్నారులు చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. దుర్గమ్మకు సాయంత్రం పంచహారతుల సేవ అనంతరం కళావేదికపై చిన్నారులు భానుశ్రీ శరణి, తన్విత, అనిష్క, శిశిర, శాన్విక, రుద్రప్రియ, కాత్విక హారిణిలతో పాటు పలువురు చిన్నారులు పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందచేశారు.

బలహీన వర్గాల ప్రజలకు అండగా జగనన్న

మంత్రి జోగి రమేష్



వైఎస్సార్ సీపీలో చేరిన మాజీ ఎంపీపీ కనకదుర్గ, బీసీ నేత బొర్రా కృష్ణతో మంత్రి జోగి రమేష్, బందరు ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖర్

పెనమలూరు: రాష్ట్రంలో జగనన్న బడుగు బలహీన వర్గాల ప్రజలకు అండగా ఉండి, వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నారని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి, పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త జోగి రమేష్ అన్నారు. పోరంకిలో ఆదివారం టీడీపీకి చెందిన మాజీ ఎంపీపీ బొర్రా కనకదుర్గ, బీసీ నేతలు బొర్రా కృష్ణ, శ్రీనివాసరావు, నేతలు, కార్యకర్తలు 300 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పోరంకిలో మంత్రి జోగి రమేష్, మచిలీపట్నం పార్లమెంట్ పార్టీ ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖర్ పార్టీ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ జగనన్న అధికారం చేపట్టిన తర్వాత కులం, మతం చూడకుండా అన్నివర్గాల వారికి సంక్షేమ పథకాలు అమలు చేసి వారికి అండగా నిలిచారన్నారు. జగనన్నపాలనలో పేద, మధ్య తరగతి కుటుంబాలు చాలా ఆనందంగా ఉన్నారన్నారు. చంద్రబాబు నాయుడు ఎన్టీఆర్‌నే కాకుండా బీసీ నేతలను కూడా వెన్ను పోటు పొడిచారని ఆరోపించారు. కొలుసు పార్థసారథి టీడీపీలో చేరిన రెండు నెలల వరకు గాలిలో ఉంచి ఎక్కడి నుంచి పోటీ చేయలో చెప్పకుండా చివరకు నూజివీడు పంపి ఆయన రాజకీయ జీవితాన్ని ప్రశ్నార్థకంగా చేశారన్నారు. రెండు సార్లు ఎంపీగా గెలిచిన కొనకళ్ల నారాయణకు సీటు ఇవ్వలేదన్నారు. చివరకు బోడే ప్రసాద్‌కు చుక్కలు చేపి టికెట్ ఇచ్చారని తెలిపారు.

సముచితస్థానం..

వైఎస్సార్ సీపీ మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖర్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీలు చేరిన వారికి సముచిత స్థానం ఉంటుందన్నారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి జరగాలంటే జగనన్నతోనే సాధ్యమవుతుందని తెలిపారు. జగనన్నకు అన్నివర్గాల ప్రజలు తమ మద్దతు ప్రకటించాలని కోరారు.

టీడీపీలో గౌరవం లేదు..

అహంకారానికి–ఆత్మాభిమానానికి మధ్య పోరాటం జరుగుతోందని పార్టీలో చేరిన మాజీ ఎంపీపీ బొర్రాకనకదుర్గ అన్నారు. టీడీపీలో బీసీలకు గౌరవం లేదన్నారు. తాము టీడీపీలో ఉండగా అనేక అవమానాలకు గురయ్యామని తెలిపారు. టీడీపీలో కొందరికే న్యాయం జరుగుతుందని, బలహీనవర్గాల ప్రజలను పట్టించుకోరని ఆరోపించారు. కార్యక్రమంలో మచిలీపట్నం కేడీసీసీబీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ దేవభక్తుని చక్రవర్తి, తాడిగడప మునిసిపాలిటీ పార్టీ చైర్మన్ అన్నే శ్రావణ్‌కుమార్, టిడ్కో డైరెక్టర్ పి.రాఘవరావు, జెడ్పీటీసీ బాకీబాబు, పార్టీ నేతలు దేవభక్తుని సుబ్బారావు, మున్నంగి అర్జున్‌రెడ్డి, గుమ్మడి విజయ్‌కుమార్, అబు కలాం, కొండలరావు, కృష్ణవేణి, నాగళ్ల రామచంద్రరావు, బొర్రా రమణయ్య, దేవినేని పున్నయ్య చౌదరి, కుందేటి శివరామకృష్ణ, పెనమలూరు, యనమలకుదురు, తాడిగడప, చోడవరం, గోసాల, వణుకూరు, గంగూరు ప్రాంతాల నుంచి పార్టీ నేతలు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్రానికి మేలు

- పెడన వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఉప్పాల రాము
- టీడీపీ, జనసేన నుంచి 100 మందికి పైగా వైఎస్సార్ సీపీలో చేరిక

కృత్తివెన్ను: రాష్ట్రానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే మేలు జరుగుతుందని ఇటువంటి నాయకుడికి అండగా ఉండి రాష్ట్రాభివృద్ధికి పాటుపడతామంటూ పలువురు టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన వారు వైఎస్సార్ సీపీలో చేరారు. కృత్తివెన్ను మండలం చినపాండ్రాకకు చెందిన సుమారు 100 మందికి పైగా ఆ రెండు పార్టీలకు చెందిన కార్యకర్తలకు పెడన నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రమేష్ (రాము) పార్టీ కండువా కప్పి స్వాగతించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ జగనన్న పాలన నచ్చి వచ్చిన వారందరికీ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని, పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన వారిలో సూదాబత్తుల కుటుంబం నుంచి రవి, వెంకన్న, రాంబాబు, కృష్ణా, మణి, రమేష్, నాగు, కొప్పినేని సాయి, నాగులు, పులి ఆదినారాయణ, సత్తి, సురేష్, శ్రీనివాస్, నల్లగంచు నాగమల్లేశ్వరరావు, రవి, నాగరాజు ఉన్నారు.



కృత్తివెన్ను మండలం చినపాండ్రాకలో టీడీపీ, జనసేన నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఉప్పాల రాము

ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పెడుతున్న కేంద్రం

'అరసం'కవితా గోష్ఠిలో వక్తలు



మాట్లాడుతున్న నాగార్జున

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ప్రజల మత విశ్వాసాలపై విద్వేషాలను రెచ్చగొట్టేలా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని అభ్యుదయ రచయితల సంఘం (అరసం) రాష్ట్ర కార్యదర్శి బొల్లినేని నాగార్జున విమర్శించారు. లెనిన్ శత వర్ధంతి ఏడాది సందర్భంగా అభ్యుదయ రచయితల సంఘం (అరసం) ఎన్టీఆర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో విజయవాడ ప్రజాశక్తినగర్‌లోని చంద్ర రాజేశ్వరరావు గ్రంథాలయంలో కొత్త సంవత్సరంలో ఎన్ని'కలలో'అంశంపై ఉగాది కవితా గోష్ఠి ఆదివారం జరిగింది. నాగార్జున మాట్లాడుతూ.. పాఠ్యాంశాల్లో మనువాద భావజాలం చొప్పిస్తున్నారని, ఇటీవల విడుదలైన రజాకార్, ట్రిపుల్ ఆర్ సినిమాల్లో తెలంగాణ సాయుధ పోరాటం, అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్రను వక్రీకరించారని విమర్శించారు. పదేళ్ల బీజేపీ పాలనలో ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. అరసం రాష్ట్ర కమిటీ సభ్యుడు గోలి సీతారామయ్య మాట్లాడుతూ.. ఎనభై ఏళ్ల క్రితం ఆవిర్భవించిన అరసం జాతీయ స్థాయిలో అభ్యుదయ విప్లవ సాహిత్య ప్రస్థానం చాలా గొప్పదన్నారు. అరసం జిల్లా అధ్యక్షుడు కొప్పర్తి రాంబాబు మాట్లాడుతూ.. కమ్యూనిస్టు మూల సూత్రాలను ప్రతిపాదించిన మార్క్స్, లెనిన్, మావో, అంబేడ్కర్, అల్లూరి, భగత్ సింగ్ వంటి చరిత్రకారుల స్ఫూర్తితో నేటి తరం యువత ముందుకు సాగాలన్నారు. అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి పరుచూరి అజయ్ కుమార్, కార్యదర్శి ఎం.అరుణ్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం నాయకులు వేణుగోపాలరావు, ఆనంద కుమార్ పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



తిరువూరు: పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలకు కొత్త కార్యవర్గాల ఎన్నిక ఆదివారం తిరువూరులో జరిగింది. ఎన్టీఆర్ జిల్లాకు అధ్యక్షుడిగా గంటా వెంకటేశ్వర్లు(జగ్గయ్యపేట), ప్రధాన కార్యదర్శిగా వి. మల్లేశ్వరరావు(తిరువూరు), కోశాధికారిగా బుడిపూటి వెంకట్రావులను ఎన్నుకున్నారు. కృష్ణాజిల్లాకు అధ్యక్షుడిగా ఎం. వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా ఎండీ సాహిదా, కోశాధికారిగా ఉషారాణి ఎన్నికయ్యారు. స్థానిక ఫిట్‌నెస్ జోన్ కార్యాలయంలో ఏపీ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం. ప్రభాకర్, దక్షిణ భారత పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్. కోటేశ్వరరావు ఎన్నిక నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో ఆదిదంపతుల త్రిశతి



ఆది దంపతుల త్రిశతి నిర్వహిస్తున్న రుత్వికులు

విజయవాడ కల్చరల్: జగద్గురువులు శృంగేరీ పీఠాధిపతి భారతీ తీర్థ మహాస్వామి జన్మదినం సందర్భంగా దుర్గాపురంలోని శృంగేరీ శారదాపీఠంలో నిర్వహిస్తున్న వైదిక కార్యక్రమాలు భక్తిగా సాగుతున్నాయి ఆదివారం నాటి కార్యక్రమంలో ఉదయం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సాయంత్రం ఆదిదంపతుల త్రిశతి, సహస్రనామార్చన మహామంగళ హారతి నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేదపండితులు ఆశీర్వచన కార్యక్రమంలో పాల్గొన్నారు. ధర్మాధికారి శిష్ట్యాల హనుమత్ ప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల 18వ తేదిన నిర్వహించే పూర్ణాహుతితో కార్యక్రమాలు ముగుస్తాయని తెలిపారు.

నాలుగు పూరిళ్లు దగ్ధం



బాధిత కుటుంబాలకు నిత్యావసరాలు అందజేస్తున్న తహసీల్దార్ రాంబాబు తదితరులు

పెడన: మండలంలోని నందిగామ గ్రామం శివారులోని ఎస్టీలకు చెందిన నాలుగు పూరిళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. పక్క పంట పొలాల్లో మినుము పంట వేస్ట్‌ను తగలబెట్టడంతో గాలికి వచ్చిపడ్డ నిప్పురవ్వలతో ఆ ఇళ్లు అగ్ని ప్రమాదానికి గురైనట్లు బాధితులు వాపోయారు. ఏకశిరి వెంకటేశ్వరరావు, ఈగా మునియ్య, పాట్లూరి చిన్న, చెవుటూరి చెంచయ్యలకు చెందిన ఇళ్లు పూర్తిగా కాలిపోయాయి. ప్రమాద స్థలాన్ని పెడన తహసీల్దార్ కె. రాంబాబు పరిశీలించి బాధిత కుటుంబాలకు 25 కిలోల బియ్యం, కేజీ కందిపప్పు, కేజీ నూనె ప్యాకెట్, అరకేజీ పంచదార, కేజీ గోధుమపిండితో పాటు దుస్తులను అందజేశారు. ఈయనతో పాటు ఆర్ఐ మణికుమార్, వీఆర్వో పార్వతీ తదితరులున్నారు.

స్పెషల్ అసిస్టెంట్లకు కరువు భత్యం ఇవ్వాలని వినతి



దేవానందరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న డెమొక్రటిక్ పీఆర్టీయూ అధ్యక్షుడు శ్రీను

లబ్బీపేట(విజయవాడతూర్పు): పదో తరగతి పరీక్ష పేపర్ల మూల్యాంకనంలో పనిచేస్తున్న స్పెషల్ అసిస్టెంట్లకు కూడా అసిస్టెంట్ ఎగ్జామినర్ల మాదిరిగా కరువు భత్యం ఇవ్వాలని డెమొక్రటిక్ పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డి.శ్రీను కోరారు. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం రాష్ట్ర డైరెక్టర్ డి.దేవానందరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో స్పెషల్ అసిస్టెంట్‌లుగా స్థానికంగా ఉండే ఎస్‌జీటీలను ఉపయోగించే వారని, ప్రస్తుతం పరీక్ష పత్రాలు పెరగడంతో ఇతర ప్రాంతాల వారిని కూడా నియమించారని తెలిపారు. ఇతర ప్రాంతాల వారు కూడా ఉన్నందున అసిస్టెంట్ ఎగ్జామినర్ల మాదిరిగా వారికి కూడా కరువు భత్యం చెల్లించాలని విజ్ఞప్తిచేశారు. శ్రీను వెంట జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి ప్రభాకర్, నగర శాఖ అధ్యక్షుడు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీనులవిందుగా వాగ్గేయకార సంకీర్తనం



కచేరి నిర్వహిస్తున్న లంక తేజస్విని, వాద్య సహకారం అందిస్తున్న కామాక్షి, శ్రీధర్

విజయవాడ కల్చరల్: స్వరతరంగిణి సంగీత సేవా సంస్థ నెలవారీ కార్యక్రమంలో భాగంగా దుర్గాపురంలోని శివరామ కృష్ణ క్షేత్రంలోని శ్రవణ వేదికపై ఆదివారం యువ సంగీత విద్వాంసురాలు లంకా తేజస్విని నిర్వహించిన శాస్త్రీయ సంగీత కచేరి మధురంగా సాగింది. సంగీత త్రిమూర్తులు త్యాగరాజ స్వామి, ముత్తు స్వామి దీక్షితార్, శ్యామశాస్త్రితో పాటు ఇతర వాగ్గేయకారులు రచించిన కీర్తనలను మధురంగా ఆలపించారు. అంబటిపూడి కామాక్షి, మంగళగిరి శ్రీధర్ వాద్య సహకారం అందించారు. కార్యక్రమాలను సంస్థ అధ్యక్షుడు గండూరి రమాసత్యనారాయణ ప్రారంభించి సంస్థ లక్ష్యాలను వివరించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి ఏఆర్‌కే ప్రసాద్, సంగీత విద్వాంసులు మోదుమూడి సుధాకర్, అంజనా సుధాకర్ పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న లారీ: ఇద్దరు మృతి

పరారీలో లారీ డ్రైవర్



లారీ కింద మోటార్ సైకిల్



రాయల వెంకటేశ్వర్లు



మొండితోక బాలశౌరి

రొంపిచర్ల : మండలంలోని అన్నవరప్పాడు గ్రామ సమీపంలో శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ఎక్స్‌ప్రెస్ వేపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు వ్యక్తులు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అద్దంకి వైపు నుంచి పిడుగురాళ్ల వైపు వేగంగా వెళ్తున్న లారీ మోటారు బైక్‌ను ఢీకొట్టడంతో ఈపూరు మండలం గోపువారిపాలెం గ్రామానికి చెందిన పాస్టర్ మొండితోక బాలశౌరి(53) అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రగాయాలైన రాయల వెంకటేశ్వర్లు(75)లు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. మృతులు గోపువారిపాలెం నుంచి మోటార్ బైక్‌పై తురిమెళ్ల గ్రామంలో ప్రార్థనలు నిర్వహించేందుకు వచ్చారు. అక్కడ ముగించుకొని ప్రకాశం జిల్లా సంతమాగులూరు అద్దరోడ్డు గ్రామంలో ప్రార్థనలో పాల్గొనేందుకు బైక్‌పై బయలు దేరారు. అన్నవరప్పాడు గ్రామ సమీపంలోని బ్రిడ్జి దిగువ భాగంలో యూటర్న్ తీసుకుంటుండగా వేగంగా వస్తున్న లారీ ఢీకొట్టింది. మృతదేహాలను పంచనామా నిర్వహించేందుకు నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడు బాలశౌరి కుమారుడు బాబూరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.పి.రవీంద్రబాబు తెలిపారు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడు.

పురుగుమందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

పెడన: ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యం సమస్యలతో పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటనపై పెడన పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని 20వ వార్డుకు చెందిన రుద్రాక్షుల బాలాజీ(36) మార్చి 29న పెడన – గుడివాడ రోడ్డులోని పెట్రోల్ బంకు వెనుక పురుగుమందు తాగి అపస్మారక స్థితిలో ఉన్నాడు. అతన్ని గమనించి బంధువులకు సమాచారం ఇవ్వడంతో మచలీపట్నం ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి అక్కడ నుంచి గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ నుంచి ఈ నెల 4వ తేదీన ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యాడు. ఐదో తేదీన తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో మచిలీపట్నం ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య సరస్వతి ఇచ్చిన పిర్యాదు మేరకు పెడన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి

తిరువూరు: తెలంగాణ రాష్ట్రంలోని దమ్మపేట మండలంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఏకొండూరు మండలం చీమలపాడుకు చెందిన చీపు లక్ష్మి, ఆమె కుమార్తెల మృతదేహాలకు ఆదివారం పోస్టుమార్టం నిర్వహించారు. దమ్మపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ముగ్గురి మృతదేహాలకు పోస్టుమార్టం చేసిన అనంతరం చీమలపాడులోని చీపు లక్ష్మి భర్త బాలకృష్ణ కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందించినా స్పందించలేదు. దీంతో పెనుబల్లి మండలం లింగగూడెంలోని లక్ష్మి తల్లికి మూడు మృతదేహాలను పోలీసులు అప్పగించారు. జీవనోపాధి కోసం హైదరాబాద్ వెళ్లిన బాలకృష్ణ వివాహిత అయిన లక్ష్మిని పెళ్లి చేసుకున్నాడు. అతని తల్లి, సోదరుడు వీరి పెళ్లికి నిరాకరించి నాటి నుంచి బంధం తెంచుకున్నారు. ప్రస్తుతం బాలకృష్ణ తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నప్పటికీ తల్లి, సోదరుడు అతనిని చూడటానికి సైతం ఇష్టపడట్లేదు.

బాలిక అదృశ్యం.. కేసు నమోదు

పెడన: బాలిక అదృశ్యం కావడంతో తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెడన పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పెడన మండలంలో ఒక గ్రామానికి చెందిన బాలిక(17) మచిలీపట్నం నారాయణ కళాశాలలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం చదువుకుంటోంది. శుక్రవారం ఫోన్ అతిగా మాట్లాడుతుంటే తండ్రి మందలించాడు. ఆ రోజు రాత్రి భోజనం తర్వాత అంతా పడుకున్నారు. శనివారం ఉదయం నుంచి బాలిక కనిపించలేదు. అన్నిచోట్ల వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారులో రూ. లక్ష నగదు స్వాధీనం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఎటువంటి పత్రాలు లేకుండా రూ. లక్ష నగదును కారులో తరలిస్తుండగా, కొత్తపేట పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. కొత్తపేట సీఐ గణేష్ తెలిసిన వివరాల ప్రకారం పాముల కాల్వ వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టులో ఆదివారం సాయంత్రం తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో వచ్చిన కారులో ఉన్న వ్యక్తుల వద్ద రూ. లక్ష నగదు ఉండటంతో ఆ నగదు వివరాలను అడిగారు. సదరు నగదుకు ఎటువంటి పత్రాలు లేకపోవడంతో పోలీసులు ఆ నగదును సబ్ ట్రెజరీ అధికారికి అప్పగించారు.

రెంటచింతల కాదు మంటచింతల

- భగభగమంటున్న భానుడు
- 44.3 డిగ్రీలకు చేరుకున్న ఉష్ణోగ్రత



రెంటచింతల: రెండు తెలుగు రాష్ట్రాల్లో వేసవిలో మంటచింతలగా పేరొందిన రెంటచింతల ఏప్రిల్ రెండో వారంలోనే భగభగమండుతోంది. ఏ రోజు ఎండ ఎక్కువ కాసినా రెంటచింతల ఉష్ణోగ్రత ఎంత అని అడగడం సహజం. ఈ ప్రాంతంలో నాపరాయి నిక్షేపాలు ఎక్కువగా ఉండటం కారణంగానే ఉష్ణోగ్రత అధికంగా నమోదు అవుతుంది. ఆదివారం గ్రామంలో గరిష్ట ఉష్ణోగ్రత 44.3 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రత 26.6 డిగ్రీలుగా నమోదైనట్లు వాతావరణ అధికారులు తెలిపారు. వాతావరణంలో ఏర్పడిన మార్పుల కారణంగా నాలుగు రోజులుగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో గ్రామస్తులు అల్లాడుతున్నారు. భానుడు నిప్పులు కురిపిస్తుండటంతో ఇంట్లోంచి బయటకు రాలేకపోతున్నారు. ఉక్కపోతకు తట్టుకోలేక వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బాలింతలు, చిన్నారులు, గర్భిణులు అవస్థలకు గురవుతున్నారు. ఉదయం 10 గంటలు దాటితే ఆరుబయటకు రావడానికి జంకుతున్నారు. వ్యవసాయ, వివిధ పనులకు వెళ్లే కూలీలు 11 గంటలకల్లా ఎండ తీవ్రత తట్టుకోలేక ఇంటిముఖం పడుతున్నారు.

పరమపరనాథుడిగా నారసింహుడు

మంగళగిరి: నగరంలో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీనృసింహ స్వామి వారు ఆస్థాన అలంకారోత్సవాలలో భాగంగా ఆదివారం పరమపరనాథుడిగా దర్శనమిచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవాన్ని ఆలయ ఈఓ ఏ రామకోటిరెడ్డి పర్యవేక్షించారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): రామరాజ్యనగర్ సమీపంలోని రైల్వే ట్రాక్‌ల మధ్య ఉన్న చెట్టుకు యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రామరాజ్యనగర్ రైల్వే ట్రాక్‌ల మధ్య ఉన్న చెట్టుకు ఓ యువకుడు (35) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు సమాచారం ఇచ్చారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు యువకుడి మృతదేహాన్ని పరిశీలించారు. జన సంచారం లేని ప్రాంతంలో సుమారు రెండు రోజుల కిందట ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. యువకుడి శరీరం నుంచి భరించలేని దుర్వాసన వస్తుండటంతో స్థానికుడై ఉంటాడా లేక ఇతర ప్రాంతం నుంచి వచ్చి ఆత్మహత్యకు పాల్పడ్డాడ అని పోలీసులు ఆరా తీశారు. ఘటనపై గొల్లపూడి గ్రామ రెవెన్యూ అధికారి జక్క రామకృష్ణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

లబ్బీపేట(విజయవాడతూర్పు): మొగల్రాజపురం సెక్షన్ మహాత్మాగాంధీ ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. జమ్మిచెట్టు 11 కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం గిరిపురం శిఖామణిసెంటర్, ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వాటర్ ట్యాంక్ రోడ్డు, బాడవపేట, జాన్‌వీధి, జక్రయ్యవీధి, యల్లాటి ఆంజనేయలు వీధుల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు గమనించి తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.

ఎంబీ విజ్ఞాన కేంద్రంలో రేపు రాజ్యాంగ శ్రవణం

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఉగాది పండుగ సందర్భంగా ఈ నెల 9వ తేదీ మంగళవారం సాయంత్రం 5.30 గంటలకు గవర్నర్‌పేటలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో రాజ్యాంగ శ్రవణం నిర్వహిస్తున్నట్లు ఎంబీ విజ్ఞాన కేంద్రం బాధ్యుడు పి.మురళీకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీ విజ్ఞాన కేంద్రం, జీఆర్కే – పోలవరపు సాంస్కృతిక సమితి సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, పాల్గొని సందేశం అందజేస్తారన్నారు. డ్యాన్స్ మాస్టర్ చందు ఆధ్వర్యంలో గాయత్రీ బృందం నృత్యాలు ప్రదర్శిస్తారని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో అభిషేకాలు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఆదివారం పూర్వాభద్ర నక్షత్రం, మాస శివరాత్రిని పురస్కరించుకుని భీమన వారి పేటలోని శ్రీ విజయదుర్గా రామలింగేశ్వర స్వామి వారి సన్నిధిలో విశేష అభిషేకాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున రామలింగేశ్వర స్వామి వారికి పంచామృత అభిషేకాలు, విశేష అలంకరణ, పూజా కార్యక్రమాలను చేపట్టారు. పంచముఖ ఆంజనేయ స్వామి వారికి పంచామృత అభిషేకాలు, తమలపాకులతో అర్చన నిర్వహించారు. ఆలయ అర్చకులు చింతలపాటి సుబ్రహ్మణ్య శాస్త్రి, పవన్‌కుమార్ శర్మలు విశేష పూజా కార్యక్రమాలను జరిపారు. స్వామివార్లకు నిర్వహించిన విశేష అభిషేకాల్లో పలువురు ఉభయ దాతలు, భక్తులు పాల్గొని తమ గోత్రనామాలతో పూజలు జరిపించుకున్నారు. అనంతరం స్వామివార్లకు పంచహారతుల సేవ నిర్వహించారు.

ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు అభినందనీయం




లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం గొర్తి సత్యవతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సూర్యారావుపేటలోని విక్రాంత్ పబ్లిషర్స్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని సినీ హీరోయిన్ శాంతిప్రియ, రోటరీ మాజీ గవర్నర్ ఎం.సతీష్‌బాబుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శాంతిప్రియ మాట్లాడుతూ.. పేద ప్రజలకు ఉచితంగా వైద్యం అందించడం శుభపరిణామమన్నారు. 20 ఏళ్లుగా గొర్తి సత్యవతి చారిటబుల్ ట్రస్ట్ సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు రానున్న రోజుల్లో మరిన్ని నిర్వహించాలని ఆకాంక్షించారు. అనంతరం పలువురికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకుడు గొర్తి శ్రీనివాస చక్రవర్తి, లత, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు హరిత తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి

విజయవాడ కల్చరల్: బెజవాడ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో నెల వారీ కార్యక్రమంలో భాగంగా హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. సీనియర్ గాయకుడు డేవిడ్ రాజు ఆధ్వర్యంలో కొమ్మినేని రత్నకుమారి, మల్లాది స్వాతి, వడ్డాది కామేశ్వరి, అయ్యప్పన్, సయ్యద్ ఆలీ, శ్రీనివాసరావు, సాయిబాబు, హనుమంతరావు, పీ బ్రహ్మం సినీ గీతాలు ఆలపించారు. సంగీత విద్వాంసుడు దావులూరి వీరభద్రరావు మాట్లాడుతూ గాయనీ గాయకులు స్వయం కృషితో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. వివిధ రంగాలకు చెందిన ప్రసూనా రామన్, కొప్పరపు బలరామకృష్ణమూర్తి, ఉమాబలరాం పాల్గొన్నారు.

గంజాయికి ఆద్యులు టీడీపీ నేతలే

- హుందాతనం కోల్పోతున్న గద్దే రామ్మోహన్
- గొడవలు సృష్టించి లబ్ధి పొందాలని చూస్తున్నారు
- వలంటీర్లపై విషం కక్కుతున్న చంద్రబాబు
- 14వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్



దర్శిపేటలో వృద్ధురాలితో మాట్లాడుతున్న దేవినేని అవినాష్, నాయకులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలో గంజాయికి ఆద్యులు టీడీపీ నేతలేనని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ అన్నారు. గత ప్రభుత్వంలో హెరిటేజ్ వాహనాల్లో గంజాయి రవాణా చేసింది టీడీపీ నేతలు కాదా అని ఆయన ప్రశ్నించారు. నియోజకవర్గంలో నిర్వహిస్తున్న ప్రచారంలో భాగంగా ఆదివారం 14వ డివిజన్‌లో ఎన్టీఆర్ సర్కిల్, దర్శిపేట ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలను కలిసి వైఎస్ జగన్ ప్రభుత్వం ఐదేళ్లలో ప్రజలకు చేసిన మేలును తెలియజేశారు. అన్ని వర్గాల ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. ఈ సందర్భంగా దేవినేని అవినాష్ మాట్లాడుతూ తాము గత ఐదేళ్లలో ప్రతి డివిజన్‌లో అభివృద్ధి పనులు చేశామన్నారు. 10 ఏళ్లు ఎమ్మెల్యేగా ఉండి, తన అసమర్థతతో ఏమి చేయలేని గద్దే రామ్మోహన్ ఏ మొహంతో ఓటు అడుగుతారని ప్రశ్నించారు. నియోజకవర్గంలో గొడవలు సృష్టించి లబ్ధి పొందాలని టీడీపీ నేతలు చూస్తున్నారని, గద్దే రామ్మోహన్ హుందాతనం కోల్పోతున్నారని ఎద్దేవా చేశారు. చనిపోయిన వ్యక్తులపై దూషణలు చేయడం రాజకీయమా అంటూ ప్రశ్నించారు.

ప్రభుత్వంపై విష ప్రచారం..

ప్రతి రోజూ రాష్ట్రంలోని వైఎస్ జగన్ ప్రభుత్వంపై ఎల్లో మీడియాలో టీడీపీ నేతలు విష ప్రచారం చేస్తున్నారని అవినాష్ ధ్వజమెత్తారు. 2014 ఎన్నికల్లో 650 హామీలు ఇచ్చిన టీడీపీ ఎన్ని నెరవేర్చారో చెప్పాలన్నారు. మ్యానిఫెస్టో కూడా కనిపించకుండా చేశారని ఎద్దేవా చేశారు. ప్రస్తుతం అధికారుల బదిలీలను కూడా రాజకీయం చేయడం దురదృష్టకరమన్నారు. రాష్ట్రంలో 36 మంది వృద్ధులు పెన్షన్ల కోసం వెళ్లి మరణించారని, వారి కుటుంబ సభ్యులకు టీడీపీ నేతలు ఏమి సమాధానం చెబుతారని నిలదీశారు. వలంటీర్ల సేవలను నిలుపుదల చేయించింది చంద్రబాబు సొంత మనిషి నిమ్మగడ్డ కాదా, తను నిత్యం వలంటీర్లపై విషం కక్కుతున్నారని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గాలికి టీడీపీ కొట్టుకుపోవడం ఖాయమన్నారు. చంద్రబాబు, టీడీపీ నేతల వేధింపుల మాటలు తట్టుకోలేకే వలంటీర్లు రాజీనామా చేస్తున్నారని అవినాష్ తెలిపారు. ఆయన వెంట స్థానిక కార్పొరేటర్ చింతల సాంబయ్య, మండల పార్టీ అధ్యక్షుడు ఎండీ రిజ్వాన్, ఊకోటి రమేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న అవినాష్



కృష్ణలంకలోని చర్చిలో మాట్లాడుతున్న దేవినేని అవినాష్

లబ్బీపేట(విజయవాడతూర్పు): తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ ఆదివారం పలు ప్రాంతాల్లో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్నారు. గుణదలలోని పార్టీ కార్యాలయంలో ప్రత్యేక ప్రార్థన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కృష్ణలంక వల్లూరు వారి వీధిలోని చర్చిలో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్నారు. అవినాష్‌కు ఏసుక్రీస్తు ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలి, ఆయన చేయబోయే కార్యాల్లో సఫలీకృతం కావాలని ప్రార్థించారు. క్రైస్తవుల పట్ల అత్యంత విశ్వాసంగా ఉండే దేవినేని అవినాష్‌కు క్రీస్తు దీవెనలు మెండుగా ఉంటాయని రెవరెండ్ హనోక్ అన్నారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ.. ఏసుక్రీస్తు మార్గం అనుసరణీయమన్నారు. ఆ ప్రభువు ఆశీస్సులు తమకు అందించాలని కోరారు. 21వ డివిజన్ కార్పొరేటర్ పుప్పాల కుమారి, నాయకులు, కార్యకర్తలు, క్రీస్తు విశ్వాసులు పాల్గొన్నారు.

నగదు, మద్యం అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

ఏసీపీ భాస్కరరావు



పటమట(విజయవాడతూర్పు): ఓటర్లకు పంపిణీ చేసేందుకు రాజకీయ పార్టీలు సమకూర్చిన డబ్బు, మద్యం, వస్తువులు రవాణా చేసిన వాహన యజమానులపై, నిల్వ చేసిన గోడౌన్ల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ భాస్కరరావు హెచ్చరించారు. పటమట పోలీస్ స్టేషన్ పరిధిలోని ట్రాన్స్‌పోర్ట్ కంపెనీల యజమానులు, గోడౌన్స్ యజమానులతో ఏసీపీ ఆదివారం సమావేశమయ్యారు. పటమట పోలీస్ స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో ఏసీపీ మాట్లాడుతూ ప్రజలను ఆకర్షించేందుకు రాజకీయ పార్టీలు డబ్బు, మద్యం, ఇతర వస్తువులను తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసిందన్నారు. ఈ వస్తువులను రవాణా చేసిన వాహనాలను సీజ్ చేస్తామని, ఈ వస్తువులను నిల్వ ఉంచిన గోడౌన్‌లను సీజ్ చేస్తామని తెలిపారు. అయితే డబ్బు, మద్యం, వస్తువులు రవాణా జరుగుతున్నట్లు, గోడౌన్‌లలో నిల్వ ఉంచేందుకు రాజకీయ పార్టీలు చేస్తున్న ప్రయత్నాలు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. సమావేశంలో సీఐ మోహన్‌రెడ్డి, ఎస్‌ఐలు శాతకర్ణి, వల్లిపద్మ పాల్గొన్నారు.

అబద్ధాలతో ప్రజల్లోకి గద్దే

- చెప్పుకోవడానికి చేసిందేమీ లేక, ఎదుటి వారిపై అక్కసు
- పదేళ్లలో చేసిన అభివృద్ధి శూన్యం
- చర్చకు రమ్మంటే రాకుండా బురద జల్లే యత్నం



ఇఫ్తార్ విందులో పాల్గొన్న గద్దే రామ్మోహన్(ఫైల్)

లబ్బీపేట(విజయవాడతూర్పు): గద్దే రామ్మోహన్... ఆయన చెప్పేవన్నీ అబద్ధాలే, చేసేదంతా అసత్య ప్రచారమే. ఆయన చెప్పే మాటలు విని తూర్పు నియోజకవర్గ ప్రజలు నవ్వుకుంటున్నారు. మూడు దశాబ్దాల రాజకీయ అనుభవం ఉన్న వ్యక్తి హుందాగా వ్యవహరించకుండా దిగజారుడు వ్యాఖ్యలు చేయడం ఏమిటని టీడీపీకి చెందిన వారే అంటున్నారు. ఆయనతో పాటు, ఆయన భార్య గద్దే అనురాధ, కుమారులు నియోజకవర్గంలో తిరుగుతూ ప్రజలను మరోసారి వంచన చేసే ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్పుకుంటున్నారు. రెండు సార్లు వారి మాటలు నమ్మి ఓట్లేశామని, ఈసారి మోసపోయేందుకు సిద్ధంగా లేమని తూర్పు ప్రజలు అంటున్నారు.

హామీలకే పరిమితం..

తూర్పు నియోజకవర్గానికి పదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్న గద్దే రామ్మోహన్ ఒక్క మంచి పని కూడా చేయలేదని, చేసిన అభివృద్ధి కూడా ఏమీ లేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. అంతేకాకుండా శ్మశానం విషయంలో దళితులను, షాదీఖానా కడతానంటూ ముస్లింలను, ఇళ్ల స్థలాల ల్యాండ్ సీలింగ్‌పై పోలీస్ కాలనీ వాళ్లను ఇలా అన్ని వర్గాల వారిని నమ్మించి నయవంచనకు పాల్పడ్డారంటున్నారు. ఇక ఈ ఎన్నికల్లో చెప్పుకోవడానికి ఏమీ లేక అబద్ధాలు, అసత్య ప్రచారానికి తెరలేపారని ప్రజలు అంటున్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో చేసిన పనులు కూడా తానే చేశానని చెబుతూ నిస్సిగ్గుగా ప్రచారం చేసుకుంటున్నారు. అందులో కృష్ణానది రిటైనింగ్ వాల్ నేనే నిర్మించానని చెప్పుకోవడంతో ప్రజలు నవ్వుకుంటున్నారు. వాస్తవంగా 2013లోనే కృష్ణానది రిటైనింగ్ వాల్ మొదటి దశకు నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులతో 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ నాసిరకంగా, అసంపూర్తిగా నిర్మాణం చేశారు. దీంతో 2020లో వచ్చిన వరదల్లో రామలింగేశ్వరనగర్ మొత్తం మునిగిపోయింది. మరి గద్దే రిటైనింగ్‌వాల్ కడితే వరదలు ఎందుకు వచ్చాయంటే ఆయన నుంచి సమాధానం లేదు. అంతేకాదు ఆయనే అల్లర్లు చేస్తూ, ఎదుటి వారిపై రుద్దే ప్రయత్నం కూడా చేస్తున్నట్లు అధికార పార్టీ నేతలు అంటున్నారు. అందులో భాగంగానే ప్రశాంతంగా ఉన్న తూర్పులో అలజడులు అంటూ ప్రచారం చేస్తున్నట్లు వారు మండిపడుతున్నారు.

కరోనాలో ఎక్కడా..

ప్రపంచ విపత్తు కరోనా సమయంలో గద్దే రామ్మోహన్ ఎక్కడా దాక్కున్నాడని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజలందరూ ఏమి జరుగుతుందోనని భయాందోళనతో ఉంటే, అండగా ఉండాల్సిన ఎమ్మెల్యే ఎక్కడ ఉన్నాడని ప్రజలు అంటున్నారు. ఆ సమయంలో తమకు అండగా ఉన్నది దేవినేని అవినాష్ మాత్రమేనని చెబుతున్నారు. ఆపదలో అండగా ఉన్న వారికే మేము మద్దతుగా నిలుస్తామని తూర్పు ప్రజలు అంటున్నారు.

చేసిన అభివృద్ధి దమ్ముగా చెబుతూ...

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో తూర్పులో రూ.650 కోట్లు అభివృద్ధి చేసినట్లు దేవినేని అవినాష్ దమ్ముగా చెబుతున్నారు. ప్రచారంలో సైతం ప్రజలకు అదే వివరిస్తూ ఓట్లు అడుగుతున్నారు. మరో రూ.900 కోట్లు సంక్షేమం రూపంలో అందించామంటున్నారు. కానీ గద్దే రామ్మోహన్ మాత్రం చేసిందేమీ లేక అబద్ధాలతో ప్రజల్లోకి వెళ్తున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. 35 ఏళ్ల యువకుడు దమ్ముగా చేసింది చెబుతుంటే, పదేళ్లు ఎమ్మెల్యే, 65 ఏళ్ల వయస్సులో తన అసమర్థతను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు.

పేదల పక్షపాతి సీఎం వైఎస్ జగన్



కృష్ణలంకలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న దేవినేని సుధీర, కార్పొరేటర్ కుమారి తదితరులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాజకీయ పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పేదల పక్షపాతిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలుస్తున్నారని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ సతీమణి సుధీర అన్నారు. దేవినేని అవినాష్ విజయాన్ని కాంక్షిస్తూ కృష్ణలంక, 20వ డివిజన్‌లోని గండి కోటయ్య వీధి, హైస్కూల రోడ్డులో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిసి ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుధీర మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని విధంగా ఏపీలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని గెలుపించుకోవాలన్నారు. త్వరలో జరిగే సాధారణ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి ఎమ్మెల్యేగా దేవినేని అవినాష్‌ను, ఎంపీగా కేశినేని శ్రీనివాస్(నాని)ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో 21వ డివిజన్ కార్పొరేటర్ పుప్పాల కుమారి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జమాక్ హౌసింగ్ కాంప్లెక్స్ అభివృద్ధికి కృషి



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న దేవినేని అవినాష్

ఆటోనగర్(విజయవాడతూర్పు): జమాక్ హౌసింగ్ కాంప్లెక్స్ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ విజయవాడ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ అన్నారు. ఆటోనగర్‌లోని జమాక్ హౌసింగ్ కాంప్లెక్స్ ఆవరణలో ఆదివారం రాత్రి ఆత్మీయ సమావేశం జరిగింది. కాంప్లెక్స్ అధ్యక్షుడు త్రిపురనేని చంద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో దేవినేని అవినాష్ మాట్లాడుతూ.. అందరూ ఐక్యతగా ఉన్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధిని పరుగులు పెట్టిస్తానన్నారు. గతంలో మా నాన్న దేవినేని నెహ్రూ పలు సార్లు ఎమ్మెల్యేగా ఈ ప్రాంతానికి మంచి సేవలు చేశారని గుర్తుచేశారు. ఆయన కుమారుడిగా ఇంకా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేస్తానని హామీ ఇచ్చారు. ఇక్కడ నివశించే 485 కుటుంబాల వారు మీ బిడ్డగా దీవించాలని కోరారు. జమాక్ హౌసింగ్ కాలనీలో ఉన్న సమస్యలన్నింటిని పరిష్కరిస్తామన్నారు. ముఖ్యంగా తాగునీరు, తూర్పువైపు రోడ్డు నిర్మాణంతో పాటు భవన సముదాయంలో కారు పార్కింగ్, గతంలో ఉన్న పాత కేసులన్నింటిని పరిష్కరిస్తానని యజమానులకు హామీ ఇచ్చారు.

మేమంతా అవినాష్ వెంటే..

గత 20 ఏళ్ల నాటి సమస్యను పరిష్కరించారని, రెండు వర్గాలుగా ఉన్న తమను ఒకటిగా చేసిన దేవినేని అవినాష్‌కు జమాక్ పెద్దలు రాజారావు, చంద్, నరసయ్య, సత్యనారాయణ, జాన్‌పాడ్, త్రినాథ్‌లతో పాటు పలువురు పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు. జమాక్ గేటు నుంచి మేళతాళాలతో అవినాష్‌కు మహిళలు, పెద్దలు ఘనస్వాగతం పలికారు. ఎన్నడూ లేని విధంగా తమను ఒకే వేదికపైకి చేర్చిన అవినాష్‌కు జీవితాంతం రుణపడి ఉంటామన్నారు.

ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని), ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్‌లను అత్యధిక మెజారిటీతో గెలిపిస్తామని చెప్పారు. అనంతరం వారు అవినాష్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏటీఏ అధ్యక్షుడు రాజనాల వేంకటరమణారావు, ముసునూరు సుబ్బారావు, ఆళ్ల చెల్లారావు, బత్తుల ప్రసాద్‌రెడ్డి, రిజ్వాన్, 11వ డివిజన్ ఇన్‌చార్జి పర్వతనేని పవన్, జమ్ముల ప్రసాద్, దేవినేని సాంబశివరావు, ఆబు, నాగిడి ప్రసాద్, షేక్ బాజీ, జమాక్ పెద్దలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే అభివృద్ధి సాధ్యం



వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న క్రాంతి

గుణదల(విజయవాడతూర్పు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోందని ఆ పార్టీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ సోదరి క్రాంతి అన్నారు. 2వ డివిజన్ కొండ ప్రాంతంలో ఆదివారం ఆమె ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకుని ఆయన తనయుడు ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన సాగిస్తున్నారన్నారు. పేదల అభ్యున్నతికి వైఎస్ జగన్ పాటుపడుతున్నారని తెలిపారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మాత్రమే రాష్ట్రంలో మౌలిక అభివృద్ధి జరిగిందన్నారు. ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించడంతో పాటు రోడ్లు, తాగునీరు, విద్యుత్ వంటి వసతులు ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందన్నారు. తూర్పు నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టిందని చెప్పారు. ప్రభుత్వ విధివిధానాలు ఆమోద యోగ్యంగా ఉన్నాయని వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి స్థానికులతో మాట్లాడి ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో 2వ డివిజన్ కార్పొరేటర్ అంబడిపూడి నిర్మలాకుమారి, నాయకులు కిరణ్ తేజ, రవిప్రకాష్, మోయిన్ తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత మానవాళికి అందిన గొప్పవరం



విజయవాడకల్చరల్: భగవద్గీత మానవాళికి అందిన గొప్పవరమని గీతా విజన్ ట్రస్ట్ చైర్మన్ గీతానంద్ పొక్కులూరి సుబ్బారావు అన్నారు. గీతా విజన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బీఆర్టీఎస్ రోడ్డులోని గాయత్రి కన్వెన్షన్ హాల్‌లో గీత అవార్డుల కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమాలను ప్రారంభించిన సుబ్బారావు మాట్లాడుతూ.. సకల వేద సారం భగవద్గీతలో కనిపిస్తుందన్నారు. ప్రతీ ఏటా వివిధ రంగాల్లోని ప్రముఖుల సామాజిక సేవలను గుర్తించి వారికి గీతా పురస్కారాలను ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ గవర్నర్ చిన్నం రామకృష్ణ మాట్లాడుతూ.. భగవద్గీతను పాఠ్యాంశంగా చేర్చాలన్నారు. సీనియర్ జర్నలిస్ట్ కృష్ణంరాజు మాట్లాడుతూ.. భగవద్గీత గొప్ప వ్యక్తిత్వ వికాస గ్రంథంగా అభివర్ణించారు. వివిధ రంగాలకు చెందిన బొమ్మిరెడ్డి రాజశేఖరరెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ వి.రజనీకాంత శర్మ పాల్గొన్నారు. దూరదర్శన్ వ్యాఖ్యాత అన్నపూర్ణ నిర్వహించిన కార్యక్రమం ఆద్యంతం ఆకట్టుకుంది. వివిధ రంగాల్లోని వారికి నిర్వాహకులు గీతా అవార్డులను అందజేశారు.

ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): విజయవాడ మొగల్రాజపురం సున్నపుబట్టీల సెంటర్‌లో ఉన్న ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ హాలులో విజయవాడ అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం జరిగింది. కార్యక్రమానికి నూతన కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు హాజరై మాట్లాడారు. ఆర్యవైశ్యుల సంక్షేమానికి ఎంతో కృషి చేసిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆర్యవైశ్యులంతా వచ్చే ఎన్నికల్లో మద్దతుగా నిలవాలని కోరారు. చింతామణి నాటకాన్ని ప్రదర్శించకుండా నిషేధించామని, రాష్ట్ర ప్రజలు అడగకుండానే వారి సంక్షేమానికి ఏమి కావాలో గుర్తించి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని చెప్పారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారి సంక్షేమానికి రూ.50 కోట్లు కేటాయించారన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డులో సభ్యులుగా కూడా ఆర్యవైశ్యులను వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నియమించారని చెప్పారు. నెల్లూరు జిల్లాకు పొట్టిశ్రీరాములు జిల్లాగా పేరుపెట్టారన్నారు. ఆర్యవైశ్యులకు అండగా ఉంటూ వారి సంక్షేమానికి కృషి చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డికి ఆర్యవైశ్యులు అండగా ఉండాలని చెప్పారు.

సంఘం అధ్యక్షుడిగా గద్దం సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా కూసుమంచి వెంకట లక్ష్మి, కోశాధికారిగా సోము రమేష్, యువజన విభాగం అధ్యక్షుడిగా కనిగళ్ల అరుణ్ సంపత్, కార్యదర్శిగా చీమకుర్తి శంకర్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా మారం రోజా రాణి, ప్రధాన కార్యదర్శి దేసు రాజ్యలక్ష్మి, సేవాదళ్ కమిటీ అధ్యక్షుడు బొగ్గరపు వెంకట సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సింహాద్రి గోపి, ఆయా సంఘాల సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు జయంతి వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య మహాసభ మాజీ అధ్యక్షుడు పెనుగొండ సుబ్బారాయుడు తదితరులు హాజరయ్యారు.

ఠాగూర్ గ్రంథాలయంలో దియా మేకింగ్ పోటీలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో క్రోధి నామ సంవత్సరం ఉగాదిని పురస్కరించుకుని ఆదివారం విద్యార్థులకు దియా మేకింగ్(దీపాల అలంకరణ) పోటీలను నిర్వహించారు. పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తమలోని సృజనాత్మకతకు పదును పెట్టి విభిన్న రకాల దీపాలను అందంగా అలంకరించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారిణి కే రమాదేవి విద్యార్థులకు ఉగాది విశిష్టతను వివరించారు.

గాలీబ్ షాహీద్ దర్గాలో చాదర్ సమర్పణ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భవానీపురంలోని సూఫీ మత గురువులు హజరత్ సయ్యద్ గాలీబ్ షాహీద్ రహమతులాల్లై 436వ ఉరుసు మహోత్సవం ఘనంగా జరిగింది. ఉరుసు మహోత్సవంలో వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ పాల్గొన్నారు. సూఫీ మత గురువులకు చాదర్ గంధం, పూలు సమర్పించారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 175 సీట్లు గెలవాలని, పార్లమెంట్ సభ్యులుగా కేశినేని నాని, పశ్చిమ ఎమ్మెల్యేగా షేక్ ఆసిఫ్ గెలవాలని ప్రార్థనలు చేశారు. బాబా వారి గంధ మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉరుసు సందర్భంగా దర్గా ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ షేక్ గౌస్ మొహిద్దీన్, నాయకులు జీఎంసీ భాషా, కార్పొరేటర్లు ఎండీ ఇర్ఫాన్, చైతన్య రెడ్డి, దర్గా ప్రెసిడెంట్ సయ్యద్ ముస్తాక్ అహ్మద్, కమిటీ పెద్దలు సత్తార్, రెహమాన్, అస్గర్, బద్రుద్దీన్, ఇషాక్, ఖాజా, మైనారిటీ నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

లబ్బీపేటలో ఇఫ్తార్ విందు



లబ్బీపేటలో మైనార్టీ నాయకుడు ఎండీ నాహీద్ ఆధ్వర్యంలో ఆదివారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ పాల్గొని భోజనాలు వడ్డించారు.

– లబ్బీపేట (విజయవాడతూర్పు)

మంచిమాట

తానెంతో జగమంత



ప్రతిమనిషి, సరిగా చెప్పాలంటే ప్రతి జీవి ప్రపంచం అంతా తన వంటిదనే అనుకుంటుంది. తన దృష్టికోణంలోనే చూస్తుంది. అందుకే అబద్ధాలాడేవారికి అందరూ అబద్ధాలు చెపుతారనే అభిప్రాయమే ఉంటుంది. ఎవరి మాటనీ ఒక పట్టాన నమ్మరు. తాను అబద్ధం చెప్పనప్పుడు ఎదుటివారు అబద్ధం చెపుతున్నారేమో అనే అనుమానం ఎందుకు వస్తుంది? పైగా తను చెప్పేది నిజం అని నమ్మమని ఒకటికి పదిసార్లు నొక్కి వక్కాణిస్తూ ఉంటారు. అవతలి వారు నమ్మరేమోననే సందేహం ఎందుకు వస్తుంది? తాను చెప్పే మాట మీద తనకే నమ్మకం లేదు కనుక.

ఇతరులని మోసం చేసే గుణం ఉన్న వారు ఇతరులు తమని మోసం చేస్తారేమో నని భయపడుతూనే ఉంటారు. మోసం చేసే బుద్ధి తనకి లేక పోతే ఎదుటి వారు తనని మోసం చేస్తారేమో ననే అనుమానం కూడా రాదు. పరాయి ఆడపిల్లలని చెడుదృష్టితో చూసేవారు తమ ఇంటి ఆడవారిని బయటకు పంపటానికి ఇష్టపడరు. దీనికి పెద్ద ఉదాహరణ రావణుడే. కనపడిన ప్రతి స్త్రీని కామదృష్టితో చూసి, చేజిక్కించుకోవాలనుకునే గుణం ఉన్నవాడు కనుకనే తన భార్యలని కట్టడిలో ఉంచాడు. మేలిముసుగు లేకుండా వారిని బయటికి రానిచ్చేవాడు కాదు. ఆ విషయాన్ని రావణ వధానంతరం యుద్ధభూమిలో పడి ఉన్న రావణుణ్ణి చూసి మండోదరి ''మేలిముసుగు లేకుండా నీ భార్యల మైన మేము ఇక్కడికి వస్తే ఏమి అనటం లేదేమి?'' అని ప్రశ్నించటంలో తెలుస్తుంది. అదే రావణుడు తన చెల్లెలు శూర్పణఖ విషయంలో అవేవీ పాటించ నక్కర లేదని చెప్పి స్వేచ్ఛగా వదిలేశాడు. రాక్షసవంశంలోనే పుట్టిన ప్రహ్లాదుణ్ణి ''కన్నుదోయి కన్యకాంత లడ్డం బైన మాతృభావము చేసి మరలువాడు'' అని పోతనామాత్యుల వారు వర్ణించారు. స్త్రీల పట్ల సద్భావం కలవాడు కనుక తన తల్లిని, ఇతర స్త్రీలని కూడా గౌరవభావంతో చూడటం తటస్థించింది.



జంతువులన్నీ ఇతర జంతువులు, ముఖ్యంగా మనుషుల మీద దాడి చేయటానికి కారణం వాటికి ఉన్న అభద్రతా భావం. అవి ఎదుటి జంతువులని తినటమో, బాధించటమో చేస్తాయి కనుక ఎదుటి జంతువులు కూడా తమని బాధిస్తాయేమోనని ఎదురు దాడి చేస్తాయి. నాగుపాముని చూస్తే ఈ విషయం బాగా అర్థమౌతుంది. మంచి జాతి సర్పం ఎదురు పడగానే మనిషి భయపడితే అది కూడా భయ పడుతుంది. దాని వంక ప్రేమగా, లేక భక్తితో చూస్తే అది కూడా అదే భావంతో చూసి తొలగిపోతుంది. అందుకే త్రాచు పాము కనపడగానే చేతులు జోడించి నమస్కారం చేసి కదల కుండా ఉండమని చెపుతారు. తేలుకి ఎదుటి ప్రాణి తనని బాధిస్తుందనే సందేహం ఉంటుంది కనుక ఏది అడ్డు తగిలితే దానిని కుట్టుకుంటూ పోతుంది. ఇటువంటి లక్షణాలే మనుషులలో కూడా కనిపిస్తాయి. అకారణంగా ఇతరులని బాధించేవారు, భయం వల్లనే బాధిస్తారు. పచ్చకామెర్ల రోగికి లోకం అంతా పచ్చగా కనిపిస్తుంది కదా!

అదేవిధంగా ''ఆత్మవత్ సర్వభూతాని'' అని భావించి ఎదుటివారి కష్టం తనది భావించి తదనుగుణంగా స్పందించేవారు, ఎవరికి మేలు కలిగినా తమకే కలిగి నంతగా సంతోషించేవారు ఉన్నారు. ఎవరికి ఆపద కలిగినా వీరి కళ్ళలో నీళ్ళు వస్తాయి. ఎవరికి మంచి జరిగినా వీరు పండగ చేసుకుంటారు. అంటే, ఈ కోవకి చెందిన వారు జంతు ప్రవృత్తి నుండి కొంత ఎదిగినట్టు చెప్పవచ్చు.

ఈ విధంగా ఉండి అందరు తన లాగానే ఉంటారు అనుకోవటం వల్ల లౌకికంగా నష్టపోయిన వారూ ఉన్నారు. కాని, మానవతా దృక్పథంలో వారు ఉన్నత స్థానానికి చేరుకున్నారని అర్థం. ప్రతిస్పందన కన్న సహ అనుభూతి ఉత్తమ స్థాయి.

– ఎస్. అనంతలక్ష్మి

తాత్త్వికథ

చెట్టునీడ



ఒకరోజు జ్ఞాని దగ్గరకు కోటీశ్వరుడు వెళ్లి స్వామి నా దగ్గర కోటానుకోట్ల డబ్బు ఉన్నది. పూర్తి ఆరోగ్యవంతుడిని. ఇక నేను ఎవరిపైనా ఆధారపడవల్సిన అవసరం లేదు. ఎవరినీ సహాయం చేయమని అర్థించాల్సిన అవసరం లేదని చాలా గొప్పగా చెప్పుకున్నాడు.

ఆ మాటలు విన్నాక జ్ఞాని నవ్వుతూ ''బాబు నాతో కాస్త దూరం నడవగలవా'' అని అడిగాడు. అయన అలా అడగడంతో నిరాకరించడం బాగుండదని తలచిన ఆ వ్యక్తి జ్ఞానితో కలిసి అడుగులు వేశాడు.

అలా నడుస్తూ నడుస్తూ అలసిపోయిన వ్యక్తి దరిదాపులలో ఏదైనా చెట్టు కనిపిస్తుం దేమో... ఆ చెట్టు నీడలో కాసేపు సేద తీరాలని చుట్టూ చూసాడు. ఎక్కడా ఏ చెట్టూ కనిపించలేదు.

ఇది గమనించిన జ్ఞాని ''ఏంటి బాబూ... వెతుకుతున్నావు?'' అని అడిగాడు.

''అయ్యా చాల దూరం వచ్చాము. కాసేపు చెట్టునీడలోకి వెళ్లి సేదతీర్చుకుని ఆ తర్వాత తిరిగి ముందుకు సాగుదాం''అని చెప్పాడు.

అతడి మాటలకు ఆ జ్ఞాని ''చెట్టునీడ నీకెందుకు బాబూ... నీ నీడలో నువ్వు సేద తీర్చుకో'' అన్నాడు.

''నా నీడలో నేను ఎలా ఉండగలను స్వామీ! ఏం మాట్లాడుతున్నారు మీరు?'' అని కాస్తంత ఆశ్చర్యంగా మరి కాస్త నిష్ఠురంగానూ అడిగాడు ఆ వ్యక్తి.

అందుకు ఆ జ్ఞాని, చిరునవ్వుతో అతడి వైపు చూస్తూ... అదేంటి, నీ నీడలో నువ్వు తల దాచుకోలేవా? నువ్వే కదా బాబూ, నాదగ్గర అన్నీ ఉన్నాయి. నేను ఎవరిని ఆశ్రయించాల్సిన అవసరం లేదు అన్నావు. చూశావా! ఇప్పుడు నీ నీడ సైతం నీకు ఉపయోగపడలేదు'' అన్నారు.


ఇప్పుడు ఆ ఐశ్వర్యవంతుడికి నిజంగా జ్ఞానోదయం అయింది ఏ చెట్టు కిందకూ వెళ్లకుండానే.

అందుకే పెద్దలన్నారు... అహంకరించవద్దు అని. ఎంత ధనవంతులైనా, వారికి ఎన్ని ఉన్నా ఎప్పుడు ఎవరికీ ఏది అవసరం అవుతుందో తెలియదు ఈ లోకంలో.

అన్నింటికీ మించి మనపైన మనకు నమ్మకం ఉండాలి అహం ఉండకూడదు. మన పైన మనకు ఆత్మవిశ్వాసం ఉండాలి. అతేకానీ, ఇతరులపైన ఏమాత్రం చులకన భావం ఉండకూడదు... మనసులోకి రాకూడదు.

గృహస్థాశ్రమ విశిష్టత

పెళ్ళి... ఇద్దరి మధ్య వ్యవహారం కాదు



కోటలో యుద్ధం చేయడం గృహస్థాశ్రమం. కోట బయట చేసేవి ఇతర ఆశ్రమాలు. అవి జన్మతః వైరాగ్యం కలిగిన మహాపురుషులకే సాధ్యం. ఎన్నో జన్మల అనుష్ఠాన బలం వారిది. వారు కారణజన్ములు. చంద్రశేఖరేంద్ర సరస్వతీ మహాస్వామివారు, చంద్రశేఖర భారతీ మహాస్వామివారు, ఒక రామకృష్ణ పరమహంస, ఒక వివేకానందుడు, అరుణాచల భగవాన్ రమణులు... ఇటువంటివారు ఎక్కడో కోట్లలో ఒకరుంటారు.

కానీ అందరికి అందుబాటులో ఉండేది, అర్థకామములను ధర్మం తో ముడివేసుకోవడానికి యోగ్యమైనది – గృహస్థాశ్రమం. దీని ప్రవేశం... కేవలం ఒక పురుషుడికో, ఒక స్త్రీకో సంబంధించినది కాదు. అంటే పెళ్ళి ఎప్పుడూ పూర్తిగా వ్యక్తిగత విషయం కానే కాదు. ఇక్కడ సక్రమంగా ప్రవర్తించకపోతే... దాని చెడు ప్రభావం సమాజం మీద పడుతుంది. కచ్చితంగా మూడవ వ్యక్తి మీద అది ప్రభావం చూపి తీరుతుంది. అదే దంపతులిద్దరూ అన్యోన్యంగా బతకగలిగితే... మూడవ వ్యక్తికి ఆదర్శంగా నిలుస్తారేమో గానీ, సమాజాన్ని అది చెడుగా ప్రభావితం చేసే అవకాశమేలేదు.

వాళ్ళిద్దరూ పుట్టుకనుంచి కలిసి ఉన్నవారు కాదు, కలిసి చదువుకోలేదు, కలిసి బతకలేదు. అకస్మాత్తుగా ఇద్దరు కలుసుకుని జీవిత ప్రయాణానికి, ఒక ఆశ్రమ నియమానికి కట్టుబడటానికి సిద్ధమవుతున్నారు. మనం ఒక ఉద్యోగంలో చేరితేనే... సవాలక్ష నియమాలకు అంగీకరించినప్పుడే దానిలో కొనసాగగలం. అటువంటిది ఒక జీవితకాలం పూర్తిగా కలిసి ఇద్దరూ ప్రయాణించాలి. పుట్టిన సంతానానికి మార్గదర్శకంగా నిలవాలి... అంటే దానికి ఎంతో పరిణతి ఉండాలి. జీవితం అంటే పూలపడవ కాదు కదా... వెలుతురు, చీకటి, కష్టాలు, సుఖాలు... అన్నింటినీ చక్కగా సమన్వయంతో, అవగాహనతో ఎటువంటి ఒడిదుడుకులు లేకుండా వంశాభివృద్ధి చేసుకుంటూ సంసారనావను నడపాల్సి ఉంటుంది. అటువంటి సంసారంలో మంచి జరిగినా, చెడు జరిగినా అది సమాజాన్ని సానుకూలంగా కానీ, ప్రతికూలంగా కానీ ప్రభావితం చేస్తుంటుంది. అందుకే పెళ్ళి ఎప్పుడూ ఇద్దరి మధ్య వ్యవహారం కాదు.

ధర్మం, కామం, అర్థం సమంగా ఉంటే... మోక్షం అనేది కొత్తగా ప్రయత్నించి తెచ్చుకోనక్కర లేదు. అదే వస్తుంది. అంటే ధర్మబద్ధమైన అర్థం, ధర్మబద్ధమైన కామం ఉండాలి. నేను డబ్బు సంపాదిస్తే ధార్మికంగా సంపాదించానా ? ఖర్చుపెడితే.. ధర్మంకోసం ఖర్చు పెట్టానా? నాకు మనసులో ఒక కోరిక పుడితే ఇది ధర్మచట్రంలో ఇముడుతుందా? దీనిని నేను నెరవేర్చుకోవచ్చా? ... ఈ పరిశీలన అలవాటయితే అర్థం. కామం ధర్మానికి ముడిపడిపోయినట్టే. సామాన్యులకు కూడా ప్రయోజనం చేకూరాలని మన రుషులు ప్రవేశపెట్టిన మార్గం ఇది.. అదే గృహస్థాశ్రమం.

గృహస్థు అంటే కేవలం ఒక గృహంలో ఉన్నవాడని కాదు. గృహస్థాశ్రమ స్వీకారం చేశాడు... అంటే ధర్మాన్ని స్వీకరించాడు.. అని. తరువాత నిత్యకర్మ చేయకుండా ఎలా ఉంటాడు? అది సాధ్యం కాదు. ఏదో కర్మ చేయవలసిందే. దీనివల్ల చివరకు ప్రత్యేకంగా ప్రయత్నించకపోయినా మోక్షమే కలుగుతుంది. జ్ఞానాన్ని ఇచ్చిన భగవంతుడు మోక్షాన్ని కూడా ప్రసాదిస్తాడు.

రామాయణంలో భరతుడు ఒక మాటంటాడు. నాలుగు ఆశ్రమాలలోకి గృహస్థాశ్రమం శ్రేష్ఠమైనది –అని. అంతకన్నా గొప్పది మరొకటి లేదు.


బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

సినిమా

వార్‌కు రెడీ!


● ఎన్టీఆర్

బాలీవుడ్ 'వార్'కు రెడీ అవుతున్నారు ఎన్టీఆర్. హృతిక్‌రోషన్, ఎన్టీఆర్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్న చిత్రం 'వార్ 2'. 2019లో హిట్‌గా నిలిచిన హిందీ చిత్రం 'వార్'కు సీక్వెల్‌గా 'వార్ 2' తెరకెక్కుతోంది. 'వార్'కి సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహించగా, 'వార్ 2'కు 'బ్రహ్మాస్త్ర' ఫేమ్ అయాన్ ముఖర్జీ దర్శకుడు. ఇప్పటికే 'వార్ 2' చిత్రీకరణ మొదలైందని, హృతిక్‌రోషన్ పాల్గొనగా కొంత చిత్రీకరణ కూడా జరిపారని టాక్. కాగా ఈ వారంలో 'వార్ 2' సెట్స్‌లో ఎన్టీఆర్ జాయిన్ అవుతారని బాలీవుడ్ సమాచారం. ఎన్టీఆర్‌పై ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను ప్లాన్ చేశారట అయాన్ ముఖర్జీ. ఈ చిత్రంలో కియారా అద్వానీ హీరోయిన్‌గా కనిపిస్తారని టాక్. 'వైఆర్ఎఫ్' (యశ్‌రాజ్ ఫిలింస్) స్పై యూనివర్స్‌లో భాగంగా రానున్న ఈ సినిమాను ఆదిత్యా చోప్రా నిర్మిస్తున్నారు. 'వార్ 2' చిత్రాన్ని వచ్చే ఏడాది ఆగస్టు 14న విడుదల చేయనున్నట్లుగా ఇప్పటికే చిత్రయూనిట్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

చలో రాజమహేంద్రవరం


● రామ్‌చరణ్


'గేమ్‌చేంజర్' కోసం రాజమహేంద్రవరం వెళ్లనున్నారట రామ్‌చరణ్. శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ హీరోగా నటిస్తున్న పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'గేమ్‌చేంజర్'. ఈ చిత్రంలో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తుండగా, అంజలి, ఎస్‌జే సూర్య, శ్రీకాంత్, నవీన్‌చంద్ర, ప్రియదర్శి, జయరాం, సునీల్ ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ సినిమా కొత్త షెడ్యూల్ చిత్రీకరణ రాజమహేంద్రవరంలో జరగనుందని ఫిల్మ్‌నగర్ సమాచారం. రామ్‌చరణ్‌తో పాటు ముఖ్యతారాగణం పాల్గొనే ఈ షెడ్యూల్ ఈ నెలాఖరులో ప్రారంభం కానుందని తెలిసింది. కథ రీత్యా సినిమాలో వచ్చే ఫ్లాష్‌బ్యాక్ సన్నివేశాలను చిత్రీకరిస్తారట శంకర్. రాజమహేంద్రవరం షెడ్యూల్ పూర్తయిన తర్వాత వైజాగ్‌కు వెళ్తారట యూనిట్. తమన్ ఈ సినిమాకు స్వరకర్త. ఈ చిత్రం ఈ ఏడాదే విడుదల కానుంది.. రిలీజ్ డేట్‌పై త్వరలోనే స్పష్టత రానుంది.

అక్టోబర్‌లో వేట్టయాన్


● రజనీకాంత్

అక్టోబర్‌లో థియేటర్స్‌కు వస్తున్నాడు 'వేట్టయాన్'. రజనీకాంత్ హీరోగా 'జై భీమ్' ఫేమ్ టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న మూవీ 'వేట్టయాన్'. లైకా ప్రొడక్షన్స్‌పై సుభాస్కరన్, జీకేఎమ్ తమిళ కుమరన్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రాన్ని ఈ ఏడాది అక్టోబరులో రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించి, పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. బూటకపు ఎన్‌కౌంటర్స్ నేపథ్యంలో సాగే ఈ సినిమాలో రజనీకాంత్ ఓ పోలీసాఫీసర్ పాత్రలో నటిస్తున్నారు. అమితాబ్ బచ్చన్, ఫాహద్ ఫాజిల్, రానా దగ్గుబాటి, మంజు వారియర్, కిషోర్, రితికా సింగ్, దుషార విజయన్ ఇతర పాత్రల్లో నటిస్తున్న 'వేట్టయాన్' సినిమాకు అనిరుధ్ రవిచందర్ సంగీత దర్శకుడు.

పవర్‌ఫుల్ పాత్రలో...


● జగపతి బాబు

రవితేజ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'మిస్టర్ బచ్చన్'. 'నామ్ తో సునా హోగా' అన్నది ట్యాగ్‌లైన్. హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ మూవీలో కీలక పాత్రలో నటిస్తున్న జగపతిబాబు లుక్‌ని రిలీజ్ చేశారు మేకర్స్. చెస్ మూవ్‌ని చేతిలో పట్టుకొని సీరియస్‌గా చూస్తున్న లుక్ బాగుంది. ''మిస్టర్ బచ్చన్'లో జగపతి బాబు పాత్ర పవర్‌ఫుల్‌గా ఉంటుంది. రవితేజ, జగపతిబాబులను తెరపై చూడటం కనుల పండువగా ఉంటుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల, సమర్పణ: పనోరమా స్టూడియోస్, టీ సిరీస్, సంగీతం: మిక్కీ జె. మేయర్, కెమెరా: అయనంక బోస్.

పెళ్లి పేరుతో మోసం చేశాడు

– సన్నీలియోన్



'ఓ వ్యక్తి ప్రేమ, పెళ్లి పేరుతో నన్ను మోసం చేశాడు' అన్నారు బాలీవుడ్ నటి సన్నీలియోన్. హిందీతో పాటు తెలుగు, తమిళ, కన్నడ, మరాఠి, బెంగాలి, మలయాళ భాషల్లోని పలు చిత్రాల్లో ప్రత్యేక పాటలతో పాటు క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా నటించి తనకంటూ ఓ గుర్తింపు సొంతం చేసుకున్నారు ఈ బ్యూటీ. 'కరెంట్ తీగ (2014) సినిమాతో తెలుగులో ఎంట్రీ ఇచ్చిన సన్నీలియోన్ 'పీఎస్‌వీ గరుడవేగ', 'జిన్నా' వంటి సినిమాల్లో నటించారు. ప్రస్తుతం ఆమె 'రంగీలా', 'వీరమదేవి', 'కొటేషన్ గ్యాంగ్', 'షీరో', 'కోకా కోలా', 'యువ' వంటి చిత్రాలతో బిజీగా ఉన్నారు. అదేవిధంగా 'స్ప్లిట్స్ విల్లా' అనే ఓ రియాలిటీ షోకి వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు సన్నీ. తాజాగా ఈ షోలో ఆమె మాట్లాడుతూ–''కొన్నేళ్ల క్రితం ఒక వ్యక్తిని చాలా ప్రేమించాను. తను కూడా నన్ను ప్రేమించాడు. మా ఇద్దరికీ నిశ్చితార్థం కూడా జరిగింది. ఆ తర్వాత ఏదో తప్పు జరుగుతోందని, అతడు నన్ను మోసం చేస్తున్నాడేమోనని నా మనసుకు అనిపించింది. దీంతో 'నువ్వు నన్ను ఇంకా ప్రేమిస్తున్నావా?' అని ప్రశ్నిస్తే లేదన్నాడు. మరో రెండు నెలల్లో మా పెళ్లిని ప్లాన్ చేసుకున్నాం. హవాయి దీవుల్లో గ్రాండ్‌గా, జీవితాంతం గుర్తుండిపోయేలా వివాహం జరగాలని ప్లాన్ చేసుకున్నాం. ఇందుకోసం అన్నీ బుక్ చేసుకుని డబ్బులు కూడా ఇచ్చేశాను. పైగా పెళ్లి షాపింగ్ కూడా అయిపోయింది. ఇలాంటి సమయంలో తను అలా చెప్పడంతో నా మనసు ముక్కలైంది.. ఎంతో బాధపడ్డాను. ఆ తర్వాత భగవంతుడు నా జీవితంలో అద్భుతమైన మార్పులు తీసుకువచ్చాడు. డానియల్ వెబర్‌ను పరిచయం చేశాడు. నా తల్లితండ్రులు చనిపోయినప్పుడు తను ఎంతో అండగా నిలిచాడు. మా ఇద్దరి మనసులు కలవడంతో పెళ్లి(2011) చేసుకున్నాం. ఎప్పటికీ నా భర్త చేయి వదలను'' అన్నారు.

అది రహస్యం కాదు!


● అదితీరావ్, సిద్ధార్థ్

''నేను, అదితీరావ్ హైదరీ కలిసి రహస్యంగా నిశ్చితార్థం చేసుకున్నామని చాలామంది అంటున్నారు. సీక్రెట్, ప్రైవేట్ అనే పదాలకు ఎంతో తేడా ఉంది. ఎవర్నీ పిలవకుండా, ఎవరికీ చెప్పకుండా చేసుకుంటే అది సీక్రెట్ అవుతుంది. కానీ, మా ఇరు కుటుంబసభ్యులతో కలిసి మేము ప్రైవేట్ ఫంక్షన్ చేసుకున్నాం. మా వారి సమక్షంలో జరిగిన నిశ్చితార్థం సీక్రెట్ ఎలా అవుతుంది'' అన్నారు హీరో సిద్ధార్థ్. గత కొన్నేళ్లుగా ప్రేమలో ఉన్న సిద్ధార్థ్, హీరోయిన్ అదితీరావు హైదరీ మార్చి 17న వనపర్తి జిల్లాలోని శ్రీరంగపురంలోని ఆలయంలో నిశ్చితార్థం చేసుకున్న సంగతి తెలిసిందే. తాజాగా ఓ వేడుకలో పాల్గొన్న సిద్ధార్థ్‌కి నిశ్చితార్థం ఎందుకు రహస్యంగా చేసుకున్నారు? పెళ్లెప్పుడు? అనే ప్రశ్నలు ఎదురయ్యాయి. దీనికి సిద్ధార్థ్ స్పందిస్తూ– ''నా ప్రేమ విషయాన్ని తొలిసారి అదితీరావుకి చెప్పినప్పుడు తన నుంచి ఏం జవాబు వస్తుందా? అని ఎదురుచూశాను. కానీ, తను నా ప్రేమను అంగీకరించడంతో చాలా సంతోషపడ్డాను. ఇక మా పెళ్లి ముహూర్తం నా చేతుల్లో లేదు.. మా ఇరుకుటుంబ పెద్దలు నిర్ణయిస్తారు'' అన్నారు సిద్ధార్థ్.

ఎమోషనల్ థ్రిల్లర్


● వరలక్ష్మి

విలక్షణ నటి వరలక్ష్మీ శరత్ కుమార్ ప్రధాన పాత్రలో నటించిన పాన్ ఇండియా చిత్రం 'శబరి'. ఈ మూవీ ద్వారా అనిల్ కాట్జ్ దర్శకుడిగా పరిచయవుతున్నారు. మహర్షి కూండ్ల సమర్పణలో మహా మూవీస్ పతాకంపై మహేంద్రనాథ్ కూండ్ల తెలుగు, తమిళ, మలయాళ, హిందీ, కన్నడ భాషల్లో నిర్మించారు. ఈ సినిమాని మే 3న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు మేకర్స్. మహేంద్రనాథ్ కూండ్ల మాట్లాడుతూ–''స్ట్రాంగ్ ఎమోషనల్ థ్రిల్లర్ చిత్రమిది. కథ, కథనాలు ఇన్నోవేటివ్‌గా ఉంటాయి. వరలక్ష్మి నటించిన గత సినిమాలకు పూర్తి భిన్నంగా 'శబరి' ఉంటుంది. ముఖ్యంగా ఆమె నటన వావ్ అనేలా ఉంటుంది. తెలుగు, తమిళ వెర్షన్స్ ఫస్ట్ కాపీ రెడీ అయ్యింది. మలయాళం, హిందీ, కన్నడ భాషల్లో పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తయ్యాయి. అన్ని భాషల ప్రేక్షకులకు నచ్చే చిత్రమిది'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: రాహుల్ శ్రీవాత్సవ, నాని చమిడి శెట్టి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సీతారామరాజు మల్లెల, సంగీతం: గోపీ సుందర్.

రైతు గంగమ్మ


● పార్వతి

విక్రమ్ హీరోగా నటించిన పీరియాడిక్ యాక్షన్ మూవీ 'తంగలాన్'. పా. రంజిత్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో పార్వతీ తిరువోతు, మాళవికా మోహనన్ హీరోయిన్లుగా నటించారు. పా. రంజిత్ నీలమ్ ప్రొడక్షన్స్‌తో కలిసి స్టూడియో గ్రీన్ పతాకంపై కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించారు. కాగా ఆదివారం(ఏప్రిల్ 7) పార్వతీ తిరువోతు బర్త్ డే. ఈ సందర్భంగా 'తంగలాన్' లో ఆమె నటించిన గంగమ్మ పాత్ర ఫస్ట్ లుక్‌ని రిలీజ్ చేశారు మేకర్స్. లుక్ చూస్తే మహిళా రైతు పాత్రలో ఆమె నటించినట్లు తెలుస్తోంది. ''కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ నేపథ్యంలో వాస్తవ ఘటనలతో 'తంగలాన్' రూపొందింది. విక్రమ్‌ని విభిన్నమైన క్యారెక్టర్‌లో చూపించబోతున్నారు పా.రంజిత్. త్వరలోనే ఈ సినిమాని విడుదల చేయనున్నాం'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్ కుమార్.